www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సోమవారం | 19-2-2018 | పేజీలు: 22 + 16 | వెల: రూ.5.00 | సంపుటి: 14 సంచిక: 220 | శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: చవితి తె. 5.15 తదుపరి పంచమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర మ. 1.38 తదుపరి రేవతి; వర్జ్యం: రా. 1.51-3.29; దుర్ముహూర్తం: మ. 12.53-1.39, మ. 3.11-3.57; అమృతఘడియలు: ఉ. 8.40-10.20; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.44; సూర్యాస్తమయం: 6.15 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

వీడియోకాల్‌లో ఉరేసుకుంది

పెళ్లి విషయంలో ఫోన్లో ప్రియుడితో వాగ్వాదం

మాటామాటా పెరిగి క్షణికావేశంలో ఆత్మహత్య

హైదరాబాద్‌లో ఎంబీఏ విద్యార్థిని విషాదాంతం

పోలీసుల అదుపులో ప్రియుడు దీక్షిత్



పేట్‌బషీరాబాద్/అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రియుడితో సరదాగా మాట్లాడేందుకు ఆ యువతి వీడియోకాల్ చేసింది! కొద్దిసేపటికి ఇద్దరి మధ్య నవ్వులు, తుళ్లింతలు మాయమై.. ఆ స్థానంలో కోపతాపాలు ప్రవేశించాయి. పెళ్లి గురించి ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఆ క్షణికావేశంలో ఆమె తీవ్ర నిర్ణయమే తీసుకుంది. ప్రియుడితో వీడియోకాల్‌లో మాట్లాడుతూనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. హైదరాబాద్ కొంపల్లిలోని శివశివానీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్

మిగతా 2వ పేజీలో...

ఐటీ సదస్సు నేటి నుంచే

WCIT Hyderabad INDIA 2018 World Congress on Information Technology

హైదరాబాద్ వేదికగా

మరో అంతర్జాతీయ కార్యక్రమం

శ్రీలంక ప్రధాని, 30 దేశాల నుంచి 500 మంది

మూడు రోజులు రాజధానిలో సందడే సందడి

12



మరో నీరవ్

రొటోమాక్ కొఠారీ

రూ.800 కోట్ల మోసం

45 రోజుల కిందటే విదేశాలకు పరార్

ఘొల్లుమంటున్న ఐదు బ్యాంకులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ 11,515 కోట్ల మెగా కుంభకోణం ఇంకా మర్చిపోకముందే మరో చీకటి బాగోతం బయటపడింది. సుప్రసిద్ధ పెన్నుల సంస్థ - రొటోమాక్ అధినేత విక్రమ్ కొఠారీ- ఐదు బ్యాంకుల నుంచి దాదాపు 800 కోట్ల రూపాయల రుణం తీసుకుని దేశం నుంచి ఉడాయించాడు. ఏడాదిన్నర గడిచినా

మిగతా 10వ పేజీలో...


దొంగచేతికే తాళం

పాస్‌వర్డే ఇచ్చేశారు

నీరవ్ గ్యాంగ్‌కి స్విఫ్ట్ సిస్టమ్ ఆపరేషన్

వివరాలిచ్చేసిన పీఎన్‌బీ సిబ్బంది

ఎడాపెడా వాడుకున్న నీరవ్, ఛోక్సీ



10

ఏప్రిల్ 20

పంట సాయం పంపిణీకి ముహూర్తం ఖరారు

యాసంగికి నవంబరు 18 నుంచి



ఆదివారం ప్రగతి భవన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం కేసీఆర్ సమీక్ష

చెక్కుల రూపంలోనే ఆర్థిక సాయం

రెండు ప్రాంతీయ సదస్సుల నిర్వహణ

25న రాజేంద్రనగర్, 26న కరీంనగర్‌లో

రైతులతో నేరుగా మాట్లాడనున్న సీఎం

సబ్సిడీపై నాట్లు వేసే యంత్రాలు

వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష

బడ్జెట్ ప్రతిపాదనలపై ఈటలతో చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పంట సాయం పంపిణీకి ముహూర్తం ఖరారైంది. ఖరీఫ్ పంటకు ఏప్రిల్ 20వ తేదీ నుంచి; యాసంగికి నవంబరు 18వ తేదీ నుంచి పంపిణీ ప్రారంభించాలని నిర్ణయించారు. సీఎం కేసీఆర్ ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెట్టుబడి మద్దతు పథకం పేరిట అందించే ఈ ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలోనే అందించనున్నట్లు ప్రకటించారు. ఇందుకు నిధులను బడ్జెట్లోనే కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రగతి భవన్‌లో ఆదివారం ఆయన వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించారు. మండల రైతు సమన్వయ సమితుల ప్రాంతీయ సదస్సులను ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించాలని సీఎం

మిగతా 3వ పేజీలో...

ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు

నోటిఫికేషన్


16 వరకు దరఖాస్తులు

ఏప్రిల్ 8న ప్రవేశ పరీక్ష

3



మోక్ష సాధన సంపూర్ణంగా వ్యక్తిగతమే..



Paramjyothi
పరంజ్యోతి

'మోక్షసాధన సామగ్ర్యాం భక్తిదేవ గరీయసీ' అన్న శంకర భగవత్పాదుల మాటను సర్వ భారతీయ సాహిత్యమూ సత్యం చేసింది. భారతీయ సంస్కృతిలో పురుషార్థాల ప్రాముఖ్యం ఎక్కువ. మానవ జీవన వికాసానికి ధర్మార్థ కామ మోక్షాలే ప్రధానం. పురుషార్థాల్లో ప్రధానాంశం ధర్మం. అర్థ కామాలు ధర్మబద్ధమైనప్పుడే మోక్ష మార్గం సులభమౌతుందన్న ఆలోచనతో ఏర్పరిచిన ఈ నియమాల్లో 'మోక్షం' మిక్కిలి శ్రేష్ఠమైనదన్న సత్యం ద్యోతకమవుతూ ఉంది. 'ధర్మమార్గ ప్రవక్తారో ముక్తా ఏవ నసంశయః' అన్నారు వాల్మీకి మహర్షి. మోక్షానికి పునాది ధర్మమే నన్నది రామాయణం చెప్పిన మాట. అదీ నారద మహర్షి ముఖతః పలికించిన పవిత్ర వచనం. మోక్షమంటే ఏమిటి? అన్నది మౌలికమైన ప్రశ్న. ఒక విధంగా దీనిని ముక్తి అని, కైవల్యమని అనుకోవచ్చు. అనేక బంధనాల్లో చిక్కుకున్న జీవుల విముక్తికి ఎవరికి వారే మార్గం వెతుక్కోవాలి. ఆ అన్వేషణకై వ్యక్తి పూర్వుల మాటలపై విశ్వాసంతో భగవతత్త్వంపై శ్రద్ధతో ప్రయత్నిస్తే ఫలితం హస్తగతం అవుతుంది. మిగిలిన మూడు పురుషార్థాలకు తాను తన కుటుంబం, సమాజం కూడా తోడుండాలి. కానీ ఈ పురుషార్థ సాధనలో ప్రతి వ్యక్తీ తనకు తానే ప్రయత్నించాలి. ఆ ప్రయత్న మార్గాలను తెలపాలన్న తపనే పూర్వ మేధావుల అన్వేషణ నుంచి ఆవిర్భవించిన వేదాది గ్రంథాలు, ఉపనిషత్తులు, పురాణాదులు మనకు స్పష్టమైన మార్గాన్ని దర్శింపజేస్తున్నాయి.

- గన్నమరాజు గిరిజామనోహరబాబు

మార్పు కోసం కలగనండి

రాజ్యం విధించే నిర్బంధాలను ఎదుర్కోండి.. ప్రముఖ కెన్యా రచయిత గూగీ వా థియాంగో

- గూగీ ఆత్మకథ తెలుగు అనువాదం ఆవిష్కరణ
- అనువదించింది జైల్లో ఉన్న ప్రొఫెసర్ సాయిబాబ
- సాయిబాబ నిర్బంధం... ఎమర్జెన్సీ కంటే తీవ్రం
- ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్



తెలుగు యూనివర్సిటీలో జరిగిన 'యుద్ధ కాలంలో స్వప్నాలు.. బాల్య జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ సభలో రచయిత గూగీ వా థియాంగో, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎంతటి ఘోరమైన పరిస్థితిలో జీవిస్తున్నప్పటికీ మార్పు కోసం కలగనడం మాత్రం మానవద్దని సుప్రసిద్ధ కెన్యన్ సాహితీవేత్త గూగీ వా థియాంగో పిలుపునిచ్చారు. రాజ్యం విధించే ఏ నిర్బంధాన్నైనా ఎదుర్కోవడానికి ముందు కలగనడం ద్వారానే విముక్తి సాధించగలమన్న నమ్మకాన్ని చరిత్ర పోరాటాలు రుజువు చేశాయని చెప్పారు. మలుపు ప్రచురణల ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియం వేదికగా గూగీ వా థియాంగో ఆత్మకథ తొలి భాగం 'యుద్ధ కాలంలో స్వప్నాలు.. బాల్య జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ పుస్తకాన్ని నాగపూర్ హైసెక్యూరిటీ జైల్లో నిర్బంధ జీవితాన్ని గడుపుతున్న ప్రొఫెసర్ సాయిబాబ అనువాదం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గూగీ మాట్లాడుతూ సాయిబాబను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాయిబాబ అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, తను కోరుకున్న సమాజం కోసం కలలు కనడం కొనసాగించాలన్నారు. తాను ఖైదీగా ఉన్న సమయంలో రాసిన పుస్తకాల్లో మూడు రచనలు జైల్లోనే తెలుగు అనువాదమవడం యాదృచ్ఛిక సంఘటనగా అభివర్ణించారు. హైదరాబాద్‌తో, ఇక్కడి మనుషులతో తనది ఆత్మీయ బంధమని పేర్కొన్నారు. ఉగాండాలోని మకెరెరె విశ్వవిద్యాలయంలో సహవిద్యార్థి ప్రొఫెసర్ సూజీథారు వల్ల తనకు ఈ నేలతో అనుబంధం ఏర్పడిందని గూగీ తెలిపారు. 1996లో వరంగల్ పర్యటనను గుర్తుచేసుకుంటూ అక్కడ టీ కెటిల్‌ను చూసిన తర్వాత తన దేశ స్మృతులు మదిలో మెదిలాయన్నారు. అనంతరం తన జైలు రచన 'వ్రెజ్లింగ్ విత్ ది డెవిల్'ను సాయిబాబకు అందించాలని ఆయన సహచరి వసంతకు గూగీ అందజేశారు. మహిళా అధ్యయనాల నిపుణురాలు ఆచార్య సుజీథారు మాట్లాడుతూ మకెరెరె విశ్వవిద్యాలయంలో సహవిద్యార్థిగా గూగీతో తనకున్న అనుబంధం ప్రత్యేకమైందని చెప్పారు. గూగీ రాసిన తొలినాటకం 'ది బ్లాక్ హెర్మిట్'లో తాను కథానాయిక పాత్ర పోషించానని గుర్తుచేశారు. గూగీ తన సహ విద్యార్థి అయితే, సాయిబాబ తన విద్యార్థి అంటూ వారిద్దరి మధ్య భావ సారూప్యత గురించి వివరించారు. ముఖ్య వక్త ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గూగీ ఆత్మకథ చదువుతున్నప్పుడు ఆ రచన పొందిక, శైలి ఆశ్చర్యానికి గురిచేసిందని అన్నారు. ఆయన రచనల్లో నైసర్గిక వర్ణన, వివరాలను సరళంగా చెప్పడంతో పాటు, వలసవాదం వల్ల తన స్థానిక సంస్కృతి ఎలా విచ్ఛిన్నం అవుతోందో చెప్పీ చెప్పకుండా వ్యక్తపరిచే విధానం ఆకట్టుకుంటుందని కొనియాడారు. పరాయి భాషలో చదువుకోవడం అన్నది మెదడుకు సంబంధించిన కార్యకలాపంగా ఉంటుంది తప్ప, హృదయగతం కాలేదని మాతృభాష ఔన్నత్యం గురించి గూగీ చెప్పిన మాటలను ఉటంకించారు. సాయిబాబ నిర్బంధం గురించి మాట్లాడటానికి ఈ పుస్తకం ఓ సందర్భమని పేర్కొన్నారు. వైకల్యంతో ఉన్న ఓ బుద్ధిజీవిని ఇలానే నిర్బంధిస్తాం, దీనికి నిష్కృతిలేదు అన్నట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందంటే ఎమర్జెన్సీకన్నా తీవ్రమైన సన్నివేశంలా అనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. సభాధ్యక్షత వహించిన ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ తనది మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథమని స్పష్టంగా ప్రకటించుకున్న గొప్ప రచయిత గూగీ అని అభివర్ణించారు. సాహితీ విమర్శకుడు ఏకే ప్రభాకర్ మాట్లాడుతూ జైల్లో ప్రవాస జీవితం గడుపుతున్న సాయిబాబ తెలుగులో మాట్లాడకూడదు, రాయకూడదు అనే నిర్బంధ పరిస్థితుల మధ్య ఈ అనువాద రచన చేయడం సాధారణ విషయం కాదని అభినందించారు. కార్యక్రమంలో విరసం నాయకురాలు వరలక్ష్మి, మలుపు సంస్థ తరపున బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ప్రాంగణం

సభా ప్రాంగణం ప్రేక్షకులతో కిక్కిరిసింది. స్థలాభావం వల్ల కొంతమంది సభికులు వేదిక ఇరువైపులా కూర్చున్నారు. ప్రముఖ కవులు వరవరరావు, కె.శివారెడ్డి, గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, సీఎం ఓఎస్‌డీ దేశపతి శ్రీనివాస్ వంటి ప్రముఖులు పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు సామాజిక వేత్తలు, దళిత, స్త్రీవాద రచయితలు హాజరయ్యారు. 'రెడ్ సెల్యూట్ గూగీ', 'సాయిబాబను తక్షణం విడుదల చేయాలి' వంటి నినాదాలతో సభాస్థలి దద్దరిల్లింది.

లోకం తీరు




20 మందిని చంపేసిన నన్ను మీరు అరెస్టు చేయకపోతే నేనే కాల్చుక చస్తా!

ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	10.8	34.7
రామగుండం	16.0	35.0
హైదరాబాద్	16.6	32.8
వరంగల్	17.0	33.0
సంగారెడ్డి	17.0	33.0

పగలు ఎండ.. రాత్రి చలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): శివరాత్రితో చలి శివ శివా అంటూ వెళ్లిపోతుందంటారు. శివరాత్రి వెళ్లి 5రోజులైనా చలిమాత్రం తగ్గడం లేదు. పగలు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా రాత్రిళ్లు చలి మాత్రం వదలడం లేదు. పగటి వేళ చుర్రుమనే ఎండ, వేడి గాలి... రాత్రి గజగజమనిపించే చలితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో కనిష్ఠంగా 13డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవగా.. గరిష్ఠంగా ఆదిలాబాద్‌లో 33, మెదక్‌లో 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్‌లో కనిష్ఠంగా 16.6,. గరిష్ఠంగా 32.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



బ్యాంకుల్లో ప్రైవేటు భాగస్వామ్యం పెరగాలి

పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రైవేటు భాగస్వామ్యం మరింత పెరగాలి. ప్రభుత్వం బ్యాంకుల రీక్యాపిటలైజేషన్ చేస్తున్న సమయంలో పరిశీలన, పర్యవేక్షణ, క్రమశిక్షణాయుత విస్తరణకు ప్రైవేటు భాగస్వామ్యం చాలా అవసరం.

- కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్



ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధికి సంబంధం లేదు

ద్రవ్యోల్బణానికి ఆర్థికాభివృద్ధికి సంబంధం లేదు. కానీ దీర్ఘకాలికంగా చూసినప్పుడు మాత్రం తక్కువ స్థాయిలో, స్థిరమైన ద్రవ్యోల్బణం అభివృద్ధికి దోహదపడుతుంది. కాబట్టి ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ధరలను స్థిరంగా ఉంచాలి.

- దువ్వూరి సుబ్బారావు, ఆర్బీఐ మాజీ గవర్నర్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.76.32	పాత ధర 67.97
కొత్త ధర రూ.76.16	కొత్త ధర 67.84
తగ్గింది : 00.16 పైసలు	తగ్గింది : 00.13 పైసలు



మల్లన్న దర్శనానికి భారీగా వచ్చిన భక్తులు

మల్లన్న దయతో తెలంగాణకు మహర్దశ

- దేవాలయాల అభివృద్ధికి సీఎం కృషి: తలసాని



చేర్యాల, ఫిబ్రవరి 18: కొమురవెల్లి మల్లన్న దయతో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుస్తున్నదని, సీఎం కేసీఆర్ కృషితో తెలంగాణ ప్రాంత దేవాలయాలు అభివృద్ధి చెందుతున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామిని దర్శించుకున్న అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారని కొనియాడారు. యాదాద్రి, భద్రాద్రి, వేములవాడ రాజరాజేశ్వరీ ఆలయంతో పాటు కొమురవెల్లి ఆలయాభివృద్ధికి చిత్తశుద్ధితో పాటుపడుతున్నారని చెప్పారు. 2004లో మల్లన్న కల్యాణానికి హాజరైన సీఎం కేసీఆర్ రూ. 5కోట్లు మంజూరు చేయడంతో పాటు ఇటీవల రూ.10 కోట్లు కేటాయించారన్నారు. ఈ నిధులతో ఆలయ పరిసరాలలో సీసీ రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. భక్తులకు వసతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారన్నారు. దాసారంగుట్ట వద్ద దాతల సహకారంతో వసతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మల్లన్నను ఇలవేల్పుగా కొలుస్తున్నందున తాను స్వతహాగా అధునాతన వసతులతో గెస్ట్‌హౌజ్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. మల్లన్న దర్శనం తర్వాత భక్తులు కొండపోచమ్మను దర్శించుకుంటారని, ఈక్రమంలో వచ్చే ఏడాది కొండపోచమ్మ వద్ద గెస్ట్‌హౌజ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. కాగా సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాలు వేలాదిమంది భక్తులతో కిక్కిరిసిపోయాయి. మల్లన్న బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఐదో వారమైన ఆదివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈసందర్భంగా భక్తులు మల్లన్న ఆలయ కోనేరులో పుణ్యస్నానమాచరించి చెలుక, నజరు, ముఖ మండప పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఒడిబియ్యం, బండారు, పట్టు వస్త్రాలు సమర్పించి మల్లన్నను దర్శించుకున్నారు.

వైభవంగా ధ్వజారోహణం

దేవతాహ్వానం, భేరిపూజలతో వేడుకలు.. యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు ఆధ్యాత్మిక సంరంభం





ధ్వజారోహణంలో గరుడ ప్రసాదాన్ని ఎగురవేస్తున్న అర్చకులు, ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు

యాదాద్రి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రీశుడు లక్ష్మీనారసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు ధ్వజారోహణం, దేవతాహ్వానం, భేరీపూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఆగమశాస్త్రం ప్రకారం బ్రహ్మోత్సవ వేడుకలకు ముక్కోటి దేవతలను ఆహ్వానించడానికి శ్రీ మహావిష్ణువు వాహనమైన గరుత్మంతుడిని ఆవాహన జరిపే పూజాక్రతువే ధ్వజారోహణ కార్యక్రమం. దేవతలను అర్చించి గరుత్మంతుడి చిత్రపటాన్ని శ్వేతధ్వజ పతాకంపై చిత్రించి ధ్వజస్తంభంపైకి ఆరోహణ చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, నాదస్వరాల మధ్య ఈ ప్రక్రియ భక్తులను ఆధ్యాత్మిక లోకంలో విహరింపజేసింది. గరుత్మంతుడిని ఆహ్వానించడానికి గరుడ ముద్దలను ఎగురవేశారు. ఇంద్ర, యమ, వరుణ, కుబేరాది గణాలను ఆవాహన గావించి గరుడ మూలమంత్రంతో గరుడ ప్రసాదాన్ని పైకి విసిరే కార్యక్రమం శాస్త్రోక్తంగా సాగింది. బ్రహ్మోత్సవ ధ్వజారోహణ ప్రసాదం స్వీకరిస్తే సౌభాగ్యం, సంతానప్రాప్తి కలుగుతుందనే విశ్వాసంతో భక్తులు గరుడ ముద్దలను స్వీకరించారు. అంతకుముందు బాలాలయ మండపంలోని యాగశాలలో హవనం నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు అష్టదిక్పాలకులను ఆహ్వానించే భేరిపూజ, దేవతాహ్వానం కార్యక్రమాలను సాయంత్రం నిర్వహించారు. బాలాలయ మండపంలో అర్చక బృందం, రుత్వికులు.. దిక్పాలకులను ఆహ్వానించేందుకు ఆయా వాయిద్యాలను వీనులవిందుగా వాయించారు. శబ్ద బ్రహ్మం, మూలమంత్ర జపంతో ప్రధాన వాయిద్యం 'భేరీ'ని మోగించి కంకణధారణ చేయడం ఈ ఉత్సవ ప్రత్యేకత. సకల దేవతలను నారసింహుడి కల్యాణ వేడుకకు ఆహ్వానించే కార్యక్రమం దేవతాహ్వానం. ఉత్సవంలో పాల్గొన్న పారాయణికులను దీక్షావస్త్రాలతో సత్కరించారు.



పేదల ఫ్రిజ్‌లు..
రాజస్థాన్ రంజన్లు

వేసవి ఇంకా రానేలేదు.. రాష్ట్రంలో అప్పుడే రంజన్ల అమ్మకాలు ఊపందుకున్నాయి. చక్కని డిజైన్లకు తోడు అందుబాటు ధరల్లో లభిస్తుండడంతో రాజస్థాన్, గుజరాత్‌లకు చెందిన రంజన్ల కోసం ప్రజలు ఎగబడుతున్నారు. రంజన్ ధర రూ.120 నుంచి రూ.200 వరకు ఉంటోంది మరింత చల్లగా ఉంటాయని సిరామిక్ రంజన్ల కోసం రూ. 250 నుంచి రూ.500 దాకా వెచ్చిస్తున్నారు. ఇవన్నీ ప్రత్యేక కంటైనర్ల ద్వారా సిరిసిల్ల జిల్లా కేంద్రానికి దిగుమతి అవుతున్నాయి.

- సిరిసిల్ల (ఆంధ్రజ్యోతి)

వీడియోకాల్‌లో ఉరేసుకుంది

(మొదటిపేజీ తరువాయి)

మేనేజ్‌మెంట్ కళాశాల వసతిగృహంలో ఈ విషాదం చోటు చేసుకుంది. బలవన్మరణానికి పాల్పడిన యువతిని అదే కళాశాలలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్న హనీషా చౌదరి (23)గా గుర్తించారు. ఆమె ప్రియుడు, అదే కళాశాలలో చదువుకుంటున్న దీక్షిత్ పటేల్ (24)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హనీషా స్వస్థలం ఆంధ్రప్రదేశ్ అనంతపురం జిల్లాలోని విద్యుత్‌నగర్. ఉన్నత విద్య కోసం హైదరాబాద్‌కు వచ్చిన ఆమె కొంపల్లి కాలేజీలోని వసతిగృహంలో 30వ నంబరు గదిలో ఉంటోంది. గుజరాత్ చెందిన సురేశ్ పటేల్ బతుకుదెరువు నిమిత్తం మేడ్చల్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన కుమారుడు దీక్షిత్ పటేల్ (24)తో హనీషా స్నేహం కొన్నాళ్లకు ప్రేమగా మారింది. ఇద్దరు పరస్పరం వాట్సాప్ చాటింగ్, వీడియో కాల్‌లో మునిగితేలేవారు.

పెళ్లి విషయమై మాటామాటా!

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఇద్దరి మధ్య ప్రేమను పెళ్లి బంధంతో శాశ్వతం చేసుకోవాలని కొన్నాళ్లుగా దీక్షిత్‌ను హనీషా కోరుతోంది. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇద్దరూ వీడియోకాల్ ద్వారా మాట్లాడుకున్నారు. కొద్దిసేపటికి హనీషా పెళ్లి ప్రస్తావన తేవడంతో సరదా సంభాషణ కాస్తా హాట్‌హాట్‌గా మారిపోయింది. ఇద్దరూ మాటామాటా అనుకున్నారు. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో హనీషా తీవ్ర మనస్తాపానికి గురైంది. దీక్షిత్‌తో వీడియో కాల్‌లో మాట్లాడుతూనే 'నేను చనిపోతున్నాను' అంటూ తాను ఉంటున్న గదిలోనే ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. వీడియోకాల్‌లో ఆమె ఉరివేసుకుంటున్న దృశ్యాన్ని చూసి హడలిపోయిన దీక్షిత్ హుటాహుటిన హాస్టల్‌కు వెళ్లి యాజమాన్యానికి విషయం చెప్పాడు. ఆమె గదికి లోపలి నుంచి గడియ పెట్టి ఉండడంతో తలుపులు బద్దలుకొట్టారు. అయితే, అప్పటికే హనీషా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. వెంటనే ఆమెను సమీపంలోని సిగ్మా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆదివారం ఆమె మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. హనీషా తండ్రి, తెలుగుదేశం నాయకుడు బుగ్గయ్య చౌదరి కూతురు మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. హనీషా మృతదేహానికి సోమవారం ఉదయం స్వస్థలంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు బంధువులు తెలిపారు.

దీక్షిత్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు

హనీషా ఆత్మహత్య కేసులో ఆమె ప్రియుడు దీక్షిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె మృతికి గల కారణాలపై అతడిని ప్రశ్నిస్తున్నారు. హనీషా చౌదరి ఆత్మహత్య వెనక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అన్న కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సొంతూరులో జరిగే తన స్నేహితుడి పెళ్లికి హనీషా హాజరయ్యే విషయంలోనూ ఇద్దరి మధ్య మాటామాటా పెరిగినట్టు తెలుస్తోంది. ఈ కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరి మధ్య సెల్‌ఫోన్ సంభాషణల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. కాగా మంత్రులు పరిటాల సునీత, కాల్వ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పార్థసారథి, ప్రభాకర్ చౌదరి, యామినిబాల తదితరులు అనంతపురంలో హనీషా మృతదేహానికి నివాళులర్పించారు.

మహిళా ఉద్యోగిపై అత్యాచారం

- పలుమార్లు రేప్ చేశారని ఎస్పీకి ఫిర్యాదు
- జీఎం సహా ఆరుగురు ఉద్యోగులపై అట్రాసిటీ కేసు
- సెజ్ కర్మాగారంలో ఘటన.. గోప్యంగా విచారణ

అచ్యుతాపురం (విశాఖ జిల్లా), ఫిబ్రవరి 18: స్థానిక ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్‌ఈజడ్-సెజ్)లోని బ్రాండిక్స్ గార్మెంట్ కంపెనీకి అనుబంధంగా వున్న 'షోర్ టు షోర్' అనే కర్మాగారానికి చెందిన జనరల్ మేనేజర్ (జీఎం), మరో ఐదుగురు ఉద్యోగులు తనను లైంగికంగా వేధించడమే కాకుండా, పలుమార్లు అత్యాచారం చేశారని అదే కంపెనీలో పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేయాలని ఆదేశించారు. ఆరుగురు నిందితుల్లో ఇద్దరిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఆలస్యంగా వెలుగులోకొచ్చిన ఈ సంఘటన వివరాలు.. చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన ఒక దళిత మహిళ, ఏపీలోని విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం మండలంలోని 'షోర్ టు షోర్' కర్మాగారంలో 2012 నుంచి సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ జీఎం దిలీప్ పింటోతోపాటు ఉద్యోగులు బాలశంకర్, శ్యామ్‌సుందర్, వాసుదేవ, నరేష్, సురేష్ తనను లైంగికంగా వేధించడంతోపాటు పలుమార్లు అత్యాచారం చేశారని జనవరి 27న జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మకు ఆమె ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన, డీఎస్పీ వివేకానందను విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ విషయాన్ని చాలా గోప్యంగా ఉంచారు. విచారణ అనంతరం వివేకానంద ఇచ్చిన నివేదిక ఆధారంగా 'షోర్ టు షోర్' కర్మాగారం జీఎం దిలీప్ పింటో, మరో ఉద్యోగి శ్యామ్‌సుందర్‌ని ఆదివారం అరెస్టు చేసి విశాఖపట్నం తరలించారు. మిగిలిన నలుగురు పరారీలో ఉన్నారని పోలీసులు చెప్పారు.



మెదడుకు హాని కలగకుండా గుండెపోటుకు చికిత్స

వాషింగ్టన్, ఫిబ్రవరి 18: గుండెపోటుకు సరికొత్త చికిత్సా పద్ధతిని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దీనివల్ల మెదడుకు ఎలాంటి హానీ కలగదని, పైగా సహజంగా రోగనివారణ సాధ్యపడుతుందని అమెరికాకు చెందిన జార్జియా వర్సిటీ, అగస్టా వర్సిటీ పరిశోధకులు చెబుతున్నారు. కొత్త చికిత్సకు ఏబీ 126 అని పేరు పెట్టారు. రక్తకణాలకు సాయపడే ఎక్స్‌ట్రా సెల్యూలర్ వెసికిల్స్(ఈవీ), ద్రవంతో నిండిన పదార్థాలను ఈ చికిత్సలో ఉపయోగించారు. ఆ తర్వాత బ్రెయిన్‌కు ఎంఆర్‌ఐ స్కానింగ్ తీయగా ఎలాంటి హానీ జరగలేదని గుర్తించినట్లు యూజీఏ ప్రొఫెసర్ స్టీవెన్ స్టైస్ వివరించారు. ప్రస్తుతం ఈ పరీక్షలు ప్రాథమిక దశల్లోనే ఉన్నాయని, వచ్చే ఏడాది మనుషులపై కూడా ఈ పరీక్షలు చేయడానికి సిద్ధపడుతున్నట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల్లో
ప్రవేశాలకు ఆహ్వానం

- దరఖాస్తులకు మార్చి 16 వరకు అవకాశం
- ఏప్రిల్ 8న ఉమ్మడి ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు తెలంగాణ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హత గల విద్యార్థులు ఈ నెల 19వ తేదీ నుంచి మార్చి 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. www.tgcet.cgg.gov.in, www.tswreis.in వెబ్‌సైట్ల ద్వారా ఆన్‌లైన్‌లో రూ. 50 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అన్ని గురుకులాల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 8వ తేదీన ఉమ్మడి ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతూ 9 నుంచి 11 ఏళ్ల వయసు గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ. 1.50లక్షలు, పట్టణాల్లో రూ. 2లక్షలు మించకూడదు. దరఖాస్తు సమయంలో ఆధార్ నంబరు తప్పనిసరిగా వేయాల్సి ఉంటుంది. ఇతర సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబరు 1800 4254 5678కు సంప్రదించవచ్చు.



అధికారులతో సమావేశమైన కేంద్ర మంత్రి అనంతకుమార్ హెగ్డే, నాయిని

తెలంగాణలో ఐటీఐల పనితీరు భేష్

- కేంద్ర మంత్రి అనంత్ కుమార్ హెగ్డే

హైదరాబాద్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)ల పనితీరు భేష్ అని కేంద్ర మంత్రి అనంత్ కుమార్ హెగ్డే ప్రశంసించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారికన్నా.. ఐటీఐ విద్యార్థులకే ఉద్యోగావకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయని తెలిపారు. శంషాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం ఆయనతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హెగ్డే మాట్లాడుతూ ఐటీఐ కళాశాలలను అత్యాధునికంగా తీర్చిదిద్దితే.. విద్యార్థుల భవిష్యత్తు బంగారమవుతుందని అభిప్రాయపడ్డారు. కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని ఐటీఐ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. పీఎంకేవీవైలో రిజిస్ట్రేషన్, అక్రిడిటేషన్‌కు 40-60 రోజుల సమయం పడుతుందని, దాన్ని తగ్గించాలని మంత్రి నాయిని కోరగా.. హెగ్డే సానుకూలంగా స్పందించారు. ఈ విషయమై త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

మార్చి 2న జర్మనీకి కేటీఆర్

- ఆసియా-పసిఫిక్ సమావేశానికి ఆహ్వానం

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో మార్చి 2వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు మంత్రి కేటీఆర్‌కు ఆహ్వానం అందింది. జర్మనీ -ఆసియా పసిఫిక్ బిజినెస్ అసోసియేషన్-98వ సమావేశానికి హాజరు కావాలని కోరుతూ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రికి ఆహ్వానం పంపారు. జర్మనీలోని హంబర్గ్‌లో ఈ సమావేశం జరగనుంది. ఆసియా దేశాల్లో జర్మనీ నిర్వహించే వ్యాపార- వాణిజ్య అవకాశాలపై ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు పొందిన సుమారు 300మంది వాణిజ్య వేత్తలు, రాజకీయ నేతలు, దౌత్యవేత్తలు హాజరుకానున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అపార వ్యాపార, వాణిజ్య అవకాశాలపై మంత్రి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ-జర్మన్‌ల మధ్య వాణిజ్య ఒప్పందం మరింత విస్తృతమవుతుందని జర్మనీ-ఏసియన్ బిజినెస్ అసోసియేషన్ ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు తనకు ఆహ్వానం రావడంపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

అంతర్రాష్ట్ర సమావేశంపై అనాసక్తి

- ఎజెండా లేకపోవడంతో పట్టించుకోని రాష్ట్రాలు
- 'సాగునీటి' మంత్రులు హాజరయ్యేదీ అనుమానమే

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : జల వివాదాలపై చర్చించేందుకు కేంద్రం నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర సమావేశాన్ని పలు రాష్ట్రాలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. హైదరాబాద్‌లో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న సమావేశానికి కేంద్ర జల వనరుల శాఖ సహాయ మంత్రి అర్జున్ రాం మెఘ్వాల్ హాజరు కానుండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, పాండిచ్చేరి, కేరళ రాష్ట్రాలను కేంద్రం ఆహ్వానించింది. అయితే, ఈ సమావేశానికి ముఖ్యమైన రాష్ట్రాల నుంచి సాగునీటిపారుదల శాఖ మంత్రులు రావడం లేదని తెలుస్తోంది. ఇప్పటి వరకు పాండిచ్చేరి, కేరళ రాష్ట్రాల మంత్రులు మాత్రమే వస్తున్నట్టు సమాచారం ఉందని, కర్ణాటక, తమిళనాడు, ఏపీ మంత్రులు హాజరయ్యే అవకాశం కనిపించడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. ఆయా రాష్ట్రాల తరఫున అధికారులు పాల్గొంటారని చెబుతున్నారు. జల వివాదాలపై రాజకీయంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని, ఇలాంటి సమావేశానికి అధికారులు మాత్రమే హాజరైనా ప్రయోజనం ఉండదని వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు కేంద్రం కూడా ఈ సమావేశానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇబ్బందులు, ఇతర అంశాలను ప్రస్తావించాలని సూచించడం మినహా అంశాల వారీగా ఏజెండా ప్రకటించకపోవడంతో రాష్ట్రాలు ఆసక్తి చూపడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా కృష్ణా నీటి పంపకాల్లో ఏపీతో ఉన్న వివాదాలు, నీటి కోటా పెంపు తదితర విషయాలను ప్రస్తావించనుంది. ఆర్డీఎస్ ఆధునికీకరణకు ఏపీ సహకరించడం లేదని పేర్కొనడంతోపాటు గోదావరి నది నుంచి కృష్ణాకు తరలిస్తున్న నీటిలో తెలంగాణ వాటాను ప్రకటించాలని కోరనుంది.

చావో రేవో తేల్చుకుందాం

- ఉద్యమాన్ని ఉధృతం చేద్దాం: మందకృష్ణ



సూర్యాపేట, ఫిబ్రవరి 18: ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమాన్ని ఉధృతం చేసి చావో రేవో తేల్చుకుందామని కార్యకర్తలకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేటలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణపై పార్లమెంటులో చర్చ జరగాలన్నారు. ప్రజాప్రతినిధులు ఎస్సీ వర్గీకరణ వాణి వినిపించేట్లు అన్ని రాజకీయ పక్షాలపై ఒత్తిడి తేవాలన్నారు. తెలంగాణ రాష్ట్రం అతలాకుతలమైనా వెరవకుండా చరిత్రను మన వైపునకు తిప్పుకునేలా కార్యకర్తలు కసితో ఉద్యమించాలన్నారు.

కాళేశ్వరం ఇరిగేషన్ ప్లానింగ్ సిద్ధం

- నేడు సీడబ్ల్యూసీకి సమర్పించే అవకాశం
- త్వరలోనే టీఏసీ క్లియరెన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి మరో కీలక అడుగు పడబోతున్నది. ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి నుంచి లిఫ్టు చేసే నీటిని ఉపయోగించుకునే విధానంపై 'ఇరిగేషన్ ప్లానింగ్' సిద్ధమైంది. ఈ ప్లానింగ్‌ను సోమవారం కేంద్ర జల సంఘానికి(సీడబ్ల్యూసీ) సమర్పించే అవకాశం ఉంది. అటు తర్వాత కేంద్ర టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) సమావేశమై ప్రాజెక్టుకు అనుమతిని జారీ చేస్తుంది. దాంతో కేంద్రం నుంచి ఇంకా రావాల్సిన పెట్టుబడి, కాస్ట్ అప్రయిజల్ వంటి అనుమతులు జారీ అవుతాయి. ఇవి కూడా లభిస్తే.. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు వచ్చినట్లవుతుంది. ఫలితంగా ప్రాజెక్టు నిర్మాణానికి వివిధ ఆర్థిక సంస్థల నుంచి నిధులను పొందడానికి అవకాశం ఉంటుంది. కేంద్రం నుంచి కూడా గ్రాంటు లేదా ఇతర మార్గాల్లో నిధులను తెచ్చుకునే వెసులుబాటు కలుగుతుంది. అలాగే జాతీయ హోదాను పొందడానికీ వీలుంటుంది.

ప్లానింగ్ సిద్ధం చేసిన వ్యాప్కోస్

గోదావరి నీటిని ఉపయోగించుకోవడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తున్న విషయం తెలిసిందే. సుమారు రూ. 80 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది డిసెంబర్ నాటికి నీటిని తరలించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి సుమారు 180 టీఎంసీల నీటిని లిఫ్టు చేసి ఎగువ ప్రాంతాలకు తరలించనున్నారు. ఈ నీటి ద్వారా సుమారు 18 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించడంతో పాటు, మరో 18 లక్షల ఎకరాలను స్థిరీకరించనున్నారు. నీటిని తరలించడానికి వీలుగా పలు పంప్ హౌస్‌లను, రిజర్వాయర్లను నిర్మిస్తున్నారు. అయితే ఈ నీటిని ఏ విధంగా ఉపయోగించనున్నారనే అంశాన్ని కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. అంటే.. ఎక్కడెక్కడ ఏయే రిజర్వాయర్ల ద్వారా ఈ నీటిని ఉపయోగిస్తారు? అనే విషయంపై ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ ప్లానింగ్‌ను సమర్పించాల్సి ఉంది. ఈ ఇరిగేషన్ ప్లానింగ్‌ను రూపొందించే బాధ్యతను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన వ్యాప్కోస్‌కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. క్షేత్ర స్థాయిలో సర్వేను నిర్వహించిన వ్యాప్కోస్.. ఈ ఇరిగేషన్ ప్లానింగ్‌ను సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ ప్లానింగ్‌ను సోమవారం సీడబ్ల్యూసీకి అప్పగించే అవకాశం ఉంది.

'దేవాదుల ప్రాజెక్టు' కార్పొరేషన్ ఏర్పాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం - తుపాకులగూడెం బ్యారేజీ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించింది.

ఏప్రిల్ 20

బడ్జెట్ ప్రతిపాదనలేమిటి?



ప్రగతి భవన్‌లో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్ తదితరులు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించారు. రాజేంద్ర నగర్‌లోని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 25న, కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో 26న వీటిని నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యవసాయాన్ని లాభసాటి చేయడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు.. సమన్వయ సమితులు నిర్వహించాల్సిన పాత్రకు సంబంధించి సదస్సుల్లో వివరించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ వర్సిటీలో జరిగే సదస్సుకు జనగామ, మెదక్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, వికారాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల మండల రైతు సమన్వయ సమితుల సభ్యులను ఆహ్వానించాలని ఆదేశించారు. కరీంనగర్ సదస్సుకు ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట జిల్లాలకు చెందిన సభ్యులను ఆహ్వానించాలని చెప్పారు. ఉదయం 10.30నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సుల్లో సీఎం కేసీఆర్, మంత్రి పోచారం పాల్గొంటారు. రైతులతో సీఎం కేసీఆర్ నేరుగా సంభాషిస్తారు. వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్ శాఖల అధికారులు కూడా పాల్గొంటారు. సదస్సులకు వచ్చే సభ్యులకు ప్రయాణ, భోజన సదుపాయాలన్నీ వ్యవసాయ శాఖ సమకూర్చాలని సీఎం సూచించారు. రైతులను సంఘటితం చేయడం, రైతు వేదికల నిర్మాణం, నిర్వహణ, రైతులకు నిరంతర శిక్షణ, పంట పెట్టుబడి మద్దతు పథకం, కనీస మద్దతు ధర, మార్కెట్లకు ఉత్పత్తులు తీసుకువచ్చే విషయంలో నియంత్రణ పాటించడం, మేలైన సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయ విధానం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, కోల్డ్ స్టోరేజీ చైన్, క్రాప్ కాలనీలు తదితర అంశాల్లో రైతు సమన్వయ సమితులు నిర్వహించాల్సిన పాత్రపై కరదీపిక అందిస్తామన్నారు.

సాగుకు ప్రత్యేక బడ్జెట్‌పై ముసాయిదా

వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని నిర్ణయించిన నేపథ్యంలో దానికి అనుగుణంగా ముసాయిదాను రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. పంట సాయం ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో రెండు విడతలుగా అందించనున్నట్లు వెల్లడించారు. సబ్సిడీపై నాట్లు వేసే యంత్రాలను అందించాలని సీఎం నిర్ణయించారు. ఈ సమీక్షలో మంత్రి ఈటల రాజేందర్, సీఎస్ ఎస్కే జోషి, ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ఎంపీలు గుత్తా సుఖేందర్ రెడ్డి, బాల్క సుమన్, ఆర్థిక, వ్యవసాయ శాఖల ముఖ్య కార్యదర్శులు రామకృష్ణారావు, పార్థసారధి, వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'గుత్తా'కే సారథ్య బాధ్యతలు?

రైతు సమన్వయ సమితి కార్పొరేషన్‌గా అవతరించబోతోంది. దీనికి సంబంధించిన విధివిధానాల రూపకల్పన జరుగుతోంది. సీఎం కేసీఆర్ ఆదివారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ అంశంపై కూడా చర్చ జరిగింది. ఇందులో భాగంగానే దీనిపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం రెండు మూడు రోజుల్లో ప్రత్యేకంగా భేటీ కాబోతోంది. సహకార లేదా కంపెనీల చట్టం కింద రిజిష్టర్ చేయాలా అన్న విషయం ఈ సమావేశం అనంతరం వెల్లడయ్యే అవకాశముంది. జిల్లా కమిటీల ఎంపిక బాధ్యతను సీఎం మంత్రులకు అప్పగించిన విషయం తెలిసిందే. మంత్రుల సిఫార్సుతో ఆయా జిల్లాల కలెక్టర్లు వాటిని వ్యవసాయ శాఖకు పంపిస్తున్నారు. ఇప్పటికే 16 జిల్లాల నుంచి వివరాలు అందాయి. అయితే, వాటిని గోప్యంగా ఉంచారు. సీఎం ఓకే చెప్పిన మీదట వాటిని వెల్లడించవచ్చని భావిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో 42 మందితో రైతు సమన్వయ సమితి ఏర్పాటవుతుందని స్వయంగా సీఎం వెల్లడించారు. దీని సారథ్య బాధ్యతలను గుత్తాకు అప్పగించవచ్చనే ప్రచారం మొదటినుంచీ జరుగుతున్న విషయం తెలిసిందే. సమీక్ష సమావేశానికి ఆయన కూడా హాజరుకావడం ఇందుకు బలం చేకూర్చినట్లయింది. ప్రభుత్వం రైతులకు అందించబోయే పెట్టుబడి సాయం విషయంలో సంధానకర్తలుగా రైతు సమన్వయసమితి సభ్యులు వ్యవహరించనున్నారు.

బడ్జెట్ ప్రతిపాదనలపై సీఎం కేసీఆర్ ఆదివారం రాత్రి సమీక్షించారు. ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఈ సమీక్షలో ఆయాశాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలను సీఎం సమగ్రంగా పరిశీలించారు. వ్యవసాయ రంగం, బీసీల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకానికి రూ.12వేల కోట్లు కేటాయించాలని నిర్ణయించింది. ఈ పద్దుతోపాటు వ్యవసాయ శాఖలోని ఇతర పథకాలపై వచ్చిన ప్రతిపాదనలను సీఎం కేసీఆర్ పరిశీలించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయరంగానికే ఎక్కువ కేటాయింపులు చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. బీసీలకు సబ్ ప్లాన్ కాకుండా ప్రత్యేక అభివృద్ధి నిధి కింద బడ్జెట్ కేటాయింపులు చేయాలన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమయినట్లు తెలిసింది. కేంద్రం నుంచి ఎలాంటి ఆర్థిక భరోసా లభించని నేపథ్యంలో రాష్ట్ర రాబడుల గురించి సీఎం ఆరా తీశారు. జీఎస్టీ, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, రవాణా పన్నుల రూపంలో 2017-18లో వచ్చిన రాబడులను పరిశీలించారు. దీని ప్రాతిపదికన కొత్త ఆర్థిక సంవత్సరంలో పన్ను ఆదాయాన్ని అంచనా వేసి బడ్జెట్ రూపకల్పన చేయాలని సీఎం సూచించినట్లు సమాచారం.

చేనేత కార్మికులకు ఉచిత బీమా, ఆరోగ్యశ్రీ

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తామని, ఆరోగ్య బీమా కార్డులు అందజేస్తామని సీఎం కేసీఆర్ అన్నారు. ఈ మేరకు తనను కలిసిన వీవర్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ప్రతినిధులకు సీఎం హామీ ఇచ్చినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు దాసు సురేష్ తెలిపారు. సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా శనివారం చేనేత కార్మికులతో పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు, ప్రగతిభవన్‌కు వెళ్లి తమ సమస్యలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు.

ఐఐటీ హైదరాబాద్‌కు
జపాన్ భారీ రుణం

- నీతి ఆయోగ్ తాజా నివేదిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): ఐఐటీ హైదరాబాద్‌కు జపాన్ భారీ రుణం అందజేయనుంది. ఐఐటీ హైదరాబాద్-జపాన్ ఉమ్మడి ప్రాజెక్టు పెట్టుబడి రూ.1776.50 కోట్లు కాగా అందులో జపాన్ నుంచి రూ.1501.50 కోట్ల ఓడీఏ రుణం లభిస్తుందని నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన వార్షిక నివేదికలో పేర్కొంది. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ పదేళ్ల పాటు మిగతా 274.77 కోట్లను గ్రాంట్ రూపేణా చెల్లిస్తుంది. వ్యవసాయ మార్కెటింగ్, రైతులకు అనుకూలమైన సంస్కరణల అమలు సూచీలో తెలంగాణకు 9వ స్థానం లభించగా.. ఏపీ ఏడో స్థానం పొందింది. తెలుగు రాష్ట్రాలు రెండూ నీతి ఆయోగ్ రూపొందించిన నమూనా వ్యవసాయ భూమి లీజింగ్ చట్టాన్ని రూపొందించే క్రమాన్ని ప్రారంభించాయని నివేదికలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ఐటీ శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి నిధులు అందించేందుకు ముసాయిదా ఆర్థిక కమిటీని ఏర్పాటు చేసినట్లు నీతిఆయోగ్ నివేదిక పేర్కొంది. ఈ సంస్థకు డైరెక్టర్, మూడు నాన్ టీ చింగ్ పోస్టులను కూడా కేబినెట్ మంజూరు చేసింది. విశాఖపట్నంలో ఐఐఎం ఏర్పాటుకు నిధులందించే విషయం పరిశీలించేందుకూ ముసాయిదా ఆర్థిక కమిటీ ఏర్పడింది. నీతిఆయోగ్-బ్రిటన్ సర్కారు ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా సీఎం చంద్రబాబు ఇంధన కాలిక్యులేటర్‌ను ఇప్పటికే ప్రారంభించారని నివేదిక పేర్కొంది. తొలి దశలో గుజరాత్, అసోంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కూ ప్రాధాన్యం ఇచ్చారని తెలిపింది. విద్యుదుత్పాదన, పంపిణీ, డిమాండ్, సరఫరాను అంచనా వేసి వినూత్న వ్యూహాలను రూపొందించేందుకు ఇది తోడ్పడుతుంది. కాగా 2030 నాటికి పునరుత్పాదక విద్యుత్ కార్యాచరణ ప్రణాళికను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అమలు చేయనున్నట్టు నీతి ఆయోగ్ తెలిపింది. హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి నిర్వహించిన ప్రపంచ ఆర్థిక సదస్సు గురించి వార్షిక నివేదికలో ప్రముఖంగా ప్రచురించారు. డిజిటల్ చెల్లింపులపై ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు.. ప్రధాని మోదీకి సమర్పించిన నివేదిక గురించి కూడా ఈ నివేదిక ప్రముఖంగా పేర్కొంది.

న్యాయవ్యవస్థలో
'సబార్డినేట్ కోర్టు'లే కీలకం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- దేశవ్యాప్తంగా 4 వేల సబార్డినేట్ జడ్జీల పోస్టుల ఖాళీలు
- కేసుల పరిష్కార జాప్యానికి అనేక కారణాలు
- సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవాల్సి ఉంది
- 'ఆంధ్రజ్యోతి'తో నేషనల్ జ్యుడీషియల్ పే కమిషన్ చైర్మన్ జస్టిస్ వెంకట్రామరెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): 'దేశ న్యాయవ్యవస్థలో సబార్డినేట్ (జిల్లా, తాలుకా, మండలం) కోర్టులు అత్యంత కీలకం. కిందిస్థాయి కోర్టుల్లో కేసులు పేరుకుపోయి పరిష్కారంలో జాప్యమవుతోంది. వీటికి సిబ్బంది కొరతే కాదు.. అనేక కారణాలున్నాయి' అని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, నేషనల్ జ్యుడీషియల్ పే కమిషన్ చైర్మన్ జస్టిస్ వెంకట్రామరెడ్డి అన్నారు. సబార్డినేట్ జడ్జీల వేతన సవరణ, కిందిస్థాయి కోర్టుల్లో వసతుల కల్పనపై గతేడాదిలో సుప్రీంకోర్టు నేషనల్ జ్యుడీషియల్ పే కమిషన్ ఏర్పాటు చేసింది. దీనికి సారథ్యం వహిస్తున్న జస్టిస్ వెంకట్రామరెడ్డి, కమిషన్ కార్యదర్శి జస్టిస్ వినయ్‌కుమార్ గుప్తా, సభ్యులు జస్టిస్ ఆర్ బసంత్ ఆదివారం నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన న్యాయాధికారులు, సంఘాలతో వారు సమావేశమై అభిప్రాయాలను సేకరించారు. జస్టిస్ వెంకట్రామరెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. కమిషన్ చేపట్టిన, చేపట్టనున్న కార్యకలాపాలను ఆయన వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: కిందిస్థాయి కోర్టుల్లో కేసులు పేరుకుపోవడానికి వసతుల్లేకపోవడమే కారణమా?

జస్టిస్ పీవీ రెడ్డి: కేసుల పరిష్కారంలో జాప్యానికి చాలా కారణాలున్నాయి. జడ్జిలు, న్యాయ అధికారులకు కావాల్సిన వసతులు కల్పించకపోవడం కూడా ఓ ప్రధాన కారణమే. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం సబార్డినేట్ కోర్టుల్లో 21 వేల జడ్జీల పోస్టులున్నాయి. కానీ.. ప్రస్తుతానికి 18 వేలు మాత్రమే ఉన్నారు.

దేశవ్యాప్తంగా కిందిస్థాయి కోర్టుల్లో వసతులు ఎలా ఉన్నాయి?

న్యాయవ్యవస్థలో సబార్డినేట్ కోర్టులు అత్యంత కీలకం. ప్రజల సమస్యలకు వీటి ద్వారానే పరిష్కారం లభిస్తుంది. హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించే వారి సంఖ్య చాలా తక్కువ. అందుకే ఈ కోర్టులపై సుప్రీంకోర్టు ఎక్కువగా దృష్టి సారించింది. ఈ కోర్టుల జడ్జీల వేతన సవరణతో పాటు ప్రస్తుతం ఉన్న, కల్పించాల్సిన వసతులపై నివేదిక ఇవ్వాలని గతేడాది సుప్రీంకోర్టు నేషనల్ జ్యుడీషియల్ పే కమిషన్‌ను ఏర్పాటు చేసింది. వివిధ రాష్ట్రాల్లో ఉన్న స్థితిగతులను అధ్యయనం చేసి వివరాలు సుప్రీంకోర్టుకు సమర్పిస్తాం.

సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృత పరుస్తున్నారా?

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వాడాల్సి ఉంది. ఇటీవల కాలంలో ఐటీ వినియోగం పెరిగింది. కేసుల సత్వర పరిష్కారానికి ఇలా అనేక అంశాలపై దృష్టి సారించాల్సి ఉంది.

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులతో పోలిస్తే సబార్డినేట్ జడ్జీల వేతనాలు ఎలా ఉన్నాయి?

ప్రభుత్వ శాఖల ఉద్యోగుల వేతనాలతో జడ్జిల వేతనాలను పోల్చలేం. ఎందుకంటే న్యాయవ్యవస్థ ఒక స్వతంత్ర వ్యవస్థ. ఈ ప్రత్యేకతను కొనసాగిస్తూ సంరక్షించాల్సిన కీలక బాధ్యతలు జడ్జీలపై ఉన్నాయి. ఏడో వేతన సవరణ సంఘం సిఫార్సుల ఆధారంగా ఇటీవలే సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల వేతనాలు పెంచారు. హైకోర్టు జడ్జీల వేతనం రూ. 80వేల నుంచి రూ. 2.25 లక్షలకు పెరిగింది. బేసిక్‌పై డీఏ 136 శాతం పెంచారు. సబార్డినేట్ జడ్జీల వేతన సవరణకు ఈ అంశాలను కూడా పరిశీలిస్తున్నాం.

వేతన సవరణపై తీసుకుంటున్న చర్యలేవి?

రాష్ట్ర ప్రభుత్వం, సబార్డినేట్ కోర్టుల జడ్జీలు, న్యాయ సంఘాలతోనూ సమావేశమవుతున్నాం. వారి సూచనలను ఆహ్వానిస్తున్నాం. వేతన సవరణపై వచ్చే నెలలో మధ్యంతర నివేదిక సుప్రీంకోర్టుకు సమర్పిస్తాం.

పూర్తి నివేదిక ఎప్పటిలోగా అందజేస్తారు?

సుప్రీంకోర్టు 20 ఏళ్ల కిందట తొలి నేషనల్ జ్యుడీషియల్ పే కమిషన్ ఏర్పాటు చేసింది. ఇది రెండోది. పూర్తి నివేదిక 18 నెలల్లో ఇవ్వాలని గతేడాది నవంబరులో ఇచ్చిన నోటిఫికేషన్‌లో కోరింది. దీనిప్రకారం నివేదిక సమర్పణకు ఇంకా ఏడాది సమయం ఉంది. సుప్రీం కోరిన నేపథ్యంలో నివేదికను ముందే సమర్పిస్తాం. తమ నివేదికతో తెలంగాణలోని 291, ఏపీలోని 496 జడ్జీలతో పాటు దేశవ్యాప్తంగా 18 వేల సబార్డినేట్ కోర్టుల జడ్జీలు, పింఛనర్లకు మేలు కలుగుతుంది.

100 మండలాల్లో ఒక్క జూనియర్ కాలేజీ లేదు!

- సర్కారువే కాదు.. ప్రైవేట్‌వీ లేవు
- ఇంటర్ కోసం విద్యార్థులకు తప్పని దూరభారం
- కొత్త కాలేజీ ఏర్పాటుకు విద్యాశాఖ కసరత్తు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సుమారు 100మండలాల్లో జూనియర్ కాలేజీలు లేవు. ప్రభుత్వ కాలేజీలే కాదు.. కనీసం ప్రైవేటు కళాశాలలు కూడా లేవంటే నమ్మలేని నిజం!! దీంతో అతికష్టంమీద విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోంది. రాష్ట్రంలో 84నూతన మండలాల్లో, 16పాత మండలాల్లో జూనియర్ కాలేజీలు లేవని ఇటీవల అధికారులు గుర్తించారు. వీటిలో అత్యధిక మండలాలు వెనుకబడినవే కావడం గమనార్హం. ఈ ప్రాంతాల్లో విద్యార్థులకు ఫీజులు చెల్లించే పరిస్థితి లేదని, ఒక వేళ కాలేజీలు ఏర్పాటు చేసినా పెట్టుబడులు కూడా తమకు మిగలవని ప్రైవేటు యాజమాన్యాలు ముందుకు రావడం లేదు.

విజ్ఞప్తుల వెల్లువ

రాష్ట్రంలో ప్రస్తుతం 404 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. వీటిల్లో ఫస్టియర్, సెకండియర్ కలిపి మొత్తం 1.8లక్షల మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. డిమాండ్ ఉన్న చాలా ప్రాంతాల్లోనూ ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధుల నుంచి ఇంటర్మీడియట్ విద్యాశాఖకు విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. తమ ప్రాంతాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు. దీంతో కదిలిన ఆ శాఖ అధికారులు.. వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఏఏ ప్రాంతాల్లో కాలేజీ అవసరం ఉంది? అక్కడి విద్యార్థుల సంఖ్య ఎంత? ఎంత వ్యయం అవుతుంది? లాంటి వివరాలతో నివేదికలు ఇవ్వాలని జిల్లా ఇంటర్ విద్యాధికారులకు ఆదేశాలిచ్చారు. ఆ నివేదికల ఆధారంగా ఇంటర్ విద్యాశాఖ నూతన ప్రభుత్వ జూనియర్ కాలేజీల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతుంది. ఒక్కో కాలేజీ ఏర్పాటుకు కనీసం రూ. 3కోట్ల వరకు అవసరమవుతాయని అధికారులు అంటున్నారు. మొదటి దశలో సుమారు 15-20 కాలేజీలకు అనుమతి లభించే అవకాశం ఉందని సమాచారం.



తాండూరు డిపోలో తాండూరు-బెంగళూరు బస్సును ప్రారంభిస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి

బడ్జెట్‌లో ఆర్టీసీకి
వెయ్యి కోట్లకు పైనే!

- తాండూరు-బెంగళూరు ఏసీ బస్సు ప్రారంభం

తాండూరు, ఫిబ్రవరి 18: ఆర్టీసీకి బడ్జెట్‌లో ఈ సారి రూ.1000 కోట్లు కేటాయించామని, వచ్చే బడ్జెట్‌లో దానికంటే ఎక్కువగానే కేటాయిస్తామని రవాణా శాఖ మంత్రి మహేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరు బస్టాండ్‌లో తాండూరు-బెంగళూరు ఆర్టీసీ ఏసీ బస్సు సర్వీసును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు ఆర్టీసీని మరింత చేరువ చేసేందుకు కొత్త బస్సుల కొనుగోలులో పల్లె వెలుగు సర్వీసులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు సీఎం కేసీఆర్ కట్టుబడి ఉన్నారన్నారు. ఇతర రాష్ట్రాలకు ఏసీ బస్సులు పెంచుతామన్నారు. 66 కోట్లతో బస్టాండ్లకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఆర్టీసీ స్థలాల్లో పెట్రోల్ బంకులు, సినిమా థియేటర్లు ఏర్పాటు చేసి ఆదాయాన్ని పెంచుతామని చెప్పారు.

వివిధ
సాహిత్య వేదిక vividha@andhrajyothy.com

ఒకానొక జ్వరగ్రస్తుడు ఒక కవితాగ్రస్తుడు

పులినెక్కిన బాటసారి
కడగంటిలో ఆరిపోవడానికి
సిద్ధంగా ఉన్న
ప్రాణదీపం
ఇంకా చీల్చే చీకటి...
విషాదం జీర మోస్తున్న
గాలి కూన..
చెంపను తాకితే విస్ఫోటించిన
శబ్ద మృదంగం
ఉరుముతున్న మెదడు
చెంపలనుండి వెచ్చగా
జారిపోతున్న హృదయం
బిక్కచచ్చిన వాక్యం
మిత్రుడా...
పద్యం దారి తప్పుతోంది
ప్రియురాలు కడసారి
చుంబిస్తోంది
జీవితం క్రమంగా
బలహీనపడుతోంది
చీకటి లోయలోంచి
పగలబడిన నవ్వు
నిన్ను క్రమ్ముకొంటున్నది
రాత్రి నది మెలకువ
సముద్రంలో కలిసిపోతున్నది
ఈ వరకు నిటారుగా
ఉన్న గర్భంలోని పద్యం
ఇప్పుడు తలక్రిందులైంది.



■ కాంచనపల్లి
96760 96614

తెలంగాణ భాష అమలుపై సదస్సు

'ప్రపంచ మాతృభాషా దినోత్సవం' సందర్భంగా తెలంగాణ భాష అమలులోని వివిధ అంశాలపై ఫిబ్రవరి 21 ఉ.10గం.లకు రవీంద్ర భారతి మినీ కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్ నందు తెలంగాణ సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో సదస్సు జరుగుతుంది. నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు. ఎస్వీ సత్యనారాయణ, దేవులపల్లి ప్రభాకర్‌రావు, దేశపతి శ్రీనివాస్, సంగనభట్ల నరసయ్య, నలిమెల భాస్కర్ తదితరులు హాజరవుతారు.

- ఏనుగు నరసింహారెడ్డి

'దేవుడు తప్పిపోయాడు' కవితా సంకలనం

విల్సన్‌రావు కొమ్మవరపు కవితా సంకలనం 'దేవుడు తప్పిపోయాడు' ఆవిష్కరణ ఫిబ్రవరి 22 సా.6గం.లకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం, దొడ్డి కొమరయ్య హాల్, హైదరాబాద్ నందు జరుగుతుంది. ఏనుగు నరసింహారెడ్డి, కె. శివారెడ్డి, కొలకలూరి ఇనాక్, జి. లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొంటారు.

- పాలపిట్ట బుక్స్

సాహిత్య సమాలోచన సదస్సు

సయ్యద్ సలీం సాహిత్యంపై సదస్సు యోగివేమన విశ్వవిద్యాలయం, శశిశ్రీ స్మారక సమితిల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22, 23 తేదీల్లో 180 సెమినార్ హాల్, సర్ సి.వి. రామన్ సైన్స్ బ్లాక్, వై.వి.యు, కడపనందు జరుగుతుంది. అత్తిపల్లి రామచంద్రారెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొంటారు.

- శశిశ్రీ స్మారక సమితి

ఆధునిక వ్యవస్థలో మాతృభాష ప్రాధాన్యత

ఐసిఎస్‌ఎస్‌ఆర్ వారి సౌజన్యంతో 'ఆధునిక వ్యవస్థలో మాతృభాష ప్రాధాన్యత' అంశంపై జాతీయ సదస్సు ఫిబ్రవరి 22 ఉ.10గం.లకు పివికెయన్ ప్రభుత్వ కళాశాల, చిత్తూరు నందు మొదలవుతుంది. జి. ఆనందరెడ్డి, రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, పేటశ్రీనివాసులురెడ్డి, మేడిపల్లిరవికుమార్ తదితరులు పాల్గొంటారు. సమాపనోత్సవం ఫిబ్రవరి 23 మ.2.30గం.లకు జరుగుతుంది.

- ఇ. వాసు

ప్రాతినిధ్య కథ - 2016 ఆవిష్కరణ

'ప్రాతినిధ్య కథ - 2016' కథా సంకలనం ఆవిష్కరణ సభ ఫిబ్రవరి 25 ఉ.10గం.లకు మధుమాలక్ష్మి కల్చరల్ సెంటర్, మొఘల్‌రాజపురం, విజయవాడ-10 నందు జరుగుతుంది. ఆవిష్కర్త పి.సత్యవతి, పరిచయం కాకుమాని శ్రీనివాసరావు, సందేశం చల్లపల్లి స్వరూపరాణి, నిర్వహణ బండ్ల మాధవరావు, సంపాదకులు- ప్రమీల మునునూరి, సామాన్య.

- సాహితీ మిత్రులు

స్ఫూర్తి పురస్కార ప్రదానం

బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ సామాజిక స్పృహగల సాహితీ సృజనకు ఇచ్చే 'స్ఫూర్తి' పురస్కారాన్ని రచయిత్రి ఓల్గాకు ఫిబ్రవరి 25 సా.6గం.లకు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరం, గుంటూరు నందు ప్రదానం చేస్తుంది. అంబటి లక్ష్మణరావు, లావు నాగేశ్వరరావు, మండలి బుద్ధప్రసాద్ పాల్గొంటారు.

- బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి

ఒక బుద్ధిజీవి బౌద్ధిక వైకల్యం

అంతా నిశ్శబ్దంగా
వున్న.. ట్టుంది,
అంతా ప్రసన్నంగా ప్రశాంతంగా
వున్న.. ట్టుంది;
శాసనసభలూ పార్లమెంటు భవనమూ
సుప్రీమ్ కోర్టు సుందర భవనాలూ
పోలీస్ స్టేషన్లూ, పెద్దాసుపత్రులూ
పత్రికల కార్యాలయాలూ వార్తల ఛానెళ్ళూ
సినీమా హాళ్ళూ కాలేజీలూ విశ్వవిద్యాలయాలూ
ఫ్యాక్టరీలూ పార్కులూ రహదారులూ రైలుమార్గాలూ
అంతటా సుఖంగానే, భద్రంగానే వున్న.. ట్టుంది.

ఆనకట్టలూ అంతరిక్షకేంద్రాలూ
మసీదులూ దేవాలయాలూ
చర్చీలూ గురుద్వారాలూ
బౌద్ధారామాలూ జైనమందిరాలూ.. అన్నీ
ఎప్పటి లాగే ఏమీ జరగనట్టే నిశ్చలంగా
వున్న.. ట్టుంది;

నదులూ, సెలయేళ్ళూ, హోరెత్తే ఎత్తిపోతలూ
పులులూ లేళ్ళూ పక్షులూ చేపలూ
అన్నిదిక్కులూ అన్ని సముద్రాలూ
నింగీ నేలా అన్నీ చలనాచలనంలో
యోగ నియోగ వియోగ సుషుప్తిలో
వున్న.. ట్టుంది;

పైన పలచని చుక్కల మధ్య
మొద్దుబారిన కొడవలిలా కళతప్పిన చంద్రవంక...
సాయిబాబా,
విద్వత్తు మెడలో మెరిసే విద్యుత్ మాలవు నువ్వు..

అక్కడ, అండా సెల్‌లో,
భౌతికవైకల్యంతో నువ్వు,
ఇక్కడ, 'అమ్మచెట్టు'లో
బౌద్ధికవైకల్యంతో నేను...
నీకు నిద్ర లేదు
నాకు నిద్ర రాదు.

●●●

నవేతిహాసంలో
బొట్టుబొట్టు రక్తం కారుతూ
తెగిరాలిన ఏకలవ్యుడి
బొటనవేలు విడిచిన బాణానివి నువ్వు;
విరిగినవిల్లునుంచి కూడా బాణం
గురితప్పకుండా దూసుకు పోతుందని నాకు
నిన్ను చూసిన తరువాతే తెలిసింది.
విప్లవగానాలు
వేషం మార్చి విశ్రమిస్తున్న ఇప్పుడు,
నీ ఆర్తాద్రరావమే గబ్బిలపు ఘనాఘన రాగమై
ఎగిరివచ్చి ఎల్లెడలనూ చుట్టుకుంటోంది,

మాంసాస్థికలను మూటకట్టి
ఇనుపముళ్ళ కంచె మీద విసిరేసినట్టు,
ఆ జైలులో అల్లాడుతున్న నువ్వు
ఊహలలో కదులుతున్నప్పుడు నాకు
హవానా మ్యూజియమ్‌లో బతికివున్న
చేగువేరా ఖండితహస్తాలు గుర్తుకొస్తున్నాయి.

●●●

మిత్రులారా, నిజమే
మనం కొత్త కళలు నేర్చుకున్నాం,
మన నుంచి మనం
మైళ్ళకి మైళ్ళు పారిపోయాం.
ఇక్కడ ఇప్పుడు
మన భూమి మీద మనమే
పరాయివాళ్ళలా ఉంటాం,
మనదికాని ఆహారం తింటాం,
మనదికాని భాషలో
మనది కాని జాతీయగీతం పాడుకుంటాం,
మనంలేని పాటలో
మన ఉనికిని వెతుక్కుంటాం,

ఫలక్‌నామా రాజప్రాసాదంలో
శ్వేత సౌధరాకుమారితో మన
దేశభక్త చాయ్ వాలా విందువిలాస వైభోగాలని
విభ్రమంతో చూస్తూ విస్తుపోతాం.

●●●



విల్లంబులూ మందుపాతరలూ
మరతుపాకులూ విప్లవాలూ వీరులకొదిలేద్దాం,
మయకోవస్కీలనీ పాబ్లో నెరూడాలనీ
నజ్రుల్ ఇస్లాములనీ కాళిదాసులనీ కబీరులనీ
ఆనందవర్ధనులనీ కలగలిపి కషాయంగా సేవిద్దాం,
ఏమీ చూడనట్టు ఏమీ విననట్టు ఏమీ అననట్టు,
భారత రాజ్యాంగం మీద మళ్లీ ప్రమాణం చేసి
ఎప్పటి లాగే ఇలాగే పడిఉందాం. సరే, సరే..
కానీ,
లోలోపల అయినా, రహస్యంగానే అయినా,
సాయిబాబా కోసం ఏడుద్దామా,
ధ్యానం చేసుకున్నట్టు అయినా...!

(నాగపూర్ కేంద్ర కారాగారంలో ఇంకా బతికి వున్న ప్రొఫెసర్. సాయిబాబాకి, ఇంకేమీ చేయలేక.)

■ దేవిప్రియ

చైనీయుల నీతి పథం 'తావొ తె చింగ్'

తావొ తె చింగ్ చైనీయుల కళలను కవిత్వాన్నే గాక మొత్తం వారి ఆలోచనా విధానాన్నీ సంస్కృతినీ ప్రభావితం చేసిన ఉద్గ్రంథం. క్రీస్తు పూర్వం ఐదు, ఆరు శతాబ్దాల్లో దీని రచన జరిగినట్లూ, రచయిత లావోత్సు అనే మహనీయుడు అయినట్లూ చరిత్రకారులు చెబుతారు.

గ్రంథంలో 81 చిన్న చిన్న అధ్యాయాలు వున్నవి. మొదటి 37 ఒక భాగం. మిగతా 47 రెండో భాగం. వీటిల్లో కొన్ని కవితాత్మకంగా, కొన్ని గద్యప్రాయంగా వుంటవి. గ్రంథం పేరు తావొ తె చింగ్ అని వ్రాస్తారు గాని, పలకటం డావొ డె జింగ్ అని పలుకుతారట. గ్రంథం మొదటి భాగం 'తావొ' అనే పదంతోను, రెండవ భాగం 'తె' అనే పదంతోను మొదలవుతవి. అందువల్ల పుస్తకానికి తావొ తె చింగ్ అని పేరు పెట్టడం జరిగింది. 'తావొ' అంటే సామాన్యంగా అందరూ చెప్పే అర్థం 'పథం' అని. ఈ ఒక్క అర్థమే కాక చీనీ భాషలో ఈ పదానికి ప్రకృతి ధర్మం, ప్రకృతి నియమం, చైతన్యం, సృష్టికర్త, దేవుడు అనేవి కూడా వున్నవని చెబుతారు. 'తె' అంటే నైతిక ఉత్కర్ష. చింగ్ అంటే గ్రంథం. 'తావొ తె చింగ్' అంటే నైతిక ఉత్కర్షకు సంబంధించిన పథాన్ని తెలిపే గ్రంథం అని స్థూలంగా అర్థం చేసుకోవచ్చు. మొదటి భాగం 'తావొ' అనే పదంతో మొదలవుతుంది గాబట్టి ఆ భాగాన్ని 'తావొ చింగ్' అనీ, రెండో భాగం 'తె' అనే పదంతో మొదలవుతుంది గాబట్టి ఆ భాగాన్ని 'తె చింగ్' అనీ అంటారు.

కొందరు పరిశోధకుల దృష్టిలో ఈ గ్రంథం ఏ ఒక్కరివల్లో ఏక కాలంలో వ్రాయబడింది కాదు. పేరు తెలియని జ్ఞానులు ఎందరో చెప్పిన సూక్తుల్ని తరువాత కాలంలో కొందరు పండితులు ఒక చోట జేర్చి గ్రంథంగా తయారు చేశారు. 'లావో త్సు' అంటే చీనీ భాషలో వయసుమళ్ళిన పెద్ద మనిషి అని అర్థం. దీన్ని బట్టి కూడా ఈ గ్రంథం వ్రాసింది ఎవరో, అతని పేరు ఏమిటో తెలియవని అంటున్నారు. ఇదిట్లావుండగా లావొత్సు అనే పేరుగల ఆయన గురించి చైనాలో చాలా కట్టు కథలు వున్నవి. అతడు పథాన్ని (తావొ) అనుసరించి యోగ సాధన చేశాడనీ, 120 ఏళ్ళో, 160 ఏళ్ళో జీవించాడనీ కొందరంటే, కాదు అతడు మరణించనే లేదని కొందరంటారు. అతడు ఎందుకు మరణించలేదంటే, అతడు అసలు పుట్టనేలేదు కాబట్టి అని మరికొందరు చతురోక్తులు ఆడుతారు. ఈ గ్రంథం ఇప్పటి రూపంలో క్రీ.పూ.3వ శతాబ్దంలో ఒక కొలిక్కి వచ్చిందని అంటారు.

> **లావోత్సు తాను అనుకొన్న విలువలు సమాజంలో క్షీణదశకు రావటం గమనించాడు. సమాజం నుంచి దూరం వెళ్ళిపోవాలని నిర్ణయించుకొన్నాడు. అలా వెళ్తుండగా, దార్లో కాపలాదారుడు ఒకడు అడ్డుపడ్డాడు. అతడికి లావోత్సు గొప్పదనం తెలుసు. అతడు అడిగాడు, "మీరు ఎలాగూ వెళ్తున్నారు గాబట్టి, వెళ్ళే ముందు మీ ఆలోచనలతో ఒక గ్రంథం వ్రాయండి," అని. అలా ఆ కాపలాదారు కోరిక మేరకు వచ్చిందే 'తావొ తె చింగ్' గ్రంథం.**

ఎందరు ఏమనుకొన్నా, లావోత్సు చారిత్రక పురుషుడనే ఎక్కువమంది విద్వాంసుల విశ్వాసం. వారి మాటలను బట్టి లావోత్సు ప్రభుత్వం వారి ప్రాచీన పత్రాలు భద్రపరచటానికి నియమింపబడిన ఉద్యోగి. కన్‌ఫ్యూషియస్ (551-479క్రీ.పూ) అనే ఇంకో ప్రసిద్ధ తాత్వికుని కంటే వయసులో పెద్దవాడు. ఒకసారి కన్‌ఫ్యూషియస్, లావోత్సును కలవటం జరిగిందట. తరువాత లావోత్సు గురించి కన్‌ఫ్యూషియస్ తన శిష్యులకు ఈ విధంగా చెప్పాడుట: "నాకు పక్షి ఎగరటం తెలుసు. చేప ఈదటం తెలుసు. జంతువు పరుగెట్టటం తెలుసు. పరుగెత్తే దాన్ని పట్టటానికి వల తయారుచేయించవచ్చు. ఈదే దాని కొరకు గాలం తయారు చేయించవచ్చు. ఎగిరే దాని కొరకు బాణం తయారు చేయించవచ్చు. కాని, ఆకాశంలోకి గాలి మీద, మబ్బుల మీద దూసుకువెళ్ళే డ్రాగన్‌ను గురించి తెలుసుకోవటం నాకు శక్తికి మించిన పని. ఇవాళ నేను లావోత్సును చూశాను. బహుశా అతడు ఈ డ్రాగన్ లాంటివాడు." కన్‌ఫ్యూషియస్ లాంటి తాత్వికుని నోటి నుండి ఇంతటి ప్రశంసను బట్టి లావోత్సు ఎంతటి వాడో ఊహించుకోవచ్చు.

లావోత్సు తన గ్రంథంలో చెప్పిన విధంగా పథాన్ని అనుసరించి చాలా కాలం జీవించాడనే చెప్పవచ్చు. తాను అనుకొన్న విలువలు సమాజంలో క్షీణదశకు రావటం గమనించాడు. సమాజం నుండి దూరంగా వెళ్ళిపోవాలని నిర్ణయించుకొన్నాడు. అలా వెళ్తుండగా, దార్లో కాపలాదారుడు ఒకడు అడ్డుపడ్డాడు. అతడికి లావోత్సు గొప్పదనం తెలుసు. అతడు అడిగాడు, "మీరు ఎలాగూ వెళ్తున్నారు గాబట్టి, వెళ్ళేముందు మీ ఆలోచనలతో ఒక గ్రంథం వ్రాయండి," అని. అలా ఆ కాపలాదారు కోరిక మేరకు వచ్చిందే 'తావొ తె చింగ్' గ్రంథం.

గ్రంథం 2500 ఏళ్ళ కిందటిది కావచ్చు గాని, ఈ కాలానికి వర్తించే జీవిత సత్యాలు ఇందులో వున్నవి. మనుషుల్ని చైనీయులుగా, అమెరికన్లుగా, యురోపియన్లుగా, భారతీయులుగా ఇట్లా అనేక విధాలుగా విడగొట్టకుండా మానవులుగా చూసినప్పుడు, ఋషి వంటి లావోత్సు మాటలు మనందరికీ శిరోధార్యాలవుతాయి. క్రిందివి 'తావొ తె చింగ్' ఇంగ్లీషు అనువాదం నుండి తెలుగు చేసిన కొన్ని అధ్యాయాలు:

1. దేన్ని అయితే పథము అని అంటున్నారో అది స్థిరమైన పథము కాదు.
ఏ నామం వల్ల గుర్తింపు కలుగుతున్నదో
అది స్థిరమైన నామం కాదు.
నామరహితమైనది భూమ్యాకాశాల పుట్టుకకు
ముందు వున్నది.
నామసహితమైనది సమస్తప్రాణికోటికి మాతృక.
సంతత నిరాసక్తత సృష్టిరహస్యం బోధపరుస్తుంది.
నిరంతర ఆసక్తత సృష్టి స్థితిని గోచరింపజేస్తుంది.
రెండింటి మూలం ఒకటేగాని పేర్లు భిన్నమైనవి.
ఈ రెండింటి నడుమ నిగూఢ రహస్యమొకటున్నది.
రహస్యాలలోకెల్ల రహస్యం.
చీకటిలోపల చీకటి.
సమస్త రహస్యాలకు ప్రవేశ ద్వారం.
అన్ని అద్భుతాలకు అది మూలం.

2. లోకంలో అందరూ సౌందర్యాన్ని సౌందర్యంగా గుర్తిస్తారు,
కురూపం వుండటం చేత.
మంచిని మంచిగా చూస్తారు, చెడు వుండటం చేత.
ఉండటం, లేకపోవటం: ఒకటి రెండవదానికి కారణమౌతుంది.
కష్టం, సుఖం: ఒకటి రెండవదాన్ని సంపూర్ణం చేస్తుంది.
దీర్ఘం, హ్రస్వం: ఒకదానికొకటి సంబంధం వుంది.
ఎత్తు, పల్లం: ఒకటి రెండవదానిపై ఆధారపడి వుంది.
స్వరము, ధ్వని: ఒకదానితో ఒకటి మేళవిస్తవి.
ఆది, అంతము: ఒకదానినొకటి అనుసరిస్తవి.

జ్ఞానులు ఏ పనీ చేసినట్లు కనిపించరు. మాటలతో బోధించరు.
సృష్టిస్తారేగాని, సొంతం చేసికోరు.
శ్రమిస్తారు, పేరు ఆశించరు.
పనిపూర్తయాక దాని గురించి పట్టించుకోరు.
అందువల్ల అది శాశ్వతత్వం సిద్ధింపజేసుకొంటుంది.

3. పొర్లిపోయేట్టు పాత్ర అంచుదాకా నీరు నింపటం దేనికి?
కత్తికి ఎంతగా పదనుపెట్టినా అది ఎంతకాలం నిలుస్తుంది?
బంగారం, పచ్చలతో నింపిన భాండాగారాన్ని ఎంతకాలం కాపలా కాయగలవు?
మితిమీరిన ధనగౌరవాలు ఉపద్రవానికి దారి తీస్తవి.
నీ కర్తవ్యం నీవు నిర్వహించాక దూరంగా తొలగి వుండు.
అలాగవుంటే స్వర్గం నీ చేతికి అందివచ్చినట్లు వుంటుంది.

4. ప్రాచీన కాలంలో పాలకులున్నట్లే ప్రజలకు తెలియదు.
తరువాత కాలంలో తెలుసుకొని ప్రశంసించటం చేశారు.
తరువాత భయపడి దూరంగా జరిగారు.
తరువాత అసహ్యించుకొన్నారు.
'ప్రజలను విశ్వసించకపోవటం మూలాన వారు అబద్ధాలు చెప్పేవారుగా తయారవుతారు' అనే మాట నిజం.

జ్ఞాని నోటి నుండి ఏ విధంగాను ఒక్క మాట రాబట్టలేం.
తన కర్తవ్య నిర్వహణ పూర్తయాక
దేశంలో ప్రతి ఒక్కరు అంటారు, 'ఆ పని
దాని అంతట అదే జరిగింది' అని.

5. మునివేళ్ళ మీద నిలబడేవారు నిలకడగా వుండలేరు.
అంగలేసేవారు నిదానంగా నడువలేరు.
తమ ఘనతను తామే చాటుకొనేవారు జ్ఞానులు కాజాలరు.
తమకు తామే నీతిమంతులమనుకొనేవారు గౌరవం పొందలేరు.
ఆత్మస్తుతి చేసుకొనేవారు ఏదీ సాధించలేరు.
అహంకరించేవారు ఉన్నత స్థానం పొందలేరు.
కనుకనే పథాన్ని పాటించేవారు వీటిని లెక్కచేయరు.

6. మొత్తం ప్రపంచాన్ని నీ అధీనంలోకి తీసుకొని
దాన్ని బాగుచేయవచ్చునని నీవు అనుకొంటున్నావా?
అది జరిగే పని అని నేననుకోను.
స్వతహాగా ప్రపంచం పరిపూర్ణమైనది, పవిత్రమైనది.
దాన్ని ఇంకా నీవు బాగు చేయలేవు.
దాన్ని నీవు మార్చాలని చూస్తే
అది పూర్తిగా చెడిపోయే ప్రమాదం వుంది.
దాన్నే పట్టుకు వేళ్ళాడుతాను అంటే
చేజారిపోయే అవకాశం వుంది.

ప్రాణులు కొన్ని కొన్ని సందర్భాల్లో ముందుంటవి.
కొన్ని సందర్భాల్లో వెనుకబడతవి.
కొన్ని సమయాల్లో ఊపిరిపీల్చటం కష్టమౌతుంది.
కొన్ని సమయాల్లో తేలిక అవుతుంది.
బోదకాలు బాధితులకు ప్రతి నెలా వెయ్యి రూపాయల పింఛను ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈ మేరకు రాబోయే బడ్జెట్లో నిధులు కేటాయిస్తారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 46,476 మంది లబ్ధి పొందనున్నారు.

ప్రొఫెసర్ జగదీశ్‌కు నాయుడమ్మ అవార్డు

నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ ఏటా అందించే ప్రతిష్ఠాత్మక నాయుడమ్మ అవార్డును ఈ ఏడాది ఆస్ట్రేలియాకు చెందిన ప్రొ.డాక్టర్ చెన్నుపాటి జగదీశ్‌కు అందచేస్తున్నట్లు ఆ సంస్థ ఫిబ్రవరి 7న తెలిపింది. ఆస్ట్రేలియా నేషనల్ వర్సిటీలో జగదీశ్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఢిల్లీ వర్సిటీ నుంచి డాక్టరేట్‌ను పొందారు. ఆయన సెమీ కండక్టర్ ఆప్టో ఎలక్ట్రానిక్స్, నానో టెక్నాలజీలో విశేష కృషి చేశారు. పలు అంశాలపై ఆయన రాసిన 870కుపైగా పరిశోధనా పత్రాలు ప్రచురిత మయ్యాయి. అమెరికాలో 5 పేటెంట్లతో పాటు 11 పుస్తకాలు ప్రచురించారు. గతంలో ఈ అవార్డును కె.కస్తూరి రంగన్, నందన్ నీలేకని తదితర ప్రముఖులు అందుకున్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు గోల్డెన్ పీకాక్ అవార్డు

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) విభాగంలో శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం గోల్డెన్ పీకాక్ అవార్డును చేజిక్కించుకుంది. బెంగళూరులో ఫిబ్రవరి 12న జరిగిన అంతర్జాతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సదస్సులో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య ఎయిర్‌పోర్టు నిర్వాహకులైన జీఎంఆర్ సంస్థ ప్రతినిధులకు ఈ అవార్డును అందజేశారు.

తెలంగాణలో బిల్డింగ్ మెటీరియల్ మ్యానుఫాక్చరింగ్ పార్కు

తెలంగాణలో కన్‌స్ట్రక్షన్, బిల్డింగ్ మెటీరియల్ మ్యానుఫాక్చరింగ్ పార్కు ఏర్పాటుకు యూఏఈకి చెందిన కెఫ్ ఇన్‌ఫ్రా (కేఈఎఫ్ ఇన్‌ఫ్రా), రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. ఇందుకోసం కెఫ్ ఇన్‌ఫ్రా సంస్థ రూ.650 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్లాంట్ ద్వారా దాదాపు 1,600 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. అలాగే పార్కులో ఏర్పాటు కానున్న 60 - 70 అనుబంధ పరిశ్రమలతో మొత్తం 10 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి, దాదాపు 30 వేల మందికి పరోక్ష ఉపాధి దొరకనుంది.

వార్తల్లో వ్యక్తులు

ఐసీసీ డైరెక్టర్‌గా ఇంద్రా నూయీ

పెప్సీకో చైర్మన్, సీఈవో ఇంద్రా నూయీ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తొలి స్వతంత్ర మహిళా డైరెక్టర్‌గా నియమితులయ్యారు. వచ్చే జూన్‌లో ఆమె ఐసీసీ బోర్డులో చేరతారు. స్వతంత్ర చైర్మన్ హోదాలో ఆమె బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈమేరకు ఫిబ్రవరి 9న జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఇంద్రా నూయీ నియామకాన్ని ఖరారు చేశారు. ఇంద్రానూయీ పదవీకాలం రెండు సంవత్సరాలు. అయితే ఆరేళ్లు మించకుండా ఆమె పదవీకాలాన్ని రెండుసార్లు పొడిగించవచ్చు.

కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా కంబర్

ప్రముఖ కన్నడ కవి, రచయిత చంద్రశేఖర కంబర్ కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత అయిన కంబర్.. సాహిత్య అకాడమీ అధ్యక్ష ఎన్నికల్లో మరాఠీ రచయిత బాల్‌చంద్ర వినెమాడే, ఒడిశా రచయిత ప్రతిభారాయ్‌లతో పోటీ పడ్డారు. కంబర్ ప్రస్తుతం అకాడమీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఫిబ్రవరి 12న జరిగిన ఈ ఎన్నికల్లో కంబర్ విజయం సాధించారు. 1937 జనవరి 2న జన్మించిన కంబర్ పలు కన్నడ సినిమాలకు దర్శకత్వం కూడా వహించారు. 1991లో సాహిత్య అకాడమీ అవార్డు, 2011లో జ్ఞానపీఠ్ అవార్డు అందుకున్నారు. ఆయన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది.

ప్రపంచ అత్యుత్తమ మంత్రి ఇంద్రావతి

ప్రపంచంలోనే అత్యుత్తమ మంత్రిగా రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేసియా ఆర్థిక మంత్రి ముల్యానీ ఇంద్రావతి ఎంపికయ్యారు. ఫిబ్రవరి 11న జరిగిన ఆరవ ప్రపంచ ప్రభుత్వ సదస్సులో ఈ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. పాలనలో పారదర్శకత తీసుకురావడం, అవినీతి వ్యతిరేక పోరాటంలో ఆమె కృషికి నిదర్శనంగా ఈ పురస్కారం దక్కించుకున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉపాధ్యక్షుడు, ప్రధాని షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ ఈ పురస్కారాన్ని ఇంద్రావతికి అందజేశారు. ఇండోనేసియా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆమె కృషి ఎంతో ఉంది. ఫోర్బ్స్ పత్రిక ప్రపంచ శక్తిమంతమైన మహిళల్లో ఇంద్రావతి 38వ స్థానంలో నిలిచారు.

క్రీడలు

భారత హాకీ జట్టు స్పాన్సర్‌గా ఒడిషా ప్రభుత్వం



భారత హాకీ జట్టుకు స్పాన్సర్‌గా వచ్చే ఐదేళ్లపాటు ఒడిషా ప్రభుత్వం వ్యవహరించనుంది. ఫిబ్రవరి 15న న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తెలిపారు. భారత జట్టు ధరించబోయే జెర్సీని కూడా ఈ సందర్భంగా ఆయన విడుదల చేశారు. ఒడిషా నుంచి దిలీప్ టిర్కి, ఇగ్నేస్ టిర్కి, లాజరస్ బార్లా లాంటి ఆటగాళ్లు భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. భారత క్రీడల చరిత్రలో ఓ రాష్ట్ర ప్రభుత్వం స్పాన్సర్‌గా వ్యవహరించడం ఇదే తొలిసారి.

ఖేలో ఇండియా ఓవరాల్ విజేత హర్యానా

యువ క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జనవరి 31 నుంచి ఫిబ్రవరి 8 వరకు ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్‌ను న్యూఢిల్లీలో నిర్వహించింది. ఇందులో అండర్- 17 కేటగిరీలో 16 ఈవెంట్లలో పోటీలు జరిగాయి. ఈ క్రీడల్లో 38 స్వర్ణపతకాలతో హర్యానా మొదటి స్థానంలో నిలిచింది. తరవాతి స్థానాల్లో మహారాష్ట్ర (36 స్వర్ణపతకాలు), ఢిల్లీ (25 స్వర్ణపతకాలు), కర్ణాటక (16 స్వర్ణ పతకాలు), మణిపూర్ (10 స్వర్ణ పతకాలు) ఉన్నాయి.

ఆసియా క్రీడల టెస్ట్ ఈవెంట్



ఇండోనేషియా రాజధాని జకార్తలో ముగిసిన ఆసియా క్రీడల టెస్ట్ ఈవెంట్‌లో భారత్‌కు ఐదు స్వర్ణాలు, ఓ రజతం, నాలుగు కాంస్య పతకాలు దక్కాయి. ఈ పోటీల్లో ఫిబ్రవరి 15న జరిగిన 49 కిలోల ఫైనల్ ఈవెంట్‌లో ఇండోనేసియాకు చెందిన మారియో బ్లాసియస్‌పై విజయం సాధించి తెలుగు బాక్సర్ కె. శ్యామ్‌కుమార్ స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. మహిళల 60 కిలోల విభాగం ఫైనల్లో ప్రత్యర్థి నీలవాన్ టెకాస్యూప్ (థాయ్‌లాండ్)ను ఓడించడం ద్వారా పవిత్ర బంగారు పతకం సాధించింది. మహిళల విభాగంలో భారత్ సాధించిన ఏకైక స్వర్ణ పతకం ఇదే.

స్టీవ్ స్మిత్‌కు బోర్డర్ మెడల్

ఆస్ట్రేలియా క్రికెట్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ ప్రతిష్ఠాత్మక అలెన్ బోర్డర్ మెడల్‌ను రెండోసారి అందుకున్నాడు. గత ఏడాది విశేష ప్రతిభ చూపిన స్మిత్, ఈ మెడల్ గెలుచుకునే క్రమంలో సహచర ఆటగాళ్లు డేవిడ్ వార్నర్ (162), నాథన్ లియాన్ (156)ను అధిగమించి 246 ఓట్లతో ప్రథమంగా నిలిచాడు. గతంలో 2015లోనూ స్మిత్ ఈ అవార్డును గెలుచుకున్నాడు. గతేడాది 24 అంతర్జాతీయ మ్యాచ్‌లు (వన్డేలు, టెస్టులు కలిపి) ఆడిన స్మిత్.. 67.46 సగటుతో 1754 పరుగులు సాధించాడు. ఇందులో ఆరు సెంచరీలున్నాయి. 28ఏళ్ల స్మిత్ గత నెలలో ఐసీసీ టెస్ట్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు కూడా ఎంపికయ్యాడు. ఆసీస్ బెస్ట్ ఉమెన్ క్రికెటర్‌కు ఇచ్చే బెలిండా క్లార్క్ అవార్డును ఎలిస్ పెర్రీ దక్కించుకుంది. పెర్రీ ఐసీసీ టెస్టు ఉమెన్ క్రికెటర్ ఆఫ్‌ది ఇయర్ అవార్డును కూడా గెలుచుకుంది.

అంతర్జాతీయం

ప్రధాని మోదీ పశ్చిమాసియా పర్యటన

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫిబ్రవరి 9 నుంచి 12 వరకు పశ్చిమాసియాలో పర్యటించారు. ఈ పర్యటనలో పాలస్తీనా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్ దేశాలను సందర్శించారు.

- ముందుగా ఫిబ్రవరి 9న జోర్డాన్‌లో పర్యటించారు. తర్వాత పాలస్తీనా చేరుకున్నారు. పాలస్తీనా రాజధాని రమల్లాలో ఆ దేశ ప్రధాని మహ్మద్ అబ్బాస్‌తో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం దిశగా ఆరు ఒప్పందాలపై ఇరుదేశాల అధికారులు సంతకాలు చేశారు. పాలస్తీనా సామర్థ్య నిర్మాణం కోసం భారత్ దాదాపు 50 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.321 కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు మోదీ తెలిపారు. భారత్ ప్రధాని ఒకరు పాలస్తీనాలో పర్యటించటం ఇదే ప్రథమం. పాలస్తీనా పర్యటన సందర్భంగా మోదీకి ఆ దేశం అరుదైన గౌరవాన్ని ప్రకటించింది. పాలస్తీనా విదేశీ అతిథులకు ఇచ్చే అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ కాలర్ ఆఫ్ ద స్టేట్ ఆఫ్ పాలస్తీనా'తో సత్కరించింది.
- ఫిబ్రవరి 11న నరేంద్ర మోదీ యూఏఈలో పర్యటించారు. ఆ దేశ యువరాజు బిన్ జాయెద్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు పక్షాల మధ్య ఐదు కీలక ఒప్పందాలు జరిగాయి. ఇందులో



భారత ఆయిల్ కంపెనీల కన్సార్షియానికి 10 శాతం రాయితీ కల్పించే చారిత్రక ఒప్పందం కూడా ఉంది. ఇది 2018 నుంచి 2057 వరకు 40 ఏళ్లపాటు అమల్లో ఉంటుంది. ఈ ఒప్పందంతో గల్ఫ్ దేశాల్లోని భారత కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. అబుదాబిలో నిర్మించనున్న స్వామినారాయణ్ మందిరానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. దుబాయ్‌లో వరల్డ్ గవర్నమెంట్ సమిట్‌లో మోదీ ప్రారంభోపన్యాసం చేశారు.

- చివరగా ఫిబ్రవరి 12న ఒమన్‌లో పర్యటించారు. ఈ పర్యటనలో రక్షణ, ఆరోగ్యం, పర్యాటక రంగాల్లో పరస్పర సహకారంపై ఇరు దేశాల మధ్య ఎనిమిది ఒప్పందాలు కుదిరాయి. మస్కట్‌లో 125 ఏళ్ళ నాటి శివాలయంలో పూజలు చేశారు. ఖబూస్ గ్రాండ్ మసీదును సందర్శించి ప్రార్థనలు జరిపారు.

సుష్మా స్వరాజ్ నేపాల్ పర్యటన

భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ ఫిబ్రవరి 1, 2 తేదీల్లో నేపాల్‌లో పర్యటించారు. ఈ పర్యటనలో నేపాల్ అధ్యక్షురాలు బిద్యాదేవీ భండారీ, ప్రధాన మంత్రి షేర్ బహదూర్ ద్యూబ, సీపీఎన్ మావోయిస్టు సెంటర్ చైర్మన్ ప్రచండతో సమావేశమయ్యారు. నేపాల్‌లో రాజకీయ స్థిరత్వం సాధించేందుకు, ఆ దేశ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు.

ఇథియోపియా ప్రధాని రాజీనామా


ఇథియోపియా ప్రధానమంత్రి హేలిమారియమ్ దేసలెన్ రాజీనామా చేశారు. ఈ మేరకు ఆ దేశ అధికార మీడియా వెల్లడించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశంలో నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో ఆయన రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. అయితే తాను రాజకీయాల్లో కొనసాగుతానని, ఇథియోపియాలో సంస్కరణలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని ప్రధాని తెలిపారు.

దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా సిరిల్



దక్షిణాఫ్రికా నూతన అధ్యక్షుడిగా సిరిల్ రమఫోసా ఎన్నికయ్యారు. కుంభకోణాల్లో కూరుకుపోయిన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా (75) ఫిబ్రవరి 14న పదవి నుంచి వైదొలిగారు. జుమా రాజీనామాతో ఆయన తొమ్మిదేళ్ల పాలనకు తెరపడింది. దీంతో జాతీయ అసెంబ్లీలో ఫిబ్రవరి 15న అధ్యక్ష ఎన్నిక జరిగింది. పార్లమెంటులో భారీ మెజార్టీ కలిగిన అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) పార్టీ.. రమఫోసాను ఆ పదవికి నామినేట్ చేసింది. వేరే అభ్యర్థులెవరూ లేకపోవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేపాల్ ప్రధానిగా కేపీ శర్మ ఓలి



నేపాల్ ప్రధానిగా ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలి ఫిబ్రవరి 15న పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రధానిగా ఎన్నికవ్వడం ఇది రెండోసారి. ఆయన ప్రధాని అభ్యర్థిత్వానికి యూసీపీఎన్- మావోయిస్టు, రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ (నేపాల్), మాదేశీ రైట్స్ ఫోరమ్ - డెమోక్రటిక్‌తో పాటు 13 చిన్న పార్టీలు మద్దతిచ్చాయి. ఆ దేశాధ్యక్షురాలు బిద్యాదేవి భండారీ ఆయనను 41వ ప్రధానిగా ప్రకటించారు. ఇటీవల పార్లమెంటు ఎన్నికల్లో వామపక్ష కూటమి ఘనవిజయం సాధించింది. ఓలీ నేతృత్వంలోని నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (సీపీఎన్) - యూఎమ్ఎల్, ప్రచండ నేతృత్వంలోని సీపీఎన్ - మావోయిస్టు సెంటర్ ఈ కూటమికి నేతృత్వం వహించాయి. అంతకుముందు ప్రధాని పదవికి నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు శేర్ బహదూర్ రాజీనామా సమర్పించారు.



రామచంద్రారెడ్డి ఉప్పుల

ఏ హక్కు 'భారత రాజ్యాంగానికి ఆత్మ'..?

ఒక వ్యక్తిలో అంతర్గతంగా నిబిడీకృతమైన శక్తియుక్తులను ఆధారంగా చేసుకొని ఉన్నత స్థాయిలో జీవించేందుకు కల్పించిన సామాజిక అవకాశాలే హక్కులు.

వ్యక్తులు ఉన్నత స్థితిలో జీవించేందుకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో పరిపూర్ణమైన అభివృద్ధిని సాధించేందుకు మౌలికావసరాలుగా ప్రాథమిక హక్కులను గుర్తిస్తూ ప్రజాస్వామ్య దేశాలన్నీ తమ రాజ్యాంగాల్లో వీటికి ప్రముఖ స్థానాన్ని కల్పించాయి.

- **ప్రాథమిక హక్కుల గుర్తింపు:** ప్రపంచంలో మొదటగా బ్రిటన్ 'మాగ్నాకార్టా' ద్వారా లిఖితపూర్వకంగా హక్కులను ప్రజలకు అందించింది. తరవాతి కాలంలో బ్రిటన్ రక్త రహిత విప్లవం (1689), అమెరికా స్వాతంత్ర్య సంగ్రామం (1776), ఫ్రెంచి విప్లవం (1789), రష్యా విప్లవం (1917) ప్రజల హక్కులను మరింత విస్తృత పరిచాయి.
- **అమెరికా ప్రభావం:** అమెరికా రాజ్యాంగంలోని 'బిల్ ఆఫ్ రైట్స్'కు ప్రభావితమైన భారత రాజ్యాంగ నిర్మాతలు వీటిని మన రాజ్యాంగంలో కూడా పొందుపరిచారు. భారత రాజ్యాంగంలోని 3వ భాగంలో అధికరణ 12 నుంచి 35 వరకు ప్రాథమిక హక్కులను పొందుపరచారు.

ఆస్తి హక్కు తొలగింపు

44వ రాజ్యాంగ సవరణ చట్టం (1978) ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. ప్రస్తుతం భారత రాజ్యాంగంలో 6 ప్రాథమిక హక్కులు మాత్రమే ఉన్నాయి.

- **వేరుచేత సిద్ధాంతం:** ప్రభుత్వం రూపొందించిన చట్టాల్లో ఏదైనా భాగం / నిబంధన గానీ ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్నపుడు కేవలం ఆ అంశాన్ని మాత్రమే వేరుచేసి దాన్ని రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంటూ అది చెల్లదని ఉన్నత న్యాయస్థానాలు తీర్పు ఇవ్వడాన్ని వేరుచేత సిద్ధాంతంగా పరిగణిస్తారు.
  ఉదా: మిథు వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ వ్యాజ్యంలో ఐపిసి - 303 సెక్షన్‌ను ప్రాథమిక హక్కుల్లోని సమానత్వపు హక్కుకు విరుద్ధమైనదిగా ప్రకటించి దాన్ని ఐపిసి నుంచి తొలగించారు.
- **గ్రహణ సిద్ధాంతం:** ప్రస్తుతం అమల్లో లేని చట్టాలను మరుగునపడిన చట్టాలుగా పేర్కొంటారు. ఆయా సందర్భాల అవసరాన్ని, ప్రాముఖ్యాన్ని అనుసరించి వాటిని అమలు/ వర్తింప జేస్తారు. దీనినే గ్రహణ సిద్ధాంతం అంటారు.
  ఉదా: బికాజీ నారాయణ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ఈ విషయాన్ని స్పష్టం చేసింది
- **సెల్ఫ్ ఇన్‌క్రిమినేషన్:** ఒక వ్యక్తిని నేరం అంగీకరించాలని బలవంతపెడుతూ నిర్బంధించరాదని అంటే సెల్ఫ్ ఇన్‌క్రిమినేషన్‌కు పాల్పడరాదని నారాయణ్‌లాల్ వర్సెస్ మాణెక్ వ్యాజ్యంలో సుప్రీంకోర్టు పేర్కొంది.
- **టెస్టిమోనియల్ కంపల్షన్:** ఒక వ్యక్తిని తనకు తాను వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వాలని ఒత్తిడి చేయరాదు. అంటే టెస్టిమోనియల్ కంపల్షన్‌కు పాల్పడరాదని సతీష్‌చంద్ర వర్సెస్ ఎం.పి.శర్మ వ్యాజ్యంలో సుప్రీంకోర్టు తెలిపింది.
- **అమికస్ క్యూరీ:** బాధితుడు న్యాయస్థానం ముందు హాజరై తన వాదనను వినిపించుకొనే స్థితిలో లేనపుడు అతని తరపున వాదించడం కోసం న్యాయస్థానం నియమించిన వ్యక్తి / అధికారిని అమికస్ క్యూరీ అంటారు.
  ఉదా: ముంబై దాడి (2007) కేసులో లభించిన ఏకైక అపరాధి అజ్మల్ కసబ్ తరపున వాదించేందుకు న్యాయస్థానం, సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్‌ను అమికస్ క్యూరీగా నియమించింది.



భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగం అమలు నాటికి 7 ప్రాథమిక హక్కులను కల్పించారు. అవి..

- సమానత్వపు హక్కు (14 - 18 అధికరణలు)
- స్వేచ్ఛా - స్వాతంత్ర్యపు హక్కు (19 -22 అధికరణలు)
- పీడనాన్ని నిరోధించే హక్కు (23 - 24 అధికరణలు)
- మత స్వాతంత్ర్యపు హక్కు (25 - 28 అధికరణలు)
- విద్యా సాంస్కృతిక హక్కు (29 - 30 అధికరణలు)
- ఆస్తి హక్కు (31వ అధికరణ)
- రాజ్యాంగ పరిహారపు హక్కు (32వ అధికరణ)

ఉన్నత న్యాయస్థానాలదే రక్షణ బాధ్యత

పౌరుల హక్కులకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఏ రకమైన ఆటంకాలు / భంగం కలుగకుండా ఉండేందుకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల సంరక్షణ బాధ్యతను రాజ్యాంగ పరిహారపు హక్కు (32) ద్వారా ఉన్నత న్యాయస్థానాలకు అప్పగించారు. ఈ హక్కును భారత రాజ్యాంగానికి ఆత్మ, హృదయం వంటిదని డా. బిఆర్. అంబేద్కర్ అభివర్ణించారు. ప్రాథమిక హక్కులకు దీన్ని పూచీకత్తుగా పరిగణిస్తారు.



కొండబాబు లాలం

జాబ్ కార్నర్

ఎయిర్ ఇండియా


ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ (ఏఐఇఎల్)- కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- విభాగాలు: ఆపరేషన్స్, కమర్షియల్, ఎయిర్ పోర్ట్ సర్వీసెస్
- మొత్తం ఖాళీలు: **21**
- పోస్టులు: కో ఆర్డినేటర్ 2, మేనేజర్ - ఫ్లైట్ 3, సీనియర్ ఆఫీసర్ - ఫ్లైట్ 2, ఆఫీసర్ - కాక్ పిట్ 1, అసిస్టెంట్ - టెక్నికల్ లైబ్రరీ 1, రూట్ మేనేజర్ 1, ఆఫీసర్ - సేల్స్ 1, మేనేజర్ - షెడ్యూలింగ్ & నెట్ వర్క్ 1, ఆఫీసర్ - ఎయిర్ పోర్ట్ సర్వీసెస్ 1, సీనియర్ అసిస్టెంట్ 6, సీనియర్ ఆఫీసర్ - కేటరింగ్ సర్వీసెస్ 1
- అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్ / డిగ్రీ / ఎంబిఏ (మార్కెటింగ్ & సేల్స్ / ఏవియేషన్) / బిఇ / బిటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: పోస్టును అనుసరించి 21 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి.
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 4
- వెబ్‌సైట్: www.airindiaexpress.in

ఊరు ఉమ్మడి సాగు

65 ఏళ్లుగా కలిసి సేద్యం చేస్తున్న గ్రామస్థులు.. దుక్కి నుంచి పంటచేతికొచ్చేదాకా అన్నీ సమష్టిగానే





'ఉమ్మడి'.. ఈ రోజుల్లో ఈ మాటకు విలువ ఇస్తోంది ఎందరు? కొన్నిచోట్ల అన్నదమ్ములంతా కలిసి ఒకే గూటి కింద ఉంటున్నా.. కలహాలు, స్పర్థలు, కలతలతో నెట్టుకొస్తున్నారు. ఒకే ఇంట్లో ఉంటున్న వారి మధ్యే ఇన్ని సమస్యలుంటే.. ఒక ఊరు ఊరంతా కలిసి వ్యవసాయం చేస్తే ఎన్ని ఇబ్బందులుంటాయో కదా! ఆ ఊరి ప్రజలు మాత్రం కలిసి 'సాగు'దాం.. ప్రగతి బాటలో అంటూ ఆనందంగా పాడుకుంటున్నారు. కమతాలు వేర్వేరైనా.. అందరూ కలిసి వ్యవసాయం చేస్తున్నారు. దుక్కి మొదలు.. విత్తనసాగు, కలుపు, చివరికి పంట చేతికొచ్చేదాకా అందరూ కలిసి వ్యవసాయం చేస్తున్నారు. వచ్చిన దిగుబడిని కలిసి పంచుకుంటున్నారు. ఇలా ఏడాదో, రెండేళ్లుగానో కాదు 65 ఏళ్లుగా వారు ఉమ్మడిసాగు బాటలో పయనిస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఆయిజ మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న ఈడిగోనిపల్లి గ్రామస్థుల ఆదర్శమిది! గద్వాల సంస్థానాధీశుల బంధువుల నుంచి 65 ఏళ్లక్రితం ఈడిగోనిపల్లికి చెందిన 65మంది రైతులు ఎకరం రూ. వెయ్యి చొప్పున 81.25 ఎకరాలను కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఏటా యాసంగిలో పంటను సాగు చేస్తారు. పంట వేసే ముందు అందరూ చక్కగా సమావేశమవుతారు. ఏ పంట వేయాలనేది నిర్ణయిస్తారు. అనంతరం ఇంటికో మనిషి చొప్పున సాగు పనులకు నడుంకడతారు. శనగ, తెల్లజొన్న, పుచ్చకాయ పంటలను విరివిగా సాగు చేస్తూ చక్కని లాభాలు ఆర్జిస్తున్నారు. సాగునీటి వసతి కల్పిస్తే.. బంగారాన్ని పండిస్తామంటున్నారు.

-ఆంధ్రజ్యోతి, గద్వాల

మూడే కులాలు.. 300 కుటుంబాలు

ఈడిగోనిపల్లి జనాభా 1350. అక్కడ 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామంలో కురువ, బోయ, గొల్ల కులాలకు చెందిన వారు మాత్రమే ఉంటారు. వారి సమష్టితత్వం సాగులోనే కాదు.. అనుబంధాల్లోనూ కనిపిస్తుంది. ఊర్లో ఎవరికి ఏ కష్టమొచ్చినా తలోచేయి వేసి ఆదుకుంటారు. తలా రూ. 300 వేసుకొని 30 లక్షలతో గ్రామంలో శివరామాంజనేయ దేవాలయాన్ని నిర్మించుకున్నారు. కుటుంబానికి కొంత వేసుకొని రూ. 3.5 లక్షలతో దేవుడికి స్థలం కొనుగోలు చేశారు. తమ భూమిలోంచి రైతులు సమిష్టిగా 10 ఎకరాలను పశువుల మేతకు, శ్మశానానికి విరాళంగా ఇచ్చి ఉదారతను చాటుకున్నారు.

ఉమ్మడి సాగు ఐక్యతను నింపింది

"మా తాతులు, తండ్రుల కాలం నుంచే ఊర్లో ఉమ్మడి సాగు చేస్తున్నాం. ఉమ్మడి సాగు మాలో ఐక్యతను పెంచింది. రేపు మా పిల్లలు కూడా ఇలా కలిసి వ్యసాయం చేసుకోవాలన్నదే మా ఆశ"

-కె. ఈరన్న, ఈడిగోనిపల్లి

నిర్ణయం తీసుకుంటే కట్టుబడి ఉంటాం



"గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా అందరు కలిసి ఒక నిర్ణయం తీసుకుంటాం. ఆ నిర్ణయానికి కట్టుబడి బాధితులకు చేయూతనిస్తాం. 'ఉమ్మడి'గా సాగుతున్నందున మా బతుకుల్లో గొప్ప భరోసా, ధైర్యం ఉన్నాయి"

-గొల్ల రామయ్య, ఈడిగోనిపల్లి

చేయూత ఇస్తే బంగారం పండిస్తాం



"ఉమ్మడి భూమితో పాటు గ్రామంలో ఉన్న మరో 1500 ఎకరాల సాగు భూమి ఉంది. అయితే, ఆ భూములకు నీటి వసతులు లేవు. ప్రభుత్వం సాగుకు ప్రత్యేక సదుపాయాలు అందిస్తే బంగారం పండిస్తాం"

-గొల్ల వెంకట్రాములు. ఈడిగోనిపల్లి



ఎక్కడ అనంత.. ఎక్కడ నిజామాబాద్

ఈ చిత్రంలో కనిపిస్తున్నది అనంతపురం జిల్లాకు చెందిన ఓ సంచార జాతి. వీరు ఏడాదిలో రెండు నెలలు మాత్రమే సొంత ఊరిలో ఉంటారు. మిగిలిన 10 నెలలూ సంచరిస్తూ జీవనం సాగిస్తుంటారు. గుంపుగుంపులుగా వెళ్లి ఒక చోట తాత్కాలికంగా నివాసమేర్పచుకుంటారు. అక్కడ ఏ పని దొరికితే ఆ పని చేసుకుంటారు. ఈ సంచారజాతిలో మగవారు కూలి పనులు చేస్తారు. సీజన్‌ను బట్టి వృత్తి మారుస్తుంటారు. కొన్నాళ్లు గంగిరెద్దులను ఆడిస్తారు. మహిళలు భిక్షాటన చేస్తారు. కూడా కోళ్లను కూడా పెంచుకుంటారు. వీరి వెంట ఎప్పుడూ కుక్కలుంటాయి. ఈ బృందం అనంతపురం నుంచి కరీంనగర్ వెళ్తుండగా నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ వద్ద 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది.

-ఆంధ్రజ్యోతి, నిజామాబాద్



మనిషి ఆఫ్రికాను ఎప్పుడు వీడాడు?

ఆధారాలు భారత్‌లోనే..!.. తమిళనాడులో 3.8లక్షల ఏళ్లనాటి రాతి పనిముట్లు



'మనిషి పుట్టుక ఆఫ్రికాలోనే జరిగింది. సుమారు 70 లక్షల ఏళ్ల క్రితం పనిచేయడం మొదలుపెట్టాడు. వలసబాట పట్టి ప్రపంచమంతా విస్తరించాడు.' మనకు తెలిసిన చరిత్ర ఇది మాత్రమే. కానీ, మనిషి ఎప్పుడు ఆఫ్రికాను వీడాడు అన్నది ప్రశ్నగానే మిగిలిపోయింది. కొన్ని రోజుల క్రితం ఇజ్రాయెల్‌లో దొరికిన మనిషి దవడ శిలాజాన్ని బట్టి చూస్తే 1.8లక్షల ఏళ్ల క్రితం వలస బాట పడ్డారని, మొరాకోలో దొరికిన ఆనవాళ్లను బట్టి 2.8లక్షల ఏళ్ల నుంచి 3.4లక్షల ఏళ్ల మధ్య ఆఫ్రికాను వీడాడని అనుకున్నాం. కానీ, అంతకు పూర్వమే ఆధునిక మానవుడు(హోమో సెపియన్స్) ఆఫ్రికాను వదిలి వచ్చాడా? అంటే అవుననే అంటున్నారు శాస్త్రవేత్తలు. అందుకు భారత్‌లో లభ్యమైన 7వేల రాళ్ల పనిముట్లే సాక్ష్యం అని చెబుతున్నారు. తమిళనాడులోని కోర్టల్లయార్ నదీ ఒడ్డున ఉన్న అత్తిరాంపక్కం అనే ప్రదేశంలో ఈ రాతి పనిముట్లను కనుగొన్నారు. వాటిని పరీక్ష చేయగా 3,85,000 ఏళ్ల నాటివని తేలాయి. అంటే.. ఆ పనిముట్లను బట్టి మనిషి ఆఫ్రికాను 3.8లక్షల ఏళ్ల క్రితమే వలసబాట పట్టినట్లు తాజా పరిశోధనలు చెబుతున్నాయని ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ వర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు.

సెకండ్ ఇన్నింగ్స్ సక్సెస్

పుట్టిన పిల్లల్లో సగంమంది రెండో సంతానమే!

చైనాలో మారుతున్న జనాభా ముఖచిత్రం



సంతాన లక్ష్మితో చైనా కళకళలాడుతోంది. గత ఏడాది చైనాలో దాదాపు కోటీ 75 లక్షలమంది పిల్లలు పుట్టారు. వారిలో సగం మంది కుటుంబంలో రెండో సంతానమే! అంతే కాదు 2016తో పోలిస్తే శిశు జననాల సంఖ్య 2017లో 5 శాతం ఎక్కువ! ఏక సంతాన విధానాన్ని చైనా రెండేళ్ల క్రితం సడలించింది. తగ్గిపోతున్న కార్మిక శక్తి, పెరుగుతున్న వృద్ధుల జనాభా చైనాను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దాదాపు 140 కోట్ల జనాభాతో అగ్రస్థానంలో ఉన్న చైనా..యువశక్తి కోసం పరితపిస్తోంది. ఈనేపథ్యంలోనే రెండో సంతానాన్ని పొందడానికి ప్రభుత్వం జంటలకు అనుమతినిచ్చింది.

ని-దర్శనం

Nidarshanam

ఈ శివుడికి నిత్య కల్యాణం

వందల ఏళ్లుగా సంప్రదాయం

'నిత్య కల్యాణం... పచ్చ తోరణం'... ఈ మాట వినగానే మనకు గుర్తొచ్చేది తిరుమల వెంకటేశ్వరుడే! ఇక్కడ మాత్రం పరమ శివుడికి నిత్య కల్యాణం జరుగుతుంది. ఎక్కడైనా ఈశ్వరుడికి కల్యాణం జరిగేది ఏడాదికి ఒక్కసారే కాగా... తూర్పు గోదావరి జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి నిత్యం కల్యాణం జరుగుతుంది. ఎక్కడైనా... కల్యాణంలో దంపతులు పాల్గొంటారు. ఇక్కడ మాత్రం... తాము దంపతులయ్యే యోగం కోసం అవివాహితులైన యువతీ యువకులు కల్యాణం జరిపిస్తారు. వీరేశ్వరుడి కల్యాణంలో పాల్గొంటే వివాహం జరుగుతుందనేది భక్తుల నమ్మకం. ఈ క్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తారు. వారి జన్మనక్షత్రం ప్రకారం కల్యాణం జరిపించుకుని తమ సంకల్పాన్ని నెరవేర్చుకుంటారు. రోజుకు 72 మందికి మాత్రమే ఈ అవకాశం కల్పిస్తారు. సుమారు 35 నుంచి 40 కల్యాణాలు ఆన్‌లైన్‌లోనే బుకింగ్ అవుతాయి. భక్తుల జన్మనక్షత్రం ఆధారంగా ఆలయ పండితులు రెండు, మూడు తేదీలు నిర్ణయిస్తారు. వాటిలో ఏదో ఒక రోజున వచ్చి కల్యాణంలో పాల్గొనేందుకు వీలు కల్పిస్తారు. తూర్పు గోదావరి జిల్లాలో మారుమూల గ్రామంలోని ఈ ఆలయంలో వందల సంవత్సరాలుగా నిత్య కల్యాణం జరుగుతోంది. అది కూడా... ప్రతి రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ వేడుక నిర్వహిస్తారు. మురమళ్ల గ్రామం కాకినాడకు 38 కిలోమీటర్లు, రావులపాలెం నుంచి 54 కిలోమీటర్ల దూరంలో ఉంది.

-ఐ.పోలవరం





ఆరో వేలితో అష్టకష్టాలు!

ఆధార్ స్కానింగ్‌కు ఆటంకం

దేముడిచ్చిన ఆరో వేలు ఆయనకు శాపమయ్యింది. ఆధార్ కార్డు పొందేందుకు ఆటంకమయ్యింది. మహారాష్ట్రలోని నాసిక్‌కు చెందిన గురుదయాళ్ త్రిఖకు ఈ సమస్య వచ్చి పడింది. 8 నెలలపాటు మహారాష్ట్రలోని అనేక ఆధార్ నమోదు కేంద్రాలకు కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోయింది. గురుదయాళ్ ఎడమ చేతికి ఆరు వేళ్లు ఉండడం, స్కానింగ్ మిషనులో సరిగా స్కానింగ్ కాకపోవడంతో అధికారులు ఆయన్ని వెనక్కి పంపేశారు. ఆరో వేలు, బొటనవేలికి అంటిపెట్టుకుని ఉండడంతో స్కానింగ్ చేయడం సాధ్యపడలేదు. దీనిపై ప్రభుత్వ అధికారులకు చెప్పినా, వారు పరిష్కారమార్గం చూపలేకపోయారు. చివరకు నాసిక్‌లోని ఒక ఆధార్ నమోదు కేంద్రంలోని స్కానింగ్ మిషన్ గురుదయాళ్ చేతి వేళ్లను సరిగా స్కానింగ్ చేయగలగడంతో ఆయన సమస్య పరిష్కారమయ్యింది.

మారకపోతే 'మర్ గయా'



నేరగాళ్లపై యూపీ పోలీస్ వేట

యోగి హయాంలో 1240 ఎన్‌కౌంటర్లు.. 40 మంది కరుడు గట్టిన నేరగాళ్ల హతం

'చంపద్దు... మారిపోతాం' అంటూ వేడుకోలు.. స్వయంగా ఠాణాలకు వచ్చి లొంగుబాట్లు

సాబ్... ఈ రోజు నుంచి మొత్తం బంద్! నన్ను ఎన్‌కౌంటర్ చేయొద్దు! కావాలంటే అరెస్టు చేసి లోపల పడేయండి!... ఠాణాలోకి పరిగెత్తుకుంటూ వచ్చి శరణుజొచ్చిన నేరగాడు ఒకడు!

'మేం చాలా తప్పులు చేశాం. ఇంకెప్పుడూ, ఎలాంటి నేరాలకు పాల్పడం. మమ్మల్ని ఎన్‌కౌంటర్‌లో లేపేయొద్దు!'... ప్లకార్డులు పట్టుకుని తిరిగిన క్రిమినల్స్!



ఆనంద్ కుమార్



నేరగాళ్ల కాల్పుల్లో మరణించిన కానిస్టేబుల్ అంకిత్.

మార్చి 20, 2017 నుంచి ఫిబ్రవరి 14 వరకు నమోదైన గణాంకాలు

- **2956** ఇప్పటిదాకా అరెస్టయిన నేరస్థుల సంఖ్య
- **142** లొంగిపోయిన గూండాల సంఖ్య
- **26** బెయిల్ దొరికినా జైల్లోనే ఉంటున్నవారి సంఖ్య
- **71** బెయిల్ రద్దు చేసుకుని జైలుకు తిరిగొచ్చిన వారు

ఎన్‌కౌంటర్లపై జాతీయ హక్కుల కమిషన్ సీరియస్

ఎస్... యూపీలో నేరగాళ్ల వణికిపోతున్నారు. తమంతట తామే మారిపోతున్నారు! దీనికి కారణం... పోలీస్! "మాటల్లేవ్... తూటాలే! మారితే... బచ్‌గయా! లేదంటే... మర్‌గయా!'... అని యూపీ పోలీసులు తేల్చి చెబుతున్నారు. ఉత్తి మాటలు కాదండోయ్... అన్నీ చేతలే! 'తూటాల భాష తెలిసిన వారికి తూటాలతోనే సమాధానం చెప్పండి' అంటూ కాషాయ వస్త్రధారి, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చేశారు. అంతే... యోగి వచ్చిన ఏడాదిలోపే 1240 ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్లలో ఇప్పటికి 40 మంది కరుడుగట్టిన నేరగాళ్లు హతమయ్యారు. 305 మందిదాకా గాయపడ్డారు. నలుగురు పోలీసులూ ప్రాణాలు వదిలారు. 247 మంది క్షతగాత్రులయ్యారు. అయినాసరే.. వెనక్కి తగ్గడంలేదు. నేరాలన్నీ ఆపేసి గప్‌చుప్ కూర్చోడం, లొంగిపోవడం... ఇవి రెండూ చేయకపోతే 'గన్'కౌంటర్! 25 రోజుల్లోనే 60 ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఎనిమిది మంది నేరగాళ్లను పోలీసులు కాల్చేశారు. 2744 మంది నేరగాళ్లను అరెస్టు చేశారు.

కలుగుల్లోంచి బయటికి...

'పోలీస్‌సే నహీ... క్రైమ్ సే డర్ లగ్‌తా హై సాబ్' (పోలీసులంటే కాదు... నేరం చేయాలంటేనే భయమేస్తోంది సార్)... సల్మాన్‌ఖాన్ 'దబాంగ్' సినిమాలోని డైలాగ్ ఇది! ఇప్పుడు యూపీలో ఇదే పరిస్థితి. తప్పించుకుని తిరుగుతున్న నేరగాళ్లు 'మేం లొంగిపోతాం' అంటూ ఠాణాలకు పరిగెత్తుకుంటూ వస్తున్నారు. ఎన్‌కౌంటర్ చేయొద్దని ప్రాధేయపడుతున్నారు. కైరానా పట్టణంలో ఇద్దరు దోపిడీ దొంగలు ఏకంగా మెడలో బోర్డులు తగిలించుకుని... వీధుల్లో నడుచుకుంటూ మరీ షామ్లీ ఎస్పీ అజయ్ పాల్ శర్మ ముందు లొంగిపోయారు. "ఇకపై కష్టపడి, నిజాయితీతో సంపాదించిన సొమ్ముతోనే జీవిస్తాం. నేరాలకు పాల్పడం. మా కుటుంబాలతో ప్రశాంతంగా జీవిస్తాం. మమ్మల్ని ఎన్‌కౌంటర్ చేయొద్దు" అని వేడుకున్నారు. నేరగాళ్ల ఏరివేతపై తమ ప్రయత్నాలు ఫలిస్తుండటంతో పోలీసులు కూడా ఖుషీగా ఉన్నారు. సోషల్ మీడియాలో తమ విజయగాథలను ప్రచారం చేసుకుంటున్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ దీనిని తీవ్రంగా పరిగణిస్తోంది. 'శాంతిభద్రతల పరిస్థితి ఘోరంగా ఉన్నప్పటికీ... ప్రభుత్వమే ఇలా ఎన్‌కౌంటర్లను ప్రోత్సహించడం తగదు' అని తెలిపింది. పోలీసులు మాత్రం తమ చర్యలను సమర్థించుకుంటున్నారు. "మేం నేరస్థులను అరెస్టు చేయడానికే వెళ్తున్నాం. వాళ్లు కాల్పులు జరిపితే... మేమూ తుపాకులకు పనిచెప్పక తప్పదు." అని తెలిపారు.



'మమ్మల్ని క్షమించండి' అని బోర్డులు పట్టుకుని లొంగిపోయేందుకు వెళ్తున్న దోపిడీ దొంగలు.

నేరస్థులకు జైలే సరైన ప్రదేశం



నేరస్థులు జైలుకు తిరిగి రావడానికి ప్రయత్నిస్తున్నట్లయితే మేము పెద్దగా పట్టించుకోం. ఎందుకంటే నేరస్థులు బయట ఉండకూడదు. వారికి జైలే సరైన ప్రదేశం.

-ఉత్తరప్రదేశ్ డీజీపీ ఓపీ సింగ్

దొంగచేతికే తాళం



బ్యాంకు లూటీ





పాస్‌వర్డే ఇచ్చేశారు.. నీరవ్ గ్యాంగ్‌కి స్విఫ్ట్ సిస్టమ్ ఆపరేషన్ వివరాలిచ్చిన పీఎన్‌బీ సిబ్బంది

- ఎడాపెడా వాడుకున్న నీరవ్, ఛోక్సీ..
- రోజుకి రెండు ఎల్‌ఓయూల జారీ
- రిటైర్మెంట్ దగ్గరపడుతున్న కొద్దీ శరవేగంగా జారీ చేసిన పీఎన్‌బీ డిప్యూటీ మేనేజర్
- 15 నగరాల్లోని 45 షాపులపై దాడులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: దొంగ చేతికే తాళం చెవులు ఇచ్చేశారు.. బ్యాంకును వాడుకోండని సర్వం ధారాదత్తం చేసేశారు. ఇదీ పంజాబ్ నేషనల్ బ్యాంక్ సిబ్బంది నిర్వాకం. అత్యంత కీలకమైన లాగ్ ఇన్‌ను, ఆఖరికి దాని పాస్‌వర్డ్‌ను కూడా నీరవ్ మోదీ బృందానికి ఇచ్చేశారు. ఇంకేముంది..? ఇక దొంగల ముఠాదే రాజ్యం.. ప్రజాధనం భోజ్యం. ఘరానా మోసగాడు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ కేవలం కొద్ది నెలల వ్యవధిలోనే రూ.11,515 కోట్ల మొత్తాన్ని ఎలా దోచుకోగలిగాడు? కచ్చితంగా పీఎన్‌బీ సిబ్బందిని ప్రలోభపెట్టడం ద్వారానే. అయితే ఇందుకు సహకరించిన సిబ్బంది అతని పట్ల ఎంత విధేయతతో ఉన్నారో తెలిస్తే ఆశ్చర్యం కలగకమానదు. ఈ కుంభకోణంలో ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి, సింగిల్ విండో క్లర్క్ మనోజ్ ఖారత్ ప్రధాన నిందితులు. ఇప్పటికే వీరిని అరెస్ట్ చేసి 14 రోజుల పోలీస్ కస్టడీకి తరలించారు. నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీలతో ఎలా కుమ్మక్కయ్యారు, ఎల్‌ఓయూల జారీ ఎలా చేశారని సీబీఐ ఇంటరాగేట్ చేసినపుడు- తాము కొంత కమిషన్ పుచ్చుకుని- స్విఫ్ట్ (సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్‌బ్యాంకింగ్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్) సిస్టమ్ లాగిన్‌ను, పాస్‌వర్డ్‌ను- నీరవ్ మోదీకి చెందిన సంస్థల ప్రతినిధులకు ఇచ్చేసినట్లు వారు ఒప్పుకున్నారు. "మా అకౌంట్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు నీరవ్ సంస్థవారికి ఇచ్చాం. వారు మా అకౌంట్ల ద్వారా లాగిన్ అయ్యి- అంటే పీఎన్‌బీ అధికారులుగా లాగిన్ అయ్యి- సిస్టమ్‌ను ఏక్సెస్ చేసుకున్నారు. వెరిఫైయ్యర్/ఆథరైజర్‌గా తమ తమ ఎల్‌ఓయూలను క్లియర్ చేసుకుని, స్విఫ్ట్ మెసేజ్‌లను పంపేవారు" అని వారు వివరించారు. ఇదే కాకుండా పీఎన్‌బీ వ్యవస్థలోని అన్ని అకౌంట్ల కంప్యూటర్ లాన్ పాస్‌వర్డులు, ఆఖరికి బ్యాంకు తాలూకు కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ కోడ్‌లు సైతం వారి అందుబాటులో ఉన్నట్లు సీబీఐ కనుగొంది. ఓ రకంగా బ్యాంక్ లావాదేవీలన్నీ నీరవ్, అతని గ్యాంగ్ కనుసన్నల్లో జరిగేవి.

15 నగరాల్లోని 45 షాపులపై దాడులు

సీబీఐ, ఈడీలు 15 నగరాల్లోని 45 షాపులు, వర్క్‌షాపులు, ఎస్ఈజెడ్ యూనిట్లపై దాడులు జరిపి విలువైన పత్రాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆదివారం ఢిల్లీ, బెంగళూరు సహా అన్ని నగరాల్లో మరో విడత సోదాలు సాగించారు. రాయ్‌పూర్‌లోని 4గీతాంజలి డైమండ్ షోరూముల్లో సోదాలు జరిపారు. బెంగళూరులో పది, ఢిల్లీలో ఏడు, ముంబై, కోల్‌కతాల్లో ఐదు, చండీగఢ్, హైదరాబాద్‌ల్లో 4, పట్నా, లక్నో, అహ్మదాబాద్, చెన్నై, గువాహటి, శ్రీనగర్, గోవా, జైపూర్, జలంధర్‌లలోని షాపుల్లో వీటిని జరిపారు. సిబ్బంది అందరినీ ప్రశ్నించి, నగరాలు విడిచి వెళ్లరాదని ఆదేశించారు.

గోకుల్ శెట్టి పాత్ర కీలకం.

డిప్యూటీ మేనేజర్ గోకుల్ శెట్టి ఇపుడు స్కాంకు కేంద్ర బిందువుగా మారారు. ఆయన కిందటేడాది మే 31న పదవీ విరమణ చేశారు. కానీ ఆయన అంతకు ఏడేళ్ల ముందు నుంచీ నీరవ్ మోదీ వ్యవహారాలను చాలా దగ్గరుండి చూసుకున్నారు. రిటైర్మెంట్ తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ఆయన శరవేగంగా నీరవ్, ఆయన మేనమామ మెహుల్ ఛోక్సీల లావాదేవీలు నెరిపారు. 2017లో కేవలం 63 రోజుల వ్యవధిలో ఆయన 143 ఎల్‌ఓయూలను (లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్) జారీ చేశారు. అంటే సగటున రోజుకు రెండు లేదా అంతకంటే ఎక్కువే. 2011 నుంచి 2017 దాకా జారీ చేసిన ఎల్‌ఓయూలు 150 కాగా.. కేవలం ఆఖరి 63 రోజుల్లో 143 ఎల్‌ఓయూలు ఇచ్చేశారాయన. దీన్ని బట్టి ఆయన ఎంత వేగంగా స్విఫ్ట్ సిస్టమ్ ద్వారా ఎల్‌ఓయూలను విదేశాల్లోని భారతీయ బ్యాంకుల బ్రాంచీలకు చేరవేశారో అర్థమవుతుంది. 2017 మార్చి 21 ఒక్కరోజునే ఆయన గీతాంజలి, గిల్ ఇండియా, నక్షత్ర బ్రాండ్ డైమండ్స్‌కు అనుకూలంగా బ్యాంక్ ఆఫ్ ఇండియా.. ఏంట్‌వెర్ప్ బ్రాంచ్ (బెల్జియం)కి 10 ఎల్‌ఓయూలు జారీచేశాడు. వీటి ఆధారంగా ఈ మూడు సంస్థలూ దాదాపు 3 లక్షల డాలర్ల సొమ్ము ఆ బ్యాంకు నుంచి తీసుకోగలిగాయి. ఆ మరుసటి రోజే దాదాపు 14 ఎల్‌ఓయూలు అదే బ్యాంకు, అదే బ్రాంచ్‌కి పంపాడు. వాటి విలువ 2.90 లక్షల డాలర్లు. మార్చి 1నుంచి పదో తేదీ మధ్య ఎస్‌బీఐ మారిషస్ బ్రాంచ్‌కు 33 ఎల్‌ఓయూలు, ఫ్రాంక్‌ఫర్ట్ బ్రాంచ్‌కు 21 ఎల్‌ఓయూలు ఛోక్సీ సంస్థల పేరిట జారీ అయ్యాయి. ఇంత జరుగుతున్నా బ్యాంకుల ఉన్నతాధికారులకు అనుమానం రాకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందని సీబీఐ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. మొదటి 150 ఎల్‌ఓయూల విలువ రూ.6500 కోట్లు కాగా 143 ఎల్‌ఓయూల విలువ రూ.3000 కోట్లు. ఇంత త్వరత్వరగా ఆయన జారీ చేయడానికి కారణం రిటైర్మెంట్‌లోగా సాధ్యమైనంత ఎక్కువగా నీరవ్ మోదీకి లబ్ధి చేకూర్చాలన్నదేనని సీబీఐ అంటోంది. రిటైరయ్యాక ఆయనకు స్విఫ్ట్ వాడుకునేందుకు లాగిన్, కోడ్ అందుబాటులో ఉండవు. సాధారణంగా ఈ ఎల్‌ఓయూల గడువు 90 రోజులు మాత్రమే. కానీ గోకుల్ శెట్టి రూల్స్‌కి విరుద్ధంగా అనేక ఎల్‌ఓయూల కాలపరిమితిని 365 రోజులుగా పేర్కొన్నాడు. ఒక ఎల్‌ఓయూ ఇచ్చినపుడు వందశాతం మార్జిన్ మనీని సదరు సంస్థ బ్యాంకుకు కట్టాలి. కానీ నీరవ్ పాత కష్టమరే కాబట్టి ఆ అవసరం లేకుండా గోకుల్ మేనేజ్ చేసేశాడు.

'గీతాంజలి'పై పరిశీలన

నీరవ్ మోదీ మేనమామ మెహుల్ ఛోక్సీ ఆధ్వర్యంలోని గీతాంజలి గ్రూప్‌కు అనుబంధంగా ఉన్న 18 సంస్థల బ్యాలెన్స్ షీట్లను సీబీఐ నిశితంగా పరిశీలిస్తోంది. వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న డబ్బును ఈ సంస్థలకు మళ్లించారా లేక గ్యారంటీగా పెట్టారా.. అన్నది ఆరా తీస్తున్నారు. బ్యాంకులోని మిగిలిన ఉద్యోగులకు అసలు ఈ వ్యవహారం తెలియకుండా ఉండడానికి ఆస్కారం లేదని, వివిధ స్థాయుల్లో ఉద్యోగుల విధులు, వారు ఛోక్సీ సంస్థలను ఆమోదించిన తీరును పరిశీలిస్తున్నారు. ఎల్‌ఓయూల ఆధారంగా జారీ అయిన లెటర్స్ ఆఫ్ క్రెడిట్‌ను నీరవ్ సంస్థలకు వెన్వెంటనే విదేశాల్లోని ఇతర భారతీయ బ్యాంకుల బ్రాంచీలు సొమ్ము అందజేసిన వైనంపై కూడా సీబీఐ దృష్టిపెట్టింది. కేవలం 24 గంటల్లోనే నీరవ్ ఎల్‌ఓయూలను క్లియర్ చేయడానికి కారణాలేంటన్న విషయాలపై స్టేట్ బ్యాంక్, అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏక్సిస్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూబీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా మొదలైన బ్యాంకుల సిబ్బందిని ప్రశ్నించనుంది.

ప్రతీ ఎల్‌ఓయూకీ కమిషన్

ప్రతీ ఎల్‌ఓయూకీ ఫలానా మొత్తం కమిషన్‌గా ముడుతుందని, దాన్ని బ్యాంకులోని ఉద్యోగులంతా పంచుకుంటారని సీబీఐ విచారణలో తేలినట్లు కథనం. మేనేజర్లు, ఆపై ఉద్యోగుల పాత్ర ఎంత అన్నది గోకుల్ చెప్పటం లేదని తెలుస్తోంది. నీరవ్ ఎలా ప్రలోభపెట్టాడు, వ్యక్తిగతంగా ఏమైనా బహుమతులు ఇచ్చాడా, రెగ్యులర్ కష్టమర్ కాబట్టి ముడుపులు ఎలా అందేవి, నీరవ్, ఛోక్సీల తరపున బ్యాంకుకు వచ్చిపోయేవారెవరు.. మొదలైనవి సీబీఐ ప్రశ్నించింది.

200 డబ్బా కంపెనీలపై ఫోకస్

దాదాపు 200 డొల్ల కంపెనీల గురించి ఈడీ, ఐటీ విభాగాలు ఆరా తీస్తున్నాయి. "శని, ఆదివారాల్లో ఈడీ 45 చోట్ల సోదాలు జరిపి 29 స్థిరాస్తులను జప్తు చేసింది. ఇవన్నీ నీరవ్ మోదీ, ఆయనకు చెందిన సంస్థలవే. మనీ లాండరింగ్ చట్టం కింద మరికొన్ని స్థిరాస్తులను జప్తు చేస్తాం. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. విదేశీ అడ్రసులున్న బినామీ సంస్థలపైనా ఆరా తీస్తున్నాం. ఇప్పటిదాకా నీరవ్‌కు చెందిన 105 బ్యాంకు అకౌంట్లను స్తంభింపచేశాం" అని ఈడీ అధికారి ఒకరు తెలిపారు.

అత్తసొమ్ము అల్లుడి దానం

పీఎన్‌బీని ముంచేసింది

ఈ ముగ్గురే..!

ముంబై, ఫిబ్రవరి 18: నీరవ్ మోదీ దోపిడీ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత అందరి దృష్టి ముంబై బ్రాడీ రోడ్డులోని పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) బ్రాంచిపైనే ఉంది. సీబీఐ అధికారులు బ్యాంకులో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ స్కామ్‌కు సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు దోపిడీకి సహకరించిన ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి వివరాలు ఇలా ఉన్నాయి.

గోకుల్‌నాథ్ శెట్టి



పంజాబ్ నేషనల్ బ్యాంకు బ్రాండీ హౌస్ బ్రాంచిలో డిప్యూటీ మేనేజరు హోదాలో 2010 మార్చి నుంచీ పనిచేస్తూ 2017 మే నెలలో ఉద్యోగ విరమణ చేశారు. రిటైర్‌మెంట్‌కు 3 నెలల ముందు..2018 జనవరి వరకూ చెల్లుబాటు అయ్యేలా 3 లెటర్స్ ఆఫ్ అండర్‌స్టాండిగ్(ఎల్‌ఓయూస్)లు జారీ చేశారు. విదేశాల్లోని నీరవ్ సంస్థలకు డబ్బులు చెల్లించేలా తప్పుడు ఆదేశాలు ఇస్తూ బ్యాంకింగ్ వ్యవస్థను ప్రభావితం చేశారు.

మనోజ్ ఖారత్



పూణేలో బీఈ చేశాడు. బ్యాంకు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మూడేళ్ల క్రితం పీఎన్‌బీలో ఉద్యోగం సంపాదించాడు. బ్రాడీ బ్రాంచిలోని ఏకగవాక్ష విధానం(సింగిల్ విండో)లో గుమస్తా. గోకులనాథ్ శెట్టి చెప్పిన దానికల్లా తలూపి బ్యాంకులో అక్రమాలకు తెరతీశాడు.

హేమంత్ భట్

నీరవ్ మోదీకి చెందిన దాదాపు 16 కంపెనీల్లో డైరెక్టర్. ఆయా కంపెనీల అధీకృత అకౌంట్స్ అన్నింటికీ అధికారికంగా సంతకం చేసే హక్కు కలిగి ఉన్నాడు. లెటర్స్ ఆఫ్ అండర్‌స్టాండింగ్‌ల కోసం గోకులనాథ్ శెట్టి ఇతర అధికారులు, నీరవ్ మోదీకి మధ్య సంధానకర్త.

బ్యాంకుల సంక్షోభంపై చిలుకూరులో పూజలు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల సంక్షోభం నుంచి ప్రజలను రక్షించాలంటూ చిలుకూరు బాలాజీ దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఎగవేత దారుల నుంచి బ్యాంకుల సొమ్ము.. తిరిగి రావాలని ఆ దేవుడిని ప్రార్థించనున్నారు. సోమవారం 12 గంటలకు బాలాజీకి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు ఎంవీ సుందరరాజన్, సీఎస్ గోపాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా రుణ విమోచన నృసింహ స్తోత్రాన్ని 11 సార్లు పఠిస్తామని తెలిపారు. బ్యాంకింగ్ రంగంలో ప్రభుత్వ, రాజకీయ నాయకుల జోక్యం ఉండకుండా చూడాలని ఆ బాలాజీని కోరుతున్నామని అన్నారు. బ్యాంకుల్లో దాచుకొన్న భారతీయుల కష్టార్జితాన్ని కార్పొరేట్ సంస్థల నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి కష్టాల నుంచి రక్షించాలని కోరుతూ ప్రతి ఒక్కరూ బాలాజీని ప్రార్థించాలని పూజారులు కోరారు.

నీరవ్.. అంబానీ..

బంధుత్వం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: పంజాబ్ నేషనల్ బ్యాంకుకు కుచ్చుటోపీ పెట్టిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ గురించి ఆరా తీసే కొద్దీ కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీతో అతనికి బంధుత్వం కూడా ఉంది. నీరవ్ మోదీ సోదరుడు నీశాల్ మోదీ అంబానీ మేనకోడలు ఇషిత భర్త. ముఖేశ్ అంబానీ సోదరి దీప్తి కుమార్తే ఇషిత. దీప్తి భర్త దత్తరాజ్ గోవాలో పెద్ద పారిశ్రామికవేత్త. అప్పట్లో మేనకోడలి పెళ్లిని ముఖేశ్ చాలా గ్రాండ్‌గా చేశారు. పెళ్లికి ముందు తన ఇంటిలోనూ, ట్రైడెంట్ హోటల్‌లోనూ భారీ పార్టీలు కూడా ఇచ్చారు. వాస్తవానికి నీరవ్‌తోపాటు నీశాల్ కూడా వజ్రాల వ్యాపారంలో ఉన్నారు. సొంతంగా కొన్ని కంపెనీలూ పెట్టారు. 1999లో తొలిసారిగా ఫైర్‌స్టార్ డైమండ్స్ ద్వారా వ్యాపారం మొదలు పెట్టినా..నీశాల్ ఎంటర్ ప్రైజస్ ఎల్ఎల్‌పీ, పారగాన్ జువెలరీ ఎల్ఎల్‌పీ, పారగాన్ మెర్కండైజింగ్ ఎల్ఎల్‌పీ, పాంచజన్య డైమండ్స్ ఎల్ఎల్‌పీ సంస్థలు స్థాపించి చాలా పేరు సంపాదించారు.



కోల్‌కతాలో నీరవ్, విజయ్ మాల్యా, లలిత్ మోదీల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

మరో నీరవ్ రొటోమాక్ కొఠారీ

(మొదటి పేజీ తరువాయి)

ఆయన అసలు గానీ, వడ్డీ గానీ కట్టలేదని, 45 రోజుల కిందటే ఆయన విదేశాలకు చెక్కేశాడని అభిజ్ఞవర్గాల కథనం. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ముంబై బ్రాంచ్) ఆయనకు అత్యధికంగా రూ 485 కోట్ల రూపాయల రుణం ఇచ్చింది. అలహాబాద్ బ్యాంక్ (కోల్‌కతా బ్రాంచ్) రూ 352 కోట్ల రుణాన్ని మంజూరు చేసింది. ఇవే గాక- ఆయన బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లు కూడా అప్పిచ్చినా- అవి ఎంత మొత్తంలో ఇచ్చాయి, ఎంత నష్టపోయాయి.. అన్న వివరాలు తెలియాల్సి ఉంది. ఒక రిపోర్టు ప్రకారం కొఠారీ దాదాపు 5000 కోట్ల రూపాయల మేర బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. ఇందులో ఎంత చెల్లించారో, ఎంత ఎగ్గొట్టారో తేలాలి. ఈ కంపెనీ ప్రధాన కార్యాలయం కాన్పూర్‌లో ఉంది. నెలన్నరగా అది తాళం వేసి ఉంది.

కొఠారీకి చెందిన పెన్నుల తయారీ సంస్థ రొటోమాక్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను- బ్యాంకుల కన్సార్టియం- ఉద్దేశపూర్వకంగా సొమ్ము ఎగవేసిన సంస్థగా (విల్‌ఫుల్ డిఫాల్టర్) ప్రకటించింది. కన్సార్టియం తరపున బ్యాంక్ ఆఫ్ బరోడా ఈ ప్రకటన చేసింది. తమను డిఫాల్టర్ల జాబితాలో చేర్చడాన్ని రొటొమాక్ -అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేసింది. కేసు పరిశీలించిన ద్విసభ్య బెంచ్- 'రొటోమాక్ సంస్థ రూ 300 కోట్ల ఆస్తులను గ్యారంటీగా చూపెట్టినపుడు డిఫాల్టర్ అని ఎలా అంటారని' ప్రశ్నిస్తూ బ్యాంకుల నిర్ణయాన్ని కొట్టేసింది. ఆ తరువాత రొటొమాక్ కేసు రిజర్వ్‌బ్యాంకు పరిశీలనకు వెళ్లింది. రొటొమాక్ కంపెనీ ఉద్దేశపూర్వక ఎగవేతదారేనని ఆర్బీఐ తాలూకు అధీకృత కమిటీ కూడా కిందటేడాది ఫిబ్రవరి 27 న ఓ ఆర్డర్‌ను పాస్ చేసింది.

ఎవరీ విక్రమ్ కొఠారీ?

1990ల్లో టెలివిజన్లలో ఓ ప్రకటన వచ్చేది... లిఖ్‌తే లిఖ్‌తే లవ్ హో జాయే... అని వచ్చే ఆ ప్రకటన దేశవ్యాప్తంగా ఎంతో పాపులర్ అయింది. రొటోమాక్ పెన్నుల కంపెనీ ప్రకటన అది. దాని అధినేతే విక్రమ్ కొఠారీ. ఈ ప్రకటనకు ముందు విశేష ప్రజాదరణ పొందిన మరో టీవీ యాడ్.. పాన్ పరాగ్ .. పాన్ మసాలా ! పాన్ పరాగ్ సంస్థ అధినేత అయిన ఎంఎం కొఠారీకి ఇద్దరు కొడుకులు. దీపక్ కొఠారీ, విక్రమ్ కొఠారీ. తండ్రి చనిపోయాక- విక్రమ్- స్టేషనరీ బిజినెస్‌లోకి వెళ్లారు. అప్పట్లో కంప్యూటర్లు, సెల్‌ఫోన్లు లేవు. పెన్నులే ఆధారం. పెన్నులు, గ్రీటింగ్ కార్డుల వ్యాపారాన్ని లాభదాయకంగా చేసిన కొఠారీ- రెనాల్డ్స్ సంస్థ నుంచి గట్టి పోటీ ఎదుర్కొన్నాడు. వ్యాపార విస్తృతికి ఆయన సల్మాన్ ఖాన్ చేత కూడా యాడ్స్ చేయించాడు. అలాగే 1995లో బాలీవుడ్ భామ రవీనా టాండన్- లిఖ్‌తే లిఖ్‌తే కు చేసిన సంగీతానికి అనుగుణంగా నర్తించిన వాణిజ్య ప్రకటన కూడా నేటికీ అందరికీ గుర్తే. విక్రమ్ కొఠారీకి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి- ఉత్తమ ఎగుమతిదారు అవార్డును కూడా ప్రదానం చేశారు. ఆ తరువాత విక్రమ్ చాలా వ్యాపారాలు ప్రారంభించారు. రొటోమాక్ ఫుడ్స్, రొటోమాక్ ఫ్రాగ్రెన్సెస్, రొటోమాక్ ఎక్స్‌పోర్ట్స్, మోహన్ స్టీల్స్, క్రౌన్ ఆల్ఫా రైటింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, రేవ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మొదలైన వాటితో పాటు లక్నో, కాన్పూర్, అహ్మదాబాద్, డెహ్రాడూన్ మొదలైన నగరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కూడా నిర్వహించేవాడు.

కానీ ఆయన తీసుకున్న అప్పులు మెడకు చుట్టుకొన్నాయి. ఒక బ్యాంకులో తీసుకున్న అప్పు మరో చోట, ఇంకో అప్పు ఇంకో చోట రొటేట్ చేస్తూ నెట్టుకొంటూ వచ్చినా మోసం దాగలేదు. ఆఖరికి రూ 600 కోట్ల రూపాయల చెక్‌బౌన్స్ కేసు కూడా నమోదైంది. కాన్పూర్‌లో విక్రమ్ కొఠారీకి చెందిన మూడు ఇళ్లను వేలం వేస్తున్నట్లు అలహాబాద్ బ్యాంకు కిందటేడాది సెప్టెంబరులో ఓ నోటీసు కూడా జారీ చేసింది. కానీ ఆయన తన పలుకుబడి ఉపయోగించి వేలంలో ఎవరూ పాల్గొనకుండా చేశాడు. ఇపుడు నీరవ్ మోదీ తరహాలో దేశం నుంచే పరారవడంతో ఆయనకు అప్పులిచ్చిన బ్యాంకుల గొల్లుమంటున్నాయి. ఈ బ్యాంకులు నీరవ్ మోదీ విషయంలోనూ భారీగానే నష్టపోయాయి.

మీరే అపరాధుల్లా

ప్రవర్తించకండి

- పీఎన్‌బీ స్కాంపై మౌనం వీడండి
- మోదీ, జైట్లీలకు రాహుల్ చురకలు
- నోట్ల రద్దు సమయంలో భారీగా మనీ లాండరింగ్: మమతా బెనర్జీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శల దాడిని కొనసాగించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)-వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ కుంభకోణంపై ప్రధాని మౌనం వీడాలని డిమాండ్ చేశారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లక్ష్యంగా కూడా విమర్శనాస్త్రాలు సంధించారు. "ప్రధాని మోదీ పరీక్షలు ఎలా పాసవ్వాలో పిల్లలకు రెండు గంటల పాటు చెబుతారు. కానీ, 22,000 కోట్ల బ్యాంకింగ్ కుంభకోణం గురించి ఆయన రెండు నిమిషాలు కూడా మాట్లాడరు. జైట్లీ దాక్కున్నారు. మీరు అపరాధులైనట్లు ప్రవర్తించడం ఆపండి. మాట్లాడండి" అని రాహుల్ ఆదివారం ట్వీట్ చేశారు. శుక్రవారం ప్రధాని 'పరీక్ష పే చర్చ' కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి సుదీర్ఘంగా మాట్లాడడం తెలిసిందే. 2013 సెప్టెంబరులో నీరవ్ నిర్వహించిన ఒక ప్రమోషనల్ ఈవెంట్‌లో రాహుల్ పాల్గొన్నారని, నీరవ్‌తో ఆయనకు వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయని బీజేపీ ఆరోపించింది. దీనిని రాహుల్ ఖండిస్తూ.. అసలు విషయం నుంచి దృష్టి మరల్చే ప్రయత్నాలు మానుకోవాలని చెప్పారు. "నీరవ్ మోదీ విషయంలో ఏం చేయనున్నారో ప్రధాని దేశ ప్రజలకు వివరించాలి. బ్యాంకింగ్ వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకు ఏం చేస్తారో తెలియజేయాలి" అని సూచించారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏతో మోసగాళ్లకు సంబంధాలు ఉన్నాయని, బ్యాంకుల్లో గత అయిదేళ్లలో రూ.61,000 కోట్ల మేర కుంభకోణాలు జరిగాయని కాంగ్రెస్ ఆరోపించింది. బ్యాంకింగ్ వ్యవస్థపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. "రిజర్వు బ్యాంకు విడుదల చేసిన డేటా ప్రకారం అయిదేళ్లలో బ్యాంకుల్లో రూ.61,260 కోట్ల మేర అక్రమాలు జరిగాయి. ఈ అయిదేళ్లలో నాలుగేళ్ల బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేనే అధికారంలో ఉంది. మోసగాళ్లకు, బీజేపీ ముఖ్య నాయకులకు మధ్య లింకులు దేశ ఆర్థిక రంగం ఆరోగ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి" అని కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ అన్నారు. అందుకే బ్యాంకింగ్ వ్యవస్థపై శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని చెప్పారు. అన్ని బ్యాంకులు ఎగవేతదారుల పేర్లు, నిరర్థక ఆస్తుల(ఎన్‌పీఏ) వివరాలు ప్రకటించేలా కేంద్రం ఆదేశించాలని కోరారు. "2017 సెప్టెంబరు నాటికి అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగం బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.8,36,782 కోట్లు. ఇందులో 77 శాతం ప్రముఖ కార్పొరేట్ సంస్థలవే" అని చెప్పారు. రూ.11,400 కోట్ల కుంభకోణం జరిగిన పంజాబ్ నేషనల్ బ్యాంకుకు 2016-17 సంవత్సరానికి విజిలెంట్ అవార్డు రావడాన్ని ఎద్దేవా చేశారు. పీఎన్‌బీ కుంభకోణంపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ డిమాండ్ చేశారు. "నోట్ల రద్దు సమయంలో పెద్దఎత్తున మనీ లాండరింగ్ జరిగింది. నిజం బయటకు రావాల"ని అన్నారు. పీఎన్‌బీ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరపాలని పుదుచ్చేరి సీఎం వి.నారాయణసామి డిమాండ్ చేశారు.

4గంటలకో ఉద్యోగి మోసం!

- ఇదీ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పరిస్థితి
- ఆర్బీఐ నివేదికలో వెల్లడి

- 2015 నుంచి 2017 మధ్య దొరికిన ఉద్యోగులసంఖ్య: 5200
- అవినీతి అధికారుల జాబితాలో ఎస్‌బీఐది ప్రథమస్థానం
- ద్వితీయ స్థానంలో ఐఓబీ.. తృతీయస్థానంలో సెంట్రల్‌బ్యాంక్



బెంగళూరు, ఫిబ్రవరి 18: ఇప్పుడు ఎక్కడ విన్నా.. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం ముచ్చటే! దాని వెనుక ఆ బ్యాంక్ ఉద్యోగులు ఉన్నట్లు స్పష్టంగా తెలుతున్నది! మరి.. ఇతర బ్యాంకుల్లో పరిస్థితి ఎలా ఉంది? ఆయా బ్యాంకుల ఉద్యోగుల మాటేమిటి?! రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల విడుదల చేసిన ఓ నివేదికను పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. ఉద్యోగుల్లో కొందరు తాము పనిచేస్తున్న సంస్థకే కన్నం పెడుతున్నారు. అందినంత దోచేసుకుంటున్నారు. దేశంలో సగటున 4గంటలకు ఓ ప్రభుత్వ రంగ బ్యాంక్ ఉద్యోగి శిక్షార్హమైన మోసానికి పాల్పడుతున్నట్లు ఆర్బీఐ నివేదికలో వెల్లడైంది. 2015 జనవరి 1 నుంచి 2017 మార్చి 31 మధ్య 5200 మంది ప్రభుత్వ రంగ బ్యాంక్ ఉద్యోగులు మోసాలకు పాల్పడి శిక్షలు అనుభవించారు. వారంతా జరిమానాలు, విధుల నుంచి బహిష్కరణ వంటి శిక్షలను ఎదుర్కొన్నారు. అవినీతి ఉద్యోగుల జాబితాలో ప్రథమస్థానంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) నిలిచింది. ఈ బ్యాంక్‌లోని 1,538 మంది సిబ్బంది మోసాలకు పాల్పడి శిక్షలు అనుభవించారు. ఇక, రెండో స్థానంలో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (449 మంది అవినీతి సిబ్బంది), మూడో స్థానంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (406 మంది అవినీతి సిబ్బంది) నిలిచింది. ప్రస్తుతం భారీ కుంభకోణంతో ప్రకంపనలు సృష్టిస్తున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 2015 జనవరి 1 నుంచి 2017 మార్చి 31 మధ్య 184 మంది అధికారులు మోసాలకు పాల్పడ్డట్లు ఆర్బీఐ బయటపెట్టింది. మోసాలకు పాల్పడినవారిని శిక్షించడం, మోసాలను నివారించడం కోసం ప్రత్యేక యంత్రాగాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఆయా బ్యాంకులకు 2016 జూలైలో ఆర్బీఐ ఆదేశాలు జారీ చేసింది.

12శాతం వాళ్లే..

ఆర్బీఐ లెక్కల ప్రకారం చూస్తే.. 2013 ఏప్రిల్ 1 నుంచి 2016 డిసెంబర్ 31 వరకు దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల్లో 17,504 మోసాలు జరిగాయి. దీని వల్ల రూ. 66,066 కోట్ల నష్టం వాటిల్లింది. ఈ మోసాలకు పాల్పడినవారిలో 12శాతం మంది ఆయా బ్యాంకుల ఉద్యోగులేనని తేలింది. 'బయట మోసాల గురించే బ్యాంకులు ఎక్కువగా దృష్టిపెడతాయి. కానీ అంతర్గతంగా జరిగే వాటిపై పెద్దగా దృష్టిపెట్టవు. ఇదే అసలు సమస్య' అని ఓ కన్సల్టింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అన్నారు.

ఆర్బీఐ లెక్కల ప్రకారం.. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో మోసాలకు పాల్పడి దొరికిన ఉద్యోగులు (2015 జనవరి 1 నుంచి 2017 మార్చి 31 మధ్య)

బ్యాంక్ పేరు	2015 (జనవరి-డిసెంబర్)	2016 (జనవరి-డిసెంబర్)	2017 (జనవరి-మార్చి)	మొత్తం
ఎస్‌బీఐ	888	547	103	1538
ఐఓబీ	245	160	44	449
సెంట్రల్ బ్యాంక్	248	130	28	406
యూనియన్ బ్యాంక్	125	72	17	214
పీఎన్‌బీ	115	58	11	184
మిగతా 22				
ప్రభుత్వరంగ బ్యాంకులు	1127	1027	255	2409
మొత్తం	2748	1994	458	5200

అక్రమాలు జరిగినా అవార్డులే

లావాదేవీల్లో అప్రమత్తంగా వ్యవహరించినందుకు పీఎన్‌బీకి రెండు సార్లు విజిలెన్స్ ఎక్సలెన్స్ పురస్కారాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: అక్రమాలు బయటపడే వరకు ఏదైనా సక్రమమే అన్నట్లు ఉంది బ్యాంకుల పరిస్థితి. పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) వ్యవహారం చూస్తే ఇదే విషయం స్పష్టమవుతోంది. పీఎన్‌బీలో రూ.11,400 కుంభకోణం జరిగినా ఇన్నాళ్లూ బయటపడలేదు. నీరవ్ మోదీ, ఆయన మేనమామ మెహుల్ ఛోక్సీలు బ్యాంకు అధికారుల సహకారంతో వేల కోట్లు కొల్లగొట్టారు. మరోవైపు లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉందంటూ గత నాలుగేళ్లలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ పీఎన్‌బీకి రెండు సార్లు విజిలెన్స్ ఎక్సలెన్స్ అవార్డులు అందించింది. బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన వ్యవహారాల్లో అప్రమత్తంగా వ్యవహరించినందుకు గానూ మార్చి, 2015లో కార్పొరేట్ విజిలెన్స్ ఎక్సలెన్స్ అవార్డును పీఎన్‌బీ అందుకుంది. ఈ అవార్డును ఇప్పటివరకు రెండు సార్లు గెలుచుకున్నట్లు పీఎన్‌బీ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. 2016-17కి గానూ మరోసారి అవార్డును గెలుచుకున్నట్లు తెలిపింది. క్రమశిక్షణతో పనులను తక్కువ సమయంలో పూర్తి చేసినందుకు ఈ అవార్డును పీఎన్‌బీ గెలుచుకుందట. ఇదంతా బాగానే ఉన్నా.. బ్యాంకు నిజంగా అప్రమత్తంగా ఉండి ఉంటే ఇంత పెద్ద కుంభకోణం జరిగేది కాదు! వేల కోట్లు నష్టపోయేదీ కాదు. ప్రస్తుతం ఈ కుంభకోణంతో సంబంధం ఉన్న 18 మంది బ్యాంకు అధికారులపై పీఎన్‌బీ సస్పెన్షన్ విధించింది. పీఎన్‌బీ మాజీ డిప్యూటీ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి, సింగిల్ విండో ఆపరేటర్ మనోజ్ ఖరత్‌లతో పాటు నీరవ్ మోదీ సంస్థల ఉద్యోగి హేమంత్‌లను సీబీఐ అరెస్టు చేసింది. వీరికి వచ్చే నెల 3 వరకు కోర్టు రిమాండ్ విధించింది.



ఆటుపోట్ల మార్కెట్లో

స్టాక్ మార్కెట్ ఊగిసలాడుతోంది. గత ఏడాదంతా రేసు గుర్రంలా పరుగెత్తింది. ఇప్పుడు మాత్రం ఇన్వెస్టర్లకు చుక్కలు చూపిస్తోంది. దీంతో ఇన్వెస్టర్లు బెంబేలెత్తి పోతున్నారు. ఈ నేపథ్యంలో రిటైల్ ఇన్వెస్టర్లు అనుసరించాల్సిన పెట్టుబడి వ్యూహాన్ని బ్యాంక్‌బజార్ సిఇఒ ఆదిల్ షెట్టి ఆంధ్రజ్యోతి 'బిజినెస్ ప్లస్' పాఠకులకు వివరిస్తున్నారు...



పెట్టుబడుల వ్యూహం

ఇటీవల రెండు సంఘటనలు భారత స్టాక్ మార్కెట్‌ను కుదిపేశాయి. ఊహించినట్టు కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి జైట్లీ స్టాక్ మార్కెట్ దీర్ఘకాలిక లాభాలపై మూలధన లాభాల పన్ను (ఎల్‌టిసిజి) విధించారు. దీంతో బడ్జెట్ రోజే మార్కెట్ కొద్దిగా ఊగిసలాడింది. ఆ తర్వాత రోజు నుంచి తీవ్ర ఆటుపోట్లకు లోనైంది. ఈ సంవత్సరం జనవరి 29న 36283 పాయింట్ల ఆల్ టైమ్ హై వద్ద క్లోజైన సెన్సెక్స్ ఫిబ్రవరి 7నాటికి దాదాపు 2000 పాయింట్లు నష్ట పోయింది. ప్రస్తుతం మార్కెట్ ఆటుపోట్ల దశను దాటలేదని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈక్విటీ ఇన్వెస్టర్లు ముఖ్యంగా ఈక్విటీ పథకాల ఇన్వెస్టర్లు ఈ కింది వ్యూహాలు అనుసరించడం మంచిది. అవేంటంటే...

ఈక్విటీ బెస్ట్

మార్కెట్‌లో ఆటుపోట్లు ఎప్పుడూ ఉండేవే. ఇప్పుడు వీటికి ఎల్‌టిసిజి కూడా తోడైంది. అయినా దీర్ఘ కాలికంగా చూస్తే మంచి రాబడులకు ఇప్పటికీ ఈక్విటీ పెట్టుబడులను మించిన మార్గం లేదు. మన ఆర్థిక వ్యవస్థ చాలా కాలం పాటు ఏటా సగటున 7-8 శాతం చొప్పున అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ విషయాన్ని గుర్తుంచుకుంటే దీర్ఘకాలిక లాభాల కోసం ఇన్వెస్టర్లు ఎవరూ ఈక్విటీ పెట్టుబడులు వదులుకోరు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసే ఇన్వెస్టర్లకూ ఇదే వర్తిస్తుంది. కొద్దిగా నష్ట భయం ఉన్నా, ఎల్‌టిసిజి భయంతో ఈ పథకాల్లో ఇన్వెస్ట్ చేయడం మానుకోవడం అంటే పప్పులో కాలేసినట్టే.

రాబడుల్లోనూ మిన్న

విత్తనం విత్తిన వెంటనే కాయలు కోసుకునే వారికి ఈక్విటీ పెట్టుబడులు పనికి రావు. ఈక్విటీ షేర్లు లేదా ఈక్విటీ పథకాల్లో ఇన్వెస్ట్ చేసే మదుపరులు మంచి లాభాల కోసం దీర్ఘకాలం పాటు వేచి చూడాలి. ఒక మాదిరి రాబడులు ఇచ్చిన ఈక్విటీ పథకాలను, పిపిఎఫ్ వంటి చిన్న పొదుపు పథకాలతో పోల్చి చూసినా ఈక్విటీ పథకాల రాబడులే మిన్న. క్రిసిల్, యాంఫి ఈక్విటీ ఫండ్ పర్ఫార్మెన్స్ ఇండెక్స్ నివేదికే ఇందుకు ఉదాహరణ. ఈ నివేదిక ప్రకారం డిసెంబరు 2017నాటికి ఈక్విటీ పథకాలు సగటున ఏడాదికి 35.59 శాతం, మూడేళ్లలో 13.08 శాతం, ఐదేళ్లలో 17.64 శాతం, పదేళ్లలో 8.94 శాతం చొప్పున రాబడులు పంచాయి. 15 ఏళ్ల కాలపరిమితి ఉండే పిపిఎఫ్‌పై ప్రస్తుతం చెల్లించే వడ్డీ రేటు 8.1 శాతం మాత్రమే. ప్రభుత్వం ఇటీవల దీన్ని బ్యాంక్ రేటుతో ముడిపెట్టి ప్రతి మూడు నెలలకు సవరిస్తోంది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుంటే ఎల్‌టిసిజి పోటు ఉన్నా, దీర్ఘకాలంలో మంచి రాబడుల కోసం చూస్తే ఇన్వెస్టర్లకు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మంచి పెట్టుబడి మార్గం.

పన్ను పోటూ తక్కువే

ఎల్‌టిజిసి వచ్చినా, దీర్ఘకాలంలో పన్నుల ఆదా పరంగా చూస్తే ఇప్పటికీ ఈక్విటీ పెట్టుబడులే మేలు. ఈక్విటీ షేర్లు లేదా ఈక్విటీ పథకాల పెట్టుబడులు కొన్న ఏడాది తర్వాత అమ్మినా రూ.లక్ష వరకు ఎల్‌టిసిజి వర్తించదు. ఆ పరిమితి దాటిన దీర్ఘ కాలిక మూలధన లాభాలపైనా పది శాతం ఎల్‌టిసిజి చెల్లిస్తే సరిపోతుంది. 20 లేదా 30 శాతం వ్యక్తిగత ఆదాయ పన్నుల శ్లాబుల్లో ఉన్న వారికీ ఇదే పన్ను రేటు వర్తిస్తుంది. ఈక్విటీ పథకాల్లో మదుపు చేసే చిన్న చిన్న ఇన్వెస్టర్ల దీర్ఘ కాలిక మూల ధన లాభం రూ.లక్ష మించాలంటే చాలా కాలం ఇన్వెస్ట్ చేయాలి. అవసరమైనపుడు ఆ పరిమితికి చేరగానే అమ్మి లాభాలు జేబులో వేసుకునే సౌలభ్యమూ ఇన్వెస్టర్లకు ఉంటుంది.



భద్రత

చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్లకు స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేయాలని ఉంటుంది. అయితే అందుకు అవసరమైన పరిజ్ఞానం, తీరికగానీ, ఏ షేర్లు మంచివి? ఏవి కావు? అని తెలుసుకునే ఓపికగానీ చాలా మందికి ఉండదు. ఇలాంటి మదుపరులు మ్యూచువల్ ఫండ్ సంస్థలు అందించే ఈక్విటీ పథకాలను ఎంచుకోవడం మంచిది. ఈ పథకాల పెట్టుబడుల నిర్వహణ అనుభవజ్ఞులైన ఫండ్ మేనేజర్ల నిర్వహణలో జరుగుతుంది. మార్కెట్ లేదా కంపెనీల ఆర్థిక పరిస్థితులను బట్టి ఏ కంపెనీ షేర్లను ఎపుడు అమ్మాలి? లేదా ఎపుడు కొనాలి? అనే విషయాలపై నిపుణులైన ఫండ్ మేనేజర్లే నిర్ణయాలు తీసుకుంటారు. దీంతో ఈ పథకాల్లో ఇన్వెస్ట్ చేసే మదుపరుల పెట్టుబడులకు నష్ట భయం కూడా తక్కువ. నెలకు రూ.500 కనీస సిప్ చొప్పున కూడా రిటైల్ ఇన్వెస్టర్లు ఈ పథకాల్లో ఇన్వెస్ట్ చేయవచ్చు.

సిప్ కొనసాగించడమే మేలు

మార్కెట్ ఆటుపోట్లతో తలెత్తే నష్ట భయాన్ని తగ్గించడమే క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక (సిప్) లక్ష్యం. దీని వల్ల యూనిట్ల సగటు కొనుగోలు ధరా తగ్గుతుంది. ప్రస్తుతం మన మార్కెట్‌లోనూ తీవ్ర ఆటుపోట్లు కనిపిస్తున్నాయి. దీనికి భయపడిపోయి హడావుడిగా ఈక్విటీ పథకాల్లో ఇన్వెస్ట్ చేసిన పెట్టుబడులను వెనక్కి తీసుకోవాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది. నిజానికి మార్కెట్ కింది చూపులు చూస్తున్నపుడే, చేతిలో డబ్బులుంటే మంచి పథకాల యూనిట్లు మరిన్ని కొనుగోలు చేయాలి. అలా చేయడం వల్ల యూనిట్ల సగటు కొనుగోలు ఖర్చులు మరింత తగ్గి, దీర్ఘకాలంలో మంచి లాభాలు వచ్చే అవకాశం ఉంది. అయితే ఇలాంటి సమయంలోనే కొన్ని జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా చిన్న, మధ్య రకం కంపెనీల షేర్లలో ఎక్కువగా ఇన్వెస్ట్ చేసిన ఈక్విటీ పథకాల జోలికి పోకూడదు. మన స్టాక్ మార్కెట్‌లో ఇప్పటికీ కొన్ని చిన్న, మధ్య రకం కంపెనీల షేర్లు అధికంగానే ట్రేడవుతున్నాయి. మార్కెట్ దిద్దుబాట సమయంలో ఇలాంటి కంపెనీల షేర్లు ఎక్కువగా నష్టపోతుంటాయి. ఆ ప్రభావం ఈ కంపెనీల షేర్లు ఉన్న ఈక్విటీ పథకాల ఎన్ఎవిల పైనా కనిపిస్తుంది.

అమ్మకం తప్పకపోతే

ఎన్నైనా చెప్పండి ఈ ఆటుపోట్లు మేం భరించలేం. మరింత నష్టపోకుండా, ఉన్న వాటిని అమ్ముకుని నాలుగు రాళ్లు చేసుకోవాలనుకుంటే మూడు విషయాల గురించి ఆలోచించడం మంచిది. అవేంటంటే...

ఎగ్జిట్ లోడ్

నిర్ణీత కాల వ్యవధిలో యూనిట్లు అమ్ముకుంటే మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఎగ్జిట్ లోడ్ పేరుతో కొంత రుసుము వసూలు చేస్తున్నాయి. ఏడాదిలోపు పెట్టుబడులు వెనక్కి తీసుకుంటే చాలా మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఇందుకోసం అప్పటి ఎన్ఎవిలో ఒక శాతం వరకు ఎగ్జిట్ లోడ్ కింద వసూలు చేస్తున్నాయి.

ఖర్చుల నిష్పత్తి

పెట్టుబడుల నిర్వహణ ఖర్చుల కోసం మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఏటా ఎన్ఎవిలో కొంత వసూలు చేస్తుంటాయి. దీనికి తోడు ఏడాదిలోపు అమ్ముకుంటే ఎగ్జిట్ లోడ్ రూపంలో మరింత భారం తప్పదు. మార్కెట్ ఆటుపోట్లకు భయపడి పెట్టుబడులు అమ్ముకోవాలనుకునే ప్రతి ఇన్వెస్టర్, ఈ ఖర్చుల నిష్పత్తి ఎంత ఉంటుందో తప్పకుండా తెలుసుకోవాలి.

కాల పరిమితి

ఈక్విటీ పథకాల్లో ఇన్వెస్ట్ చేసిన ఏడాదిలోపే అమ్ముకుంటే వచ్చే లాభాలపై ఎగ్జిట్ లోడ్‌కు తోడు 15 శాతం చొప్పున స్వల్ప కాలిక మూల ధన లాభాల(ఎస్‌టిసిజి) పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఎల్‌టిసిజితో పోలిస్తే ఇది ఐదు శాతం ఎక్కువ. ఇలా అధిక పన్నులు, ఎగ్జిట్ లోడ్ చెల్లించే కంటే మార్కెట్ స్థిరపడే వరకు వేచి చూసి దీర్ఘకాలిక లాభాలు బుక్ చేసుకోవడం మంచిది.

తెలివిగా పన్నులు తగ్గించుకోవడం

ఎల్‌టిసిజి ఉన్నా కొద్దిగా తెలివిగా వ్యవహరిస్తే ఈక్విటీ పథకాల దీర్ఘ కాలిక మూల ధన లాభాలపైనా పన్నుల భారం తగ్గించుకోవచ్చు. ఇందుకోసం మీ కంటే తక్కువ ఆదాయం ఉన్న మీ కుటుంబ సభ్యుల పేరు మీద ఇన్వెస్ట్ చేయడం ఒకమార్గం. ఇంకోటి మూలధన లాభాలు రూ.లక్షకు చేరగానే ఎప్పటికపుడు పెట్టుబడులు అమ్ముకుని ఆ లాభాలను ఎలాంటి పన్ను పోటు లేకుండా మంచి ఈక్విటీ పథకాల్లో ఇన్వెస్ట్ చేయడం. ఈ రెండు పద్దతుల ద్వారా 10 శాతం ఎల్‌టిసిజి భారం నుంచీ తప్పించుకోవచ్చు.

జామ్నా ఆటో ఇండస్ట్రీస్



ఆటోమొబైల్ రంగంలో వినియోగించే టాపర్డ్ లీఫ్ స్ప్రింగ్స్, పారబోలిక్స్, స్ప్రింగ్స్‌ను తయారు చేస్తున్న ప్రపంచంలో మూడో అతిపెద్ద కంపెనీ ఇది. భారత్‌లో అతిపెద్ద సంస్థ. దేశంలోకి తొలిసారిగా పారబోలిక్ స్ప్రింగ్స్‌ను ప్రవేశపెట్టిన కంపెనీ కూడా ఇదే. దేశీయంగా తొమ్మిది తయారీ కేంద్రాలను కలిగి ఉంది. ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీ (ఒఇఎం) మార్కెట్లో 64 శాతం వాటాను కలిగి ఉంది. మొత్తం 410 రకాల స్ప్రింగ్స్‌ను తయారు చేస్తున్నది. అనుబంధ కంపెనీ జై సస్పెన్షన్ సిస్టమ్స్ కూడా దేశీయ ఆఫ్టర్ మార్కెట్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నది. దేశవ్యాప్తంగా 390 పట్టణాల్లో మార్కెటింగ్ నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. విదేశీ మార్కెట్ల నుంచి రెవెన్యూ పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ప్రస్తుతం పారబోలిక్ స్ప్రింగ్స్ మార్కెట్లో 95 శాతం వాటాను, లీఫ్ స్ప్రింగ్స్ మార్కెట్లో 73 శాతం వాటాతో అగ్రగామిగా కొనసాగుతున్నది. నిర్వహణ లాభాల మార్జిన్లను ప్రస్తుతం ఉన్న 14.1 శాతం నుంచి 16 శాతానికి పైగా పెంచుకునేందుకు యాజమాన్యం ప్రణాళికలను సిద్ధం చేసింది. డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌తోపాటు గ్యారేజీలు, రీటెయిలర్స్‌తో ఒప్పందాలను కుదుర్చుకోవడం ద్వారా అమ్మకాలను పెంచుకుంటున్నది. ప్రపంచ ఆటో మోటివ్ లీఫ్ స్ప్రింగ్‌ల మార్కెట్ 2021 నాటికి 1,280 కోట్ల డాలర్లకు చేరుకుంటుందని అంచనా. అలాగే 2022వరకు ఏటా సగటున 10 శాతం చొప్పున (సిఎజిఆర్) వృద్ధి చెందుతుందని అంచనా. అగ్రగామి కంపెనీగా అవకాశాలను అందిపుచ్చుకోవడానికి కంపెనీ సంసిద్ధంగా ఉంది. గ్లోబల్ కంపెనీలైన దాల్మియర్, వోల్వోలకు సప్లయ్ చేయడానికిగాను హోసూర్‌లో కొత్త ప్లాంట్‌ను నెలకొల్పుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దాదాపు 6 శాతం మేర వాల్యూమ్స్ పెరుగుతాయని మేనేజ్‌మెంట్ అంచనా వేస్తోంది. 2019 ఆర్థిక సంవత్సరంనాటికి రుణ భారాన్ని పూర్తిగా తగ్గించుకోనుంది.



ఫండమెంటల్స్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఫలితాలను అంచనాకు మించి ప్రకటించింది. గత ఏడాదితో పోల్చితే రాబడి రూ.338.67 కోట్ల నుంచి 471.98 కోట్లకు పెరిగింది. నిర్వహణ లాభం రూ.43.95 కోట్ల నుంచి 63.16 కోట్లకు పెరిగింది. 48.65 శాతం వృద్ధితో నికర లాభం రూ.32.17 కోట్లకు చేరింది. రిటర్న్ ఆన్ ఈక్విటీ 31 శాతంతో పటిష్ఠంగా ఉంది. అలాగే డిసెంబరు త్రైమాసికంలో ఇపిఎస్ 49 శాతం మేర పెరిగింది. 2016 ఆర్థిక సంవత్సరానికి 1.80 రూపాయలున్న ఇపిఎస్ 2017లో 2.63 రూపాయలకు చేరుకుంది. సంవత్సరాంతానికి 4.35 రూపాయలకు చేరుకుంటుందని అంచనా. దీంతో ఇపిఎస్ రేటింగ్ గరిష్ఠంగా 93గా ఉంది. అలాగే విలియమ్ ఓనీల్ రిలేటివ్ ప్రైస్ స్ట్రెంథ్ 84గా ఉంది. డిసెంబరునాటికి ఈ షేరులో సంస్థాగత ఇన్వెస్టర్ల మదుపు గణనీయంగా పెరిగింది. మొత్తం సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 2016 డిసెంబరునాటికి 8.21 శాతంగా ఉండగా.. 2017 డిసెంబరునాటికి 11.68 శాతానికి చేరుకుంది. మ్యూచువల్ ఫండ్ల వాటా 5.43 శాతానికి పెరగ్గా.. ఎఫ్ఐఐల వాటా 4.49 శాతంగా ఉంది. క్యాన్ స్లిమ్‌లోని దాదాపు అన్ని అంశాలను కలిగి ఉంది.

టెక్నికల్స్

దాదాపు 15 నెలల కన్సాలిడేషన్ తర్వాత వచ్చిన బ్రేకవుట్‌తో గత ఏడాది కాలంలో నూరు శాతానికి పైగా రాబడిని ఇచ్చిన స్టాక్ ఇది. గత నెలలో 91.40 రూపాయల వద్ద జీవిత కాలపు గరిష్ఠ స్థాయిని ఏర్పాటు చేసిన తర్వాత ప్రస్తుతం రీట్రేస్‌మెంట్ జరుగుతోంది. 61.8 శాతం రీట్రేస్‌మెంట్ తర్వాత గత రెండు వారాలుగా కోలుకుని ప్రస్తుతం 50 డిఎంకు ఎగువనే క్లోజ్ అయింది. 200 డిఎంఎ స్థాయి గత నాలుగేళ్లగా గట్టి మద్దతు స్థాయిగా పని చేస్తోంది. ఆర్ఎస్ఐ ఇండికేటర్ 61కి ఎగువన బుల్లిష్ జోన్‌లో ఉంది. స్టోకాస్టిక్స్ ఆసిలేటర్‌లో ఇప్పటికే ఓవర్ సోల్డ్ నుంచి బయటపడుతూ కొనుగోలు సంకేతాలు అందుతున్నాయి. అయితే మార్కెట్ పరిస్థితులు బేరిష్‌గా మారినందున ఈ షేరుకు స్వల్ప మొత్తాలలో 65 రూపాయల నుంచి 77 రూపాయల స్థాయిల మధ్య అక్యుములేట్ చేయవచ్చు. స్వల్పకాలిక లక్ష్యం 92 రూపాయలు. వచ్చే ఏడాదిన్నర కాలంలో మరోసారి నూరు శాతం రాబడిని ఇవ్వగల సత్తా ఉన్న షేరు ఇది.

- టి బ్రహ్మాచారి
హెడ్, అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్స్,
హైదరాబాద్ చాప్టర్
tbchary@gmail.com

గమనిక : ఈ శీర్షికలో అందించే రికమండేషన్ల ఆధారంగా జరిపే లావాదేవీలకు ఇన్వెస్టర్లదే పూర్తి బాధ్యత. వారి లాభనష్టాలకు ఆంధ్రజ్యోతి పత్రిక, కాలమిస్ట్ ఎలాంటి బాధ్యత వహించరు. లావాదేవీలు చేపట్టే ముందు మీ వ్యక్తిగత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సలహా తీసుకోండి.

ఇన్వర్టెడ్ టాక్స్ స్ట్రక్చర్ అంటే?



గొండాల రాంబాబు

వస్తుసేవల పన్ను (జిఎస్‌టి)లో పన్ను చెల్లింపుదారునికి లభించే ముఖ్యమైన సదుపాయం ఏమిటంటే ముందు స్టేజిలో చెల్లించిన టాక్స్‌ను ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ కింద తీసుకోవడం. ఈ విధంగా తీసుకున్న క్రెడిట్‌ను తన అమ్మకాలకు సంబంధించి చెల్లించాల్సిన పన్నులో మినహాయించుకోవడం. తద్వారా తాను చెల్లించాల్సిన పన్ను భారం తగ్గిపోతుంది. అయితే కొన్ని సందర్భాల్లో ముడిపదార్థాలు లేదా తాను తీసుకునే ఇతర సేవలకు సంబంధించి చెల్లించే పన్ను శాతం తన అంతిమ ఉత్పత్తి మీద చెల్లించాల్సిన పన్ను శాతంకన్నా ఎక్కువగా ఉండటం వల్ల ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌లో బ్యాలెన్స్ మిగిలిపోతుంది.

ఉదాహరణకు.. ఒక పారిశ్రామికవేత్త ప్రతి నెలా ఒక కోటి రూపాయల మేర ముడిసరుకు కొనుగోలు చేస్తున్నాడు. దాని నుంచి వేరే ఉత్పత్తులు తయారు చేసి అమ్ముతున్నాడని అనుకుందాం. ముడిసరుకు ఖరీదు, జీత భత్యాలు, ఇతర ఖర్చులు, లాభం కలిపి తయారైన సరుకును నలభై శాతం అదనంగా అంటే కోటి నలభై లక్షల రూపాయలకు అమ్ముతున్నాడు. అతను కొనే ముడిసరుకు మీద పన్ను 12 శాతం ఉండగా.. అతని అంతిమ ఉత్పత్తి 5 శాతం పన్ను కింద ఉంది. అంటే అతను తీసుకునే ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ 12 లక్షల రూపాయలు కాగా (రూ.కోటి ముడిసరుకుపై 12 శాతం) అతను చెల్లించాల్సినది మాత్రం 7 లక్షల రూపాయలు మాత్రమే (రూ.కోటి నలభై లక్షలపై 5 శాతం). అతనికి ప్రతి నెలా 5 లక్షల రూపాయల వరకు ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ మిగిలిపోతుంది.



ఇలా మిగిలిన మొత్తాన్ని రిఫండ్ తీసుకోవడానికి జిఎస్‌టిలో ఒక సదుపాయం కల్పించారు. దీని ప్రకారం.. పన్ను చెల్లింపుదారుడు ఆన్‌లైన్ ద్వారా తన ఖాతాలోకి ఎంటర్ అయి తగు వివరాలు ఇవ్వడం ద్వారా సిస్టమ్ ఒక ప్రత్యేక ఫార్ములా ప్రకారం అతనికి ఎంత మేర రిఫండ్ వస్తుందో చూసి ఆ మేర ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను అతని అకౌంట్ నుంచి డెబిట్ చేస్తుంది. దీనికి గుర్తుగా ఒక ఎఆర్ఎన్ సంఖ్యను ఇస్తుంది. ఇప్పుడు రిఫండ్ కోరే వ్యక్తి ఆర్ఎఫ్‌డి 01 ఎ అనే అప్లికేషన్‌ను నింపి దానికి సిస్టమ్ జెనరేట్ చేసిన ఎఆర్ఎన్ సంఖ్య కలిగిన డాక్యుమెంట్, వారి క్రెడిట్ లెడ్జర్ నఖలు సంబంధిత వస్తుసేవల పన్ను అధికారికి అందజేయడం ద్వారా రిఫండ్ పొందవచ్చు. నిర్మాణరంగంలో ఉన్న వారితో పాటు మరికొంత మంది నోటిఫై చేసిన సరఫరాదారులకు ఈ సదుపాయం వర్తించదు.

గమనిక : ఈ వ్యాసాల ద్వారా ఇస్తున్న సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. పాఠకులు ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత చట్టాలు/నిబంధనలను కూలంకషంగా పరిశీలించాలి.

ఐఆర్‌సిటిసి బీమాతో రైలు ప్రయాణికులకు భరోసా

రైళ్లలో ప్రయాణిస్తున్నారా? అయితే ఆ టిక్కెట్లను ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్‌లోనే కొనుగోలు చేయడం మంచిది. టిక్కెట్‌తోపాటు మీ జీవితానికీ రైల్వే శాఖ బీమాతో ధీమా కల్పిస్తోంది. సెప్టెంబరు 1, 2016 నుంచి ఐఆర్‌సిటిసి ఐచ్చిక ప్రయాణ బీమా పథకం (ఒటిఐఎస్) పేరుతో ఐఆర్‌టిసి ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ప్రారంభంలో ఐఆర్‌టిసి ఇందుకోసం ఒక్కో ప్రయాణికుడి నుంచి 92 పైసలు వసూలు చేసేది. డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా డిసెంబరు 12, 2016 నుంచి ఉచితంగానే రైల్వే ప్రయాణికులకు ఈ బీమా సౌకర్యం కల్పిస్తున్నారు.

ఈ బీమా పథకం ముఖ్యాంశాలు.

- ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న కన్‌ఫర్మ్‌డ్, ఆర్ఎసి టికెట్లకు మాత్రమే ఈ బీమా సౌకర్యం వర్తిస్తుంది.
- ప్రయాణ సమయంలో ప్రయాణికుడు ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.10 లక్షలు చెల్లిస్తారు.
- ప్రయాణ సమయంలో తలెత్తే ప్రమాదాలతో శాశ్వత అంగవైకల్యం ఏర్పడినా రూ.10 లక్షలు చెల్లిస్తారు.
- పాక్షిక అంగవైకల్యం ఏర్పడితే రూ.7.5 లక్షలు పరిహారంగా ఇస్తారు.
- గాయాల పాలై ఆస్పత్రిలో చేరితే ఆస్పత్రి ఖర్చుల కింద రూ.2 లక్షలు లభిస్తాయి.
- చనిపోతే మృతదేహాన్ని స్వస్థలానికి తరలించేందుకు రూ.10,000 ఇస్తారు.
- రైలు ఎక్కేటపుడు, రైల్లో ఉన్నపుడు, రైలు దిగేటప్పుడు ఏర్పడే ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలకు మాత్రమే ఈ బీమా వర్తిస్తుంది.

ఎస్‌బిఐ ఎంఎఫ్ 'బంధన్ ఎస్‌డబ్ల్యుపి'

ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్ (ఎస్‌బిఐ ఎంఎఫ్) సంస్థ ఇన్వెస్టర్ల కోసం కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. 'బంధన్ ఎస్‌డబ్ల్యుపి' పేరుతో ప్రవేశ పెట్టిన ఈ సదుపాయాన్ని సంస్థ ఓపెన్ ఎండెడ్ పథకాల గ్రోత్ ఆప్షన్ ఇన్వెస్టర్లు ఎవరైనా ఉపయోగించుకోవచ్చు. ఈ ఆప్షన్ ద్వారా ఇన్వెస్టర్లు పథకాల్లోని తమ పెట్టుబడుల నుంచి నెల నెలా కనీసం రూ.12,000 చొప్పున తమ కుటుంబ సభ్యులకు బదిలీ చేసుకోవచ్చు. విదేశాల్లో ఉండే కుటుంబ సభ్యులకు మాత్రం ఈ సదుపాయం వర్తించదు. ఇప్పటికే డివిడెండ్, రీఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్స్‌లో ఉన్న ఇన్వెస్టర్లు కూడా గ్రోత్ ఆప్షన్‌కు మారడం ద్వారా బంధన్ ఎస్‌డబ్ల్యుపి సదుపాయం పొందవచ్చు. పన్నుల భారం లేకుండా ఇన్వెస్టర్ల కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ఈ సదుపాయం ప్రవేశపెట్టారు.


ఫ్యూచర్ జనరలి 'హార్ట్ అండ్ హెల్త్ ప్లాన్'

ఫ్యూచర్ జనరలి ఇండియా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ మరో సమగ్ర ఆరోగ్య బీమా పాలసీ ప్రారంభించింది. 'హార్ట్ అండ్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్' పేరుతో ప్రారంభించిన ఈ పాలసీ ద్వారా 59 రకాల హృద్రోగాలు, కేన్సర్లు, ఇతర ఆరోగ్య సమస్యలకు బీమా రక్షణ లభిస్తుంది. 18 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్కులు ఎవరైనా ఈ పాలసీ తీసుకోవచ్చు. 76 సంవత్సరాల వయసు వరకు ఈ పాలసీ ద్వారా బీమా రక్షణ లభిస్తుందని కంపెనీ తెలిపింది. వయసును బట్టి 10, 15, 20, 25, 30 సంవత్సరాల కాల పరిమితితో చెల్లించే ప్రీమియాన్ని బట్టి రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఆరోగ్య బీమా లభిస్తుంది. పాలసీ తీసుకునేటప్పుడే ఎక్స్‌క్లూజివ్ హార్ట్ కవర్, ప్రీమియం తిరిగి చెల్లించే హార్ట్ కవర్, క్రిటికల్ ఇల్‌నెస్ కవర్ లేదా ప్రీమియం చెల్లింపు ఆప్షన్ ఉండే క్రిటికల్ ఇల్‌నెస్ కవర్ ఎంచుకోవచ్చని తెలిపింది.

వచ్చే ఏడాది 8 పిఎస్‌యు ఇష్యూలు

న్యూఢిల్లీ : హిందుస్తాన్ ఏరోనాటిక్స్, రైట్స్ సహా ఎనిమిది ప్రభుత్వ రంగ సంస్థలు రానున్న ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా మార్కెట్ తలుపులు తట్టనున్నాయి. పిఎ్‌సయుల వాస్తవ విలువను వెలికి తీసుకురావడంతోపాటు వాటిని మరింత బాధ్యతాయుతంగా పని చేయించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వాటిని స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేయాలని భావిస్తోంది. నిధుల పరిణామాన్ని బట్టి ఈ ఇష్యూలన్నింటినీ దశలవారీగా విడుదల చేస్తామని దీపమ్ కార్యదర్శి నీరజ్ గుప్తా తెలిపారు. హెచ్ఏఎల్ ఇష్యూ జారీకి ఇప్పటికే సెబి అనుమతి సాధించిందని, రక్షణ రంగానికి చెందిన ఈ పిఎస్‌యులో ప్రభుత్వం 10 శాతం వాటాలు విక్రయించబోతున్నదని ఆయన చెప్పారు. రైట్స్, ఇరెడా, భారత్ డైనమిక్స్, మిధాని కూడా దరఖాస్తులు చేశాయన్నారు.

ప్రపంచ ఐటి సదస్సుకు రంగం సిద్ధం



WCIT Hyderabad INDIA 2018 World Congress on Information Technology

హైదరాబాద్ వేదికగా మరో అంతర్జాతీయ కార్యక్రమం.. శ్రీలంక ప్రధాని, 30 దేశాల నుంచి 500 మంది ప్రతినిధుల రాక

▸▸ **మూడు రోజులు సందడే సందడి**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదిక కానుంది. గత నవంబరులో ప్రపంచ ఎంటర్‌ప్రెన్యూర్ల సదస్సు విజయవంతంగా నిర్వహించి మూడు నెలలైనా ముగియక ముందే మరో భారీ అంతర్జాతీయ సదస్సు ఇక్కడ జరుగుతోంది. సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు (18-21 తేదీలు) ప్రపంచ సమాచార సాంకేతిక పరిజ్ఞాన సదస్సు, నాస్కామ్ ఇండియా లీడర్‌షిప్ ఫోరమ్ (డబ్ల్యుసిఐటి-ఎన్ఐఎల్ఎఫ్) సమావేశాలు హైదరాబాద్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో (నోవాటెల్ హోటల్) జరుగనున్నాయి. ఇప్పటికే జిఇఎస్‌ను ఎంతో విజయవంతంగా నిర్వహించిన ఘనత సంపాదించుకున్న తెలంగాణ ప్రభుత్వం ఐటి మంత్రి కెటిఆర్ సారథ్యంలో ఈ సదస్సుకు ఆతిథ్యం వహిస్తోంది. శ్రీలంక ప్రధానితోపాటు కెనడా, అమెరికా, మెక్సికో, బ్రెజిల్, నైజీరియా, దక్షిణాఫ్రికా, తైవాన్, ఆర్మీనియా నుంచి 500 మంది వరకు ప్రతినిధులు వస్తున్న ఈ సదస్సును ప్రధాని నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రారంభోపన్యాసం చేస్తారు. కేంద్ర ఐటి శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

ఆయనతో పాటు కెటిఆర్, ఇతర ప్రముఖులు వేదికపై ఆసీనులవుతారు. ప్రధాని ప్రసంగం అనంతరం డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో పాలనా విధానాలపై పునరాలోచన అనే అంశంపై మంత్రుల రౌండ్‌టేబుల్ సమావేశానికి రవిశంకర్ ప్రసాద్ అధ్యక్షత వహిస్తారు. "డిజిటల్ విస్తరణ-కొత్త బాటలో పయనం" ఈ ఏడాది జరిగే డబ్ల్యుసిఐటి ప్రధాన థీమ్. దీనికి అనుగుణంగానే మూడు రోజుల ఈ సదస్సులో 22 సెషన్లలో ప్రతినిధులు కొత్త టెక్నాలజీలు, ప్రధాన ధోరణులపై సమూలంగా చర్చిస్తారు.

డబ్ల్యుసిఐటితో సమాంతరంగా నాస్కామ్ ఇండియా లీడర్‌షిప్ సదస్సు కూడా నిర్వహిస్తున్నారు. ఈ సదస్సు ఇంతవరకు ముంబైలోనే జరుగుతుండగా తొలిసారిగా ఆ నగరానికి వెలుపల హైదరాబాద్ వేదికగా జరుగుతోంది. ఐటి రంగానికి చెందిన దిగ్గజాలందరూ దీనికి హాజరై కొంగొత్త ఆలోచనలను పరస్పరం పంచుకుంటూ ఐటి ప్రపంచంలో తదుపరి పెద్ద మార్పు ఏది అనే అంశం ఆమూలాగ్రంగా చర్చిస్తారు. ఎన్ఐఎల్ఎఫ్‌కు రెండు వేల మంది వరకు ప్రతినిధులు హాజరవుతున్నారు. పరిశ్రమకు చెందిన ప్రముఖులతో పాటు తమ ప్రసంగాలతో ప్రపంచాన్ని ప్రభావితం చేసే వారు, టెక్నాలజీ ఆరాధకులు కూడా ఈ సమావేశాల్లో పాల్గొంటారు. కొత్త టెక్నాలజీలు, వర్చువల్ రియాల్టీ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, నాలుగో పారిశ్రామిక విప్లవం, డిజిటల్ ప్రపంచ వాస్తవాలకు దీటుగా నైపుణ్యాల వృద్ధి, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ-నియంత్రణలు, డేటా విప్లవ ప్రపంచంలో గోప్యతాపరమైన అంశాలు వంటి భిన్న అంశాలపై డబ్ల్యుసిఐటి-ఎన్ఐఎల్ ఎఫ్ విస్తృతంగా చర్చిస్తాయి. ఈ సదస్సుకు హాజరవుతున్న ప్రముఖుల్లో జగ్గీ వాసుదేవ్ సద్గురు, పుల్లెల గోపీచంద్ కూడా ఉన్నారు.

అమెజాన్ @ 3 లక్షలు

న్యూఢిల్లీ :ఇ-కామర్స్ దిగ్గజం భారత్‌లో మూడు లక్షల మంది విక్రేతల మైలురాయిని దాటింది. భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన ఐదేళ్ల వ్యవధిలోనే ఈ మైలురాయిని చేరింది. విక్రేతలు, కస్టమర్ల సంఖ్య పెంచుకోవడంపై అమెజాన్ వందల కోట్ల డాలర్లు ఖర్చు చేస్తోంది. తాము భారత్‌లోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన నవ్యతల ప్రభావమే నానాటికీ విక్రేతలు అధిక సంఖ్యలో ఆకర్షితులవుతున్నారని అమెజాన్ ఇండియా డైరెక్టర్ గోపాల్ పిళ్లై అన్నారు.

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	72.00	విజయవాడ	77.00
కరీంనగర్	73.00	గుంటూరు	77.00
వరంగల్	74.00	ఒంగోలు	79.00
మహబూబ్‌నగర్	72.00	చిత్తూరు	75.00
కర్నూలు	72.00	నెల్లూరు	75.00
విశాఖపట్నం	73.00	అనంతపురం	75.00
గోదావరి	76.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.40 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	380.00	చిత్తూరు	408.00
వరంగల్	382.00	చెన్నై	415.00
విజయవాడ	383.00	నమక్కల్	395.00
గోదావరి	383.00	బెంగళూరు	405.00
విశాఖపట్నం	385.00	ముంబై	425.00

రూ. 60 వేల కోట్లతో
డిజిటల్ పారిశ్రామిక వాడ

▸▸ **అంతర్జాతీయ కంపెనీలతో ఆర్ఐఎల్ జట్టు**

▸▸ **మహారాష్ట్ర పెట్టుబడుల సదస్సులో అంబానీ ప్రకటన**

ముంబై : మహారాష్ట్రలో 60 వేల కోట్ల రూపాయలతో దేశంలోని తొలి ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఏరియాను నెలకొల్పనున్నట్టు పారిశ్రామిక దిగ్గజం ముకేశ్ అంబానీ ప్రకటించారు. ప్రపంచంలోని ఇతర భాగస్వాములతో కలిసి ఆర్ఐఎల్ దీన్ని నెలకొల్పుతుందని మహారాష్ట్ర పెట్టుబడిదారుల సదస్సులో మాట్లాడుతూ ఆయన చెప్పారు. వచ్చే పదేళ్ల కాలంలో దీని ఏర్పాటు పూర్తవుతుందంటూ అది దేశంలోనే తొలి సమీకృత డిజిటల్ ఏరియాగా నిలుస్తుందని తెలిపారు. అయితే ఎక్కడ దీన్ని ఏర్పాటు చేసేది, ఇంత భారీ పెట్టుబడి ప్రణాళిక తొలి దశ ఎప్పుడు అన్న విషయాలేవీ ఆయన ప్రకటించలేదు. ఈ ప్రాజెక్టులో భాగస్వామి అయ్యేందుకు ఆర్ఐఎల్‌కు అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాల నుంచి అద్భుతమైన మద్దతు లభించిందని అంబానీ చెప్పారు. సిస్కో, సీమెన్స్, హెచ్‌పి, డెల్, నోకియా, ఎన్ విడియా సహా 20కి పైగా గ్లోబల్ కంపెనీలు తమతో ఆ ప్రాజెక్టులో ఇన్వెస్ట్ చేయడానికి వారాల వ్యవధిలోనే అంగీకారం ప్రకటించాయని ఆయన తెలిపారు. తయారీ రంగం విప్లవంలో చైనా ఏ విధంగా ముందువరుసలో నిలిచిందో సేవల రంగం కేంద్రంగా చోటు చేసుకునే నాలుగో పారిశ్రామిక విప్లవంలో భారత్ ముందువరుసలో నిలవడం అంతే వాస్తవమని ఆయన అన్నారు.



సదస్సులో రతన్ టాటాతో ముకేశ్ అంబానీ

ఈ వారం పరిధి కీలకం

(ఫిబ్రవరి 19-23 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ : 10452 (-3)

నిఫ్టీ గత వారం 10618-10434 నడుమ సంచరించి కేవలం 3 పాయింట్ల నష్టంతో 10452 వద్ద ముగిసింది. వరుసగా మూడు వారాలు నష్టాలతో ముగిసినందు వల్ల ఈ వారం ఎగువకు పయనించే ఆస్కారం ఉంది. మంగళవారం నాటి కదలిక ఆధారంగా ఏర్పడే పరిధి వచ్చే మూడు వారాలకు కీలకం.

- స్వల్పకాలిక ట్రెండ్ చాలా బేరిష్‌గా మారింది. మధ్యకాలిక ధోరణిలో బుల్లిష్‌గాను, దీర్ఘకాలిక ధోరణిలో మరింత బుల్లిష్‌గాను ఉంది. 10650 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలంలో కూడా బుల్లిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10781, 10591, 10387, 10067 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ 100, 200 డిఎంఎలకన్నా పైన ట్రేడవుతోంది. నిఫ్టీ 200 డిఎంఎకన్నా పైన ఉండడం 50 డిఎంఎ 200 డిఎంఎకన్నా పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 10650
బ్రేక్‌డౌన్ స్థాయి : 10200

నిరోధ స్థాయిలు : 10600, 10675, 10750 (10525 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 10300, 10225, 10150 (10375 దిగువన బేరిష్)

ఆస్ట్రో గైడ్

సాధారణ నిస్తేజం (సోమవారానికి)

తిథి : ఫాల్గుణ శుద్ధ చతుర్థి నక్షత్రం : ఉత్తరాభాద్ర, రేవతి

భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, మీన, కర్కాటక రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 1.00; 1.36

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడగా ప్రారంభమై 11.45 నుంచి చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 11.45 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి)కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 3 గంటల సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధ స్థాయిలు : 10490, 10525

మద్దతు స్థాయిలు : 10405, 10370

రూ.10 లక్షల కోట్లలో
బ్యాంకులకు దక్కేదెంత?

ఎగవేతల్లో నాలుగోవంతు మాత్రమే రికవరీ?
భారీ ఎత్తున రైటాఫ్‌లకు బ్యాంకులు సిద్ధం కావాల్సిందే?
భవిష్యత్తుపై పిఎస్‌యు బ్యాంకుల ఆందోళన



బ్యాంకింగ్ రంగంలో పేరుకుపోయిన బకాయిల మొత్తం సుమారు 10 లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. ఇందులో బడా కార్పొరేట్ సంస్థల వాటానే అత్యధిక శాతం. ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరించడానికి సిద్ధపడి, బ్యాంకులూ సకలశక్తులను ఉపయోగించి ఈ బకాయిల వసూలుకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటే నికరంగా ఎంత వెనక్కి వస్తుందో చెప్పలేని పరిస్థితి. ప్రస్తుతం ఉన్న అనుభవాల ప్రకారం చూస్తే 30-40 శాతం కంటే ఎక్కువ వసూలు కాకపోవచ్చని నిపుణులు అంటున్నారు. అంటే 10 లక్షల కోట్ల రూపాయల మొండిపద్దుల్లో కనీసం 6-7 లక్షల కోట్ల రూపాయలపై బ్యాంకులు ఆశలు చాలించుకోవాల్సిందే. అంటే మొండిపద్దుల సమస్యను పరిష్కరించినా బ్యాంకుల కష్టాలు మాత్రం తొలగవు. వందల కోట్ల రూపాయల రుణాలను బ్యాంకులు రైటాఫ్ చేయాల్సి వస్తుంది. అందుకే ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ వంటి వారు బ్యాంకులను ప్రైవేట్ పరం చేయమని సలహా ఇస్తున్నారు.

13 ఏళ్లలో పది రెట్లు పెరిగిన మొండిపద్దులు

భారీ ఎత్తున రుణాల ఎగవేతలు, మరోవైపు ఘరానా దోపిడీలు.. దేశీయ బ్యాంకింగ్ రంగాన్ని నిర్జీవంగా మారుస్తున్నాయి. ఆర్‌బిఐ డేటా ఆధారంగా 2004లో బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రకటించిన నివేదిక ప్రకారం మొండిపద్దుల మొత్తం లక్ష కోట్ల రూపాయల లోపే ఉంది. గతేడాది జూన్‌నాటికి ఈ మొత్తం 9.5 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. ఇప్పుడు 10 లక్షల కోట్ల రూపాయలు దాటి ఉంటుందని అంచనా. అంటే సుమారు 13-14 ఏళ్ల కాలంలోనే మొండిపద్దుల మొత్తం పది రెట్లు పెరిగిందన్నమాట. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు, అక్రమమార్గాల్లో కొల్లగొట్టిన మొత్తాలతో వ్యాపారులు, కంపెనీల ప్రమోటర్లు, వారి కుటుంబ సభ్యులు కోటీశ్వరులయ్యారు. విదేశాల్లోనూ ఆస్తులు పోగేసుకున్నారు. వారితో చేతులు కలిపిన బ్యాంకు ఉద్యోగులు సొంత ఆస్తులు కూడబెట్టుకున్నారు. రాజకీయ నాయకులు లబ్ధిపొందారు. బ్యాంకులు మాత్రం బక్కచిక్కిపోయాయి. కోట్లాది మంది ప్రజల సొమ్ము ప్రమాదంలో పడింది.

30 శాతం కూడా వసూలు కాలేదు

బ్యాంకు రుణాల వసూళ్ల విషయంలో కఠినంగా వ్యవహరించడానికి వీలుగా ప్రభుత్వం 2016లో దివాలా చట్టాల కోడ్ (ఐబిసి)ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం కింద నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్స్‌లో కేసులు దాఖలు చేసి బకాయిల వసూళ్లకు బ్యాంకులు చర్యలు తీసుకుంటున్నాయి. ఐబిసి అమల్లోకి వచ్చిన తర్వాత దాదాపు 540 కార్పొరేట్ సంస్థల రుణబకాయి కేసులను కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ (సిఐఆర్‌పి) కింద చేపట్టారు. ఇందులో పది కేసులు మాత్రమే 2017 డిసెంబరునాటికి పరిష్కారమయ్యాయి. ఈ 10 కంపెనీల బకాయిల మొత్తం 5,500 కోట్ల రూపాయలుండగా అందులో బ్యాంకులు నికరంగా 1,800 కోట్ల రూపాయలను మాత్రమే వసూలు చేసుకోగలిగాయి. తాకట్టుగా పెట్టిన ఆస్తులు ఇతర సెక్యూరిటీలను విక్రయించగా లభించిన మొత్తం ఇంతే. అంటే దాదాపు 3,700 కోట్ల రూపాయలు బ్యాంకులు నష్టపోయినట్టే. మొత్తం బకాయిల్లో 32 శాతం మాత్రమే వసూలైంది. తెలంగాణకు చెందిన కామినేని స్టీల్ అండ్ పవర్ బకాయిల మొత్తం దాదాపు 1,500 కోట్ల రూపాయలుండగా రెజల్యూషన్‌కు వెళ్లిన బ్యాంకులు కేవలం 600 కోట్ల రూపాయలు మాత్రమే రాబట్టుకోగలిగాయి. మరో కంపెనీ శ్రీ మెటాలిక్ బకాయిల్లో 7 శాతం కూడా వసూలు కాలేదు. ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకుంటే మొత్తం 5 లక్షల కోట్ల రూపాయల విలువైన మొండిపద్దులను సిఐఆర్‌పి ప్రకారం పరిష్కరించడానికి అవకాశం ఉంది. ఈ 5 లక్షల కోట్ల రూపాయల్లో 1.5 లక్షల కోట్ల రూపాయల నుంచి 2 లక్షల కోట్ల రూపాయలలోపే వసూలుకావచ్చని అంచనా. అంటే బ్యాంకుల నెత్తిన భారీ రైటాఫ్‌ల భారం పడుతుందన్నమాట.

12 మంది బడా డిఫాల్టర్లు

బ్యాంకుల పద్దుల్లో భారీ ఎత్తున మొండిబకాయిలున్న 12 కంపెనీలపై దివాలా చట్టాల కింద చర్యకు ఆర్‌బిఐ ఆదేశించింది. మొత్తం మొండిబకాయిల్లో ఈ 12 కంపెనీల వాటానే 25 శాతం ఉంటుందని అంచనా. ఈ 12 కంపెనీల తర్వాత దివాలా చట్టాల కింద చర్యలకు మరో 28 కంపెనీలతో రెండో జాబితా కూడా ఆర్‌బిఐ సిద్ధం చేసింది. ఈ జాబితాలోని 25 కంపెనీలపై బ్యాంకులు దివాలా చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నాయి. మూడు కంపెనీల విషయంలో మాత్రం ఎన్‌సిఎల్‌టి ఆవల పరిష్కారానికి వెసులుబాటు ఇవ్వాలని నిర్ణయించాయి. రెండో జాబితాలో ఆర్‌బిఐ పేర్కొన్న 28 కంపెనీల ఉమ్మడి రుణాల విలువ 2 లక్షల కోట్ల రూపాయలుంటుందని అంచనా.

కంపెనీలను కలిపేయండి

చాలా సంస్థలకు అనుబంధ సంస్థలుంటాయి. ప్రధాన కంపెనీ లాభాల్లో ఉంటే కొన్ని అనుబంధ కంపెనీలు భారీ రుణభారం, నష్టాలతో సతమతమవుతుంటాయి. ఈ కంపెనీల ప్రమోటర్లు, ప్రధాన ఇన్వెస్టర్లు ఒకరే. రుణాలు ఎగవేసిన కంపెనీపై బ్యాంకులు, ఆర్థిక సంస్థలు చర్యలు తీసుకున్నా ప్రమోటర్లకు చెందిన ఇతర కంపెనీలకు వచ్చే నష్టం ఏమీ లేదు. ఈ నేపథ్యంలోనే గ్రూప్ కంపెనీలను కలిపేయాలన్న సూచన కొందరు నిపుణుల నుంచి వస్తోంది. ఇన్‌ఫ్రా రంగంలోని ప్రముఖ కంపెనీలైన జిఎంఆర్, జివికెవంటి సంస్థల్లోనూ భారీ ఎత్తున అప్పులున్న అనుబంధ కంపెనీలున్నాయి. అలాంటి వాటిని ప్రధాన కంపెనీలతో విలీనం చేస్తే బ్యాంకుల రుణబకాయిల వసూలు తేలికవుతుందని నిపుణుల అభిప్రాయం. కొంతకాలం క్రితం ప్రభుత్వం దివాలా తీసిన నేషనల్ స్పాట్ ఎక్స్ఛేంజీని దాని ప్రమోటింగ్ సంస్థ ఫైనాన్షియల్ టెక్నాలజీస్‌లో విలీనానికి తీసుకున్న చర్యను ఈ సందర్భంగా నిపుణులు గుర్తు చేస్తున్నారు.

ఆర్‌బిఐ సూచనల మేరకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)లో బ్యాంకులు కేసులు దాఖలు చేసిన తొలి 12 కంపెనీలు.. వాటి బకాయిల వివరాలు...

భూషణ్ స్టీల్: భూషణ్ స్టీల్ ఎగవేసిన రుణాల మొత్తం 44,478 కోట్ల రూపాయలు. భూషణ్ స్టీల్ అనుబంధ కంపెనీ భూషణ్ పవర్ అండ్ స్టీల్ కూడా 37,248 కోట్ల రూపాయల రుణాల ఎగవేతకు పాల్పడింది. అంటే కేవలం ఈ ఒక్క గ్రూప్ బకాయిల మొత్తమే 81,726 కోట్ల రూపాయలు.
లాంకో ఇన్‌ఫ్రాటెక్: లాంకో రుణ బకాయిల మొత్తం 44,364 కోట్ల రూపాయలు.
ఎస్సార్ స్టీల్: రుణాల ఎగవేత మొత్తం 37,284 కోట్ల రూపాయలు.
అలోక్ ఇండస్ట్రీస్: టెక్స్‌టైల్స్ రంగంలోని అలోక్ ఇండస్ట్రీస్ రుణ బకాయిల మొత్తం 22,075 కోట్ల రూపాయలు.
ఆమ్‌టెక్ ఆటో: ఈ సంస్థ 14,074 కోట్ల రూపాయలు ఎగవేసింది.
మోనెట్ ఇస్పాత్ అండ్ ఎనర్జీ: ఈ సంస్థ బకాయిల మొత్తం 12,115 కోట్ల రూపాయలు.
ఎలక్ట్రోస్టీల్: రుణాల ఎగవేత మొత్తం 10,273 కోట్ల రూపాయలు.
ఎరా ఇన్‌ఫ్రా: ఎరా ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ ఎగవేతల మొత్తం 10,065 కోట్ల రూపాయలు.
జేపీ ఇన్‌ఫ్రాటెక్: ఈ సంస్థ బకాయిల మొత్తం 9,365 కోట్ల రూపాయలు. ఈ గ్రూప్‌లో భారీ బకాయిలున్న సంస్థలున్నాయి.
ఎబిజి షిప్‌యార్డ్: బకాయిల మొత్తం 6,953 కోట్ల రూపాయలు.
జ్యోతి స్ట్రక్చర్స్: సుమారు 5,165 కోట్ల రూపాయలు.

రెండో జాబితాలోని కొందరు డిఫాల్టర్ల వారి బకాయిలు

వీడియోకాన్ ఇండస్ట్రీస్, వీడియోకాన్ కమ్యూనికేషన్స్: 22,000 కోట్ల రూపాయలు
జయస్వాల్ నికో ఇండస్ట్రీస్: 3,853 కోట్ల రూపాయలు
ఐవిఆర్‌సిఎల్: 7,121 కోట్ల రూపాయలు. ఇప్పటికే ఎన్‌సిఎల్‌టిలో కేసు నమోదైంది.
రుచి సోయా: 5,922 కోట్ల రూపాయలు
ఎస్ఇఎల్ మాన్యుఫాక్చరింగ్: 4,793 కోట్ల రూపాయలు
ఆర్చిడ్ ఫార్మా: 2756 కోట్ల రూపాయలు
కాస్టెక్స్ టెక్నాలజీస్: 1302 కోట్ల రూపాయలు

ఈ జాబితాలో ఇంకా వీసా స్టీల్, జై బాలాజీ ఇండస్ట్రీస్, ఉత్తమ్ గాల్వా స్టీల్స్, ఉత్తమ్ గాల్వా మెటాలిక్స్, కోస్టల్ ప్రాజెక్ట్స్ ఉన్నాయి. కోస్టల్ ప్రాజెక్ట్స్‌కు సంబంధించి 975 కోట్ల రూపాయల బకాయి కోసం ఇప్పటికే ఎస్‌బిఐ కోల్‌కతాలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో కేసు నమోదు చేసింది.

కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రెజల్యూషన్ కింద పరిష్కరించిన 10 రుణ కేసుల్లోని బకాయిలు, వసూలైన మొత్తాలు

కంపెనీ	రావాల్సిన మొత్తం (రూ.కోట్లలో)	రాబట్టుకున్న మొత్తం (రూ.కోట్లలో)	వసూలైన మొత్తం శాతంలో
సినర్జీస్ దూరే ఆటోమోటివ్	972.15	54	5.63
చాపరియా ఇండస్ట్రీస్	49.75	20.6	41.41
ప్రోవెస్ ఇంటర్నేషనల్	3.42	3.42	100
శ్రీమెటాలిక్	1287.2	607.3	7.18
వెస్ట్‌బెంగాల్ ఎసెన్షియల్ కమోడిటీస్ సప్లయ్ కార్పొరేషన్	359.15	18.5	51.74
కామినేని స్టీల్ అండ్ పవర్	1508.88	600	39.76
షిర్డీ ఇండస్ట్రీస్	673.88	176.3	26.16
హోటల్ గౌదవన్	70.84	44.21	62.41
నందన్ హోటల్స్	1.38	--	--
జెఇకెపిఎల్	599	162	27.05

బ్రోకర్లతో వజ్ర వ్యాపారుల చెట్టపట్టాల్

▸▸ **ఉల్లంఘనలపై వివరాలు సేకరిస్తున్న సెబి**



న్యూఢిల్లీ : వజ్రాభరణాలు అంటే నిన్న మొన్నటి వరకు మహిళలు అమితంగా ఇష్టపడతారని మాత్రమే అందరికీ తెలుసు. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ దెబ్బతో ఇప్పుడు అవే వజ్రాలు, వజ్రాభరణాలు అక్రమాలతో కోట్లు పోగేసే కేటుగాళ్లకూ మారుపేరుగా మారాయి. వీరి అక్రమాలు స్టాక్ మార్కెట్‌కూ విస్తరించాయని వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో స్టాక్ మార్కెట్ బ్రోకర్లు-వజ్రాల వ్యాపారుల మధ్య ఉన్న సంబంధాలపై సెబి కూపీ లాగుతోంది. ఈ మొత్తం బాగోతంలో పిఎన్‌బి పాత్రపైనా సెబి వివరాలు సేకరిస్తోంది. పిఎన్‌బి కుంభకోణం బయటి పడిన వెంటనే మిగతా బ్యాంకులూ అప్రమత్తమయ్యాయి వజ్రాలు, ఆభరణాల వ్యాపారంతో సంబంధం ఉన్న తమ ఖాతాదారులందరి ఆర్థిక లావాదేవీలపై ఓ కన్నేసినట్టు సమాచారం. మరోవైపు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన కంపెనీల వ్యవహారాల శాఖ (ఎంసిఎ) కూడా మోదీ, చోక్సీకి చెందిన రిజిస్టర్డ్ కంపెనీల విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ కంపెనీలు, వాటి డైరెక్టర్లు సమర్పించిన ఫైళ్లను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి.

రూ.18,000 కోట్ల మోసం!

పిఎన్‌బి నుంచి మోదీ, చోక్సీ కంపెనీలు అక్రమంగా పొందిన ఎల్ఓయుల విలువే రూ.11,300 కోట్లు ఉంది. మిగతా బ్యాంకుల విషయం కూడా బయట పడితే ఇది ఎంత లేదన్నా రూ.18,000 కోట్ల వరకు ఉంటుందని అంచనాలు వినిపిస్తున్నాయి. వజ్రాల పరిశ్రమ అక్రమ నగదు లావాదేవీలకు అడ్డాగా మారిందని ఎప్పటి నుంచో ఆరోపణలు వినిపిస్తున్నాయి. వజ్రాల విలువ మదింపు చేయడం కష్టంగా ఉండడం ఇందుకు ప్రధాన కారణం. రుణాలు మంజూరు చేసేటపుడు బ్యాంకులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఈ రంగానికి చెందిన అనేక కంపెనీలు బ్యాంకులు నెత్తిన ఇప్పటికే టోపీ పెట్టాయి. నీరవ్ మోదీ, గీతాంజలి గ్రూపు ప్రమోటర్ చోక్సీల మోసం ఇపుడు వాటన్నిటిని మించి పోయింది.

బ్యాంకులపై ప్రభుత్వ పెత్తనం వద్దు : అసోచామ్

మరోవైపు ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకు(పిఎస్‌బి)ల ఈక్విటీలో ప్రభుత్వ వాటాను 50 శాతానికంటే తక్కువకు కుదించాలని అసోచామ్ ప్రభుత్వాన్ని కోరింది. అపుడే బ్యాంకులపై ప్రభుత్వ అధికారుల పెత్తనం తగ్గి బ్యాంకులు అసలైన బ్యాంకింగ్ కార్యకలాపాలపై దృష్టి పడతాయని పేర్కొంది. దాంతో బ్యాంకు ఉద్యోగుల్లో జవాబుదారీతనం, చేసే పనుల్లో పారదర్శకత ఏర్పడుతుందని స్పష్టం చేసింది.

ఎర్రజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు?

▸ నిజామాబాద్ జిల్లాలో స్థల పరిశీలన

ఆర్మూర్, ఫిబ్రవరి 18 : రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా సోమవారం నుంచి ఎర్రజొన్నల కొనుగోలుకు నిర్ణయించడంతో ఆదివారం మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులు నిజామాబాద్ జిల్లాలోని పలుచోట్ల కేంద్రాల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో, వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద 63వ నెంబర్ జాతీయ రహదారి సమీపంలో, కమ్మర్‌పల్లి మార్కెట్ యార్డ్‌లో, బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ సబ్ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు నిర్ణయించారు. కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. ఇందుకు అవసరమై తూకాలు, చెన్ని మిషన్‌లు, తేమ శాతం గుర్తించే పరికరాలను, గన్నీ బ్యాగులు, తాటిపత్రాలను సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. రైతులకు సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. స్థానిక వీఆర్వో, ఏఈవోల ధ్రువీకరణ అనంతరం పర్మిట్లు పొందిన రైతుల ఎర్రజొన్నలు మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. ఎర్రజొన్నలను బాగా ఎండబెట్టి, తేమ శాతం 12 మించకుండా చూసుకోవాలన్నారు. పంటకు సంబంధించిన పూర్తి వివరాలు, బ్యాంక్ పాసు బుక్కు, పట్టేదార్ పాసు పుస్తకం, ధ్రువీకరణ పత్రాలతో రావాలన్నారు. తూకం వేయించిన 10 రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని వారు తెలిపారు.

నిజాం షుగర్స్ కథ కంచికేనా?

లేఆఫ్ ప్రకటించిన యాజమాన్యం.. రెండేళ్లుగా కార్మికులకు అందని వేతనాలు

▸ ఉపాధి లేక రోడ్డున పడ్డ ఉద్యోగులు

▸ రక్షణ కమిటీ ఆధ్వర్యంలో మళ్లీ దీక్షలు

▸ పట్టించుకోని ప్రజాప్రతినిధులు


బోధన్‌లోని నిజాం షుగర్స్ కర్మాగారం

బోధన్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : చరిత్రంతా గతమేనా?.. నాటి తీపి జ్ఞాపకాలు నేడు చేదును పంచనున్నాయా? దశాబ్దాల కాలంగా రైతులకు తీపిని పంచిన నిజాంషుగర్స్ కర్మాగారం.. ముగిసిన కథేనా అంటే.. ప్రస్తుత పరిస్థితులు అవుననే సమాధానమిస్తున్నాయి. అధికారంలోకి వస్తే నిజాం షుగర్స్‌ను ప్రభుత్వపరం చేస్తామన్న టీఆర్ఎస్ నేతల ఎన్నికల హామీలు నీటిమూటలయ్యాయి. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా.. 'నిజాం షుగర్స్' గోడును పట్టించుకున్న పాపానపోలేదు. ఇదే అదునుగా భావించిన యాజమాన్యం.. ప్రభుత్వానికి సమాచారం ఇవ్వకుండానే రెండేళ్ల క్రితం లే ఆఫ్ నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి కర్మాగారం మూతపడగా కార్మికులు రోడ్డున పడ్డారు. చెరుకు రైతులు మాత్రం సాగుకు దూరమయ్యారు. ఆసియా ఖండంలోనే పెద్దదైన నిజాం షుగర్స్ ఫ్యాక్టరీని నిజామాబాద్ జిల్లా బోధన్‌లో 1937లో నిజాం నవాబు మీర్ అలీ ఖాన్ ప్రారంభించారు. అయితే ప్రైవేటీకరణలో భాగంగా అప్పటి ప్రభుత్వం 2002లో ఈ ఫ్యాక్టరీ ప్రైవేటుపరం చేస్తూ ఎన్‌డీఎస్ఎల్ యాజమాన్యానికి అప్పగించింది. అయితే వీరు బకాయిలు చెల్లించలేదంటూ ప్రభుత్వం కోర్టును ఆశ్రయిస్తూ.. సభాసంఘాన్ని కూడా నియమించింది. దీంతో యాజమాన్యం బకాయి మొత్తాన్ని కోర్టులో డిపాజిట్ చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా టీఆర్ఎస్ నేతలు తాము అధికారంలోకి వస్తే.. నిజాం షుగర్స్‌ను ప్రభుత్వపరం చేసి పూర్వ వైభవం తెస్తామని హామీ ఇచ్చారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా లేఆఫ్‌తో మూతపడింది. రెండేళ్లుగా కార్మికులకు లేక కుటుంబ పోషణ కష్టమై రోడ్డున పడ్డారు. టీఆర్ఎస్ ప్రభుత్వం దీనిపై స్పందించకపోవడంపై అటు కార్మికులు, ఇటు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో చెరుకును సాగు చేసిన రైతులు పంట ఉత్పత్తులను కామారెడ్డి జిల్లాలోని ప్రైవేట్ కర్మాగారాలకు, లేదంటే మహారాష్ట్రకు తరలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నిజాంషుగర్స్ వేలం రచ్చ

నిజాంషుగర్స్ లేఆఫ్ అనంతరం అనేక ఉద్యమాలు, పరిణామాలు చోటుచేసుకున్నాయి. కొద్ది నెలల క్రితం నిజాంషుగర్స్ వ్యవహారం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) పరిధిలోకి చేరింది. దీంతో వారు రైతులు, కార్మికులతో భేటీ అయ్యారు. అయితే ఎన్‌సీఎల్‌టీ నిజాం షుగర్స్‌ను వేలం నిర్వహించేందుకు యాజమాన్యానికి అనుమతి ఇచ్చిందన్న వ్యవహారం చర్చనీయాంశమైంది. నిరసనగా ఉద్యమం ఉధృతమైంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

సైదాపూర్, ఫిబ్రవరి 18: అప్పుల బాధతో కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం గుజ్జులపల్లి గ్రామానికి చెందిన జంపాల రమేశ్ (40) అనే కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రమేశ్ రెండెకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ప్రతికూల పరిస్థితులతో పంటలు సరిగా పండక, రూ.4 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు తీర్చేదారిలేక రమేశ్ శనివారం ఇంట్లో పురుగు మందు తాగాడు. స్థానికులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రాంరెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 18: రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండల కేంద్రంలో ఆదివారం విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన మద్దుల రాంరెడ్డి (47) తన మూడు ఎకరాలకు నీరు పారించేందుకు ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. మోటారు వేస్తుండగా స్టార్టర్ నుంచి సరఫరా అయ్యే విద్యుత్ వైర్ తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన స్థానికులు రాంరెడ్డిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడు.

తెలంగాణలో 470 గురుకులాలు

▸ దేశంలో ఎక్కడా ఇన్ని లేవు: కడియం

▸ వడగళ్ల బాధితులకు పరిహారం: అల్లోల

▸ కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శం: పోచారం

▸ ప్రజారోగ్యం కోసం పక్కా ప్రణాళిక: చందూలాల్

▸ కాంగ్రెస్‌ది తుస్సు యాత్రే: ఎంపీ బూర

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: కేజీ టూ పీజీ విద్య అమలులో భాగంగా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం 470 గురుకులాలను మంజూరు చేసిందని.. దేశంలో మరెక్కడా ఇన్ని గురుకులాలు లేవని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఆదివారం జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ గతంలో 216 గురుకులాలు ఉంటే తెలంగాణ ఏర్పాటయ్యాక, అదనంగా 470 గురుకులాలు నెలకొల్పామన్నారు. అన్ని సామాజిక వర్గాల పిల్లలు ఇందులో చదువుకుంటున్నారని చెప్పారు. విదేశాలకు వెళ్లి చదువుకునే దళిత విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచిన ఘనత కూడా టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వడగళ్ల వర్షంతో పంట దెబ్బతిన్న బాధిత రైతులకు త్వరలోనే నష్ట పరిహారం అందిస్తామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలో వడగళ్ల వానతో దెబ్బతిన్న పంటలను ఆదివారం మంత్రి పరిశీలించారు. బాధిత రైతులకు పరిహారం ఇచ్చేందుకు సీఎం కేసీఆర్ సుముఖంగా ఉన్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా బీర్కూర్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పోచారం మాట్లాడుతూ మార్చి 11న రాష్ట్ర వ్యాప్తంగా 72 లక్షల మంది రైతులకు డిజిటల్ పాస్ బుక్కులు అందించనున్నట్లు చెప్పారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోందని మంత్రి చందూలాల్ అన్నారు. జయశంకర్ జిల్లా, ములుగు ఏరియా వైద్యశాలలో ఏర్పాటు చేసిన టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించి, వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులను ఆయన పరామర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ చేపట్టాలనుకునే బస్సు యాత్ర.. తుస్సు యాత్రే అవుతుందని భువనగిరి ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఎద్దేవా చేశారు. ఆదివారం నల్లగొండలో ఆయన మాట్లాడుతూ ఆ యాత్రలో వాహనాలకు డీజిల్, పెట్రోల్ కూడా దండగే అన్నారు.


వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మంత్రి అల్లోల

మతోన్మాదం పెచ్చరిల్లుతోంది

▸ చాడ వెంకటరెడ్డి



ఖమ్మంరూరల్ ఫిబ్రవరి 18: దేశంలో మతోన్మాదం పెచ్చరిల్లిపోతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా రూరల్ మండలం ఏదులాపురం పంచాయతీ పరిధిలో జరుగుతున్న సీపీఐ మహాసభల్లో రెండో రోజు ఆదివారం జరిగిన సదస్సులో చాడ మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని మోదీ మాటలకు, చేతలకు సంబంధం లేదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ సర్కార్ అతలాకుతలం చేసిందని ఆరోపించారు. బ్యాంకుల విలీనం ద్వారా కార్పొరేట్ శక్తులు, సంపన్న వర్గాలకు మేలు జరిగిందని, నీరవ్ మోదీ లాంటి వ్యక్తులు వేల కోట్లు దోచుకుని పరారయ్యేందుకు అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోయి, సంపద కొంత మంది చేతుల్లోనే పేరుకుపోతోందని చెప్పారు. ఒక శాతం మంది చేతిలో 76శాతం దేశ సంపద పోగుపడిందని, మరికొంతకాలం మోదీ పాలన సాగితే ఇది మరింతగా పెరగనుందని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మైనారిటీలు, లౌకికవాదులపై దాడులు పెరిగాయని అన్నారు. సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పార్టీ జిల్లా కార్యదర్శి బాగం హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలకు పూర్వ వైభవం

▸ ప్రభుత్వ సలహాదారు రమణా చారి



కామారెడ్డి, ఫిబ్రవరి 18: ప్రాచీన కళలకు తెలంగాణలో పూర్వ వైభవం వస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రమణాచారి అన్నారు. ఆదివారం కామారెడ్డిలో జరిగిన జిల్లా స్థాయి జానపద భజన పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాచీన కళలు, సాహిత్యాన్ని వెలికి తీసి నిరాదరణకు గురైన కళాకారులను ఆదరిస్తున్నారన్నారు. కళాకారులకు పింఛన్ సౌకర్యాన్ని కూడా కల్పించారన్నారు.

పాలకులు తప్ప.. పాలన మారలేదు

▸ గద్దర్



నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో పాలకులు మారారే తప్ప, పాలన మారలేదని ప్రజా యుద్ధ నౌక గద్దర్ అన్నారు. మారిందల్లా టోపీలు, కండువాలేనని చెప్పారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో అఖిల భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (ఏఐఎఫ్‌డీవై) రాష్ట్ర ప్రథమ మహాసభలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా గద్దర్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం వచ్చింది ఎంత నిజమో.. రాలేదన్నది అంతే నిజమన్నారు. ఎంతో మంది యువజనులు పనులు లేక పస్తులుంటున్నారని తెలిపారు. 60 శాతానికి పైగా ఉన్న యువజనులు పల్లెలకు వెళ్లి 2019లో నిశ్శబ్ద విప్లవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు తమ జెండాలు, ఎర్ర జెండాలను పక్కనపెట్టి ఐక్యమై రాజ్యాధికారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టుల కొట్లాట ఎప్పటికీ సిద్ధాంత పరమే కాని, వ్యక్తిగతం కాదని అన్నారు. రాష్ట్రంలో పాలకులు ఇచ్చిన హామీలు బుట్టదాఖలయ్యాయని చెప్పారు.

వరంగల్ 'కలెక్టరేట్'కు ఆత్మీయ వీడ్కోలు

▸ 132 ఏళ్ల చరిత్ర కలిగిన భవనం

▸ కొద్ది రోజుల్లో కూల్చివేత

▸ బంధాన్ని నెమరువేసుకున్న ఉద్యోగులు

హన్మకొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అర్బన్ కలెక్టరేట్ ప్రాంగణంలోని పాత పరిపాలనా భవనం కొద్ది రోజుల్లో కూల్చివేతకు గురికాబోతోంది. 132 సంవత్సరాల పాటు ప్రజలకు సేవలందించిన ఈ భవనం శాశ్వతంగా కనుమరుగు కాబోతోంది. బ్రిటీష్ కాలంలో సుభాగా ఉన్నప్పుడు ఈ భవనం నిర్మాణమైంది. అందుకే ఈ భవనం ఉన్న ప్రాంతానికి సుబేదారిగా పేరువచ్చింది. వరంగల్ అర్బన్ కలెక్టరేట్‌లో ప్రస్తుతం ఉన్న పాత భవనాల స్థానే రూ.32 కోట్ల వ్యయంతో అధునాతన సౌకర్యాలతో విశాలమైన కొత్త భవన సముదాయాన్ని నిర్మిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా ఈ భవనంలో పని చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు ఆదివారం భవనానికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఉద్యోగ రీత్యా ఈ భవనంతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 132 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ భవనం ఒక పరిపాలన కేంద్రంగా ఉమ్మడి జిల్లా అభివృద్ధి సమగ్రాభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. అలాంటి ఈ భవనం ఇంకా కొద్ది రోజుల్లో కనుమరుగవుతుండడంపై విచారం వ్యక్తం చేశారు. ఇందులో కొంత భాగాన్ని స్మృతి చిహ్నంగా ఉంచాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుకు వినతి పత్రం సమర్పించనున్నట్టు తెలిపారు.



తక్కువ ధరకు నాణ్యమైన వస్త్రాలందించాలి

▸ సిద్దిపేటలో వస్త్ర దుకాణాన్ని ప్రారంభించిన మంత్రి హరీశ్, సినీ నటి రకుల్


షాపింగ్ మాల్‌లో చీరలతో నటి రకుల్

సిద్దిపేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మాంగళ్య షాపింగ్ మాల్ (వస్త్రదుకాణం)ను ఆదివారం మంత్రి హరీశ్‌రావు, సినీ హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్‌లు ప్రారంభించారు. తొలుత మంత్రి హరీశ్‌రావు హాజరై షాపింగ్ మాల్‌ను ప్రారంభించి మాట్లాడారు. వరంగల్, కరీంనగర్ తర్వాత ఈ మాల్‌ను సిద్దిపేటలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సిద్దిపేట చుట్టుపక్కల వంద గ్రామాల ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన వస్త్రాలను అందించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం సినీ నటి రకుల్ ప్రీత్‌సింగ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆమెను చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. షాపింగ్ మాల్‌లో రకుల్ ప్రీత్‌సింగ్ కొత్త చీరలను ఆసక్తిగా తిలకించారు. సిద్దిపేట పట్టణం సూపర్‌గా ఉన్నదని కితాబిచ్చారు. 'మీ అభిమానంతోనే నాకు గుర్తింపు వచ్చిందని, ఇలాగే నన్ను ఆదరించాలని' అభిమానులతో ఆమె అన్నారు.


షాపింగ్ మాల్‌లో జ్యోతి వెలిగిస్తున్న మంత్రి హరీశ్

పెదవాగు చిన్నబోయింది !

తెలంగాణలో ప్రాజెక్టు.. ఆంధ్రప్రదేశ్‌లో ఆయకట్టు

▸ మరమ్మతులను పట్టించుకోని రెండు రాష్ట్రాలు

▸ శిథిలావస్థలో కాలువలు, తూములు

▸ మూడో వంతు ఆయకట్టుకూ అందని నీరు

అశ్వారావుపేట, ఫిబ్రవరి 18 : పదహారు వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించిన పెదవాగు మధ్యతరహా ప్రాజెక్టు ఇప్పుడు చిన్నబోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల సరిహద్దులో ఉన్న ఈ ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలోకి వస్తుండడంతో మరమ్మతు పనులను ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా మూడు మండలాలను సస్యశ్యామలం చేసిన ప్రాజెక్టు.. ఇప్పుడు దీనావస్థలో కొట్టుమిట్టాడుతోంది. కాలువల్లో పూడిక పేరుకుపోగా, తూములు శిథిలావస్థకు చేరి నీరు వృథాగా పోతోంది. అశ్వారావుపేట మండల సరిహద్దులోని గుమ్మడిపల్లి వద్ద పెదవాగు ప్రాజెక్టును 1977లో నిర్మించారు. 16వేల ఎకరాలకు నీరందించేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ప్రాజెక్టు ఎడమ, కుడి కాలువల ద్వారా వేలేరుపాడు, కుకునూరు మండలాల్లోని 13,000 ఎకరాలకు నీరందించేవారు. అశ్వారావుపేట మండలంలో 2 వేల ఎకరాల్లోపు ఆయకట్టు సాగయ్యేది. అయితే రాష్ట్ర విభజన సమయంలో వేలేరుపాడు, కుకునూరు మండలాలు ఆంధ్రప్రదేశ్‌లోకి వెళ్లడంతో ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. తెలంగాణలో ఉన్న ప్రాజెక్టుకు ఏపీలో ఆయకట్టు ఉండడంతో మరమ్మతులు చేసే వారు కరువయ్యారు. ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు లేదన్న సాకుతో తెలంగాణ ప్రభుత్వం విస్మరిస్తుండగా, ప్రాజెక్టు పక్క రాష్ట్రంలో ఉండడంతో ఏపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. పెదవాగు ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టడంలో మొదటి నుంచీ నిర్లక్ష్యమే కనిపిస్తోంది. 2006 తర్వాత ప్రాజెక్టుకు ఒకటి, రెండు సార్లు గేట్లు, చిన్న మరమ్మతులు తప్ప ఇతర పనులకు పైసా కూడా వెచ్చించలేదు. పదేళ్లు దాటినా కాలువలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోయి, మట్టితో పూడుకుపోయాయి. చాలా చోట్ల కాలువలకు గండ్లు పడ్డాయి. కాలువలపై నిర్మించిన తూములు, వాటి తలుపులు, అక్విడక్ట్‌లు శిథిలమయ్యాయి. పలు ప్రాంతాల్లో కల్వర్టులు కూలిపోవడంతో పంట పొలాలకు నీరు వెళ్లే పరిస్థితి లేదు. కొందరు రైతులు ప్రాజెక్టులో ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని పొలాలు సాగు చేసుకుంటున్నారు.

ఈసారైనా కనికరిస్తారా?

పెదవాగు ప్రాజెక్టు, పూడిక, కాలువల దుస్థితి, ఆయకట్టు, రైతులు ఎక్కడివారు.. తదితర అంశాలను తేల్చేందుకు గతంలో ప్రభుత్వం ఓ కమిటీని వేసింది. ఇది అంతరాష్ట్ర సమస్యగా మారడంతో ఇప్పటి వరకూ ఒక్క పైసా కూడా రాలేదు. ప్రాజెక్టు శిథిలావస్థకు చేరడంతో మూడో వంతు ఆయకట్టుకు కూడా నీరు అందడం లేదు. ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. ఇరు రాష్ట్రాల బడ్జెట్లలో ఈ సారైనా నిధులు కేటాయిస్తారేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.


శిథిలావస్థకు చేరిన తూము

నా భర్త మృతదేహాన్ని స్వదేశానికి తెప్పించండి

▸ వలస కూలీ భార్య వేడుకోలు

గండీడ్, ఫిబ్రవరి 18: బతుకుదెరువు కోసం కుటుంబాన్ని, సొంత గ్రామాన్ని వదిలి నాలుగు రూపాయలు సంపాదించుకుందామని సౌదీ అరేబియాకు వెళ్లాడు. పట్టుమని పదిహేను రోజులు కూడా గడవక ముందే ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కిందపడి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం షేక్‌పల్లి తండాకు చెందిన కాట్రావత్ దేవ్‌జనాయక్ గత నెల 30న సౌదీ అరేబియాలోని రియాజ్‌కు వెళ్లాడు. అక్కడ పని చేస్తూ ఈ నెల 13న ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కింద పడి మృతి చెందాడు. సమీపంలో ఉన్న తండావాసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఐదు రోజుల నుంచి అతడి భార్య, కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. జిల్లా ఉన్నతాధిరులు స్పందించి దేవ్‌జనాయక్ మృత దేహాన్ని త్వరగా స్వదేశానికి తీసుకువచ్చేలా చూడాలని వేడుకుంటున్నారు.

7 కిలోల గంజాయి పట్టివేత

రామగిరి, ఫిబ్రవరి 18 : పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మంథని జేఎన్టీయూహెచ్ కళాశాల సమీపంలో 7 కిలోల గంజాయి పట్టుబడింది. ఎస్ఐ శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం ఈ దాడులు చేశారు.



పర్వతాల్లో కూలిన విమానం!

ఇరాన్‌లో 66 మంది మృతి



ప్రమాదానికి గురైన ఆసిమాన్ ఎయిర్‌లైన్స్ విమానం (ఫైల్)



టెహ్రాన్, ఫిబ్రవరి 18: ఇరాన్‌లో విమానం కూలి 66 మంది ప్రయాణికులు మృతిచెందారు. జాగ్రోస్ పర్వతశ్రేణుల్లో ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ఆరుగురు సిబ్బంది, ఒక పసికందు ఉన్నారు. ప్రమాద విషయాన్ని ఎయిర్‌లైన్స్ పబ్లిక్ రిలేషన్స్ ముఖ్య అధికారి మహ్మద్ తబతాబాయ్ ధ్రువీకరించారు. మంచు తుఫాను కారణంగా ఘటనా స్థలాన్ని గుర్తించడం సహాయక సిబ్బందికి కష్టంగా మారింది. ఆసిమాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 8 గంటలకు సిబ్బంది సహా 66 మందితో టెహ్రాన్ నుంచి యాసుజ్ నగరానికి బయల్దేరింది. 1993 నుంచి సర్వీస్‌లో ఉన్న ఈ విమానం మెహ్రాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే రాడార్ సంకేతాలు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. ఆ విమానం సాంకేతిక లోపాలతో జాగ్రోస్ పర్వతాల్లో కూలిపోయిందని గుర్తించారు. తొలుత విమానంలో ప్రయాణిస్తున్న వారంతా చనిపోయినట్టు ప్రకటించిన తబతాబాయ్ ఆ తర్వాత.. ఇంతవరకూ ఘటనా స్థలాన్ని గుర్తించలేదని, ఎంతమంది మృతిచెందారో కచ్చితంగా చెప్పలేమని అన్నారు. 'విమానం కోసం తీవ్రంగా గాలించాం. అది కూలిపోయి ఉంటుందని నిర్ధారణకు వచ్చాం. దురదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో మన ఆప్తులు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం ఎక్కడ జరిగిందో గుర్తించలేకపోతున్నాం. అందులో ఉన్నవారంతా చనిపోయారని కచ్చితంగా చెప్పలేం' అని ఆయన మీడియాకు తెలిపారు. ప్రమాద స్థలాన్ని గుర్తించేందుకు అత్యవసర సేవల సిబ్బంది హెలికాప్టర్లతో గాలిస్తున్నా.. మంచు కారణంగా ఆటంకం ఏర్పడుతోంది. కొన్ని బృందాలను కాలినడకన పంపినా ప్రయోజనం కనిపించలేదు. 'అత్యవసర సహాయం కోసం ఇప్పటి వరకూ ఐదు సహాయక బృందాలను పంపాం. కానీ.. వారు ఇంతవరకూ సంఘటనా స్థలాన్ని గుర్తించలేకపోయార'ని ఇరాన్ అత్యవసర సేవల విభాగం హెడ్ జలాల్ పూరన్‌ఫర్ తెలిపారు. ఈ ప్రమాదంపై ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహాని దర్యాప్తునకు ఆదేశించారు.



జయహో బాహుబలి!

మహామస్తకాభిషేకానికి రెండో రోజూ పోటెత్తిన భక్తులు

అందరికీ అభిషేక అవకాశం.. వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని శ్రావణబెళగొళలో భగవాన్ బాహుబలి గోమటేశ్వరస్వామి మహామస్తకాభిషేకానికి ఆదివారం రెండో రోజూ భక్తులు పోటెత్తారు. ఉదయం 8 గంటలకే మస్తకాభిషేకం ప్రారంభమైంది. 1008 కలశాల పవిత్ర జలాలతో బాహుబలిని అభిషేకించారు. మధ్యాహ్నానికల్లా క్షీరాభిషేకం, చందనం, అష్టగంధంతోపాటు 21 సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తుల సంఖ్య మరింత పెరిగింది. మధ్యాహ్నం తర్వాత పాసులు లేని భక్తులకు అభిషేకం చేసే అవకాశం కల్పించారు. జైన గురువు చారుకీర్తి భట్టారకస్వామిజీ విశేష పూజలతో ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిశాయి.

రైల్వే స్టేషన్లలో వాహన చార్జింగ్ కేంద్రాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: రైల్వే స్టేషన్లలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు దేశ రాజధానిలోని న్యూఢిల్లీ, నిజాముద్దీన్ స్టేషన్లలో వీటిని అందుబాటులోకి తేనుంది. ఒక్కో స్టేషన్లో ఐదేసి ఏసీ చార్జింగ్ పాయింట్లు ఉంటాయని, వీటిద్వారా ఏకకాలంలో పదేసి వాహనాలను రీచార్జ్ చేయవచ్చని అధికారులు తెలిపారు. డీసీ చార్జింగ్ పాయింట్ల ద్వారా ఒక వాహనం పూర్తిస్థాయిలో రీచార్జ్ అవ్వాలంటే ఆరు గంటల సమయం పడుతుందని.. అదే ఏసీ పాయింట్ల ద్వారా గంట సమయం సరిపోతుందని పేర్కొన్నారు.

ఎంపీ మంత్రికి ఈసీ నోటీసులు

భోపాల్, ఫిబ్రవరి 18: మధ్యప్రదేశ్ రాష్ట్ర క్రీడలు, యువజన సంక్షేమ శాఖల మంత్రి యశోధర రాజే సింధియాకు ఆదివారం ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో ఓటర్లను బెదిరించినట్లు, మభ్యపెట్టినట్లు ఆమెపై ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నోటీసులు జారీ చేసిన ఈసీ.. ఈనెల 20న వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

నోటిఫికేషన్‌కు ముందే జేడీఎస్ తొలి జాబితా

బెంగళూరు, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియకు మరో నెల రోజులకుపైగా గడువు ఉండగానే జేడీఎస్ పార్టీ పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని దేవెగౌడ, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్.డి.కుమారస్వామి ఆదివారం 126 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ఇందులో నలుగురు మహిళలు, ఏడుగురు మైనారిటీలు ఉన్నారు. ఏడాది ముందే జాబితాను ప్రకటిస్తామని గతంలో ప్రకటించిన జేడీఎస్, మరీ అంత ముందుగా అయితే రాజకీయంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వెనుకంజ వేసింది. ఎన్నికలు మే నెలలో జరిగే అవకాశం ఉండగా మిగిలిన పార్టీలకంటే ముందుగానే తొలి జాబితాను ప్రకటించింది.

తాజ్‌ను సందర్శించిన కెనెడా ప్రధాని

ఆగ్రా, ఫిబ్రవరి 18: వారం రోజుల పర్యటనలో భాగంగా భారత్ వచ్చిన కెనెడా ప్రధాని జస్టిన్ ట్రుడోవ్ ఆదివారం కుటుంబ సమేతంగా తాజ్‌మహల్‌ను సందర్శించారు. ఈ నెల 25 వరకు భారత్‌లో పర్యటించనున్న జస్టిన్.. 23న ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా వీరిద్దరూ రక్షణ విభాగం, భద్రత, ఉగ్రవాద నిరోధక సహకారం, వాణిజ్యం, పెట్టుబడులు తదితర అంశాలపై ఒప్పందాలు చేసుకోనున్నారు.

జిగ్నేష్ మేవాని సహా 70 మంది అరెస్టు

అహ్మదాబాద్, ఫిబ్రవరి 18: ఓ దళిత నేత ఆత్మహత్యను పోలీసులు నిరోధించలేకపోయారని ఆరోపిస్తూ.. ఆదివారం గుజరాత్ వ్యాప్తంగా దళిత సంఘాలు ఆందోళన చేపట్టాయి. రాజధాని నగరం గాంధీనగర్ సహా.. అహ్మదాబాద్, మెహ్‌సనాలోని పఠాన్, సరస్‌పూర్‌లో రహదారులపై బైఠాయించి వాహనాలను అడ్డుకున్నాయి. సరస్‌పూర్ వద్ద గుజరాత్ స్వతంత్ర ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానిని పోలీసులు అరెస్టు చేశారు. వేర్వేరు ప్రాంతాల్లో మొత్తం 70 మంది ఆందోళనకారుల్ని అరెస్టు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి జేకే భట్ మీడియాకు తెలిపారు. కాగా.. దళితులకు భూమి ఇవ్వాలంటూ భానూభాయ్ వంకార్ అనే దళిత నేత శుక్రవారం పఠాన్‌లోని కలెక్టర్ కార్యాలయం వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డ విషయం తెలిసిందే.

అంతరించిపోతున్న 40 భారతీయ భాషలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: దాదాపు 40 భారతీయ భాషలు, మాండలికాలు అంతరించిపోయే దశలో ఉన్నాయని జన గణన నివేదికలో వెల్లడైంది. ప్రస్తుతం 22 అధికారిక భాషలతో పాటు మరో వంద భారతీయ భాషలను లక్ష కంటే ఎక్కువ మంది మాట్లాడుతున్నారని, 42 భాషలను మాత్రం పది వేల కంటే తక్కువ మంది మాట్లాడుతున్నారని హోంమంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. వీటిలో అత్యధికంగా అండమాన్ నికోబార్ దీవుల్లోని 11 భాషలు, మణిపూర్‌లో 7, హిమాచల్ ప్రదేశ్‌లో 4, ఒడిసాలో 3, కర్ణాటక, ఏపీ, తమిళనాడు, అరుణాచల్ ప్రదేశ్, అసోంలో 2 భాషల చొప్పున, ఉత్తరాఖండ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మేఘాలయా, పశ్చిమ బెంగాల్‌లో ఒక్కో భాష చొప్పున అంతరించి పోయే దశలో ఉన్నట్లు గుర్తించారు. యునెస్కో జాబితాలోనూ ఈ భాషలు ఉన్నాయని పేర్కొన్నారు.

పిటిషన్ ఉపసంహరించుకున్న 'అగస్టా'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ఇటలీకి చెందిన హెలికాప్టర్ల తయారీ సంస్థ అగస్టా వెస్ట్‌ల్యాండ్ 'బ్యాంకు హామీ'కి సంబంధించి ఢిల్లీ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది. భారత నౌకాదళం 56 హెలికాప్టర్ల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించగా.. అగస్టా వెస్ట్‌ల్యాండ్ సంస్థ రూ.3 కోట్లను బ్యాంకు హామీ కింద 2013లో డిపాజిట్ చేసింది. ఆ సంస్థ నిబంధనలు ఉల్లంఘించడంతో కేంద్ర ప్రభుత్వం రూ.3 కోట్లను తీసేసుకుంది. బ్యాంకు హామీ మొత్తాన్ని తీసేసుకోవడాన్ని సవాలు చేస్తూ అగస్టా వెస్ట్‌ల్యాండ్ సంస్థ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేసింది. సంస్థ నిబంధనలు ఉల్లంఘిస్తే బ్యాంకు గ్యారంటీ మొత్తం ప్రభుత్వానికే చెందుతుందని, ఆ విషయం నిబంధనల్లో స్పష్టంగా ఉందని కేంద్రం తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో బ్యాంకు హామీపై ఇచ్చిన ఉత్తర్వులను ఢిల్లీ హైకోర్టు గత ఏడాది కొట్టివేసింది. ఈ క్రమంలో కేంద్రం బ్యాంకు హామీ కింద ఇచ్చిన మొత్తాన్ని సొమ్ము చేసేసుకుంది.

బీజేపీ నరనరాన ప్రజాస్వామ్యం

- అందుకే విజయవంతంగా సంకీర్ణం
- వాజ్‌పేయి ప్రయోగం మార్గదర్శకం
- ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్య
- బీజేపీ కొత్త కార్యాలయం ప్రారంభం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: 'బీజేపీ మూలాల్లో.. నరనరాన ప్రజాస్వామ్యం ఉంది. అందుకే సంకీర్ణాన్ని సాధ్యమైనంత ఉత్తమ మార్గంలో ముందుకు తీసుకెళ్లడంలో విజయం సాధించాన'ని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బీజేపీతో టీడీపీ సహా కొన్ని మిత్రపక్షాల విభేదాల నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'వివిధ పార్టీలు ఉన్న ప్రజాస్వామ్యంలో సంకీర్ణ రాజకీయాలు సహజం. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పొత్తులు, తెగదెంపులు వేరే విషయం. సంకీర్ణంలో మిత్రపక్షాలతో కలిసి పయనించడం తప్పనిసరి. ఈ ప్రయోగాన్ని నాడు అటల్‌జీ ఆధ్వర్యంలో బీజేపీ విజయవంతంగా చేసింది. దేశంలో కొత్త ఆశను రేకెత్తించింది" అని మోదీ గుర్తు చేశారు. ఢిల్లీలోని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ మార్గ్‌లో బీజేపీ కొత్త కేంద్ర కార్యాలయాన్ని మోదీ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అగ్రనేతలు ఎల్‌కే ఆడ్వాణీ, మురళీ మనోహర్ జోషి సహా పార్టీ మాజీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశ ప్రయోజనాల కోసం జరిగిన అన్ని ఉద్యమాలకు జన సంఘ్, బీజేపీ సారథ్యం వహించాయని చెప్పారు. 1951లో భారతీయ జన సంఘ్‌గా ఏర్పడిన నాటి నుంచి పార్టీ అభివృద్ధిని వివరిస్తూ... ఏనాడూ తొలినాళ్ల ఆదర్శాలను విస్మరించలేదని, గుండెల నిండా దేశభక్తితో పని చేస్తున్నామని చెప్పారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చాలా మంది నాయకులు కాంగ్రెస్‌తో ఉన్నారని, తర్వాత కాలంలో విడిపోయి సొంత పార్టీలు పెట్టుకున్నారని అన్నారు. స్వాతంత్ర్యానంతరం ఒకటి లేదా రెండు బలమైన జాతీయ పార్టీలు ఉండాలన్న అవసరాన్ని గుర్తించడంతో జన సంఘ్ ఏర్పాటు జరిగిందని చెప్పారు. జాతి హితం కోసం జరిగిన అన్ని ఉద్యమాలకు పార్టీ సారథ్యం వహించిందని, ఇది తమకు గర్వకారణమని అన్నారు. అందుకే బీజేపీ దేశభక్తి నిండిన పార్టీగా పేరొందిందని, దేశం కోసం పోరాటానికి, త్యాగానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని చెప్పారు. కార్యకర్తల త్యాగాల వల్లే పార్టీ ఈస్థాయికి చేరిందన్నారు.



బీజేపీ కొత్త కార్యాలయాన్ని ఆదివారం ఢిల్లీలో ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీనియర్ నేత ఎల్‌కే ఆడ్వాణీ

జేఎన్‌పీటీలో 4వ టెర్మినల్ ప్రారంభం

ముంబై: జవహర్‌లాల్ నెహ్రూ నౌకాశ్రయంలో రూ.7,900 కోట్ల నాలుగో టెర్మినల్ ప్రాజెక్టును మొదటి దశను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం జాతికి అంకితం చేశారు. ఇది సరుకు రవాణా సామర్థ్యాన్ని 50 శాతం పెంచుతుంది. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ విమానయాన సంస్థలు గత ఏడాది కాలంలో 900 విమానాలకు ఆర్డర్లు ఇచ్చాయని చెప్పారు. ఇది దేశంలో విమానయాన రంగంలో భారీ అభివృద్ధికి సంకేతమని అన్నారు. ప్రపంచీకరణను అందిపుచ్చుకోవాలంటే మనకు నాణ్యమైన మౌలిక వసతులు అవసరమని చెప్పారు.



బీజేపీ కొత్త కార్యాలయం ఎదుట పార్టీ గుర్తు కమలం ఆకారంలో కొలను

ప్రపంచంలోని అన్ని పార్టీల కంటే పెద్ద కార్యాలయం


1.70 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం గల బీజేపీ కొత్త ప్రధాన కార్యాలయం ప్రపంచంలోని అన్ని రాజకీయ పార్టీల కార్యాలయాల కన్నా పెద్దదని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా తెలిపారు. ఏడాదిలో దేశంలోని ప్రతి జిల్లాలో సొంత కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొత్త కార్యాలయంలో ఆధునిక కమ్యూనికేషన్ టెక్నాలజీని ఏర్పాటు చేశామని, ఇక్కడ కూర్చుని ప్రధాని ఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్నైనా నిర్వహించవచ్చని తెలిపారు. 18 నెలల కాలంలో ఈ బహుళ అంతస్థుల భవనాన్ని నిర్మించిన అమిత్ షా బృందాన్ని ప్రధాని అభినందించారు. దేశంలోని 694 జిల్లాలకు గాను 635 జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మించాలని 2015 జాతీయ కార్యవర్గ సమావేశాల్లో నిర్ణయించిన విషయాన్ని షా గుర్తు చేశారు. 35 ఏళ్లుగా బీజేపీ పద్రాన కార్యాలయం న్యూఢిల్లీలోని అశోకా రోడ్డులో కొనసాగింది. అక్బర్ రోడ్డులో కాంగ్రెస్ కార్యాలయం ఉంది. లుటియన్ బంగ్లా జోన్ నుంచి పార్టీల కార్యాలయాలను తరలించాలన్న సుప్రీం కోర్టు ఆదేశాలతో బీజేపీ కొత్త ప్రాంతానికి మారింది. ఇది ఇతర పార్టీలు కూడా తరలేవిధంగా ఒత్తిడి పెంచవచ్చని భావిస్తున్నారు.



రెండు రోజుల పర్యటనలో భాగంగా సౌదీ వెళ్లిన కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఆదివారం రియాద్‌లో సౌదీ రాజు సాల్మన్ బిన్ అబ్దుల్ అజీజ్‌తో సమావేశం అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలపై వారు సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. - గల్ఫ్ ప్రతినిధి, ఆంధ్రజ్యోతి

త్రిపుర ఎన్నికల్లో 78.5% పోలింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: త్రిపురలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదివారం రాత్రి 9 గంటల వరకు 78.5 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికల కమిషన్ వెల్లడించింది. 25.73 లక్షల మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని తెలిపింది. మొత్తం 60 స్థానాలకు ఒకటి మినహా అన్ని చోట్ల ఎన్నికలు జరిగాయని పేర్కొంది. చారిలామ్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి రామేంద్ర నారాయణ్ గత వారం కాలం చేయడంతో.. అక్కడ ఎన్నికను మార్చి 12కు వాయిదా వేసినట్లు తెలిపింది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే.. ఈ సారి 12.5 శాతం తక్కువ పోలింగ్ నమోదైందని ఉప ఎన్నికల కమిషనర్ సుదీప్ జైన్ విలేకరులకు తెలిపారు. కాగా.. 'ఎర్ర'కోట త్రిపురలో కాషాయ జెండా ఎగురవేసేందుకు బీజేపీ తహతహలాడుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాలతోపాటు.. పలువురు ప్రముఖులు బీజేపీ తరఫున ప్రచారం చేశారు. గిరిజన ప్రాంతాల్లో బలంగా ఉన్న ఐపీఎఫ్‌టీతో పొత్తు బీజేపీకి కలిసివచ్చే అంశమని విశ్లేషకులు చెబుతున్నారు. బీజేపీ 51 స్థానాల్లో, ఐపీఎఫ్‌టీ తొమ్మిది స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపాయి. ఈ సారి కాంగ్రెస్ ఒంటరి పోరు సాగిస్తోంది. కక్రబోన్ నియోజకవర్గం మినహా.. మిగతా 59 స్థానాల్లో పోటీచేస్తోంది.



ఓటు హక్కు వినియోగించుకుంటున్న సీఎం మాణిక్ సర్కార్

ఎన్ఐఆర్ఎఫ్‌కు వివరాలు ఇవ్వాల్సిందే

- లేకపోతే వర్సిటీలకు నిధుల్లో కోత!
- యూజీసీకి ఎంహెచ్ఆర్డీ ప్రతిపాదన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా యూనివర్సిటీలు, కళాశాలలు నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్)కు వివరాలు ఇవ్వకపోతే ఏటా యూజీసీ ఇచ్చే నిధుల్లో కోత పడనుంది. ఈ మేరకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ(ఎంహెచ్ఆర్డీ) యూజీసీకి ప్రతిపాదించినట్లు తెలిసింది. ఎంహెచ్ఆర్డీ తొలిసారిగా 2015లో దేశంలోని ఉన్నత విద్యా సంస్థలకు ర్యాంకులు ఇవ్వడం ప్రారంభించింది. విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్ఐఆర్ఎఫ్ ఇప్పటికి రెండుసార్లు 8 విభాగాల్లో ర్యాంకులు వెల్లడించింది. ఆయా విద్యా సంస్థలకు 'ఇష్టముంటేనే ఇందులో పాల్గొనొచ్చు లేదంటే అవసరం లేదు' అన్న తరహాలో ప్రారంభించారు. దీంతో అన్ని విద్యాసంస్థలు ఎన్ఐఆర్ఎఫ్‌కు సమాచారం ఇవ్వడం లేదు. ఫలితంగా 'ర్యాంకుల' ఉద్దేశం నెరవేరడం లేదు. దాంతో తప్పనిసరిగా ర్యాంకింగ్స్‌లో పాల్గొనాలనే నిబంధన తీసుకురావాలని ఎంహెచ్ఆర్డీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

రజనీతో కమల్ భేటీ

- ఇది స్నేహపూర్వక సమావేశమే
- మదురై సభకూ రమ్మన్నాను: కమల్
- కరుణానిధి, స్టాలిన్‌తోనూ చర్చలు

చెన్నై, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రెండ్రోజుల్లో (21న) రాజకీయ పార్టీని ప్రారంభించబోతున్న నటుడు కమల్‌హాసన్ అకస్మాత్తుగా సూపర్‌స్టార్ రజనీకాంత్‌ని కలుసుకుని సంచలనం రేకెత్తించారు. చెన్నై పోయస్‌గార్డెన్‌లోని రజనీ నివాసానికి ఆదివారం మధ్యాహ్నం కమల్‌హాసన్ స్వయంగా వెళ్లి రజనీతో భేటీ అయ్యారు. అనంతరం కమల్ విలేకరులతో మాట్లాడారు. 'నా రాజకీయ నిర్ణయం గురించి రజనీతో మాట్లాడాను. బహిరంగ సభకు రావాలని ఆహ్వానించాను. ఇది రాజకీయ సమావేశం కాదు.. స్నేహపూర్వకమైనదే' అని చెప్పారు. రజనీకాంత్ మాట్లాడుతూ.. 'రాజకీయ ప్రయాణం ప్రారంభానికి నన్ను ఆహ్వానించడానికి కమల్ వచ్చారు. నేను కూడా శుభాకాంక్షలు తెలియజేశాను. బహిరంగ సభకూ రావాలని కోరారు. డబ్బు కోసమో, పేరు కోసమో కమల్ రాజకీయాల్లోకి రాలేదు. ఆయన ప్రయాణం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను' అని చెప్పారు. రాజకీయాల్లో ఇద్దరూ కలిసే అవకాశం ఉందా అన్న ప్రశ్నకు.. 'సినిమాల్లో నా దారి వేరు, కమల్ దారి వేరు. రాజకీయాల్లోనూ నా దారి వేరుగానే ఉంటుంది' అని బదులిచ్చారు. కాగా, రజనీతో భేటీ అనంతరం డీఎంకే అధ్యక్షుడు కరుణానిధిని కమల్ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనకు డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ స్వాగతం పలికారు.



రజనీకాంత్ నివాసంలో కమల్‌హాసన్

కావేరీ పాత ఒప్పందాల్లో ఏ అన్యాయం లేదు

- అవి అమల్లోనే ఉన్నాయి.. అంతరించలేదు
- ఆ ప్రాంత ప్రజలందరికీ నీరందుతోంది
- ఇందులో రాజకీయానికి తావులేదు
- కర్ణాటకకు తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: దశాబ్దాల కావేరీ వివాదానికి తన తీర్పుతో ముగింపు పలికిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంలో స్వాతంత్ర్యానికి ముందు కుదిరిన ఒప్పందాలకు వ్యతిరేకంగా కర్ణాటక చేసిన వాదనను తోసిపుచ్చింది. కావేరీ జలాల పంపకంపై 1892, 1924ల్లో మైసూరు రాజసంస్థానం, మద్రాస్ ప్రెసిడెన్సీ రాష్ట్రం మధ్య కుదిరిన ఒప్పందాలను కర్ణాటక తన వాదనల్లో తీవ్రంగా వ్యతిరేకించింది. 'ఈ ఒప్పందాలపై మద్రాస్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపేందుకు మైసూరు మహారాజా స్వతంత్రుడు కాదు. ఆయన బ్రిటిష్‌వారికి సామంత రాజు మాత్రమే. సమానత్వ ప్రాతిపదికన ఒప్పందాలు జరుగలేదు. మహారాజా అధికారాన్ని తోసిరాజని బ్రిటిష్ ప్రభుత్వం ఈ ఒప్పందాలపై ఆదేశాలు జారీ చేసింది' అని కర్ణాటక వాదించింది. దీనితో చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ అమితవ రాయ్, జస్టిస్ ఏఎం ఖన్విల్కర్‌లతో కూడిన ధర్మాసనం విభేదించింది. 'ఈ రెండు ఒప్పందాల్లో ఎలాంటి రాజకీయం లేదు. భారత సార్వభౌమాధికారానికి వీటితో సంబంధమే లేదు. పైగా కావేరీ పరీవాహక ప్రాంత ప్రజలందరికీ నీరు లభిస్తోంది. స్వాతంత్ర్యానంతరం 1892, 1924 ఒప్పందాలు అంతరించాయని, అమల్లో లేవన్న వాదన సహేతుకం కాదు. ఒప్పందాలు అంతరించలేదు. ప్రజల నీటి అవసరాల కోసం గట్టిగా సంప్రదింపులు జరిపే అధికారం, ఒప్పందం కుదుర్చుకోవాలో అక్కర్లేదో నిర్ణయించుకునే అధికారం మైసూరుకు ఉండకపోయి ఉండవచ్చు. 1947 తర్వాత ఆ అధికారం సంక్రమించింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చాక నిస్సందేహంగా ఆ హక్కు వచ్చేసింది. కానీ ఆ అధికారాన్ని కర్ణాటక ఉపయోగించుకోలేదు. అందువల్ల తనకు అన్యాయం జరిగిందని, ఈ ఒప్పందాలు చెల్లవని ప్రకటించాలన్న కర్ణాటక వాదనను అంగీకరించజాలం' అని కరాఖండీగా చెప్పింది. ఈ ఒప్పందాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాక.. వీటిలో రాజకీయ కోణం కనిపించలేదని పేర్కొంది. కర్ణాటకకు అన్యాయం జరిగిందనడం సరికాదని స్పష్టం చేసింది.

ప్రధాని విమానయానాలపై.. రూ. 2.86 లక్షల చార్జీ విధించిన పాక్

ఆర్టీఐ ద్వారా వెలుగులోకి.. విదేశీయాత్రలకు రెండేళ్లలో 2కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ప్రధాని నరేంద్ర మోదీ పాకిస్థాన్ ఆకస్మిక పర్యటన సందర్భంగా ఆ దేశం రూ. 1.49 లక్షల చార్జీ విధించింది. 2015 డిసెంబరు 25న అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ జన్మదినం రోజున అకస్మాత్తుగా ఆ దేశంలో ల్యాండ్ అయ్యారు. ప్రధాని విమానానికి లాహోర్ విమానాశ్రయంలో పార్కింగ్, ఇతర ఖర్చుల కింద ఆ దేశం రూ. 1.49 లక్షల చార్జీ విధించింది. ఆ తర్వాత.. 2016 మే నెలలో ఇరాన్, జూన్‌లో ఖతర్ పర్యటనల సందర్భంగా మోదీ విమానం పాక్ ఉపరితలాన్ని వినియోగించుకుంది. ఇందుకు పాకిస్థాన్ రూ. 1.37లక్షల చార్జీ విధించింది. ఓ ఆర్టీఐ దరఖాస్తుతో ఈ విషయాలు వెలుగు చూశాయి. 2014-16 మధ్య మోదీ విదేశీ యాత్రలకు రూ. 2 కోట్ల ఖర్చు అయినట్లు కేంద్రం తెలిపింది.

కళ్లల్లో యాసిడ్ ఇంజెక్ట్ చేశారు!

వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని బిహార్‌లో దారుణం

బెగుసరాయ్, ఫిబ్రవరి 18: యజమాని భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న కోపంతో ఓ ట్రాక్టర్ డ్రైవర్‌పై ఆ యజమాని మనుషులు దారుణానికి ఒడిగట్టారు. కళ్లలో యాసిడ్‌ను ఇంజక్ట్ చేసి, శాశ్వత అంధత్వానికి కారణమయ్యారు. బిహార్‌లోని సమస్తిపూర్ జిల్లా బరౌనీ గ్రామంలో ఓ యువకుడు భూయజమాని వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆ యజమాని భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకుని, ఈనెల 6న ఆమెతోపాటు పారిపోయారు. దీంతో యజమాని కిడ్నాప్ కేసు పెట్టాడు. సదరు మహిళ ఈనెల 16న కోర్టులో.. భర్తతోనే ఉంటానని చెప్పి ఇంటికెళ్లింది. ఆ మహిళ మరిది శనివారం 20 మందితో కలిసి ట్రాక్టర్ డ్రైవర్‌ని చావబాదాడు. ఆపై యాసిడ్‌ను కళ్లల్లో ఇంజక్ట్ చేశారు. యాసిడ్ కారణంగా బాధితుడు రెండుకళ్లు కోల్పోయాడని వైద్యులు నిర్ధారించారు.


సకినా ఖాటున్

ఇప్పుడు తెలిసిందా నా సత్తా!

- పారా పవర్ లిఫ్టింగ్ వరల్డ్‌కప్‌లో సకినాకు రజతం
- కామన్వెల్త్‌కు ఎంపిక చేయకపోవడంపై పోరాడుతున్న లిఫ్టర్

కోల్‌కతా: భారత పారా పవర్ లిఫ్టర్ సకినా ఖాటున్ దేశం గర్వించేలా చేసింది. ప్రతిష్ఠాత్మక పారా పవర్ లిఫ్టింగ్ వరల్డ్‌కప్‌లో రజతం గెలుచుకుంది. 45 కిలోల విభాగంలో బరిలోకి దిగిన ఆమె 80 కిలోల బరువెత్తి వెండి పతకం నెగ్గింది. అనేక ప్రతికూల పరిస్థితుల్లో ఈ టోర్నీకి హాజరైన ఆమె అద్భుత ప్రదర్శన చేయడం విశేషం. ఈ ఏడాది జరిగే కామన్వెల్త్ క్రీడలకు తనను ఎంపిక చేయకపోవడంతో ఆత్మహత్య చేసుకుంటానని గత నెలలో ప్రకటించిన సకినా వార్తల్లో నిలిచింది. అర్హత ఉన్నా తనకు అన్యాయం జరగడాన్ని ఆక్షేపించిన సకినా వరల్డ్‌కప్ పతకంతో తన సత్తా ఏపాటిదో మరోసారి నిరూపించుకుంది. వాస్తవానికి కామన్వెల్త్ క్రీడల్లో పతకం నెగ్గిన భారత ఏకైక పారా అథ్లెట్‌గా సకినా గుర్తింపు దక్కించుకుంది. గత పోటీల్లో లైట్‌వెయిట్ విభాగంలో ఆమె కాంస్యం సాధించింది. అదే విధంగా ఈ సారి జరిగే క్రీడల కోసం కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీజీఎఫ్) అర్హత ప్రమాణాలను కూడా అందుకున్నది. అయినా.. జట్టు సెలెక్షన్స్‌లో ఆమెను పక్కనబెట్టారు. దాంతో, తనను ఎంపిక చేయకుంటే భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. తనకు తీవ్ర అన్యాయం జరిగిందని.. ఈ విషయంలో కల్పించుకొని న్యాయం చేయాలని కోరుతూ.. ప్రధాని మోదీకి లేఖ కూడా రాసింది. ఒకటిన్నరేళ్ల వయసులో పోలియో బారిన పడిన సకినా.. తాను అన్ని అర్హతా ప్రమాణాలు అందుకున్నానని, కామన్వెల్త్‌లో మరో పతకం నెగ్గే దిశగా ఎంతగానో కష్టపడుతున్నానని లేఖలో తెలిపింది. తనను జట్టులో చేర్చాలని భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ)ని ఎన్నోసార్లు అభ్యర్థించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. తాను కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనేలా చూడాలని మోదీని అభ్యర్థించింది. మరి, తాజా పతకాన్ని చూసి అయినా సంబంధిత అధికారులు సకినాను కామన్వెల్త్‌కు ఎంపిక చేస్తారో లేదో చూడాలి.

మారింది ఫార్మాటే.. ఆట మాత్రం సేమ్ టు సేమ్.. టీ20 సిరీస్‌నూ భారత జట్టు అదిరే ఆటతో ఆరంభించింది. ముందుగా శిఖర్ ధవన్ (39 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 72) అండతో వచ్చిన వారు వచ్చినట్టు ధనాధన్ బ్యాటింగ్‌తో స్కోరును పరిగెత్తించగా సఫారీలపై టీ20ల్లో భారత్ అత్యధిక పరుగుల రికార్డును తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత డివిల్లీర్స్ లేకుండానే బరిలోకి దిగిన ఆతిథ్య జట్టును పేసర్ భువనేశ్వర్ ఆటాడుకున్నాడు. ఆరంభ, డెత్ ఓవర్లలో విరుచుకుపడి ఐదు వికెట్లతో ప్రత్యర్థి వెన్ను విరిచాడు. హెన్‌డ్రిక్స్ ఒక్కడే పోరాటాన్ని ప్రదర్శించాడు. మరోవైపు ఈ మైదానంలో ముందుగా బ్యాటింగ్ చేసిన జట్టు గెలవదనే సెంటిమెంట్‌నూ భారత్ బ్రేక్ చేసింది.

మూడు ఫార్మాట్లలో ఐదేసి వికెట్లు తీసిన తొలి భారత బౌలర్ భువనేశ్వర్ (టెస్టుల్లో నాలుగు సార్లు, వన్డే.. టీ20ల్లో ఒక్కోసారి)

టీ20ల్లో దక్షిణాఫ్రికాపై భారత్‌కు ఇదే అత్యధిక స్కోరు



ధవన్ దంచగా.. భువీ వణికించగా!

- తొలి టీ20లో సఫారీలపై భారత్ విజయం
- శిఖర్ అర్ధ సెంచరీ
- ఐదు వికెట్లతో అదరగొట్టిన భువనేశ్వర్

శిఖర్ ధవన్ (39 బంతుల్లో 72)


మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ భువనేశ్వర్ (5/24)

జొహాన్నెస్‌బర్గ్: మూడు టీ20ల సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. ఓపెనర్ శిఖర్ ధవన్ మెరుపు అర్ధసెంచరీకి పేసర్ భువనేశ్వర్ (5/24) సూపర్ షో తోడవ్వడంతో ఆదివారం వాండరర్స్ మైదానంలో జరిగిన తొలి టీ20లో భారత్ 28 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. 2014 ఏప్రిల్ తర్వాత సఫారీలపై భారత్ గెలవడం ఇదే తొలిసారి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 203 పరుగులు చేసింది. మనీశ్ పాండే (27 బంతుల్లో 1 సిక్స్‌తో 29), కోహ్లీ (20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 26) రాణించారు. ఓపెనర్ రోహిత్ శర్మ (9 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 21) మెరుపు ఆరంభాన్నిచ్చాడు. ఆ తర్వాత లక్ష్యం కోసం బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 9 పరుగులు 175 పరుగులు చేసి ఓడింది. హెన్‌డ్రిక్స్ (50 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 70), బెహర్డీన్ (27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 39) మినహా అంతా విఫలమయ్యారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ భువనేశ్వర్‌కు దక్కింది.

మెరుపు ఆరంభం

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ తుఫాన్ వేగంతో ప్రారంభమైంది. మైదానం చిన్నదిగా ఉండడంతో పాటు అవుట్‌ఫీల్డ్ వేగంగా స్పందించడంతో ఓపెనర్లు చెలరేగారు. తొలి ఓవర్ రెండో బంతినే రోహిత్ సిక్సర్‌గా మలచగా చివరి రెండు బంతులను 6,4గా ముగించడంతో 18 పరుగులు వచ్చాయి. ఆ తర్వాత అరంగేట్ర పేసర్ డాలా వేసిన ఓవర్ తొలి బంతిని ఫోర్‌గా మలిచినా ఐదో బంతికి కీపర్ క్యాచ్ ఇచ్చి రోహిత్ వెనుదిరిగాడు. ఈ దశలో కోహ్లీ కాకుండా సురేశ్ రైనా (7 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్సర్‌తో 15) బరిలోకి దిగి ఉన్న కాసేపు విజృంభించాడు. మూడో ఓవర్‌లో వరుసగా సిక్స్, ఫోర్ సాధించాడు. మరుసటి ఓవర్‌లో ధవన్ మిడ్ వికెట్ మీదుగా ఓ భారీ సిక్సర్ కొట్టాడు. అదే ఓవర్ చివరి బంతిని రైనా లెగ్ సైడ్ ఆడాలనుకున్నా అది ఎడ్జ్ తీసుకుని గాల్లోకి లేవడంతో డాలా రిటర్న్ క్యాచ్ తీసుకున్నాడు. దీంతో నాలుగు ఓవర్లు ముగిసేసరికి 49 పరుగులతో రన్‌రేట్ 12.25తో ఉన్నా రెండు వికెట్లు కోల్పోవాల్సి వచ్చింది. ఈ దశలో ధవన్, కోహ్లీ మరోసారి చెలరేగుతూ స్కోరును పరిగెత్తించారు. దీంతో పవర్‌ప్లేలో భారత్ 78/2 స్కోరు సాధించింది. టీ20ల్లో భారత్‌కు ఇదే అత్యధికం. అయితే ఎనిమిదో ఓవర్‌లో కోహ్లీ లాంగ్ ఆన్‌లో ఆడిన భారీ షాట్ బెహర్డీన్ చేతుల్లోకి వెళ్లినా అందుకోలేకపోయాడు. అదే ఓవర్‌లో తను ఫోర్, సిక్స్ బాదాడు. 8.2 ఓవర్లలోనే జట్టు వంద పరుగులు దాటింది. కానీ పదో ఓవర్‌లో కోహ్లీ రూపంలో భారత్‌కు గట్టి షాకే తగిలింది. షంసి తనను ఎల్బీగా అవుట్ చేశాడు. అయితే ఈ నిర్ణయంపై కోహ్లీ రివ్యూకు వెళ్లినా ఫలితం దక్కలేదు. మూడో వికెట్‌కు వీరి మధ్య 59 పరుగులు జత చేరాయి. అటు జోరు ప్రదర్శించిన ధవన్ ఓ చక్కటి ఫోర్‌తో 27 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత మరో 4 ఫోర్లు బాదినా 15వ ఓవర్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. 17వ ఓవర్‌లో మనీష్ పాండే ఇచ్చిన క్యాచ్‌ను షంసి వదిలేశాడు. కానీ తను ఈ అవకాశాన్ని సరిగ్గా సొమ్ము చేసుకోలేకపోయాడు. ఆఖరి వరకు అజేయంగా నిలిచినా బ్యాటింగ్ పిచ్‌పై వేగం కనబరచకపోగా అతడి ఇన్నింగ్స్‌లో ఓ సిక్స్ మినహా బౌండరీ లేదు. వేగంగా ఆడే క్రమంలో ధోనీ (16) 19వ ఓవర్‌లో అవుటయ్యాడు. ఆఖరి ఓవర్‌లో 9రన్స్ చేసిన భారత్ 200 మార్క్ దాటింది.

చెలరేగిన భువీ


లక్ష్యం కోసం బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ఓ బౌండరీతో ప్రారంభమైనా ఆ తర్వాత తడబడింది. భువనేశ్వర్ వరుస ఓవర్లలో 2 వికెట్లు తీసి దెబ్బతీశాడు. ఇన్నింగ్స్ రెండో ఓవర్లో దక్షిణాఫ్రికా మూడు ఫోర్లతో ఫర్వాలేదనిపించినా మరుసటి ఓవర్‌లో భువీ ఓపెనర్ స్మట్ (14)ను అవుట్ చేశాడు. తన తర్వాతి ఓవర్‌లోనే డుమిని (3) ఇచ్చిన క్యాచ్‌ను మిడ్‌వికెట్ నుంచి వెనక్కి పరిగెడుతూ రైనా అద్భుతంగా అందుకున్నాడు. ఇక పాండ్యా తన తొలి ఓవర్‌లోనే ప్రమాదకర మిల్లర్ (9)ను అవుట్ చేయడంతో జట్టు 55 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయింది. మరోవైపు ఓపెనర్ హెన్‌డ్రిక్స్ మాత్రం ధాటిని కొనసాగించాడు. అతడికి బెహర్డీన్ నుంచి సహకారం లభించింది. వీరిద్దరూ వరుస బౌండరీలతో స్కోరులో కదలిక తెచ్చారు. అటు 37 బంతుల్లో హెన్‌డ్రిక్స్ తొలి అర్ధ సెంచరీ సాధించాడు. ఈ దశలో వేగం పెంచిన బెహర్డీన్.. చాహల్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 81 రన్స్ జోడించారు. మరోవైపు హెన్‌డ్రిక్స్ భారీషాట్లతో విరుచుకుపడి ఉత్కంఠ పెంచాడు. అయితే 18వ ఓవర్‌లో తన రెండో స్పెల్ ఆరంభించిన భువీ కోలుకోలేని దెబ్బ తీశాడు. తొలి బంతికే హెన్‌డ్రిక్స్‌ను నాలుగు, ఐదో బంతికి క్లాసెన్ (16), మోరిస్ (0)ను అవుట్ చేయగా చివరి బంతికి ప్యాటర్సన్ (1) రనౌట్ అయ్యాడు. దీంతో భారత్ విజయం ఖాయమైంది.

స్కోరు బోర్డు

భారత్: రోహిత్ (సి) క్లాసెన్ (బి) డాలా 21; ధవన్ (సి) క్లాసెన్ (బి) పెహ్లుక్వాయో 72; రైనా (సి అండ్ బి) డాలా 15; కోహ్లీ (ఎల్బీ) షంసి 26; పాండే (నాటౌట్) 29; ధోనీ (బి) మోరిస్ 16; పాండ్యా (నాటౌట్) 13; **ఎక్స్‌ట్రాలు 11; మొత్తం: 20 ఓవర్లలో 203/5.వికెట్ల పతనం:** 1-23, 2-49, 3-108, 4-155, 5-183. **బౌలింగ్:** ప్యాటర్సన్ 4-0-48-0; డాలా 4-0-47-2; మోరిస్ 4-0-39-1; షంసి 4-0-37-1; స్మట్స్ 2-0-14-0; పెహ్లుక్వాయో 2-0-16-1.

దక్షిణాఫ్రికా: స్మట్స్ (సి) ధవన్ (బి) భువనేశ్వర్ 14; హెన్‌డ్రిక్స్ (సి) ధోనీ (బి) భువనేశ్వర్ 70; డుమిని (సి) రైనా (బి) భువనేశ్వర్ 3; మిల్లర్ (సి) ధవన్ (బి) పాండ్యా 9; బెహర్డీన్ (సి) పాండే (బి) చాహల్ 39; క్లాసెన్ (సి) రైనా (బి) భువనేశ్వర్ 16; పెహ్లుక్వాయో (సి) చాహల్ (బి) ఉనాద్కట్ 13; మోరిస్ (సి) రైనా (బి) భువనేశ్వర్ 0; ప్యాటర్సన్ (రనౌట్) 1; డాలా (నాటౌట్) 2; షంసి నాటౌట్ 0; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 175/9, వికెట్ల పతనం:** 1-29, 2-38, 3-48, 4-129, 5-154, 6-158, 7-158, 8-159, 9-175. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-24-5; ఉనాద్కట్ 4-0-33-1; బుమ్రా 4-0-32-0; పాండ్యా 4-0-45-1; చాహల్ 4-0-39-1.

గాయంతో డివిల్లీర్స్ అవుట్




జొహాన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా జట్టును గాయాల బెడద వీడడంలేదు. ఇప్పటికే ఓసారి గాయంతో భారత్‌తో తొలి మూడు వన్డేలకు దూరంగా ఉన్న స్టార్ బ్యాట్స్‌మన్ డివిల్లీర్స్ మరోసారి గాయంతో టీ20 సిరీస్ నుంచి వైదొలిగాడు. టీమిండియాతో ఐదో వన్డేకు ముందు డివిల్లీర్స్ మోకాలికి గాయం అయింది. అయినా ఆఖరి రెండు వన్డేల్లో అతడు పాల్గొన్నాడు. కానీ అది తిరగబెట్టడంతో కోహ్లీసేనతో టీ20 మ్యాచ్‌లకు దూరం కావాల్సి వచ్చింది. భారత్‌తో మూడో టెస్ట్ సందర్భంగా కుడి చూపుడు వేలికి గాయం కావడంతో మొదటి మూడు వన్డేలను డివిల్లీర్స్ మిస్సయిన సంగతి తెలిసిందే. డుప్లెసిస్, కీపర్ క్వింటన్ డికాక్ గాయాలతో ఇదివరకే భారత్‌తో టీ20 సిరీస్‌నుంచి తప్పుకొన్నారు.

ఇంగ్లండ్ ఉత్కంఠ విజయం

- అయినా దక్కని ఫైనల్ బెర్తు

హామిల్టన్: మూడు వరుస పరాజయాల తర్వాత గెలుపు రుచి చూసిన ఇంగ్లండ్ ఫైనల్‌కు చేరుకోవడంలో మాత్రం విఫలమైంది. ముక్కోణపు టీ-20 సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లిష్ జట్టు రెండు పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. కెప్టెన్ మోర్గాన్ (46 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 80 నాటౌట్), డేవిడ్ మలాన్ (36 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 53) మెరుపు అర్ధ శతకాలతో చెలరేగడంతో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 194 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లలో ట్రెంట్‌బౌల్ట్ మూడు, టిమ్ సౌథీ రెండు వికెట్లు తీశారు అనంతరం ఛేదనలో న్యూజిలాండ్ ఓవర్లన్నీ ఆడి 4 వికెట్లకు 192 పరుగులు చేసి గెలుపు ముంగిట బోల్తా పడింది. ఓపెనర్లు గప్టిల్ (47 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 62), కొలిన్ మన్రో (21 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 57) విజృంభించినా ఫలితం లేకపోయింది. ఆఖరి ఓవర్లో కివీస్ విజయానికి 12 పరుగులు అవసరం అవగా.. ఇంగ్లండ్ బౌలర్ గ్రాండ్‌హోమ్ 9 పరుగులే ఇచ్చాడు. ఈ మ్యాచ్‌లో ఓడినా రన్‌రేట్ ఆధారంగా న్యూజిలాండ్ ఫైనల్‌కు చేరుకుంది. ఈ నెల 21న ఆస్ట్రేలియాతో ఆ జట్టు అమీతుమీ తేల్చుకోనుంది.

మానవాదిత్యకు రజతం



న్యూఢిల్లీ: భారత యువ షూటర్ మానవాదిత్య సింగ్ రాథోడ్ కతార్ ఓపెన్ షాట్‌గన్ మీట్‌లో రజతంతో మెరిశాడు. జూనియర్స్ మెన్స్ ట్రాప్ ఈవెంట్‌లో బరిలోకి దిగిన మానవాదిత్య ఫైనల్లో 118 స్కోరుతో రెండో స్థానంలో నిలిచి వెండి పతకం గెలుచుకున్నాడు. ఇటలీ షూటర్ (119) ఒకేఒక్క పాయింట్ తేడాతో స్వర్ణం, జర్మనీ షూటర్ కాంస్యం నెగ్గారు.

ఆ వ్యాఖ్యలు బాధిస్తున్నాయి !



లిండ్సే వోన్

ప్యాంగ్‌చాంగ్: లిండ్సే వోన్.. అమెరికాకు చెందిన ఈమె ఆల్ టైమ్ స్కీయర్లలో ఒకరు. 2010 ఒలింపిక్స్‌లో 'డౌన్‌హిల్'లో స్వర్ణ పతకం గెలిచిన ఆమె.. ఈసారి 'సూపర్-జి'లో పతక రేసులోనే లేకపోవడం వింటర్ ఒలింపిక్స్ చరిత్రలో ఓ సంచలనం. అంతేకాదు.. యావత్ స్కీయింగ్ ప్రపంచాన్ని షాక్‌కు గురిచేసింది. ఈ విభాగంలో ఆమె ఆరో స్థానానికి పడిపోవడం గమనార్హం. అయితే తాను పతకం నెగ్గకపోవడంకంటే కూడా ట్విటర్‌లో అభిమానులు తనను తిట్టిపోయడం వోన్‌ను ఎక్కువగా బాధిస్తోందట. లిండ్సే అమెరికా వ్యతిరేకి అని నెటిజన్లు ఆమెను దుయ్యబడుతున్నారు. కారణం.. ప్యాంగ్‌చాంగ్‌లో తాను పతకం గెలిస్తే వైట్‌హౌస్‌ను సందర్శించబోనని ప్రకటించింది. వోన్ పతకం మిస్సవడంతో విషాదంలో మునిగిన అమెరికన్లు.. ఆమె వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కొందరు మండిపడుతుండగా మరికొందరు తిట్ల దండకం అందుకున్నారు. కానీ అభిమానుల ఆగ్రహం సరికాదని, తాను పక్కా అమెరికన్‌నని చెబుతోందామె.

లంకదే టీ-20 సిరీస్

సిలెట్: బంగ్లాదేశ్ పర్యటనను శ్రీలంక విజయవంతంగా ముగించింది. ఇప్పటికే ముక్కోణపు వన్డే సిరీస్, టెస్టు సిరీస్ నెగ్గిన లంక టీ-20లను కూడా కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన రెండో టీ-20లో లంకేయులు 75 పరుగుల తేడాతో ఆతిథ్య బంగ్లాను చిత్తు చేశారు. దాంతో, రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేశారు. తొలుత కుశాల్ మెండిస్ (42 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 70) విజృంభించడంతో లంక నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 210 పరుగులు చేసింది. అనంతరం భారీ ఛేదనలో బంగ్లా జట్టు 18.4 ఓవర్లలో 135 పరుగులకే కుప్పకూలి చిత్తుగా ఓడిపోయింది. కుశాల్ మెండిస్‌కే మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, సిరీస్ అవార్డులు దక్కాయి.

ఫెడెక్స్@97



రోటెర్‌డామ్: స్విట్జర్లాండ్ దిగ్గజం, వరల్డ్ నెంబర్ వన్ రోజర్ ఫెడరర్ ఖాతాలో మరో టైటిల్ చేరింది. రోటెర్‌డామ్ ఏబీఎన్ అమ్రో వరల్డ్ టోర్నమెంట్‌లో ఫెడెక్స్ విజేతగా నిలిచాడు. ఆదివారం పూర్తి ఏకపక్షంగా సాగిన ఫైనల్లో రోజర్ 6-2, 6-2తో వరుస సెట్లలో గ్రిగర్ దిమిత్రోవ్‌ను మట్టికరిపించాడు. గంటలోపే దిమిత్రోవ్ ఆట కట్టించిన ఫెడెక్స్ ముఖాముఖీల్లో అతనిపై తన ఆధిపత్యాన్ని 7-0కు పెంచుకున్నాడు. అధికారికంగా నెంబర్ వన్ హోదా దక్కించుకోవడానికి ఒక రోజు ముందు అతను ఈ ట్రోఫీ నెగ్గడం విశేషం. రోటెర్‌డామ్‌లో ఫెడెక్స్ మూడోసారి విజేతగా నిలువగా.. ఓవరాల్‌గా అతనిది 97వ టైటిల్. దాంతో, 20 గ్రాండ్‌స్లామ్‌ల విజేత రోజర్ తన కెరీర్‌లో వంద టైటిళ్ల లక్ష్యానికి చేరువయ్యాడు.

అమ్మాయిలకు షాక్

మూడో టీ-20లో భారత్ ఓటమి



జొహాన్నెస్‌బర్గ్: వన్డే సిరీస్ నెగ్గిన ఉత్సాహంలో టీ-20 సిరీస్‌పై కూడా కన్నేసిన భారత అమ్మాయిలకు సౌతాఫ్రికా మహిళల జట్టు షాకిచ్చింది. ఆదివారం జరిగిన మూడో టీ-20లో భారత్‌ను ఐదు వికెట్ల తేడాతో ఓడించింది. ఈ పోరులో నెగ్గి మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌ను చేజిక్కించుకుందామని ఆశించిన టీమిండియాను బ్యాటింగ్ వైఫల్యం దెబ్బకొట్టింది. తొలుత బ్యాటింగ్ చేసిన హర్మన్‌ప్రీత్‌సేన 17.5 ఓవర్లలో 133 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (30 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 48), స్మృతి మంధాన (24 బంతుల్లో 5 ఫోర్లు, సిక్సర్‌తో 37), వేదా కృష్ణమూర్తి (14 బంతుల్లో 4 ఫోర్లతో 23) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. గత రెండు మ్యాచ్‌ల్లో హాఫ్ సెంచరీలతో మెరిసిన మిథాలీరాజ్ (0) ఈ సారి డకౌటైంది. సఫారీ బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్ ఐదు వికెట్లతో భారత్‌ను దెబ్బకొట్టింది. అనంతరం 134 పరుగుల లక్ష్యాన్ని సౌతాఫ్రికా 19 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. సున్ లాస్ (41), చోల్ ట్రైయాన్ (34) రాణించారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-2తో నిలిచిన ఆతిథ్య జట్టు సిరీస్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. నాలుగో టీ-20 ఈ నెల 21న జరగనుంది.



వైభవంగా ఆమ్రపాలి పెళ్లి

- ఐపీఎస్ సమీర్ శర్మతో ఏడడుగులు వేసిన వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్
- జమ్మూలో వేడుకకు వరంగల్ నుంచి కమిషనర్ శృతి, ప్రముఖుల హాజరు

హన్మకొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ఆమ్రపాలి కాట, ఐపీఎస్ అధికారి సమీర్ శర్మ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వీరి వివాహం జమ్మూ నగరంలో ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వివాహ వేడుకకు ఇరు కుటుంబాల వారు, బంధువులు, స్నేహితులు హాజరయ్యారు. అంతకు ముందు వరుడు సమీర్ సాయంత్రం ఆరు గంటలకు జమ్మూ రెసిడెన్సీ రోడ్డులోని తన నివాసం కేసీ రెసిడెన్సీ నుంచి బరాత్‌గా కల్యాణ మండపానికి వచ్చారు. సమీర్ కుటుంబ సభ్యులు జమ్మూ మార్బుల్ మార్కెట్‌లోని కింగ్స్ విల్లేలో సోమవారం రాత్రి విందు ఏర్పాటు చేశారు. వివాహానికి వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ శ్రుతి ఓజా, ఎమ్మెల్యే ఆరూరి రమేష్, టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, వరంగల్ అర్బన్ కలెక్టరేట్ సిబ్బంది, మరి కొంతమంది ముఖ్యులు హాజరయ్యారు.

వృద్ధుడి చేతిలో చిరుత హతం

వి.కోట/హోసూరు, ఫిబ్రవరి 18 : చిరుతను ఒంటరిగా ఎదుర్కొని దానిని హతమార్చిన ఓ వృద్ధ రైతు ఉదంతమిది. చిత్తూరు జిల్లా సరిహద్దు.. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్న ఈ సంఘటన సంచలనం సృష్టించింది. మహారాజకడై చెందిన రామమూర్తి (62) ఉదయం పొలంలో పాడి పశువులు మేపుతుండగా అకస్మాత్తుగా ఓ చిరుత దాడి చేసింది. పశువులు భయంతో పరుగులు తీయడంతో, వాటిని వదిలి రామమూర్తిపై తెగబడింది. ఒక్క క్షణంలో తేరుకున్న అతడు ధైర్యంగా చిరుతను ఎదుర్కొన్నాడు. తన వద్దనున్న వేటకొడవలితో నరకడంతో కింద పడిన చిరుత అక్కడికక్కడే హతమైంది. విషయం తెలుసుకున్న అటవీశాఖాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చిరుతపులి కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. పశువులను అడవిలోకి తీసుకెళ్లగా ఈ సంఘటన జరిగిందా, లేక అడవి బయట పొలాల్లో జరిగిందా అన్న అంశంపై విచారణ చేపడుతున్నారు. గాయపడిన రామూర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, అతడిని కూడా విచారిస్తున్నారు.



చిరుతపులి కళేబరం (ఇన్‌సెట్‌లో) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు

ఏటా 100 కోట్ల మంది చిన్నారులపై వేధింపులు

- లైంగిక, శారీరక దాడులు ఎదుర్కొంటున్న బాలలు
- బలవన్మరణాలకు ఇవే ప్రధాన కారణాలు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడి
- నిర్మూలన దిశగా అడుగులేయాలని దేశాలకు పిలుపు



హైదరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఏటా మానసిక, శారీరక, లైంగిక దాడులకు గురవుతున్న చిన్నారుల సంఖ్య అక్షరాలా వంద కోట్లు. 10 నుంచి 18 ఏళ్లలోపు బాలల్లో బలవన్మరణాలకు వేధింపులే ప్రధాన కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. ఈ సంఖ్య ప్రమాదకరస్థాయిలో పెరుగుతోందని, ప్రపంచదేశాలు ఈ వేధింపుల నివారణ దిశలో చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చింది. ఈ నెల 8న జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో డబ్ల్యూహెచ్ఓ ఇదే అంశంపై ప్రధానంగా చర్చించింది. చిన్నారులకు మరింత భద్రత అవసరమని.. ఇందుకు అన్ని దేశాలు ముందుకు రావాలని కోరింది. ప్రతి ఐదుగురు బాలల్లో ఒకరు శారీరక వేధింపులకు గురవుతున్నారని పేర్కొంది. అదేవిధంగా.. ముగ్గురు చిన్నారుల్లో ఒకరు మానసిక వేధింపులకు, 18 శాతం మంది అమ్మాయిలు, 8 శాతం అబ్బాయిలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. చిన్నతనంలో వేధింపులకు గురైనవారిపై.. ఆ ప్రభావం జీవితాంతం ఉంటుందని డబ్ల్యూహెచ్ఓ ప్రతినిధి డాక్టర్ ఎటిన్నే క్రుగ్ తెలిపారు. 'వేధింపులను తట్టుకోలేక వీరు మాదక ద్రవ్యాలు, మద్యం, ధూమపానాలకు బానిసలవుతున్నారు. తీవ్ర ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రాణాంతక ఎయిడ్స్, ఒత్తిడి, మూత్రపిండాల సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు' అని వివరించారు. అన్ని దేశాలు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి, తక్షణ చర్యలు చేపట్టేందుకు 'గ్లోబల్ ప్లాన్ ఆఫ్ యాక్షన్'ను రూపొందించామన్నారు.

అత్యవసర చర్యలివి..

- చిన్నారుల్లో మానవతావిలువలను పెంపొందించాలి.
- వేధింపులపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. నిందితులకు చట్టం ఉందనే భయం కలిగించాలి.
- తల్లిదండ్రులే మొదటి గురువులు.. ఇంట్లో విచక్షణతో మెలగాలి. ఆడ, మగ అనే భేదభావానికి తావివ్వొద్దు.
- వేధింపులకు గురైన పిల్లలపై మరింత శ్రద్ధ అవసరం. వారికి మానసిక ధైర్యాన్ని అందించాలి
- పిల్లల సమస్యలను గురువులు అర్థం చేసుకుని.. వారితో సన్నిహితంగా మెలగాలి.

ఫిర్యాదుకు పాక్సో ఈ బాక్స్

చిన్నారులను లైంగిక వేధింపుల నుంచి రక్షించేందుకు కేంద్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం (ఎన్‌సీపీసీఆర్) 'పాక్సో ఈ బాక్స్'ను రూపొందించింది. బాధితులు, వారి తల్లితండ్రులు ఈ బాక్స్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఎన్‌సీపీసీఆర్ తెలిపింది. ఇందుకు తమ వెబ్‌సైట్ ఠీఠీఠీ.ఛిఇఛిట.జౌఠి.జీ ను బ్రౌజ్ చేయాలని సూచించింది. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తామని, వాటిని సంబంధిత పోలీసులు, బాలల హక్కుల సంఘాలకు పంపుతామని పేర్కొంది. టోల్‌ఫ్రీ నంబరు 1098తోపాటు, 98682-35077కు ఫోన్‌ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని వివరించింది.

తేజస్ యుద్ధ విమానాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్



డీఆర్‌డీఓ చైర్మన్ క్రిస్టొఫర్ వెల్లడి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) పరిశోధనలు చేస్తోందని ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎస్ క్రిస్టొఫర్ వెల్లడించారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అడ్వాన్స్‌డ్ ఇన్ కంట్రోల్ అండ్ ఆప్టమైజేషన్ ఆఫ్ డైనమికల్ సిస్టమ్స్ (ఏసీఓడీఎస్)ను ఆయన హైదరాబాద్‌లో ఆదివారం ప్రారంభించారు. డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన తేలికపాటి యుద్ధ విమానం తేజస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కూడా ఉపయోగించామన్నారు. "నియంత్రణ మరియు మార్గదర్శకత్వక టెక్నాలజీలు రక్షణ రంగంలో చాలా కీలకమైన పాత్ర పోషిస్తాయి. వీటిలో మనం చాలా అభివృద్ధి సాధించాం. ఉదాహరణకు తేజస్‌నే తీసుకుందాం. దీనిలో అత్యుత్తమ నియంత్రణ, మార్గదర్శకత్వ టెక్నాలజీలను వాడటం వల్ల ఎలాంటి పరిస్థితుల్లోనైనా అది పనిచేయగలుగుతుంది" అని ఆయన పేర్కొన్నారు. క్షిపణులు, సబ్ మెరైన్‌లు, ఎయిర్‌క్రాఫ్ట్‌లలో వీటికి విస్తృతమైన ప్రయోజనాలు ఉన్నాయన్నారు. టెక్నాలజీ రంగంలో అనేక మార్పులు వ స్తున్నాయని.. వీటిని ఒడిసిపట్టుకోవాల్సిన అవసరముందని డీఆర్‌డీఓ క్షిపణి విభాగం డైరెక్టర్ జనరల్, రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. "వైమానిక రంగంలో కొత్త కొత్త టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్నాయి. భవిష్యత్తులో రక్షణ రంగంలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. వీటిని అభివృద్ధి చేయటానికి అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవాలి. ఆధునిక నియంత్రణ, మార్గదర్శకత్వ టెక్నాలజీలను అన్ని రక్షణ వ్యవస్థలలోనూ ఉపయోగించటానికి ప్రయత్నించాలి" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియాకు చెందిన ప్రొఫెసర్ ఫ్రాంక్ ఆల్‌గోవర్, ఎన్ఐటీ తిరుచ్చికి చెందిన ప్రొఫెసర్ అయ్యగారి రామకళ్యాణ్‌తో పాటుగా అనేక మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. రక్షణ రంగంలో అనేక పరిశోధనలు చేసి పదవి విరమణ చేసిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్‌వీ కాదమ్, ఎస్‌కే రాయ్‌లను ఈ సందర్భంగా సత్కరించారు.

- స్పెషల్ డెస్క్

మేఘాలయాలో ఎన్సీపీ అభ్యర్థి హత్య

మందుపాతరతో కారును పేల్చిన మిలిటెంట్లు.. ఇద్దరు గార్డ్స్ కూడా మృతి

షిల్లాంగ్, ఫిబ్రవరి 18: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న మేఘాలయాలో దారుణం చోటుచేసుకుంది. మిలిటెంట్లు ఆదివారం రాత్రి ఓ కారును మందుపాతరతో పేల్చివేయడంతో కారులో ప్రయాణిస్తున్న నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అభ్యర్థి, ఆయన ఇద్దరు అంగరక్షకులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.. మృతిచెందిన అభ్యర్థిని విలియం నగర్ నుంచి పోటీచేస్తున్న జోనాథన్ నెంగ్మింజా సంగ్మా (43)గా గుర్తించారు. ఆయన తన నియోజకవర్గంలో ప్రచారం ముగించుకొని విలియంనగర్‌కు తిరిగివెళుతుండగా రాత్రి 7:50 గంటల ప్రాంతంలో మిలిటెంట్లు ఈ దారుణానికి ఒడిగట్టారు. ఘటన జరిగినప్పుడు కారులో ఏడుగురు ప్రయాణిస్తున్నారని పోలీసులు తెలిపారు. కారులో మిగతా నలుగురికి గాయాలైనట్టు తెలుస్తోంది. కాగా ఈ ఘాతుకానికి పాల్పడింది గారోలాండ్ సమస్య కోసం పోరాడుతున్న గారో నేషనల్ లిబరేషన్ ఆర్మీగా అనుమానిస్తున్నారు. జోనాథన్ 2013లో ఇదే నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు.

27న టీపీయూఎస్ ఆధ్వర్యంలో ధర్నా

వరంగల్: ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా టీపీయుఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 27న అన్ని మండల కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూరం విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం హన్మకొండలో తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య
సోమవారం • 19 ఫిబ్రవరి 2018

స్ఫూర్తి



అడవి కూడా పసిపాప లాంటిదే... కొన్ని వేల కుటుంబాలకు, వందల గ్రామాలకు! ఏ చెడు చూపు పడకుండా కంటికి రెప్పలా కాచుకుంటేనే ఫలసాయం. అలాంటి కంటిపాపకు ఆపద వస్తే? కాపాడుకోవటానికి తల్లిగా ఏం చేయాలి? ఆ అడవిలో దళం ఏర్పాటు చేయాలి. ఆ తల్లి అక్షరాలా అదే చేసింది. అడవిని కాపాడుకునే 'అమ్మల దళం' ఏర్పాటుచేసింది గిరిజన బిడ్డ **జమున**. ఆమె చొరవతో ఏర్పడిన 'అమ్మల దళం' ఇప్పుడు ఆ అడవిని పసిపాపలా సంరక్షిస్తోంది.



అడవికి అమ్మ!

అడవి... గిరిజనులకు సర్వస్వం. పశువులకింత మేత దొరికితేనే, పసివాళ్లకింత పాలు దొరికేది. అడవిలో పుల్ల దొరికితేనే, ఇంట్లో పొయ్యి మండేది. కానీ కలప మాఫియా అడవి మీద పెట్టిన గొడ్డలి గాటుతో ఆ గిరిజన మహిళ కడుపు మండింది.

అడవిలో ఆడ పరశురాముడు!

గండ్రగొడ్డలి భుజాన పెట్టుకొని అడవిలో నడిచి వచ్చే జమునను చూస్తే కలప మాఫియాకు హడల్. వారికి ఆమె ఆడ పరశురాముడు. తనొక అడవిని కాచే వనదుర్గ.. కలప అక్రమ రవాణాదారుల పాలిట అపర దుర్గ. గడచిన 20 ఏళ్లుగా జమున కలప మాఫియాతో పోరాడుతోంది. ఇంతకీ ఎవరీ జమున? అడవి సంరక్షురాలిగా ఎందుకు మారింది?

జమునా తుడు.. ఒక సామాన్య గిరిజన యువతి. జార్ఖండ్‌లోని పూర్వీసింగ్‌భూమ్ జిల్లాలో ఉన్న ముతుర్ఖ ఆమె స్వగ్రామం. ప్రభుత్వం, నక్సలైట్లు పట్టుకోసం పోరాడుతున్న ప్రాంతం అది. 1998లో వివాహమయ్యాక జమున ఆ ఊళ్లో అడుగుపెట్టింది. ఊరిని ఆనుకొనే సుమారు 150 ఎకరాల అటవీ ప్రాంతం ఉంది. ఆ గ్రామస్తులకు అనాదిగా అడవితో పేగుబంధం ఉంది. ఆ అడవిలో ఉండే చెట్టూ పుట్టను దేవతల్లా కొలుస్తారు. జంతువులకు సైతం హాని చేయకుండా మసలుకుంటారు. కొన్నాళ్లకు ప్రశాంతంగా ఉండే అడవిలో కలప మాఫియా కదలికలు మొదలయ్యాయి. చెట్లను నరికి, దుంగలను తరలించటం ప్రారంభమైంది.

జమునకు చిన్నతనం నుంచి మొక్కలంటే ప్రాణం. చిన్నపిల్లగా ఉన్నప్పటి నుంచే తండ్రి తన చిట్టి చేతులతో కొన్ని వందల మొక్కలు నాటించాడు. దానికి తోడు పదో తరగతి వరకు చదివిన చదువు ఆమెలో వివేకాన్ని తట్టి లేపింది. జరుగుతున్న ఘోరాన్ని అడ్డుకోమని ప్రబోధించింది. వెంటనే రంగంలోకి దిగింది. గ్రామంలోని మహిళలతో సమావేశం ఏర్పాటుచేసి అడవులను నరికితే భవిష్యత్తులో జరిగే నష్టాలను తెలిపింది. తమ జీవితాలు అడవుల పరిరక్షణతో ఎలా ముడిపడి ఉన్నదీ విడమర్చి చెప్పింది. 'అడవులను కాపాడే పని మగాళ్లు చేయాలని' వాదించిన తోటి మహిళలకు నచ్చజెప్పింది. అతి కష్టం మీద 25 మంది మహిళలు జమునతో కదిలారు. అధికారులను కలసినా ఫలితం లేకపోవటంతో జమున అధికారాన్ని తన చేతుల్లోకి తీసుకొంది.

మాఫియాకు గొడ్డలిపెట్టు!

స్మగ్లర్లు అక్రమంగా నరికిన కలపను రైలు మార్గంలో తరలించేవారు. ఆయువుపట్టు మీద కొట్టాలనే ఉద్దేశంతో గిరిజన మహిళలంతా రైల్వే అధికారులను కలసి, కలప తరలించటంపై నిషేధం విధించాలని కోరారు. దీంతో కలవరపడిన కలప మాఫియా స్టేషన్ బయట వారిపై విరుచుకుపడింది. అనేక మంది మహిళలు గాయపడ్డారు. రాళ్ల దాడి నుంచి జమునను కాపాడేందుకు ప్రయత్నించిన ఆమె భర్త తలకు గాయమైంది. తలో దిక్కు పరిగెత్తి ప్రాణాలు దక్కించుకున్నారు. రెచ్చిపోయిన మాఫియా రాత్రివేళల్లో చెట్లను తగులబెట్టి ప్రతీకారం తీర్చుకునేది.

కదిలింది వన దుర్గ!

కలప లేకుండా గిరిజనులకు మనుగడ లేదు. దాంతో జమున కలప స్మగ్లర్ల బారి నుంచి అడవిని కాపాడేందుకు మహిళలతో 'వన సురక్ష సమితి'ని ఏర్పాటు చేసింది. చేతిలో గండ్రగొడ్డలితో అడవులకు పహారా కాస్తోంది. అక్కడ 60 మంది మహిళలు జట్లుగా ఏర్పడి రోజులో మూడు పూటలా (ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం) గస్తీ తిరుగుతారు. కొన్నిసార్లు రాత్రిళ్లు కాపలా కాస్తారు. చేతిలో వాటర్ బాటిల్, వెంట ఒక కుక్క ఉంటాయి. ఈటెలు, విల్లు, బాణాలు వారి ఆయుధాలు. కొన్నాళ్లకు వారి తెగువను చూసి, రాత్రిళ్లు కాపలా కాసేందుకు మగవాళ్లు ముందుకొచ్చారు. దాంతో కలప మాఫియాకు ముకుతాడు పడింది.

కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ జమునను 'ఆదర్శ మహిళ'గా ఎంపిక చేసింది. రాష్ట్రపతి భవన్‌లో పురస్కారం అందుకోవటమేగాక దేశ ప్రథమపౌరుడితో కలసి భోజనం చేసే అరుదైన అవకాశమూ ఆమెకు దక్కింది. 'యాక్ట్స్ ఆఫ్ సోషల్ కరేజ్' విభాగంలో 'గాడ్‌ఫ్రే ఫిలిప్స్ బ్రేవరీ అవార్డ్'కు సైతం ఆమె ఎంపికైంది.



ఇప్పుడా ప్రాంతంలో జమునను 'లేడీ టార్జాన్' అని పిలుస్తున్నారు.

గుర్తింపు తెచ్చిన కృషి

చుట్టుపక్కల గ్రామాలకు ఈ స్ఫూర్తి పాకింది. అడవులను కాపాడుకునేందుకు ఎవరికి వారే ముందుకొచ్చారు. మరో 150 సంఘాలను ఏర్పాటు చేశారు. జమున స్ఫూర్తితో 6 వేల మంది సభ్యులుగా చేరారు. చివరకు అటవీ శాఖ ఆ గ్రామాన్ని దత్తత తీసుకొంది. పాఠశాల ఏర్పాటు చేసి రక్షిత నీటి సరఫరా వ్యవస్థను కల్పించింది. కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ జమునను 'ఆదర్శ మహిళ'గా ఎంపిక చేసింది. రాష్ట్రపతి పురస్కారం అందుకోవటమేగాక ఆయనతో కలసి భోజనం చేసే అరుదైన అవకాశమూ ఆమెకు దక్కింది. 2013లో 'యాక్ట్స్ ఆఫ్ సోషల్ కరేజ్' విభాగంలో 'గాడ్‌ఫ్రే ఫిలిప్స్ బ్రేవరీ అవార్డ్'కు సైతం ఆమె ఎంపికైంది. కానీ విచిత్రం ఏమిటంటే.. ఇప్పటికీ జమున కుటుంబం కడు పేదరికంలో మగ్గుతోంది. అలంకరణ సామాగ్రి అమ్మి నెలకు రూ. 2 వేలు సంపాదిస్తుంది జమున. భర్త కూలీ పనులకు వెళతాడు. ఆ సొమ్ముతోనే కుటుంబం గడవాలి. పూరింట్లోనే ఆమె నివాసం. 'గ్రామాలకు వెళ్లి ప్రజల్ని చైతన్యవంతం చేయాలని ఉంది కానీ నాకు శక్తి లేదు. సహాయం లభిస్తే మరిన్ని అడవులను కాపాడతాను' అని అంటారావిడ. ప్రకృతిని కాపాడాలనే ఆశయంతో కలప మాఫియాతో నిరంతర పోరాటం చేస్తున్న జమున ప్రయత్నం ఇప్పటికే చాలామందికి స్ఫూర్తినిచ్చింది. ఆమె విజయయాత్ర ఇంకా కొనసాగుతూనే ఉంటుంది. ఎందుకంటే.. అడవిని కాపాడుకోవటం అంటే మనల్ని మనం కాపాడుకోవటమే కదా.



సంగీతం ఆయన ప్రాణం...
సాహిత్యం ఆయన ప్రణవం!
కథ ఆయన వచస్సు...
కళ ఆయన తపస్సు!
వెరసి...
సినీరంగానికే... ఆయన చిర యశస్సు!

చిర యశో...ధన్‌వాన్

కళాతపస్వి
కె. విశ్వనాథ్ బర్త్‌డే
స్పెషల్ ఇంటర్వ్యూ...
లోపలి పేజీలో

పేరెంటచ్

సీరియస్‌గా తీసుకుంటే అంతే..!

పసి పిల్లల్ని పట్టుకుని "నువ్వు ఏమవుతావో చెప్పు" అనడం కొంత మందికి బాగా అలవాటు. అనూహ్యమైన ఆ ప్రశ్నకు ఏం చెప్పాలో తెలియక పిల్లలు డాక్టర్‌నవుతాననో, యాక్టర్‌నవుతాననో అప్పటికి ఏది నోటికి వస్తే అది చెప్పేస్తారు. అలా చెప్పడం వెనుక ఆ వృత్తి గురించి అప్పటికే ఏదో తెలుసు అనేమీ కాదుకదా. ఎక్కువ సార్లు టీవీలోనో, సినిమాల్లోనో లేదా పత్రికలోనో ఎక్కువ సార్లు చూడటం వల్ల కలిగిన భావనే అవుతుంది తప్ప మరొకటి కాదు. ఆ మాటే పట్టుకుని వాళ్లను ఆ దిశగానే నడిపించాలని చూస్తే, అది ఒక్కోసారి అర్థరహితంగా మారుతుంది.

తెలిసీ తెలియని వయసులో తనేదో ఇంజనీరు అయిపోతానని అన్నంత మాత్రాన పిల్లాడికి మ్యాథమెటిక్ మైండ్ ఉన్నట్లు కాదు కదా! మరెందుకు అలా అన్నాడంటే దానికి సాధారణంగా వారి వృత్తి వైభవమే కారణంగా ఉంటుంది. పెద్ద బంగళాలో ఉండడం, మంచి కారు ఉండడం, చాలా దర్జాగా ఉండడం ఇవన్నీ పిల్లల్ని ఆకర్షిస్తాయి. అంతే తప్ప ఇంజినీరింగ్ కోర్సులో సీటు సంపాదించడం అంటే ఏమిటో, ఆ కోర్సులో చేయవలసిన శ్రమ ఏమిటో ఆ పిల్లాడికి లేశమాత్రమైనా తెలుసా? దాని గురించి ఎంతో కొంత తెలిసాక పిల్లల నోట ఆ మాట వస్తే దాన్ని గురించి ఆలోచించవచ్చు. అలాంటిదేమీ లేని ఆ బాల్యావస్థలో ఏదో ఒకటి చెప్పాలి కాబట్టి అదేదో చెబితే, ఆ మాటను అతని జీవితాన్నీ ముడిబెడితే ఎలా?

అంతకన్నా, అప్పుడో ఇప్పుడో కొన్ని వృత్తుల గురించి పిల్లలకు కొంచెం కొంచెంగా పరిచయం చేస్తూ ఉండాలి. ఆయా వృత్తుల్లోని కష్టనష్టాలేమిటో, సుఖసౌఖ్యాలేమిటో వివరిస్తూ ఉండాలి. ప్రతి ఆనందం వెనుక ఎంతో కొంత కష్టం కూడా ఉంటుందనే విషయాన్ని, వాటి గురించిన ఎంతో కొంత ఆకళింపు ఏర్పడిన తర్వాత తాను ఏం కావాలనుకుంటున్నాడో తానే చెబుతాడు. అంతే గానీ, ఊరికే ఉబుసుపోక ఏదో అడిగేసి, పిల్లలేదో చెప్పేస్తే దాన్నే వాళ్ల తల మీద రుద్దే ప్రయత్నం చేయకూడదు. అది పిల్లలకు మంచిది కాదు... తలిదండ్రులకూ మంచిది కాదు.

విశేషం

ఔను! మళ్లీ పెళ్లి చేసుకున్నారు!

ఎన్నో రోజులుగా ఆమెను చూస్తున్నాడు మైఖేల్. మాట్లాడుతున్నాడు. ఆమె కూడా అంతే! ఆమె అంటే ఇష్టంగానే ఉండేది. ఇద్దరి మధ్యా విడదీయలేని అనుబంధమేమో అనిపించింది అతనికి "పెళ్లి చేసుకుందామా?" అని అడిగాడు. ఇంతకీ అతని పేరు మైఖేల్ జోయస్. ఉండేది న్యూజిలాండ్‌లో. ఆమె కూడా అక్కడే. ఎన్నో రోజుల నుంచి అడుగుదామనుకున్నాడు. మనసులో దాచుకోలేకపోయాడు. చిలిపిగా నవ్వేసింది. ఏమీ సమాధానం చెప్పలేదు. కానీ ఆ నవ్వులోనే అంతా చెప్పేసిందేమో! తికమకపడిపోయాడు. కానీ పట్టువదల్లేదు. మరోసారి అడిగాడు. సరేనంది. ఇంట్లో వాళ్లూ సరేనన్నారు. ఇక పెళ్లికి ప్లాన్ చేసుకున్నారు. బంధుమిత్రులు హాజరవుతున్నారు. అందరి ముఖాల్లో గందరగోళం. వారిద్దరూ చర్చిలో ఉంగరాలు మార్చుకున్నారు. ఎందుకంటే మైఖెల్ తమ వివాహ వేడుక వీడియోను తన బ్లాగ్‌లో పోస్ట్ చేశాడు. దాని పేరు 'ఏ స్పెషల్ వెడ్డింగ్ షూట్'. వీడియో చూసిన వాళ్లందరూ మెచ్చుకున్నారు. కానీ అసలు విషయం తెలిసి నివ్వెరపోయారు. ఈ పెళ్లి న్యూజిలాండ్‌లోనే కాకుండా మొత్తం ప్రపంచమంతా హాట్ టాపిక్ అయింది. అసలు ఏమైంది? ఎందుకంటారా? అది వారికి రెండో పెళ్లి! ఓహ్ ఎక్కడైనా సాధారణమే కదా అంటారా! కాదు. ఇది కాస్త విచిత్రం!



న్యూజిలాండ్‌లోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఉంటున్న మైఖేల్ వయసు 64 ఏళ్లు. ఇంకో విషయం... ఆమెతో అతనికి పెళ్లై 38 ఏళ్లయింది. అదే ఇక్కడ ట్విస్ట్. ఇద్దరూ కలిసి ఉంటున్నా మళ్లీ ఎందుకు ఆ వయసులో ఎందుకు చేసుకున్నారు? అనే ప్రశ్న తలెత్తవచ్చు. ఎందుకంటే అతను మర్చిపోయాడు. మొత్తం జీవితాన్ని! ఆమెతో జరిగిన పెళ్లి కూడా గుర్తులేదు. అతనికి అల్జీమర్స్. 2010లో హఠాత్తుగా దాడి చేసింది. క్రమంగా అన్ని జ్ఞాపకాలు పగిలిన అద్దాలయ్యాయి. ఏళ్లు గడుస్తున్న కొద్దీ పూర్తిగా మర్చిపోయాడు.

కొత్త కొత్తగా!

"పేరేంటి" అని అడిగాడు. బాధను అణుచుకుంటూనే "లిండా జాయిస్" అని ఆమె చెప్పింది. అప్పటి నుంచి కొత్తగా ఆమె ప్రేమలో జీవించాడు. ప్రతి క్షణాన్నీ ఆస్వాదించాడు. అందుకే కొత్తగా పెళ్లి చేసుకున్నాడు. భర్త తన గురించి మర్చిపోయినా లిండా మాత్రం తన ప్రేమను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తోంది. "ఒక రోజు సడన్‌గా 'నన్ను పెళ్లిచేసుకుంటావా?' అని అడిగాడు అప్పటికే చాలా సార్లు అసలు విషయం చెప్పడానికి ట్రై చేశాను. కానీ అతను మాత్రం ఒప్పుకోలేదు. ఈ పెళ్లి నాకో తీపి జ్ఞాపకం. అందరి సమక్షంలో మళ్లీ నా భర్తనే పెళ్లి చేసుకోవడం వింత అనుభూతి" అని చెప్పిందామె.

హెల్త్‌కేర్

ఆరోగ్యానికి ఇవి తప్పనిసరి!



పళ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, మాంసకృత్తులు, వెన్నతీసిన పాల ఉత్పత్తులను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే శరీరానికి అవసరమైన పోషకాలు తగిన మోతాదులో అందుతాయి. చక్కని ఆరోగ్యం మన సొంతమవుతుంది.

- రోజుకు రెండున్నర కప్పుల కూరగాయలు తీసుకోవాలి. ౢకప్పు ఆకుకూరలు తప్పనిసరి.
- మాంసకృత్తులు, పీచు, పొటాషియంలాంటి పోషకాలు పళ్ల ద్వారానే లభిస్తాయి. తాజా పండ్లు అరకప్పు, డ్రైఫ్రూట్స్ పావు కప్పు, ఫ్రూట్ జ్యూస్ తీసుకోవాలి.
- తృణధాన్యాల ద్వారా శరీరానికి తగినంత పీచుపదార్థం లభిస్తుంది. క్వినోవా, బార్లీ, గోధుమపాస్తా, గోధుమ బ్రెడ్ లాంటివి తీసుకోవాలి.
- రోజుకు 150 గ్రాముల మాంసకృత్తులు తీసుకోవాలి.
- పాల ఉత్పత్తుల్లో పొటాషియం, విటమిన్ డి, మాంసకృత్తులు, కాల్షియం లాంటి పలు పోషకాలుండటం వల్ల ఆరోగ్యానికి మంచిది. పెరుగు, వెన్నతీసిన పాలను రోజులో రెండు మూడుసార్లు తీసుకోవాలి.



సెలబ్ ఫిట్

మోడల్‌గా గ్లామర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన బెంగాలీ బ్యూటీ బిపాషా బసు... ఆ తరువాత తన అందం, అభినయంతో బాలీవుడ్‌ను ఊపేసింది. చూడచక్కని శరీర ఆకృతితో కుర్రాళ్ల మతి పోగొడుతున్న ఈ ముద్దుగుమ్మ మెరుపుల వెనుక మంత్రమేంటని అడిగితే... 'క్రమం తప్పని వ్యాయామం' అంటూ చెప్పేసింది. అవుట్‌డోర్ షూటింగ్‌లకు వెళ్లినప్పుడు కూడా ట్రైనర్‌ను వెంటబెట్టుకుని వెళుతుందంటే ఫిట్‌నెస్‌కు ఆమె జీవితంలో ఎంతటి ప్రాధాన్యం ఉందో అర్థం చేసుకోవచ్చు. నటిగా విలాసవంతమైన జీవన శైలికి అలవాటుపడినా... మద్యపానం, ధూమపానం వంటి వాటికి దూరంగా ఉండటం... ఆధ్యాత్మిక చింతనలో గడపడం కూడా తన సొగ'సిరుల'కు మరో ముఖ్య కారణం అంటోంది బిపాషా. 'లవ్ యువర్‌సెల్ఫ్' పేరుతో ఫిట్‌నెస్ డీవీడీని విడుదల చేసిన ఈ 'సెక్స్ సింబల్' ఆరోగ్య రహస్యాలు మీ కోసం...

బీ లైక్ బిపాషా!

ఆహారమే ఆరోగ్యం...

రోజూ వ్యాయామంతో పాటు తిండి విషయంలో కచ్చితమైన మెనూ పాటిస్తాను. ఎందుకంటే సరైన ఆహారమే ఆరోగ్యం కదా!

ఉదయం: నిద్ర లేవగానే ఓ గ్లాసుడు నిమ్మకాయ నీళ్లు తాగుతా. రాత్రి నానబెట్టిన కొన్ని బాదం పప్పులు తింటాను. ఆ తరువాత ఓ కప్ టీ.

బ్రేక్‌ఫాస్ట్: ఈ మెనూ చాలా పెద్దదిగా ఉంటుంది! ఆరు కోడి గుడ్లు (తెల్ల సొన), బ్రెడ్ టోస్ట్, పుట్టగొడుగులు, వెన్న తీసిన పాలు, తినగలిగినన్ని పండ్లు.

లంచ్: బియ్యంతో వండే అన్నానికి నేను దూరం. పప్పు, గ్రీన్ సలాడ్, గ్రిల్డ్ చేప లేదా చికెన్, రెండు సోయా చపాతీలు.

డిన్నర్: ఆలివ్ ఆయిల్‌తో వండిన కూరగాయలు, గ్రీన్ సలాడ్, గ్రిల్డ్ చేప లేదా చికెన్, కొద్ది మొత్తంలో తీపి పదార్థాలు.

సూర్య నమస్కారాలతో మొదలు...

మోడలింగ్ చేసే రోజుల్లో ఫిట్‌నెస్ గురించి పెద్దగా పట్టించుకునేదాన్ని కాదు. నటిగా మారిన తరువాతే పక్కాగా ఫాలో అవుతున్నా. కార్డియో ఎక్స్‌ర్‌సైజ్‌లే కాదు... యోగా కూడా నా ఫిట్‌నెస్ చార్ట్‌లో ఉంటుంది. రోజూ పొద్దున్నే 108 సూర్య నమస్కారాలు చేస్తాను. రెండు గంటల పాటు వర్కవుట్స్, యోగా ఉంటాయి. శరీర దృఢత్వం, మానసిక ఆరోగ్యానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి.



నా వర్కవుట్ షెడ్యూల్ ఇదీ...

రోజూ ఒకటే రకం ఎక్స్‌ర్‌సైజ్‌లు చేయాలంటే నాకు బోర్. అందుకే రెగ్యులర్ వ్యాయామానికి మోడరన్ టెక్నిక్స్ జోడించి, వాటిని వారానికి సరిపడా విభజించాను.

సోమవారం: అప్పర్ బాడీ వర్కవుట్

మంగళవారం: యాబ్స్ వ్యాయామం

బుధవారం: శరీరం కింది భాగం, కాళ్లకు సంబంధించిన వ్యాయామాలు

గురువారం: పిరుదుల ఆకృతి కోసం ఎక్స్‌ర్‌సైజ్‌లు

శుక్రవారం: అప్పర్ బాడీ వర్కవుట్

శనివారం: యాబ్స్, పిరుదల ఆకృతి కోసం వ్యాయామాలు

ఆదివారం: విశ్రాంతి

ఇవి కాకుండా కార్డియో ఎక్స్‌ర్‌సైజ్‌లు కూడా చేస్తాను. వాటిల్లో ట్రెడ్‌మిల్ 20 నిమిషాలు, సైక్లింగ్ వంటివి 10 నిమిషాలు, రోయింగ్ మిషన్‌పై 20 నిమిషాల వ్యాయామాలు ఉంటాయి.

ఫిట్‌నెస్ టిప్స్...

- ఆరోగ్యకర జీవితానికి క్రమశిక్షణ ముఖ్యం. ఫిట్‌నెస్ ట్రైనింగ్ రోజూ చెయ్యాలనుకొంటే క్రమశిక్షణ తప్పనిసరి.
- నాజూగ్గా మారడానికో... బరువు తగ్గడానికో ఉపయోగించే పిల్స్, డైట్స్ దీర్ఘకాల ప్రయోజనాలనివ్వవు. కానీ... రోజూ క్రమం తప్పని వ్యాయామం అద్భుతమైన ఫలితాలనిస్తుంది.
- నీళ్లు బాగా తాగండి. అది మీ శరీరంలోని మలినాలను శుద్ధి చేస్తుంది. చర్మాన్ని ఆరోగ్యకరంగా ఉంచుతుంది.
- ఒకే రకమైన వ్యాయామాలు బోర్ కొడతాయి. మీ ఫిట్‌నెస్ లక్ష్యాలకు అనుగుణంగా ఎక్స్‌ర్‌సైజ్‌లను మారుస్తుండండి.
- పిజ్జాలు, బర్గర్‌ల వంటి జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండండి.



ఇప్పుడు మనం వాడుతున్న స్మార్ట్‌ఫోన్లలో కెమెరాలు చాలా శక్తివంతంగా ఉంటున్నాయి. హై రిజల్యూషన్‌తో పాటు హెచ్‌డీఆర్, పనోరమా, బ్యూటిఫికేషన్, స్లో మోషన్, పోర్ట్రెయిట్ వంటి పలు రకాల అడ్వాన్స్‌డ్ మోడ్‌లు నిక్షిప్తం చేయబడుతున్నాయి. ఈ నేపథ్యంలో మెరుగైన ఫొటోలు పొందాలంటే కేవలం ఫోన్ చేతిలోకి తీసుకొని క్యాప్చర్ బటన్ ప్రెస్ చేస్తే చాలదు.. ఫొటోగ్రఫీ టిప్స్ మీద అవగాహన ఉండాలి. అవేంటో ఇప్పుడు చూద్దాం.

మీకు మీరే SUPER ఫొటోగ్రాఫర్!

కెమెరా గురించి తెలుసుకోండి..

చాలామందికి తమ ఫోన్లో ఉండే కెమెరాలో ఎలాంటి ఆప్షన్లు ఉన్నాయో.. వాటిని ఏ సందర్భాల్లో వాడొచ్చో అసలు తెలియనే తెలియదు. ప్రతీ ఫోన్ కెమెరాకి సెట్టింగ్స్ అనే విభాగంలో పలు రకాల కాన్ఫిగరేషన్ సెట్టింగులు, షూటింగ్ మోడ్లు, చివరకు డిఎస్ఎల్ఆర్ కెమెరాల్లో మాదిరిగా ఐఎస్ఓ, వైట్ బ్యాలెన్స్, ఎక్స్‌పోజర్, షట్టర్ స్పీడ్ వంటి అన్ని కీలకమైన అంశాలను మాన్యువల్‌గా ఎంపిక చేసుకునే వెసులుబాటూ కల్పించబడి ఉంటాయి. వీలైనప్పుడు వాటన్నిటినీ విడివిడిగా మారుస్తూ శాంపిల్ ఫోటోలను క్యాప్చర్ చేస్తూ స్టడీ చేయండి.

భిన్నమైన యాంగిల్స్

ఎప్పుడూ ఒకటే యాంగిల్‌లో ఫోటోలు తీయకండి. కొన్నిసార్లు భిన్నమైన యాంగిల్స్ ప్రయత్నిస్తే అద్భుతమైన ఫోటోలు వస్తాయి. అలాగని చూడడానికి ఎబ్బెట్టుగా కనిపించే ఫోటో యాంగిల్స్‌కి దూరంగా ఉండండి. ఎటూ స్క్రీన్ మీద ప్రివ్యూ కనిపిస్తూ ఉంటుంది కాబట్టి క్యాప్చర్ బటన్ ప్రెస్ చేయడానికి ముందే భిన్నమైన యాంగిల్స్ ఎక్స్‌ప్లోర్ చేయడం మంచిది.

రూల్ ఆఫ్ థర్డ్ గుర్తుపెట్టుకోండి

సబ్జెక్ట్ ఏదైనా కానివ్వండి.. 'రూల్ ఆఫ్ థర్డ్' అనే ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ రూల్‌ని ఎలా వాడాలో తెలుసుకొని దాన్ని ఫాలో అవండి. మీ ఫోన్ స్క్రీన్ మీద కనిపిస్తున్న ప్రివ్యూ మొత్తం ఒక ఫ్రేమ్ అనుకుంటే దాన్ని అడ్డంగానూ, నిలువుగానూ మూడు భాగాలుగా విభజించండి. మీరు షూట్ చేస్తున్న సబ్జెక్ట్ అన్నింటి కన్నా సెంటర్‌గా ఉండాలి. అప్పుడు ఫోటోకి వచ్చే అందమే వేరు. ముఖ్యంగా అందమైన ప్రకృతి మధ్య మనిషిని నిలబెట్టి ఫోటోలు తీసేటప్పుడు ఈ టెక్నిక్ అద్భుతంగా పనిచేస్తుంది. కొన్ని ఫోన్ల కెమెరా సెట్టింగుల్లోనే ఈ రూల్ ఆఫ్ థర్డ్ ఫాలో అవ్వడానికి తగ్గట్టు లైన్లు కూడా చూపించబడతాయి.

ఫ్లాష్ అసలు వాడొద్దు..

ఫోటో తీయాలంటే చాలామంది ఫ్లాష్ తప్పనిసరిగా వాడుతూ ఉంటారు. చాలా సందర్భాల్లో ఫ్లాష్ వాడడం వలన కలర్స్ అసహజంగా కనిపిస్తూ ఫోటో ఎబ్బెట్టుగా క్యాప్చర్ అవుతుంది. అస్సలు లైటింగే లేదనుకుంటే తప్పించి ఫ్లాష్ జోలికి వెళ్లకండి. వీలైనంత తవరకూ మీరు షూట్ చేస్తున్న ప్రదేశంలో లభిస్తున్న లోకల్ లైటింగ్‌నే మెరుగ్గా వాడటానికి ప్రయత్నించండి. ఇంకా అవసరం అనుకుంటే కొద్దిశాతం ఐఎస్ఓ సెట్టింగ్ పెంచండి. బాగా తక్కువగా లైటింగ్ ఉన్న ప్రదేశాల్లో ఫ్లాష్ వాడక తప్పదనుకోండి.

వీలైనంత క్లోజ్‌గా..

నాలుగడుగుల దూరంలో ఉన్న మనిషిని షూట్ చేసేటప్పుడు చాలామంది క్లోజప్ కోసం ఫోటోని జూమ్ చేస్తుంటారు. ఇలా జూమ్ చేస్తే పిక్సెల్ క్వాలిటీ తగ్గిపోతుందని గ్రహించండి. ఏటూ అవతల మనిషి మీకు దగ్గరలోనే ఉన్నారు కాబట్టి ఓ రెండు అడుగులు మీరే ముందుకు వేసి వారికి దగ్గరగా వెళ్లి ఫోటో క్యాప్చర్ చేయండి.

కేవలం సీనరీలే కాదు..

అందమైన ప్రకృతి దృశ్యాలు ఉన్న ప్రదేశాలకు వెళ్ళినప్పుడు చాలామంది కేవలం సీనరీస్‌ని మాత్రమే క్యాప్చర్ చేస్తుంటారు. మీకు సీనరీస్ విడిగా కావాలనుకుంటే వాటినీ షూట్ చేయండి, అలాగే వాటితో పాటు మనుషుల్ని నిలబెట్టి మరో ఫోటో తీయండి. సీనరీస్‌లో మనుషులు ఉండడం వల్ల ఫోటోకి జీవం వస్తుంది.

ఫోకస్ ముఖ్యం!

మనకు ఫోన్ స్క్రీన్ మీద ఫ్రేమ్‌లో ఏమైనా కన్పించవచ్చు. కానీ మనం షూట్ చేస్తున్నది ఓ వ్యక్తినో, వస్తువునో అయినప్పుడు స్క్రీన్ మీద వేలితో ట్యాప్ చేయడం ద్వారా ఆ ఆబ్జెక్ట్‌ని ఫోకస్ చేయండి. ఇలా ప్రత్యేకంగా మనం ఫోకస్ చేయకపోతే కెమెరాల్లో ఉండే ఆటో ఫోకస్ అనే సదుపాయం కొన్నిసార్లు మనకు పెద్దగా అవసరం లేని సబ్జెక్టులను ఫోకస్ చేసే ప్రమాదం ఉంది. దాంతో మనకు కావలసినవి మాత్రం బ్లర్‌గా కన్పిస్తాయి.

లెన్స్ శుభ్రంగా!

స్మార్ట్‌ఫోన్ల వెనుక భాగంలో కెమెరా లెన్స్ ఉండటం వల్ల చాలాసార్లు ఫోన్ పట్టుకునేటప్పుడు కెమెరా లెన్స్ మీద మురికి చేరిపోతుంటుంది. దాన్ని ఎప్పటికప్పుడు క్లీన్ చేయకపోతే మనం షూట్ చేసే ఫోటోల క్వాలిటీ తగ్గుతుంది. దేనితో పడితే దాంతో కాకుండా ఓ మైక్రో ఫైబర్ క్లాత్‌తో ఫోన్ కెమెరా లెన్స్‌ని శుభ్రపరచండి.

రా ఫొటోలు జాగ్రత్త!

సహజంగా కెమెరాలు బయటవుండే కాంతిని క్యాప్చర్ చేసి దానిలో ఉండే రెడ్, గ్రీన్, బ్లూ వంటి రంగులను విభజించి ఓ జెపెగ్ ఫోటోగా సేవ్ చేస్తుంటాయి. ఇలా ప్రాసెసింగ్ చేయబడే క్రమంలో చాలాసార్లు ఫోటోలో ఉండే ముఖ్యమైన పిక్సెల్స్ తొలగించబడి డీటైల్ మిస్ అవుతూ ఉంటుంది. అందుకే ఒకవేళ మీ ఫోన్లో 'రా ఫొటోస్' క్యాప్చర్ చేసుకునే సదుపాయం ఉంటే అదే ఫార్మెట్లో ఫోటో షూట్ చేసి వాటిని తర్వాత కంప్యూటర్లో అడోబ్ ఫోటోషాప్, లైట్‌రూమ్ వంటి ఫోటో ఎడిటింగ్ అప్లికేషన్లలో కావాల్సిన విధంగా ఎడిట్ చేసుకోవటం మంచిది.

ఫ్రేమ్ చెక్ చేసుకోండి..

చాలాసార్లు ఫోటో తీయడానికి కేవలం ఒక పది ఇరవై సెకన్లు మాత్రమే సమయం లభించవచ్చు. ఉదాహరణకి ఓ సెలబ్రిటీతో మీ ఫ్రెండ్ ఎవర్నయినా ఫోటో తీస్తున్నారనుకుందాం. రెండు మూడు నిముషాలు ఆ సెలబ్రిటీని అలాగే నిలబడమని చెప్పలేం కదా. అలాగని ఎట్లాబడితే అట్లా ఫోటో తీస్తే అవి ఎబ్బెట్టుగా వస్తుంది. అందుకే సందర్భం ఏదైనా ఫోటో క్యాప్చర్ చేసేముందు మీ ఫోన్ స్క్రీన్ మీద ప్రివ్యూ రూపంలో ఫ్రేమ్ మొత్తం ఓసారి సంతృప్తిగా ఉందో లేదో చెక్ చేసుకున్న తర్వాతే కేప్చర్ బటన్ ప్రెస్ చేయండి. అలాగే ఒకేసారి అయిదారు ఫోటోలు క్యాప్చర్ చేయండి. కనీసం ఒకటి కాకపోతే మరొకటి పనికొస్తుంది.

సెల్ఫీల విషయంలో...

మామూలు ఫోటోలు కన్నా ఈమధ్య ఫ్రంట్ కెమెరా ద్వారా సెల్ఫీలు క్యాప్చర్ చేసుకోవడం ఎక్కువైంది. సెల్ఫీల్లో ప్రధానంగా బ్యూటిఫికేషన్ మోడ్‌లను వాడడం వల్ల స్కిన్ పూర్తి స్మూత్‌గా తయారై అసహజంగా కనిపిస్తుంది. అందుకే ఫోటోని నార్మల్‌గా షూట్ చేసుకుని ఆ తర్వాత అవసరమైతే థర్డ్‌పార్టీ యాప్స్ సాయంతో కొద్ది మొత్తంలో ఫిల్టర్లను అప్లై చేసుకుంటే మంచిది. అలాగే సెల్ఫీలు కేప్చర్ చేసేటప్పుడు కెమెరా మనకంటే కొద్దిగా పైభాగాన, లేదా సమాంతరంగా ఉండే విధంగా చూసుకుంటే గొంతు ప్రాంతం ఎబ్బెట్టుగా ఉండదు. సెల్ఫీల కోసం ఫోన్ కొనుగోలు చేసేటప్పుడు వీలైనంతవరకూ అది వైడ్ యాంగిల్ సపోర్ట్ చేసేదై ఉండేలా చూసుకోండి. ఒకే ఫ్రేమ్‌లో ఎక్కువమంది వ్యక్తుల్ని సెల్ఫీలో క్యాప్చర్ చేసుకోవచ్చు.




నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

సిగ్నల్స్ ఇచ్చే బ్యాక్‌ప్యాక్



[illegible] భయం కూడా అవసరం లేదు. ఇది పూర్తిగా వాటర్‌ప్రూఫ్‌గా ఉంటుంది. ఈ బ్యాక్‌ప్యాక్‌లో బట్టలు, పుస్తకాలు పెట్టుకోవడానికి వీలుగా ఒక భాగం, పెన్నులు, బిజినెస్‌కార్డులు పెట్టుకోవడానికి మరో భాగం ఉంటాయి. ఎల్ఈడీ కమ్యూటర్ మరో భాగంలో ఉంటుంది. యూఎస్‌బీ కేబుల్ సహాయంతో ప్యానెల్ ఛార్జింగ్ చేసుకోవచ్చు. దీని ధర సుమారు రూ. 9,100.

లెనొవొ యోగా బుక్



ఇంజనీరింగ్, ఎంబిఎ విద్యార్థులకు ల్యాప్‌టాప్ తప్పనిసరి. బిజినెస్ వ్యవహారాలు చూసుకునే వారైతే ఎప్పుడూ వెంట ఉండాల్సిందే. అది ల్యాప్‌టాప్‌గా, టాబ్లెట్‌గా ఉపయోగపడేది అయితే మరీ మంచిది. ఆ కోవకు చెందినదే 'లెనొవొ యోగా బుక్'. డిజైన్లు వేసుకోవడానికి, నోట్స్ రాసుకోవడానికి ఈ ల్యాప్‌టాప్ బాగా ఉపకరిస్తుంది. ఈ ల్యాప్‌టాప్‌పై టైపింగ్ చేయడం చాలా సులువు. ఆటో కరెక్ట్, షార్ట్ కట్స్, ఆటో కంప్లీట్ వంటి ఫీచర్లు టైపింగ్‌ను మరింత సులభతరం చేస్తాయి. దీని ధర రూ. 40 వేలు.

మ్యూజిక్ ప్రియుల కోసం...!



కొందరు సంగీతాన్ని ఇయర్‌ఫోన్స్ పెట్టుకోవడాన్ని ఇష్టపడితే, మరికొందరు ఇంట్లో స్పీకర్‌లో లౌడ్‌గా పెట్టుకుని వినడాన్ని ఇష్టపడతారు. అలాంటి వారికి 'బోస్ సౌండ్ లింక్ కలర్ 2' బ్లూటూత్ స్పీకర్ బాగా ఉపయోగపడుతుంది. ఈ పోర్టబుల్ బ్లూటూత్ స్పీకర్ వాటర్ రెసిస్టెంట్ ఫీచర్‌ను కలిగి ఉంటుంది. ఈ స్పీకర్ చెంతన ఉంటే అవుట్‌డోర్ ఈవెంట్స్ జరిగినపుడు, వెకేషన్స్‌కు వెళ్లినపుడు మ్యూజిక్ లౌడ్‌గా పెట్టుకుని ఎంజాయ్ చేయవచ్చు. ఈ స్పీకర్‌ను ఉపయోగించడం కూడా సులువు. యాప్ సహాయంతో కనెక్ట్ కావొచ్చు. యాప్ సహాయంతోనే వాల్యూమ్ పెంచుకోవడం, తగ్గించుకోవడం చేయవచ్చు. ప్లేబ్యాక్ వంటి ఆప్షన్లు కూడా ఉంటాయి. దీని ధర రూ. 11,500. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది.

ఈ పవర్ బ్యాంక్ చెంతనుంటే...

ఉదయం లేచిన దగ్గరి నుంచి రాత్రి పడుకునే వరకు స్మార్ట్‌ఫోన్ వాడుతూనే ఉంటాం. మధ్యలో ఛార్జింగ్ తగ్గిపోతే పవర్ సాకెట్ల కోసం వెతుక్కోవాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే పవర్ బ్యాంక్ ఉండాల్సిందే. తరచుగా ప్రయాణాలు చేసే వారి చెంత, ఎక్కువగా ఫోన్ ఉపయోగించే వారి చెంత పవర్ బ్యాంక్ తప్పక ఉండి తీరాల్సిందే. పవర్‌బ్యాంకుల్లో ఫెరారీ పవర్ బ్యాంక్ ఉత్తమమైనదిగా చెప్పుకోవచ్చు. బ్యాటరీ సామర్థ్యాన్ని డిజిటల్ డిస్‌ప్లేలో చూడొచ్చు. రెండు యూఎస్‌బి పోర్టులుంటాయి. ఒకేసారి రెండు డివైజ్‌లను ఛార్జింగ్ చేసుకోవచ్చు. 12000 ఎంఎఎచ్ సామర్థ్యం ఉన్న ఈ పవర్‌బ్యాంక్ మీ అవసరాలకు కరెక్ట్‌గా సరిపోతుంది. దీని ధర రూ. 5,300. అమెజాన్ ఆన్‌లైన్ స్టోర్‌లో కొనుగోలు చేయవచ్చు.



టెక్ సెక్యూరిటీ

గూగుల్ మూడంచెల భద్రత




గూగుల్ సంస్థ నెటిజన్ల భద్రత కోసం, ఇంటర్నెట్ [illegible] యన్ యాప్స్ బారిన పడకుండా సేఫ్‌గార్డ్‌గా ఉండటానికి ఈ చెకప్ ఉపయోగపడుతుంది. డివైజ్ పోతే పర్సనల్ డాటా ఇతరుల చేతుల్లో పడకుండా ఫైండ్ మై డివైజ్ యాప్ ఉపకరిస్తుంది. ఈ త్రీ-స్టెప్ సేఫ్టీ ద్వారా డాటాకు, డివైజ్‌లకు పూర్తి భద్రత లభిస్తుందని గూగుల్ చెబుతోంది.

ఫన్నీ యాప్

ఫొటోలకు ఫన్ జోడించాలంటే!

మీ ఫొటోలు, వీడియోలు మరింత ఫన్‌గా తయారు చేసుకోవాలా? అయితే 'విమో' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి. విమో మోషన్ స్టిక్కర్స్ సహాయంతో వీడియోలు, ఫొటోలను [illegible] యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసుకోవచ్చు.



టెక్ సందేహాలు!

నెట్ అలా వాడుకోవచ్చా?

నా ఫోన్లో మిగతా అప్లికేషన్లు పనిచేస్తూ కేవలం వాట్సప్‌కి కొద్దిసేపు ఇంటర్నెట్ రాకుండా డిసేబుల్ చేసుకునే అవకాశం ఏదైనా ఉందా?

- కృష్ణారెడ్డి, పాల్వంచ

సహజంగా కాసేపు వాట్సప్‌లో ఆఫ్‌లైన్‌లోకి వెళ్లడానికి చాలామంది వైఫై, మొబైల్ డేటా ఆఫ్ చేస్తుంటారు. దీంతో మిగతా అప్లికేషన్లకి కూడా ఇంటర్నెట్ నిలిచిపోతూ ఉంటుంది. అయితే కొన్ని విపిఎన్ యాప్స్‌ని వాడడం ద్వారా మీకు ఏ అప్లికేషన్‌కి కావాలంటే ఆ అప్లికేషన్‌కి తాత్కాలికంగా అటు మొబైల్ డేటా కానీ, ఇటు వైఫై గానీ నిలుపుదల చేసుకోవచ్చు. ఇలాంటి వాటిలో 'పాజ్' ఓ ఆండ్రాయిడ్ అప్లికేషన్ గూగుల్ ప్లే స్టోర్లో లభిస్తుంది. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకుని వాట్సప్ వరకు మాత్రమే ఆఫ్ లైన్లోకి వెళ్లేలా ఏర్పాటు చేసుకోవచ్చు.




ఫేస్‌బుక్‌లో పోస్ట్‌లు ఎందుకలా?

ఫేస్‌బుక్‌లో కొన్నిసార్లు నేను ఏదైనా పోస్ట్ చేస్తే 'ఇది స్పామ్ అవడం వల్ల తొలగించాం' అంటూ ఫేస్‌బుక్ దాన్ని డిలీట్ చేస్తోంది. ఎందుకిలా జరుగుతోంది?

- రామకృష్ణ, ఏలూరు

ఫేస్‌బుక్ ఈ మధ్య స్పామ్‌ని అడ్డుకోవడానికి అనేక చర్యలు తీసుకుంటోంది. దీంట్లో భాగంగా మెషిన్ లెర్నింగ్ పద్ధతులను అనుసరిస్తోంది. ఈ మెషిన్ లెర్నింగ్ ప్రపంచవ్యాప్తంగా కొన్ని డేటా సెట్స్ ఆధారంగా ఏది స్పామ్, ఏది కాదు అన్నది ఆటోమేటిక్‌గా నిర్ణయించుకుంటుంది. ఆ క్రమంలో చాలా సందర్భాల్లో తెలుగు, తమిళ్, కన్నడ, హిందీ వంటి ప్రాంతీయ భాషల్లో చేయబడే పోస్టులు స్పామ్‌గా పరిగణించబడుతున్నాయి. త్వరలో ఈ స్పామ్ ఫిల్టరింగ్ మరింత మెరుగ్గా పనిచేసే అవకాశం ఉంది కాబట్టి ముందుముందు ఇలాంటి సమస్యలు తగ్గుముఖం పడతాయి.



లొకేషన్ సరియైనది కాదా?

కొంతమంది స్నేహితులు తాము ఫలానా చోట ఉన్నామని షేర్ చేసే లోకేషన్లు కరెక్ట్ కాదని చెబుతుంటారు. అదెంతవరకు నిజం?

- పరమేశ్వర్, నల్గొండ

సహజంగా మన స్మార్ట్‌ఫోన్ ద్వారా ఫేస్‌బుక్, వాట్సప్ వంటి యాప్స్‌లో లోకేషన్ షేర్ చేసేటప్పుడు ఇప్పుడు మనమున్న ప్రదేశం అక్షాంశ, రేఖాంశాలు గుర్తించబడి వాటి ఆధారంగా లోకేషన్ అవతలి వారికి షేర్ చేయబడుతుంది. అయితే ఆండ్రాయిడ్ ఫోన్లలో డెవలపర్ ఆప్షన్స్ అనే ప్రత్యేకమైన విభాగంలో ఉండే మాక్ లోకేషన్స్ అనే ఆప్షన్‌ని వాడి కొంతమంది నిజంగా తామెక్కడున్నామో దాచిపెట్టి వేరే ప్రదేశంలో ఉన్నట్లు లోకేషన్‌ని సెట్ చేసి తప్పుడు ఫలితాలు షేర్ చేస్తుంటారు. అలాంటప్పుడు వారి అసలైన లోకేషన్ తెలుసుకోవడం కూడా కష్టమే అవుతుంది. కేవలం అప్లికేషన్ డెవలపర్లకి యాప్స్ డెవలప్ చేసేటపుడు ఉపయోగపడేలా అందించబడిన ఈ ఆప్షన్ ఈమధ్య బాగా దుర్వినియోగం అవుతోంది.



మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం navya@andhrajyothy.com

డైలీ సుడోకు - 111

9	2							
8	6	7	5					
3				4			8	
	3				7			4
	7		9	5	3		1	
2			6				7	
	8			9				3
					5	8	4	6
							9	5

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు-110 సమాధానం

[illegible]





చిర యశో...ధన్‌వాన్

Star Talk

మన కళలకూ, కథలకూ వెండితెరను వేదిక చేసిన ఆ కళాతపస్వి కాశీనాథుని విశ్వనాథ్! నిరుడు ప్రతిష్ఠాత్మక 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారం అందుకున్న ఆ నట, దర్శకుడి 88వ పుట్టినరోజు నేడు. మనసుకు దగ్గరగా, మీడియా ఇంటర్వ్యూలకు దూరంగా ఉంటున్న ఆయన తన జీవితాన్ని తీర్చిదిద్దిన తల్లితండ్రులు, గురువులు, శబ్దగ్రాహకుడిగా గడిపిన సినీ రంగపు తొలినాళ్ళు, 'సర్గమ్' నుంచి 'ధన్‌వాన్' దాకా సాగిన తన హిందీ సినీ ప్రస్థానంపై ఎన్నో ప్రశ్నలకు తొలిసారిగా ఈ చిర యశో ధనవంతుడు 'నవ్య'తో మనసు విప్పారు. ఆ మాటల ఊటలోని ముఖ్యాంశాలు...

• డాక్టర్ రెంటాల జయదేవ

నేనివాళ ఇలా ఉన్నానంటే అది ఎంతోమంది సహాయం, సహకారం, మార్గదర్శకత్వం. జీవితాన్ని తీర్చిదిద్దినవాళ్ళంటే నాకు గుర్తొచ్చేది అమ్మా నాన్న. నాకు చదువు నేర్పిన గురువులు. సినీరంగంలో నేను పనిచేసిన శబ్దగ్రహణం, దర్శకత్వ శాఖల్లో నా చేయి పట్టుకు నడిపించిన సీనియర్లు.

అవన్నీ అమ్మానాన్న నేర్పినవే!

అందరు పిల్లల్లానే నా వ్యక్తిత్వాన్ని మొదట తీర్చిదిద్దింది మా అమ్మానాన్నలే (సరస్వతి, సుబ్రహ్మణ్యం). మేము ముగ్గురం పిల్లలం. నేను, నాకు ఇద్దరు చెల్లెళ్ళు (శ్యామలాదేవి, గిరిజాదేవి). తాడికొండ వారి ఆడపడుచు అయిన మా అమ్మ చదువుకున్నది చాలా తక్కువే కానీ, కథలు చెప్పడంలో, అవసరమైతే కర్రతో చెప్పడంలో, క్రమశిక్షణ నేర్పడంలో దిట్ట. కంచంలో పెట్టిన అన్నం, పప్పు ఏదైనా పారేస్తే దేవుడు కోప్పడతాడు అని అమ్మ చెబితే అది మాకు వేదం. మా అందరికీ ఆ రోజుల్లో అమ్మానాన్నల ప్రవర్తనే పెద్ద బాలశిక్ష. మా నాన్న గారు ఎప్పుడూ చెడుగా మాట్లాడేవారు కాదు. ఆయన నోట పెద్ద తిట్టు ఏదైనా ఉందీ అంటే 'ఫూల్', 'రాస్కెల్'. అంతే. ఇంటికి వచ్చినవాళ్ళను పలకరించడం, మంచినీళ్ళు ఇవ్వడం, నాన్న గారు చేసుకొనే పూజలు, పునస్కారాలు, ఇతరుల పట్ల ఆయన చూపే భక్తిశ్రద్ధలు... అవన్నీ పిల్లలం అనుసరించాం, అలవరచుకున్నాం. నా ఒకటి, రెండు తరగతుల వరకు మా పితామహుల ఊరైన గుంటూరు జిల్లా పెద పులివర్రులోనే ఉండేవాళ్ళం. తరువాత పెరిగిందంతా బెజవాడ కృష్ణలంకలో!



తల్లిదండ్రులు సరస్వతి, సుబ్రహ్మణ్యం

ఆ రోజుల్లో డబ్బు కన్నా చిన్న చిన్న అనుభూతులకే ప్రాధాన్యం. మా నాన్న గారు పెద పులివర్రులో నాకో చిన్న మూడు చక్రాల సైకిల్ కొనిపెడితే, అదో మెర్సిడెస్ బెంజ్ అన్నంత తృప్తి మాకుండేది. సెట్టి గారు అల్యూమినియం బానలో ఇడ్లీలు తెచ్చి, వీధి వెంట అమ్ముతూ వెళుతుంటే, ఆయనను పిలిచి, అమ్మానాన్న ఇడ్లీలు కొనిపెడితే అదో పెద్ద స్టార్ హోటల్ భోజనం. ప్రతి చిన్న ఆనందాన్నీ చాలా పెద్దదిగా అనుభవంలోకి తెచ్చుకునే రోజులు, సంస్కృతి, అలవాట్లు, అభిప్రాయాల మధ్య పెరిగాం.

అలాగే, స్కూలు టీచర్లన్నా, గురువులన్నా భయభక్తులుండేవి. 'రాత్రి గస్తీ తిరుగుతుంటా. ఇంట్లో మీరు చదువుతున్నారో, లేదో కనిపెడ్తాన్తా' అని పెద పులివర్రులో మా మాస్టారు అనేవారు. ఊళ్ళో వీధి మీదకే మా ఇంటి గోడ, కిటికీ. మాస్టారు ఏ క్షణంలో వచ్చి గమనిస్తారో అని, తెల్లవారు అయిదున్నర కల్లా లేచి, ఆముదపు దీపం పెట్టుకొని, (నవ్వుతూ...) ఆయన రోడ్డు మీద వెళుతుంటే వినపడాలని నాటక ఫక్కీలో, బిగ్గరగా పాఠాలు చదివేవాణ్ణి.

నా అసలు పేరు అలా విశ్వనాథ్ అయింది!

అప్పటికి మా నాన్న గారు హెచ్.ఎం. రెడ్డి గారి దర్శకత్వంలో వాహినీ పిక్చర్స్ బి.ఎన్. రెడ్డి గారు తీసిన 'గృహలక్ష్మి' సినిమాకు ఫిల్మ్ రిప్రజెంటేటివ్‌గా బెంగుళూరులో ఉండేవారు. దాంతో బెజవాడకు మా మేన మామ గారి దగ్గరకు చదువుకోవడానికి వచ్చా. (గాంధీజీ) మునిసిపల్ హైస్కూలులో ఆయనే చేర్పించాడు. నిజానికి నేను పుట్టినప్పుడు బియ్యంలో రాసిన నా అసలు పూర్తి పేరు... కాశీనాథుని విశ్వనాథ బాబు. కానీ, సహజంగా కవి, సాహిత్యాభిలాష ఉన్న మా మేనమామ (తాడికొండ కామేశ్వరరావు) ఆ స్కూలులో నన్ను చేర్పిస్తున్నప్పుడు రవీంద్రనాథ్ టాగోర్ లాగా స్టైల్‌గా విశ్వనాథ్ అని రిజిస్టర్‌లో రాయించాడు. అలా విశ్వనాథ బాబును కాస్తా, విశ్వనాథ్ అయ్యా (నవ్వు).

బెజవాడ వచ్చాక సెకండ్ ఫారం దాకా (గాంధీజీ) మునిసిపల్ హైస్కూల్‌లో చదివా. అక్కడ మాకు నారాయణమూర్తి గారనే హెడ్మాస్టర్ ఉండేవారు. అలాగే, బసవరాజు సుబ్బారావు గారని హిస్టరీ మాస్టర్ ఉండేవారు. ఆయన సి.ఎస్.ఆర్. ఆంజనేయులు గారు తదితరులతో కలసి నాటకాలు వేసేవారు. శివాజీ వేషానికి ఆయన పేరు. ఆయన క్లాసుకు వచ్చి, తన పాత్ర డైలాగులు రిహర్సల్ చేస్తుంటే పిల్లలం నోరెళ్ళబెట్టుకొని చూస్తూ, వింటూ ఉండేవాళ్ళం. థర్డ్ ఫార్మ్ నుంచి మున్సిపల్ హైస్కూల్ అరండల్‌పేట బ్రాంచిలో చదివా.

చిన్నప్పుడే ఫిల్మ్ ప్రొజెక్టర్ ఆట!

మా నాన్న గారు వాహినీ పిక్చర్స్‌లో విజయవాడలో ఫిల్మ్ రిప్రజెంటేటివ్. కరెంట్ కూడా లేని రోజులవి. ఎందుకనో చిన్నప్పుడు నేను ఫిల్మ్ రీలు చుట్ట పెట్టుకొని, బ్యాటరీ దీపం లాంటిది ఉన్న ప్రొజెక్టర్‌లో నుంచి స్పీడుగా రీలు తిప్పుతూ, గోడ మీద ప్రొజెక్ట్ చేసి, పిల్లలతో ఆడుకొనేవాణ్ణి. పదిమందినీ పిలిచి చూపించి, వచ్చినవాళ్ళ నుంచి కాణీ చొప్పున డబ్బులు వసూలు చేయడం సరదా. నా భవిష్యత్ ప్రయాణం సినిమా అని చిన్నప్పుడే అలా తెలియకుండా నిర్ణయమైందేమో! బీఎస్సీ పూర్తయ్యాక అప్పుడే కొత్తగా మొదలైన వాహినీ స్టూడియోలో ఉద్యోగం కోసం నాన్న గారు దర్శక, నిర్మాత బి.ఎన్.రెడ్డి గారి దగ్గరకు పంపారు. అక్కడ ఆడియోగ్రాఫర్‌గా మొదలయ్యా.


మొదటి రోజే... వెనక్కెళ్ళిపోదామనుకున్నా!

సినీ రంగంలో ఉద్యోగం కోసం మద్రాసు (ఇప్పటి చెన్నై) మహానగరంలో అడుగుపెట్టిన మొదటి రోజు ఇప్పటికీ గుర్తే. అదో భయంకరమైన టార్చరస్ డే. ముందు రోజు బెజవాడలో మా అమ్మానాన్న కాళ్ళకు దణ్ణం పెట్టి, ఒక్కణ్ణే రైలెక్కా. మా నాన్న గారి బాస్ బ్రిజ్‌మోహన్ దాస్ అనే గుజరాతీ ఆయన. ఆయన మద్రాసు టి. నగర్‌లో నాయర్ రోడ్డులో ఇప్పుడు ఆంధ్రా క్లబ్ ఉన్న ప్రాంతంలో ఉండేవారు. కిందేమో వాహినీ పిక్చర్స్ ఆఫీసు. పైనేమో దాస్ గారి ఇల్లు. నన్ను ఆయన ఇంట్లో అప్పటికి ఉండమన్నారు. మద్రాసులో దిగాక, నేను నేరుగా ఆయన దగ్గరకు వెళ్ళి, అక్కడ నుంచి వడపళని వాహినీ స్టూడియోకు ప్రయాణమయ్యా. వెళ్ళగానే మొదటి రోజు నన్ను ఫిల్మ్ ప్రొజెక్షన్ థియేటర్లో పని గమనించమన్నారు. కింద సౌండ్ డిపార్ట్‌మెంట్‌కి మంచి రికార్డింగ్ థియేటర్. పైన సినిమా ప్రొజెక్షన్ రూమ్. రికార్డింగులు లేనప్పుడు అక్కడే సినిమా ప్రొజెక్షన్లకు ఇచ్చేవారు. అప్పట్లో అన్నీ నైట్రేట్ ఫిల్ములే. ఆ రీళ్ళ చుట్టలన్నీ క్యాన్‌లో నుంచి తీసి స్పూల్‌కు ఎక్కించి అందించడం, ప్రొజెక్షన్ అయిపోయిన రీళ్ళను మళ్ళీ రీవైండ్ చేసి క్యాన్లలో సర్దిపెట్టడం, ఆపరేటర్ పక్కనే నిల్చొని ఆ కన్నంలో నుంచి సినిమా చూడడం... ఇదీ నా పని.

ఆ రోజున ఏకంగా మూడు సినిమాల ప్రొజెక్షన్లున్నాయి. ఒక ఫ్రెంచ్ సినిమా, ఆ వెంటనే ఒక తమిళ సినిమా ('త్రిముషే ఆళ్వార్' అనుకుంటా), మరో సినిమా. అలా పొద్దుటి నుంచి రాత్రి దాకా నిల్చున్నవాణ్ణి నిల్చున్నట్టే ఉండాల్సి వచ్చింది. ఎప్పుడూ అంత శ్రమ నాకు అలవాటే లేదు. చక్కగా తయారై, స్టూడియోకు వెళ్ళిన నేను ఇంటికి వచ్చేసరికి దారుణంగా తయారయ్యా. బాగా పొద్దుపోయింది. అందరూ నిద్రలో ఉన్నట్టున్నారు. కింద తలుపుకొట్టినా ఎవరూ తీయలేదు. ఓ పక్కన నీరసం. మరోపక్క ముంచుకొస్తున్న నిద్ర. చివరకు మేడ మెట్ల దగ్గర గట్టు మీదే పడుకొండిపోయా. ఆ రాత్రి అలా గడిచింది. అమ్మో... ఇదంతా మన వల్ల కాదు. బెజవాడకు వెళ్ళిపోదాం అనుకున్నా. (నవ్వుతూ...) అనుకున్నది వేరు, అయినది వేరు.

బాస్ ఇచ్చిన భారీ ప్రశంస

అప్పట్లో వాహినీ స్టూడియో ఆసియాలో పెద్దది. శోభనాచల స్టూడియోలో ప్రిమిటివ్ ఎక్విప్‌మెంట్ ఉండేది. మా స్టూడియోలో ఆసియాలోనే సోఫిస్టికేటెడ్ ఎక్విప్‌మెంట్. మా స్టూడియోలో సౌండ్ రికార్డిస్టు శాఖకు పెద్ద, నాకు గురువు ఎ. కృష్ణన్ (కృష్ణయ్యర్). ఆయనే ఆ తరువాత చాలాకాలానికి హైదరాబాద్ వచ్చి, ఇక్కడ సారథీ స్టూడియోలో సౌండ్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా కూడా పనిచేశారు. వాహినీ కృష్ణన్ గారి కింద వల్లభజోస్యుల శివరామ్, (జెమినీ) కోటేశ్వరరావు నాకు సీనియర్లు. నా పైన మోహన సుందరం ఉండేవారు. నేను నాలుగో స్థాయి... (నవ్వుతూ) ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీ.



రికార్డింగ్ గురువు ఎ. కృష్ణన్

మా బాస్ నన్ను బాగా చూసుకొనేవారు. హి ఈజ్ వెరీ గ్రేట్ మ్యాన్. నేనంటే చాలా నమ్మకం. ఆయన అందుబాటులో లేనప్పుడు మేము రికార్డింగ్ చేసేవాళ్ళం. ఒక సినిమాకు రికార్డింగ్ చేస్తున్నప్పుడు ఒక నిర్మాత కమ్ డైరెక్టర్ నా మీద ఆయన కృష్ణన్ గారికి ఏదో ఫిర్యాదు చేశాడు. మా బాస్ రమ్మన్నారంటూ, ఎవరో వచ్చి పిలిచారు. హడావిడిగా వెళ్ళాను. విషయం ఏమిటని బాస్ నన్ను అడిగారు. ఇంకా బేస్ కావాలి, తబలా కావాలి అంటూ ఆ దర్శక, నిర్మాత అడిగిన సంగతి చెప్పా. సంగతి అర్థమైన మా బాస్, సదరు వ్యక్తితో ఒకటే మాట అన్నారు. 'ఇఫ్ విశ్వమ్ కమ్స్ ఇన్ డే అండ్ టెల్స్ దట్ దిసీజ్ నైట్. ఐ బిలీవ్'. అంతే. అవతలి వ్యక్తికి నోట మాట రాలేదు. ఒక గొప్ప ఛీఫ్ టెక్నీషియన్ నుంచి, నా బాస్ నుంచి నాకు లభించిన అది పెద్ద దీవెన, ప్రశంస అది.


ఒళ్ళు ఝుల్లుమంది

మా బాసే నన్ను ప్రోత్సహించి, స్వతంత్రంగా సౌండ్ రికార్డిస్టును కూడా చేశారు. వాహినీ వారి 'దేవత', 'భక్త పోతన', జెమినీ 'చంద్రలేఖ' తదితర చిత్రాలకు పనిచేసిన ప్రసిద్ధ సినిమాటోగ్రాఫర్, డైరెక్టర్ కె. రామ్‌నాథ్ రూపొందించిన తమిళ చిత్రం 'తాయ్ ఉళ్ళమ్' (అమ్మ మనసు - 1952) ఇండిపెండెంట్ సౌండ్ రికార్డిస్టుగా నా తొలి సినిమా. మొదటి రోజు నైట్ షూటింగ్. నాకు ధైర్యం కోసం మొదట గంట సేపు మా గురువు గారు కృష్ణన్ నా పక్కనే కూర్చున్నారు. అప్పట్లో సాధారణంగా డబ్బింగ్ ఉండేది కాదు. షాట్‌లోనే డైరెక్ట్‌గా డైలాగ్ రికార్డింగ్. షాట్ కాగానే, రామ్‌నాథ్ గారు నా దగ్గరకు వచ్చి, ఈజ్ సౌండ్ ఓకే అన్నారు. అంత పెద్దాయన నా దగ్గరు వచ్చే సరికి, వణికినట్లయ్యా. ఒళ్ళు ఝుల్లుమంది. ఓకే అని చెప్పా.



కె.రామ్‌నాథ్, 'తాయ్ ఉళ్ళమ్' పోస్టర్

అప్పట్లో సౌండ్ రికార్డింగ్ చాలా కీలకమైన పని. షూటింగ్‌లో ఆర్టిస్టు డైలాగులు దొర్లించేస్తుంటే, షాట్ ఓకే కాదని చెప్పేవాళ్ళం. అందరూ మా నుంచి సజెషన్స్ తీసుకొనేవాళ్ళు. అసిస్టెంట్‌గా ఉన్న రోజుల్లోనే ఏయన్నార్ నటించిన 'లైలా మజ్ను' (1949), 'స్వప్నసుందరి' (1950) లాంటి చిత్రాలకు పనిచేశా. 'ఇవాళ మా వాచికం ఇలా ఉందంటే, అదంతా వాహినీలో కె. విశ్వనాథ్ లాంటి సౌండ్ రికార్డిస్టులు మా డైలాగును సరిదిద్ది, మా మాడ్యులేషన్‌ను తీర్చిదిద్దడం వల్లే' అని ఏయన్నార్ ఆ తరువాత చాలా సభల్లో చెప్పారు. ఆ రోజుల్లో ఎన్టీయార్, ఏయన్నార్, యస్వీయార్ లాంటి మహా నటులు కూడా ఈ బేసిక్ అంశాలను గౌరవించేవాళ్ళు. మేము చెబితే వినేవాళ్ళు. కలాయించేవాళ్ళు కాదు. ముఖ్యంగా, రీరికార్డింగ్‌కీ, ఇన్సిడెంటల్ మ్యూజిక్‌కీ నాకెంతో పేరు. ఉదాహరణకు, అప్పట్లో పి. పుల్లయ్య గారి దర్శకత్వంలో ఎన్టీయార్ 'బండరాముడు' (1959) టైటిల్స్‌కి ప్రత్యేకంగా సౌండ్ స్క్రీన్‌ప్లే రాసుకొని, దృశ్యం లేకుండా రెండున్నర నిమిషాలు కేవలం శబ్దాలతో అది ఒక దొంగ తాలూకు కథ, అతను పారిపోతున్నాడు, రక్షకభటులు ఈలేస్తూ వెంటపడుతున్నారు అని తెలిసేలా సౌండ్స్‌తో ఇల్యూజన్ తెచ్చాను. అది చాలా పేరు తెచ్చింది. అందరూ 'మా సినిమాకు సౌండ్ రికార్డిస్టుగా విశ్వనాథ్ కావాల'ని అడిగేలా పనిచేయడం నాకిప్పటికీ గర్వకారణం. పదకొండేళ్ళు రికార్డిస్టుగా పనిచేశాక, అక్కినేని, ఆదుర్తి ప్రోత్సాహంతో అన్నపూర్ణా సంస్థకు అసోసియేట్ డైరెక్టర్‌గా వెళ్ళా. అలా లైన్ మారింది.



'బండరాముడు'లో ఎన్టీయార్, సావిత్రి

ఆయన ధైర్యం నాకుంటేనా..?

దర్శకత్వ శాఖ విషయానికి వస్తే, మా గురువు గారు ఆదుర్తి సుబ్బారావు గారి పేరు చెప్పుకోవాలి. నేను దర్శకత్వ శాఖలో సహాయకుడిగా పనిచేసింది ఆయనొక్కరి దగ్గరే. నా దృష్టిలో ఆదుర్తి గారంటే... ఒక్క మాటలో డేరింగ్, డాషింగ్. అంతకు అంత స్పోర్టివ్ కూడా! ఏ విషయమైనా సరే ఆయన చాలా ధైర్యంగా నిర్ణయాలు తీసుకొనేవారు. ధైర్యంగా ఏదో అనేసి, మరుసటి రోజుకు చప్పబడిపోయే చాలామందిలా కాకుండా, ఆ నిర్ణయాలకు కట్టుబడి ఉండేవారు. "మొత్తం అందరూ కొత్తవాళ్ళతో 'తేనెమనసులు' సినిమా తీద్దాం" లాంటి ఆయన సాహసోపేతమైన నిర్ణయాలే అందుకు ఉదాహరణ.


ఆయనలోని గొప్పతనం ఏమిటంటే, ఆయనెప్పుడూ నన్ను ఓ అసిస్టెంట్‌గా చూడలేదు. క్రియేటివ్ వర్క్‌లో సహచరుడిగా చూసేవారు. నాకు ఆయన 'మూగమనసులు' (1964 జనవరి 30 రిలీజ్)కి సెకండ్ యూనిట్ డైరెక్టర్‌గా బాధ్యతలు ఇచ్చినా, 'సుడిగుండాలు' (1968 జూన్ 28)కి స్క్రీన్‌ప్లే రైటర్ పని అప్పజెప్పినా అందుకే. నన్నెప్పుడూ తనతో సమాన గౌరవమిచ్చి, తన వెంటే విమానంలో తీసుకెళ్ళేవారు. ఆదుర్తి గారు, నిర్మాతలు నా మీద పెట్టుకున్న నమ్మకానికి తగ్గట్లే, సినిమా రూపకల్పనలో వీలైనంత ముందస్తు సన్నాహాలన్నీ చేసేవాణ్ణి. ఎస్. రాజేశ్వరరావు గారు, కె.వి. మహదేవన్ గారు లాంటి పెద్ద సంగీత దర్శకులతో, దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి లాంటి ప్రసిద్ధ గీత రచయితలతో పాటల చర్చలు వగైరా చేసి, ఆ వ్యవహారాల్లో దర్శకుడికి భారం తగ్గించేవాణ్ణి. ఆదుర్తి గారి ప్రోత్సాహంతోనే, 'ఆత్మగౌరవం' (1966 మార్చి 18)తో తొలి చిత్ర దర్శకుడినయ్యా. అక్కడ నుంచి మరో కథ.



'సెట్స్‌'లో ఆదుర్తి, అక్కినేని, సావిత్రి, టి.కృష్ణలతో విశ్వనాథ్

వాళ్ళే కథలకు ప్రేరణ

నా చిత్రాల్లో అత్యధిక శాతానికి కథలన్నీ నావే. చుట్టూ చూసిన మనుషులు, ప్రపంచం, వార్తలు, ఎదురైన అనుభవాలే వాటికి ప్రేరణ. కొన్ని కథలు చాలా గమ్మత్తుగా పుడతాయి. మన ఊళ్ళలో ఇంట్లో ఏ కాఫీ పొడో, చక్కెరో అయిపోతే, అప్పటికప్పుడు పక్కింటివాళ్ళ దగ్గరకెళ్ళి అరువు తెచ్చుకోవడం సర్వసాధారణం. అలా నా చిన్నప్పుడు మా పక్కింటివాళ్ళు వచ్చి ఒకసారి మా ఇంటి నుంచి ఒక చిన్న గ్లాసుడు కాఫీ పొడి తీసుకెళ్ళారు. ఆ తరువాత కొన్నాళ్ళకు పక్కింటి అమ్మాయి వచ్చి, కాఫీ పొడి ఇవ్వలేదు కానీ, మా గ్లాసు మాకు ఇవ్వడానికి వచ్చింది. ఆ అమ్మాయి ఆ గ్లాసు నాకు ఇస్తున్నప్పుడు నా చేతిని తగిలింది. ఒక్కసారిగా నా ఒళ్ళు ఝుల్లుమంది. అప్పుడు నా వయసు ఏడెనిమిదేళ్ళుంటాయేమో. అప్పుడప్పుడే స్త్రీ పురుష భేదం తెలుస్తూ, ఎదుగుతున్న దశలో ఒక ఆపోజిట్ సెక్స్ వ్యక్తి మాగ్నెటిక్ టచ్‌తో కలిగిన ఆ అనుభూతి నన్నెంతో కాలం వెంటాడింది. కేవలం ఒక స్పర్శతో కలిగే అనుభూతి ఏమిటనే ఆ ఆలోచనే నేను సినిమా రంగంలోకి వచ్చాక, పెరిగి పెద్దదై, 'సిరివెన్నెల'కి ప్రేరణ అయింది. !



తొలి చిత్రం 'ఆత్మగౌరవం'



అలాగే, ఆ రోజుల్లో ఒక బ్రిటీష టూరిస్టు వనిత మన ఇండియాకు వచ్చి తిరుగుతూ, కేరళలో ఒక రిక్షావాణ్ణి పెళ్ళి చేసుకుంది. అది పెద్ద పబ్లిసిటీ అయింది. ఆ వార్త చదివినపుడు నేను ఇన్‌స్పైర్ అయ్యా. వాళ్ళ పెళ్ళి ఎలా జరిగినా, కేవలం పబ్లిసిటీ కోసమే అన్నీ, చివరకు కూతురి (జయసుధ) పెళ్ళి కూడా చేసే కాలేజీ కరెస్పాండెంటైన ఒక అత్త గారి (రమాప్రభ) కథ అల్లుకున్నా. అల్లుడు (కృష్ణంరాజు) ఎలా సరైన దోవలో పెట్టాడనే టీజింగ్ ఫార్ములాతో కథ నడుస్తుంది. అదే... 'అల్లుడు పట్టిన భరతం' (1980).

బ్లాక్ అండ్ వైట్ రోజులకు వెళితే... ఎన్టీయార్, జగ్గయ్యలతో నేను తీసిన 'చిన్ననాటి స్నేహితులు' (1971) సినిమా. నేను చాలా దగ్గర నుంచి చూసిన ప్రముఖ చిత్ర నిర్మాతలు 'విజయా' బి. నాగిరెడ్డి, చక్రపాణి గార్ల జీవితం ఆ చిత్రకథకు ప్రేరణనిచ్చింది. నాగిరెడ్డి గారి పిల్లలు తమకు డబ్బు కావాలంటే, వాళ్ళ నాన్న గారిని కాకుండా తమ కుటుంబ సన్నిహితులైన చక్రపాణి గారిని అడిగేవాళ్ళు. అలాంటివన్నీ చూసిన తరువాత, ఆఫీసులో యజమాని (జగ్గయ్య), ఉద్యోగి (ఎన్టీయార్)గా పనిచేస్తూ, ఇంటి దగ్గర ఆప్తమిత్రులుగా మెలిగే ఇద్దరు స్నేహితుల కథ తట్టింది. జగ్గయ్య కూతురు వాణిశ్రీ ఏం కావాల్సినా తండ్రిని కాకుండా, తండ్రికి చిన్ననాటి స్నేహితుడైన ఎన్టీయార్‌ను అడుగుతుంది. అలా 'చిన్ననాటి స్నేహితులు' అల్లా.




అవే... హిందీలో కొత్తగా!

హిందీ చిత్రసీమలో నా ప్రవేశం చిత్రంగా జరిగింది. నిజానికి, హిందీ రంగంలోకి వెళ్ళాలననే ఆలోచన నాకెప్పుడూ లేదు. రాలేదు. అయితే, నా 'ఓ సీత కథ' సినిమా చూసి, హిందీ నటుడు, నిర్మాత ప్రేమ్‌జీ వచ్చి పట్టుబట్టడంతో హిందీలో 'ఓ సీత కథ' మొదలుపెట్టా. తెలుగులో రోజారమణి, కాంతారావు వేసిన వేషాలకు హిందీలో రేఖ, శ్రీరామ్‌లాగూను తీసుకున్నాం. ప్రేమ్‌జీది గమ్మత్తైన పద్ధతి. ఆ ప్రొడక్షన్ రోజుకో కొత్త రచయితతో సాగేది. ఆ సినిమా అలా ఏళ్ళ తరబడి నిర్మాణంలో ఉండిపోయింది. ఆ సినిమాకు నా దగ్గర శశిలాల్ నాయర్ అనే తెలివైన, చురుకైన యువకుడు అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాడు. అతను అప్పటికే డైరెక్షన్ యత్నాల్లో ఉండడంతో, చివరలో సినిమా కంప్లీట్ చేసే బాధ్యతను అతనికి అప్పజెప్పా. చివరకు ఆలస్యంగా 'ఔరత్.. ఔరత్... ఔరత్' (1996) పేరిట విడుదలైందట!

హిందీలో నా అసలు సిసలు రంగప్రవేశం రిషికపూర్, జయప్రద నటించిన 'సర్గమ్' (1979)తో. అది తెలుగు హిట్ 'సిరిసిరిమువ్వ' (1976)కు రీమేక్. ఆ సినిమా రీమేక్ హక్కుల్ని నవయుగ ఫిల్మ్స్ అధినేత పర్వతనేని చంద్రశేఖరరావు గారి సోదరుడు, ప్రముఖ నిర్మాత పి. మల్లికార్జునరావు తీసుకున్నారు. 'సిరిసిరిమువ్వ' హిందీలో తీద్దామనుకున్న ఆయన, ఇంతలో మరో ప్రసిద్ధ హిందీ నిర్మాత ఎన్.ఎన్. సిప్పీ అడగడంతో, ఆ రైట్స్ ఆయనకు అమ్మేశారు. సిప్పీ దగ్గర ఎప్పుడూ ఆస్థాన దర్శకుల బృందం ఒకటి ఉండేది. అందులో దీక్షిత్ అనే ఆయనకు ఈ రీమేక్ అప్పగించారు. ఆయన తెలుగు 'సిరిసిరిమువ్వ' చూసి, 'ఇందులో కథ కన్నా, కథనం ఇంకా బాగుంది. కాబట్టి నా కన్నా, తెలుగు మాతృక తీసిన దర్శకుణ్ణి పెట్టుకుంటే న్యాయం జరుగుతుంది' అని విశాల హృదయంతో చెప్పారు. దాంతో, సిప్పీ నా దగ్గరకు వచ్చారు. అలా 'సర్గమ్' తీశా. పెద్ద హిట్.

అలా... హిందీలోకి 'శంకరాభరణం'

'శంకరాభరణం' కూడా హిందీలో 'సుర్ సంగమ్' పేరిట రీమేక్ చేశాం. అసలు కర్ణాటక సంగీతం నేపథ్యంలోని ఆ సినిమాను హిందీలో చేయాలని అనుకోలేదు. అప్పట్లో హైదరాబాద్‌లో వజీర్ సుల్తాన్ టొబాకో (చార్మినార్ సిగరెట్ తయారీ కంపెనీ) వాళ్ళు 'మ్యూజిక్ ఈజ్ గోల్డ్' అని ఉత్సవాలు జరిపేవారు. ఆ ఉత్సవాల్లో పాల్గొనేందుకు సితార పండిట్ రవిశంకర్, ప్రతిమా బేడీ, శివ్‌కుమార్ శర్మ, సి.ఎన్. వ్యాస్ లాంటి సంగీత, నృత్య దిగ్గంతులు చాలా మంది హైదరాబాద్ వచ్చారు. వాళ్ళందరికీ సికింద్రాబాద్ మంజు థియేటర్‌లో 'శంకరాభరణం' మార్నింగ్ షో చూపించా. సినిమా పూర్తయ్యాక రవి శంకర్ గారితో కారులో నేనూ లంచ్‌కు వెళుతున్నా. అప్పుడాయన 'శంకరాభరణం'ని మెచ్చుకున్నారు. 'సౌత్‌లో మీకు కర్ణాటక సంగీతం ఒక్కటే. కానీ, మాకు నార్త్‌లో చాలా ఘరానాలున్నాయి. ఒక్కో ఘరానాలో ఒక్కో సంగీత సంప్రదాయం. కాబట్టి, ఈ సినిమా హిందీలో చేయడం కొద్దిగా ఇబ్బంది. ఇఫ్ ఎనీ టైమ్ యు వాంట్ హెల్ప్, అయామ్ దేర్' అన్నారు. అప్పటికి హిందీలో తీయాలనే ఆలోచనే లేని నేను ఆశ్చర్యపోయా.



తరువాత 'శంకరాభరణం' హిందీ రైట్స్ నిర్మాత ఎన్.ఎన్. సిప్పీయే మొదట కొన్నారు. చివరకు మన వద్దే రమేశ్ వాళ్ళు ఉత్సాహపడడంతో, వాళ్ళకు రైట్స్ ఇచ్చేశారు. హిందీలో తీయమంటూ నా దగ్గరకు వచ్చినపుడు, రవిశంకర్ గారి సలహాతో రాజన్ మిశ్రా, సాజన్ మిశ్రా అనే ప్రసిద్ధ సంగీత విద్వాంసులిద్దరిని సంప్రతించాం. వారిద్దరినీ బొంబాయికి రప్పించాం. ఇరవై రోజుల పాటు వాళ్ళు రోజూ ఏదో ఒకటి పాడడం, రాగం ఆలపించడం, అది విని లక్ష్మీకాంత్-ప్యారేలాల్ జంట మరొకటి పాడడం... ఇలా బాగా మథించి, ఆ జంట, ఈ జంట కలసి సమన్వయంతో 'శంకరాభరణం' హిందీ వెర్షన్ 'సుర్ సంగమ్'కి సంగీతం చేశారు. తెలుగులో జె.వి. సోమయాజులు వేసిన శంకరశాస్త్రి పాత్రకు అప్పట్లో బ్రాహ్మణ తరహా వేషాలు వేస్తున్న గిరీశ్ కర్నాడ్‌ను తీసుకున్నాం. మంజుభార్గవి చేసిన తులసి పాత్రకు జయప్రదను తీసుకున్నాం. అయితే, గిరీశ్ కర్నాడ్‌లో కొంత స్త్రీత్వం కనిపిస్తోందనీ, శంకరశాస్త్రి పాత్రలోని గాంభీర్యం రాలేదనీ కొందరు విమర్శించారు. నిజానికి, ఈ పాత్ర ఎలాగైనా తాను వేయాలని నటుడు అనుపమ్ ఖేర్ ఆ రోజుల్లో ట్రై చేశారు. కానీ, అది కుదరలేదు. ఏమైనా, హిందీ వెర్షన్ ఆశించిన ఆదరణ పొందలేదు.




'శంకరాభరణం'లో ...

అవే సినిమాలు... హిందీలో కొత్తగా!

ఇప్పటి దాకా హిందీలో పది సినిమాలు దర్శకత్వం వహించా. వాటిలో ఎనిమిది నా తెలుగు హిట్స్‌కు రీమేక్‌లు. 'సంగీత్', 'ధన్‌వాన్'... రెండూ మాత్రం స్ట్రయిట్ హిందీ సినిమాలు. మీరు గమనిస్తే, నా సొంత సినిమాలు నేనే రీమేక్ చేసినా హిందీలో ఆ టేకింగ్, ఆ ఎడాప్టేషన్ పూర్తిగా భిన్నంగా కనిపిస్తాయి. కావాలంటే, 'సిరిసిరిమువ్వ... సర్గమ్', 'శంకరాభరణం... సుర్ సంగమ్', 'సప్తపది... జాగ్ ఉఠా ఇన్సాన్', 'శుభోదయం... కామ్‌చోర్', 'జీవన జ్యోతి... సన్‌జోగ్', 'శుభలేఖ... శుభ్ కామ్నా', 'స్వాతిముత్యం... ఈశ్వర్'... ఇలా ఒరిజినల్, రీమేక్‌లు రెండూ పక్కపక్కనే పెట్టుకొని చూడండి. నా దృష్టిలో రీమేక్ అంటే మక్కికి మక్కి తీయడం కాదు. మాతృకలోని ఆత్మను పోగొట్టకుండా జాగ్రత్తపడుతూ, మునుపటి లోటుపాట్లను సవరిస్తూ, ఆ కథను ఇంకా వీలైనంత మెరుగ్గా చెప్పడం! నా సినిమాలను నేనే హిందీలో రీమేక్ చేసినా, ఆ రీమేక్‌లు కొత్తగా ఉండడానికి కారణం అదే!

అవి రీమేక్ చేయాలనుంది!

హిందీలో నేరుగా తీసిన సినిమాలకొస్తే, మన దగ్గర రికార్డింగ్ డ్యాన్సుల లాగా ఉత్తరాదిన నౌటంకీ నృత్యం చేసే, కళ్ళు లేని అమ్మాయి కథగా హిందీలో 'సంగీత్' చేశా. అందులో మూడు వయసుల్లో మాధురీ దీక్షిత్ కనిపిస్తుంది. మంచి సినిమా. కొన్ని సన్నివేశాలు ఇప్పటికీ ఫ్రెష్‌గా అనిపిస్తాయి. అలాగే, అజయ్ దేవ్‌గణ్, కరిష్మా కపూర్, మనీషా కొయిరాలా నటించిన 'ధన్‌వాన్' చిత్రం. ఇప్పటికీ నా తెలుగు సినిమాల్లో కొన్ని హిందీలో రీమేక్ చేయాలని అనిపిస్తుంటుంది. టీజింగ్ ఫార్ములా 'అల్లుడు పట్టిన భరతం' హిందీలో బాగుంటుందని, అది రీమేక్ చేయాలని అనుకొనేవాణ్ణి. అలాగే, చెప్పులు కుట్టుకొనే స్థాయి నుంచి కోటీశ్వరుడిగా ఎదిగిన హీరో కథ 'స్వయంకృషి' హిందీలో చేస్తే బాగుంటుంది. కన్నడ నటుడు స్వర్గీయ విష్ణువర్ధన్‌కు ఎలాగైనా 'స్వయంకృషి' కన్నడంలో చేయాలని ఉండేది.



భయపడ్డ ఆ పాటే హిట్టు!

'సర్గమ్' అనగానే అందరికీ గుర్తొచ్చే పాపులర్ పాట 'డఫ్లీవాలే డఫ్లీ బజా'. ఆ పాట ఎంత పెద్ద హిట్టో అందరికీ తెలుసు. కానీ, ఆ పాట పెడుతున్నప్పుడు నేను కొద్దిగా అనుమానించా. తెలుగు ఒరిజినల్‌లో అక్కడ 'రారా స్వామి రారా' అంటూ సంప్రదాయ కీర్తన వస్తుంది. ఇక్కడేమో డఫ్లీవాలే... ట్యూన్ ఇచ్చారు లక్ష్మీకాంత్-ప్యారేలాల్. ఆ ట్యూను, అందులోనూ 'డఫ్లీ బజా... డఫ్లీ బజా' (డప్పు వాయించు... డప్పు వాయించు) అనే ఆ మాటలు తప్పుడు అర్థం ఇస్తాయేమోనని అనుమానించా. కానీ, సంగీత దర్శకుడు, నిర్మాత నన్ను కన్విన్స్ చేశారు. సినిమా మొత్తంలో ఆ పాట పాపులర్ అవుతుందని చెప్పారు. అలానే షూటింగ్ చేసేశాం. సినిమా రిలీజైంది. చివరకు నిర్మాత చెప్పినట్లే అయింది. దేశమంతటా ఆ పాట మారుమోగింది. కలకత్తాకు వెళితే, థియేటర్‌లో జనం ఆ పాటకు డబ్బులు విసరడం నా కళ్ళారా చూశా.



'సర్గమ్'లో రిషీకపూర్, జయప్రద


కనులలో కథలెన్నో..

ఇటీవల నేను నటించిన సినిమాలంటే... హీరో అర్జున్ దర్శకత్వం వహించిన తమిళ, కన్నడ ద్విభాషా చిత్రం (తమిళంలో 'సొల్లి విడవా', కన్నడంలో 'ప్రేమ బరహ') పది రోజుల క్రితం విడుదలైంది. కార్గిల్ యుద్ధం నేపథ్యంలో సాగే ఇద్దరు జర్నలిస్టుల ప్రేమకథ అది. అర్జున్ కుమార్తె ఐశ్వర్యా హీరోయిన్. నాది ఆమె తాత పాత్ర. సినిమాకు మంచి రిపోర్టులు వస్తున్నాయి. మంచి పాత్రలు వస్తే చేయడానికి (నవ్వుతూ...) ఇప్పటికీ కాస్ట్యూమ్స్‌తో, వయసుకు తగ్గ ఈ గడ్డంతో సిద్ధంగా ఉన్నా. దర్శకత్వం వహించమని కూడా కొందరు అడుగుతుంటారు. ఇప్పటికీ ఎన్నో సబ్జెక్టులు మనసులో తిరుగుతుంటాయి. సహాయకులతో కలసి వాటి మీద ఒక్కో మాట అనుకుంటూ, కథలుగా అల్లుతుంటా. నేను తీసిన సినిమాల కన్నా ఇలా అనుకొని, అల్లుకొని, ఇంకా తీయకుండా డైరీలో రాసుకున్న స్క్రిప్టులు బోలెడున్నాయి. సంగీత నేపథ్యంలో సాగే ఒక టెర్రరిస్టు కథ, అలాగే జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన ఒక కర్ణాటక సంగీత విద్వాంసురాలి కథ 'విదుషీమణి' లాంటివి అందులో మచ్చుకు కొన్ని. మొదటి కథ విని అర్జున్ ఎలాగైనా ఆ సినిమా చేయాలని ఉబలాటపడ్డాడు. ఇక, 'విదుషీమణి' కథ అంటే నటి జయప్రదకు ప్రాణం. ఇప్పటికీ ఆ సినిమా చేద్దామని అంటూ ఉంటుంది. పరమేశ్వరానుగ్రహం ఎలా ఉంటుందో చూద్దాం.

ఈ నెల 23న బ్రహ్మాండమైన విడుదల



PRASADS ఎన్.టి.ఆర్ గార్డెన్	Cinepolis ఎ/సి - అత్తాపూర్	Cinetown మియాపూర్
PVR మాదాపూర్	TIVOLI సికింద్రాబాద్	MULTIPLEX ఎల్.బి.నగర్
PVR బంజారాహిల్స్	Cine Planet ఎ/సి - కొంపల్లి	ASIAN ఎ/సి - చింతల్
PVR పంజాగుట్ట	దిల్‌సుఖ్‌నగర్	ASIAN హన్మకొండ
PVR కూకట్‌పల్లి	ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్	GEETHA ASIAN నిజామాబాద్
INOX బంజారాహిల్స్	ASIAN ఎ/సి - ఉప్పల్	SVC ఎ/సి - కరీంనగర్
INOX ఎ/సి - కాచిగూడ	మూసాపేట్	ఎ/సి - వరంగల్
ఎ/సి - అమీర్‌పేట్	ASIAN ఎ/సి - కూకట్‌పల్లి	మరియు మీ అభిమాన థియేటర్లలో
ఎ/సి - శామీర్‌పేట్	ASIAN ఎ/సి - అత్తాపూర్	
Cinepolis ఎ/సి - కూకట్‌పల్లి	ASIAN ఎ/సి - కాప్రా	
Cinepolis మల్కాజ్‌గిరి	ASIAN దిల్‌సుఖ్‌నగర్	RELEASE



శ్రీమయూరి

70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్

లక్ష్మీకళ సినీప్రైడ్ మల్టీప్లెక్స్ ఎ/సి - మూసాపేట్

BVK విజయలక్ష్మి మల్టీప్లెక్స్ ఎ/సి - ఎల్.బి.నగర్

PRASADS ఎన్.టి.ఆర్ గార్డెన్	INOX బంజారాహిల్స్	TIVOLI సికింద్రాబాద్	Cinetown మియాపూర్
PVR మాదాపూర్	INOX ఎ/సి - కాచిగూడ	ఎ/సి - కొంపల్లి	ASIAN హన్మకొండ
PVR బంజారాహిల్స్	ఎ/సి - అమీర్‌పేట్	దిల్‌సుఖ్‌నగర్	GEETHA ASIAN నిజామాబాద్
PVR పంజాగుట్ట	మల్కాజ్‌గిరి	ఇ.సి.ఐ.ఎల్ క్రాస్ రోడ్	SVC ఎ/సి - కరీంనగర్
PVR కూకట్‌పల్లి	- అత్తాపూర్	ఎ/సి - కాప్రా	ఎస్2 - వరంగల్
లక్ష్మణ్ - వరంగల్	రాజా డీలక్స్ - కరీంనగర్	బాలాజీ - మహబూబ్‌నగర్	శ్రీనివాస - తాండూర్

మరియు మీ అభిమాన థియేటర్లలో — AMAZING ARTS RELEASE

విజయవంతమైన 2వ వారం MEMORABLE HIT...



దేవి

70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్

11.00,2.15,5.45,9.15

Enjoy 4k Digital Projection & Dolby Atmos Sound System

SVC మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00,2.00,6.00,9.00

SVC సంగీత - ఆర్.సి.పురం 11.00,2.00,6.00,9.00

SVC ఈశ్వర్ - అత్తాపూర్ 11.00,2.00,6.00,9.00

శ్రీలక్ష్మి 70 ఎ/సి - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00

PRASADS 10.00,12.45,3.30,8.30,11.00	Cinemas SHAMEERPET 11.20,5.00,7.40,10.40	ASIAN కూకట్‌పల్లి 1.20,4.30,7.20
PVR 10.30,1.25,4.20,7.15,10.10	Cinepolis 10.20,1.15,4.10,7.00,10.00	ASIAN అత్తాపూర్ 1.20,4.30,7.45
PVR 10.10,1.05,7.45,11.00	Cinepolis 10.45,1.40,4.35,7.30,10.25	ASIAN RADHIKA కాప్రా 10.50,1.20,7.20,10.30
PVR 10.40,1.35,4.30,7.25,10.20	Cinepolis 10.10,1.05,4.00,6.55,9.50	ASIAN దిల్‌సుఖ్‌నగర్ 2.00,9.00PM
PVR 10.20,11.20,1.15,4.10, 7.05,8.05,10.00,11.00	TIVOLI సికింద్రాబాద్ - 11.00,4.30,10.00	MULTIPLEX 11.15,2.00,4.45,7.30,10.15
	Cine Planet కొంపల్లి 10.40,1.25,7.15,10.40	ASIAN చింతల్ 2.30,9.15PM
INOX 10.40,1.00,4.40,7.35,10.30	11.00,2.00,8.00,11.00	ASIAN హన్మకొండ 11.05,1.45,7.30,10.20
INOX 10.30,1.20,4.10,7.40,10.30	ఎ/సి - 11.00,2.00,6.00	GEETHA ASIAN నిజామాబాద్ 1.50,7.30,10.30
Cinemas AMEERPET 11.10,4.40,7.30,10.15	ASIAN ఉప్పల్ 10.45,1.45,7.10,10.40	ఎస్2 సినిమాస్ - వరంగల్
మల్లిఖార్జున - కూకట్‌పల్లి 11.30,2.30,6.30,9.30	మంజు - సికింద్రాబాద్ 11.00,2.00,6.00,9.00	శ్రీసాయిరామ్ - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15
మెగా - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00	సెన్సేషన్ సన్‌షైన్ - ఖైరతాబాద్ 11.00,2.00,6.00,9.00	సంతోష్ - ఇబ్రహీంపట్నం 11.00,2.00,6.00,9.00
శ్రీరాములు - మూసాపేట్ 11.30,2.30,6.30,9.30	నర్తకి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30	భుజంగ - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
SVR శివశక్తి - కాప్రా 11.00,2.00,6.00,9.00	గెలాక్సీ - టోలిచౌకి 11.00,2.00,6.00,9.00	సుష్మ - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15
గోకుల్ - ఎర్రగడ్డ 11.15,2.15,6.15,9.15	BR హైటెక్ - మాదాపూర్ 11.15,2.15,6.15,9.15	వైజయంతి - నాచారం 11.00,2.00,6.00,9.00
శ్రీనివాస - ఉప్పల్ 11.15,2.15,6.15,9.15	కళ్యాణి మూవీమ్యాక్స్ - బోయిన్‌పల్లి 11.30,2.30,6.30,9.30	గణేష్ - శంషాబాద్ 11.30,2.30,6.30,9.30
సాయిరంగ - మియాపూర్ 11.00,2.00,6.00,9.00	SV సినీస్కేర్ - పటాన్‌చెరు 11.15,2.15,6.15,9.15	వెంకటేశ్వర - మేడ్చల్ 11.00,2.00,6.00,9.00
స్వప్న కాంప్లెక్స్ - కాటేదాన్ 11.00,6.00PM	శ్రీప్రేమ - తుక్కుగూడ 11.00,2.00,6.00,9.00	కృష్ణ - అలియాబాద్ 11.00,2.00,6.00,9.00
		మహేశ్వరి సినిమా - మహేశ్వరం 11.00,2.00,6.00,9.00

SVC ప్రతిమ 70 ఎ/సి - కరీంనగర్ | SVC దేవి 70 ఎ/సి - జనగాం

SVC రామకృష్ణ 70 - షాద్‌నగర్ | SVC నటరాజ్ 70 - నల్గొండ

వరంగల్
రాధిక 70 ఎ/సి - వరంగల్
అమృత ఎ/సి - హన్మకొండ
లక్ష్మి - మహబూబాబాద్
భవాని ఎ/సి - కాజీపేట్
జయశ్రీ ఎ/సి - నర్సంపేట
ఊర్వశి ఎ/సి - భూపాలపల్లి
జయా డీలక్స్ - పరకాల
వెంకటేశ్వర - తొర్రూర్
లక్ష్మి ఎ/సి - మర్రిపెడ
బాలాజీ ఎ/సి - చేర్యాల
శ్రీలక్ష్మి ఎ/సి - డోర్నకల్
సూర్య కళామందిర్ - నెక్కొండ
తిరుమల - పాలకుర్తి
మోహన్ - కేసముద్రం
నారాయణ - హసన్‌పర్తి

ఖమ్మం
వినోద 70 - ఖమ్మం
దుర్గ 70 - కొత్తగూడెం
ఉదయభాస్కర్ - భద్రాచలం
సాయి బాలాజీ - సత్తుపల్లి
వెంకటేశ్వర - పాల్వంచ
సీతారామ - మణుగూరు
కళాంజలి ఎ/సి - ఇల్లందు
శాంతి - మధిర

సాయిసుమన్ - అశ్వరావుపేట
వాసవి ఎ/సి - వైరా
శివం ఎ/సి - సారపాక
శ్రీదుర్గ ఎ/సి - బోనకల్
సాయిబాలాజీ - నేలకొండపల్లి

కరీంనగర్
తిరందాజ్ - కరీంనగర్
న్యూఅశోక - గోదావరిఖని
బాలాజీ ఎ/సి - జగిత్యాల
విమల్ 70 ఎ/సి - సిరిసిల్ల
సంగీత 70 ఎ/సి - పెద్దపల్లి
లక్ష్మి 70 ఎ/సి - మెట్‌పల్లి
లక్ష్మి 70 ఎ/సి - కోరుట్ల
అన్నపూర్ణ - హుజూరాబాద్
మురళీ డీలక్స్ - జమ్మికుంట
శ్రీ రాజరాజేశ్వరి - వేములవాడ
వెంకటేశ్వర - హుస్నాబాద్
రాజశ్రీ ఎ/సి - రాయికల్
శ్రీనివాస ఎ/సి - చొప్పదండి
సారథి కళామందిర్ - కమలాపూర్
అన్నపూర్ణ ఎ/సి - ముల్కనూర్

నిజామాబాద్
విజయ - నిజామాబాద్
ప్రియా 35 - కామారెడ్డి
వెంకటేశ్వర ఎ/సి - బోధన్

మహేశ్వరి - బాన్సువాడ
వెంకటేశ్వర ఎ/సి - ఆర్మూర్
సుదర్శన్ ఎ/సి - భీమ్‌గల్
వెంకటేశ్వర ఎ/సి - పిట్లం
పరమేశ్వరి - బిచ్‌కుంద
లక్ష్మి ఎ/సి - ఎల్లారెడ్డి
వెంకటేశ్వర ఎ/సి - దర్పల్లి
కృష్ణ ఎ/సి - నందిపేట్

మహబూబ్‌నగర్
తిరుమల కాంప్లెక్స్ - మహబూబ్‌నగర్
శ్రీనివాస ఎ/సి - వనపర్తి
శ్రీనివాస ఎ/సి - గద్వాల్
బాబా 70 - నారాయణపేట
శ్రీనివాస 70 ఎంఎం- జడ్చర్ల
శ్రీసాయిరాం - అచ్చంపేట
రవి ఎ/సి - నాగర్‌కర్నూలు
నేషనల్ ఎ/సి - కల్వకుర్తి
శివసాయి 70 - ఐజ
వెంకటేశ్వర - కొల్లాపూర్
పరమేశ్వరి - కొత్తకోట
రాఘవేంద్ర ఎ/సి - మక్తల్
రాఘవేంద్ర ఎ/సి - దేవరకద్ర
లక్ష్మి 70 ఎంఎం ఎ/సి - కోస్గి
వెంకటేశ్వర ఎ/సి - పెబ్బేరు
హైటెక్ ఎ/సి - ఆత్మకూర్

శ్రీనివాస ఎ/సి - కడ్తాల్

నల్గొండ
వెంకటేశ్వర - మిర్యాలగూడ
కిషోర్ ఎ/సి - సూర్యాపేట
రంగ 70 ఎ/సి - కోదాడ
వసుంధర - భువనగిరి
వెంకటేశ్వర ఎ/సి - నకిరేకల్
శ్రీనివాస - హుజూర్‌నగర్
వెంకటేశ్వర - దేవరకొండ
శ్రీనివాస ఎ/సి - చౌటుప్పల్
మల్లీశ్వరి - తిరుమలగిరి
సుజన ఎ/సి - చిట్యాల
లక్ష్మి 70 ఎ/సి - మాల్
లక్ష్మి ఎ/సి - యాదగిరిగుట్ట
అచ్చిరెడ్డి ఎ/సి - హాలియా
వెంకటేశ్వర - వలిగొండ
తారా సినిమా - మోత్కూర్
ఆనంద్‌రాయల్ - దిండి

ఆదిలాబాద్
మహేశ్వరి - ఆదిలాబాద్
శ్రీనివాస ఎ/సి - మంచిర్యాల
నారాయణ 70 - నిర్మల్
బాలాజీ 70 - బెల్లంపల్లి
వెంకటరమణ - కాగజ్‌నగర్

తిరుమల - సిసిసి శ్రీరామ్‌పూర్
కమల ఎ/సి - భైంసా

మెదక్
సినీమాక్స్ 70 ఎ/సి - మెదక్
సీతారామ - సిద్దిపేట
రుక్మిణి ఎ/సి - సంగారెడ్డి
జ్యోతి ఎ/సి - సదాశివపేట
మహేశ్వరి - జహీరాబాద్
సంతోష్ 70 ఎ/సి - గజ్వేల్
సాయిరామ్ - రామాయంపేట
సాయి డీలక్స్ - నర్సాపూర్
సువర్ణ 70 - నారాయణఖేడ్
శ్రీనివాస 70 - దుబ్బాక
పావని 70 - వెల్దుర్తి

రంగారెడ్డి
సినీమాక్స్ - వికారాబాద్
చంద్ర ఎ/సి - తాండూర్
భవాని 70 ఎ/సి - పరిగి
లక్ష్మి 70 ఎ/సి - శంకర్‌పల్లి
వెంకటేశ్వర 70 - చేవెళ్ల

రాయచూర్
పద్మనాభ - రాయచూర్
కనకదుర్గ - గంగావతి
కూడలిసంఘమేశ్వర - సింధనూర్
సవిత ఎ/సి - దేశాయిక్యాంప్

నేడే చూడండి... SUPER HIT...




సంధ్య

70 ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్

11.00,2.00,6.00,9.00

PRASADS 10.00,6.10,8.50,11.15	భ్రమరాంబ 70 - కూకట్‌పల్లి 11.30,2.45,6.30,9.45
PVR మాదాపూర్ 11.00,8.05,10.50	రాజధాని కాంప్లెక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,6.00,9.00
PVR బంజారాహిల్స్ 10.50,4.00,7.50	స్వప్న కాంప్లెక్స్ ఎ/సి - కాటేదాన్ 11.00,6.00PM
PVR పంజాగుట్ట 10.50,1.30,8.15	సూపర్ 70 ఎ/సి - బాలాపూర్ 11.00,2.00,6.00,9.00
PVR 10.15,11.15,2.20,4.45,8.15,10.30	శ్రీదేవి 70 ఎంఎం ఎ/సి - ఆర్.సి.పురం 11.15,2.15,6.15,9.15
PVR ఐకాన్ - 12.00,7.15,10.30	శ్రీరమణ కాంప్లెక్స్ ఎ/సి - అంబర్‌పేట్ 11.15,2.15,6.15,9.15
PVR పంజాగుట్ట ఎ/సి - 11.10, 11.25,2.10,4.15,5.05,8.05,11.00	విష్ణు 70 ఎంఎం ఎ/సి - వనస్థలిపురం 11.15,2.15,6.15,9.15
INOX బంజారాహిల్స్ 10.30,2.30,4.25,10.50	ఆరాధన 70 ఎంఎం ఎ/సి - తార్నాక 11.00,2.00,6.00,9.00
INOX కాచిగూడ 11.10,4.40,7.20	నాగేంద్ర 70 ఎ/సి - కర్మన్‌ఘాట్ 12.00,3.00,7.00,10.00
Cinemas AMEERPET అమీర్‌పేట్ 11.00,2.00,5.00,10.40	విజేత 70 ఎంఎం ఎ/సి - బోరబండ 11.00,2.00,6.00,9.00
Cinemas SHAMEERPET ఎ/సి - శామీర్‌పేట్ 4.50,10.20	రాఘవేంద్ర కాంప్లెక్స్ - మల్కాజ్‌గిరి 11.15,2.15,6.15,9.15
Cinepolis కూకట్‌పల్లి 10.30,4.20,7.30,10.50	అలంకార్ 70 ఎ/సి - లంగర్‌హౌస్ 11.00,2.00,6.00,9.00
Cinepolis మల్కాజ్‌గిరి 10.30,1.45,4.25,7.20,10.50	రాజ్యలక్ష్మి 70 ఎంఎం ఎ/సి - ఉప్పల్ 11.00,2.00,6.00,9.00
Cinepolis అత్తాపూర్ 11.20,1.55,5.00,7.25,10.40	రంగ 70 ఎంఎం ఎ/సి - జీడిమెట్ల 11.00,2.00,6.00,9.00
TIVOLI సికింద్రాబాద్ 1.40,7.30,10.45	శ్రీదేవి 70 ఎంఎం ఎ/సి - చిలకలగూడ 11.30,2.30,6.30,9.30
Cine Planet కొంపల్లి 10.30,1.35,7.25,10.10	శారద 70 ఎంఎం ఎ/సి - కాప్రా 11.00,2.00,6.00,9.00
దిల్‌సుఖ్‌నగర్ 10.30,4.35,7.15,10.00	SVC మహాలక్ష్మి కాంప్లెక్స్ - కొత్తపేట 11.00,2.00,6.00,9.00
ఇ.సి.ఐ.ఎల్ 11.15,2.15,6.15,9.15	సెలెక్ట్ 70 ఎ/సి - మచ్చబొల్లారం 12.00,3.00,7.00,10.00
ASIAN ఉప్పల్ 10.30,1.30,7.45,10.10	కృష్ణ సినిమా 70 ఎంఎం ఎ/సి - నాగారం 11.00,2.00,6.00,9.00
CINEPRIDE మూసాపేట్ 1100,2.15,6.00,9.30	లక్ష్మి 70 ఎంఎం ఎ/సి - శంషాబాద్ 11.30,2.30,6.00,9.00
ASIAN కూకట్‌పల్లి 10.50,4.50,10.15	జ్యోతి 70 ఎంఎం ఎ/సి - ఐడిఎ బొల్లారం 11.30,2.30,6.30,9.30
ASIAN అత్తాపూర్ 1.50,4.50,10.30	
ASIAN RADHIKA కాప్రా 10.30,4.50,7.40	
ASIAN శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,6.00	
Cinetown మియాపూర్ 11.15,6.00,9.45	
MULTIPLEX ఎల్బీనగర్ ఎ/సి - 11.00, 1.10,3.20,4.00,8.40,11.00	
ASIAN షా షహెన్‌షా చింతల్ 11.15,6.15	
ASIAN హన్మకొండ 10.50,1.35,7.00	
GEETHA ASIAN నిజామాబాద్ 10.40,1.40,7.40	
SVC ప్రతిమ ఎ/సి - కరీంనగర్	
ఎస్2 సినిమాస్ - వరంగల్	

రామ్ 70 - వరంగల్	దుర్గ కెఎం - జగిత్యాల	శారద 70 - పరిగి	పార్థసారథి - కల్వకుర్తి
శ్రీనివాస 70 - ఖమ్మం	నటరాజ్ - సిరిసిల్ల	అంజిరెడ్డి - చౌటుప్పల్	నటరాజ్ - హుజూరాబాద్
తిరుమల - కరీంనగర్	ఓంకార్ - భువనగిరి	సాయిరాజా - షాద్‌నగర్	మినీ ఎస్ఎన్‌టి - రాయ్‌చూర్
నటరాజ్ డీలక్స్ - నిజామాబాద్	వీఆర్‌డీఆర్ - సూర్యాపేట	సాయిరాం - అచ్చంపేట	రామ్‌రాజ్ - నర్సంపేట్
వెంకటేశ్వర - నల్గొండ	శకుంతల - కోదాడ	దేవి 70 ఎ/సి - జడ్చర్ల	శ్రీరమణ - నాగర్‌కర్నూల్
వెంకటేశ్వర - మహబూబ్‌నగర్	పరమేశ్వరి - కొత్తగూడెం	మోహన్ - జహీరాబాద్	రంగ 70 ఎ/సి - వనపర్తి
నటరాజ్ డీలక్స్ - అదిలాబాద్	శ్రీనివాస - సత్తుపల్లి	సితార 70 - సంగారెడ్డి	శాంభవి - కాజిపేట
అశోక - హన్మకొండ	గోపాలకృష్ణ - భద్రాచలం	వెంకటేశ్వర - సిద్దిపేట	రాఘవ - మిర్యాలగూడ
రామకృష్ణ - తొర్రూర్	లక్ష్మి 70 - మంచిర్యాల	మహేశ్వరి - సదాశివపేట	ప్రియ 70 - కామారెడ్డి
కృష్ణ కెఎం - జనగాం	తిరుమల 70 - నిర్మల్	సీతారామ - ఇల్లందు	సందీప్ - గంగావతి
ఊర్వశి - గోదావరిఖని	శాంతమహల్ - తాండూర్	KFC ENTERTAINMENT RELEASE	







జ్యోతిక

తుమ్హారీ జ్యోతిక

మధ్యతరగతి గృహిణిగా, రాత్రివేళల్లో పని చేసే రేడియో జాకీగా విద్యాబాలన్ నటించిన హిందీ చిత్రం 'తుమ్హారీ సులు'. పదిహేను కోట్ల నిర్మాణ వ్యయంతో తెరకెక్కిన ఈ చిత్రం సుమారు యాభై కోట్లు వసూలు చేసింది. ముఖ్యంగా జాతీయ పురస్కార గ్రహీత విద్యా బాలన్ నటనకు మంచి పేరొచ్చింది. ఇప్పుడు ఆ పాత్రలో నటించి, దక్షిణాది ప్రేక్షకులను మెప్పించడానికి జ్యోతిక సిద్ధమవుతున్నారు. పెళ్లి తర్వాత సందేశాత్మక చిత్రాలు, హుందాతనంతో కూడిన పాత్రలు చేస్తున్న జ్యోతిక, 'తుమ్హారీ సులు' తమిళ రీమేక్‌లో నటించనున్నారు. ఈ చిత్రానికి 'గగనం', 'గౌరవం' చిత్రాల ఫేమ్ రాధామోహన్ దర్శకత్వం వహించనున్నారు. జ్యోతిక మూగచెవిటి అమ్మాయిగా నటించిన తమిళ చిత్రం 'మౌళి'కి రాధామోహనే దర్శకుడు. వీళ్ళిద్దరి కాంబినేషన్‌లో 'తుమ్హారీ సులు' రీమేక్ రెండో చిత్రం! త్వరలో చిత్రీకరణ ప్రారంభించనున్నారు. 'మౌళి'లో జ్యోతిక నటనకు మంచి ప్రశంసలు వచ్చాయి. అందువల్ల, అప్పుడే ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడుతోంది. ప్రస్తుతం మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతోన్న ద్విభాషా చిత్రం 'నవాబ్'లో జ్యోతిక నటిస్తున్నారు.






ట్రెండ్‌ని ఫాలో అవుతా

- సీరత్ కపూర్

"రోమ్‌లో ఉంటే రోమన్‌లా ఉండమన్నారు. నాకు అలా ఉండటమే ఇష్టం. నటిని అయ్యాక ట్రెండ్స్‌ని ఫాలో కావడం తప్పనిసరి. నేను ఎప్పుడూ ట్రెండీగా ఉండటానికే ఇష్టపడతాను" అని అన్నారు సీరత్‌కపూర్. 'రన్ రాజా రన్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన నటి సీరత్ కపూర్. ఆమె మాట్లాడుతూ "ఫ్యాషన్‌గా ఉండటం ఎంత ముఖ్యమో, కంఫర్టబుల్‌గా ఉండటం కూడా అంతే ముఖ్యం. అందుకే నాకు సౌకర్యవంతమైన మోడ్రర్న్ దుస్తులను ధరించడానికే ఇష్టపడతాను" అని చెప్పారు సీరత్. ఇప్పటిదాకా చేసిన పాత్రల్లో ఇటీవల 'టచ్ చేసి చూడు'లో నటించిన దివ్య కేరక్టర్ మనసుకు దగ్గరైందని, థియేటర్‌లో చూసినప్పుడు చాలా ఎంజాయ్ చేశాననీ చెప్పారు.








రకుల్‌ప్రీత్ సింగ్

శివ... శివా... సైన్స్ ఫిక్షన్

ప్రేమకథల్లో నటించారు! యాక్షన్ కామెడీ సినిమాలు చేశారు! పక్కా కమర్షియల్ చిత్రాల్లో కథానాయికగా మెరిశారు! కానీ, రకుల్‌ప్రీత్ సింగ్ ఇప్పటివరకూ సైన్స్ ఫిక్షన్ సినిమా చేయలేదు. అందుకనే, తమిళంలో అవకాశం రాగానే అంగీకరించారని సమాచారమ్! బుల్లితెరపై యాంకర్ అడుగుపెట్టి వెండితెరపై దూసుకువెళ్తున్న శివ కార్తికేయన్ హీరోగా తమిళంలో ఒక సైన్స్ ఫిక్షన్ సినిమా రూపొందనుంది. 'ఇంద్రు నేట్రు నాళై' ఫేమ్ రవికుమార్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో శివ కార్తికేయన్‌కి జోడీగా రకుల్ నటించనున్నారని చెన్నై కోడంబాక్కమ్ టాక్. దర్శకుడు రకుల్‌కి కథ వినిపించడం, ఆమెకు నచ్చడం, వెంటనే డేట్స్ ఇచ్చేయడం జరిగాయట! బహుశా... జూన్‌లో చిత్రీకరణ ప్రారంభం కావొచ్చు. ప్రస్తుతం దర్శకుడు రవికుమార్ స్క్రిప్ట్ పనుల్లో క్షణం తీరిక లేకుండా ఉన్నారు. ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి స్వరకర్త. ఇది కాకుండా తమిళంలో సూర్య హీరోగా సెల్వ రాఘవన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంతో పాటు కార్తీ సరసన మరో చిత్రంలో రకుల్ నటిస్తున్నారు.

వేసవిలో... రెండో సంతానం!

ఎన్టీఆర్ ఇప్పుడు ఆనందోత్సాహంలో ఉన్నారు. ఆయన శ్రీమతి లక్ష్మీ ప్రణతి త్వరలో ఆయనకు మరో బిడ్డను కానుకగా ఇవ్వనున్నారు. ఎన్టీఆర్, ప్రణతి దంపతులకు నాలుగేళ్ల కుమారుడు అభయ్‌రామ్ ఉన్న సంగతి తెలిసిందే. అప్పుడప్పుడూ ఎన్టీఆర్ సినిమా వేడుకల్లోనూ ప్రణతి, అభయ్‌రామ్ తళుక్కున మెరుస్తుంటారు. ఈ వేసవిలో వీరి కుటుంబంలోకి మరొకరు చేరనున్నారనే విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. తమ హీరో రెండో సారి తండ్రి అవుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఎన్టీఆర్ అభిమానులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.


ఎన్టీఆర్

మనుషులకు, దెయ్యాలకు మధ్య...


నాని, శ్రీకాంత్, తరుణ్

శ్రీకాంత్, నాజియా జంటగా నటించిన చిత్రం 'రారా'. విజి చెర్రీస్ విజన్స్ యూనిట్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి శ్రీమిత్ర చౌదరి సమర్పకుడు. ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ వేడుక జరిగింది. నాని మాట్లాడుతూ "నాకు అష్టాచమ్మా నుండి శ్రీకాంత్‌గారితో పరిచయం ఉంది. నటుడిగా ఆయనేంటో అందరికీ తెలుసు. హారర్ జోనర్‌లో ఆయన చేసిన ఈ చిత్రం హిట్ కావాలి" అని అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ "హాస్యంతో కూడిన హర్రర్ థ్రిల్లర్ సినిమా ఇది. ఈ జోనర్ సినిమా చెయ్యడం ఇదే మొదటిసారి. పాయింట్ కొత్తగా ఉండటం వల్ల చేశా. ఇందులో మనుషులకు, దెయ్యాలకు మధ్య సాగే సరదా ఆటలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి" అని అన్నారు. ఈ నెల 23న సినిమాను విడుదల చేస్తున్నామని శ్రీమిత్ర చౌదరి తెలిపారు.

కొత్త కాన్సెప్ట్... కాంబినేషన్ రిపీట్!


సాయిధరమ్ తేజ్

హీరో సాయిధరమ్ తేజ్, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో ఆల్రెడీ ఓ చిత్రం ('విన్నర్') వచ్చింది! ఇప్పుడు మరోసారి ఈ కాంబినేషన్ రిపీట్ అవుతోంది. తాజా చిత్రాన్ని శ్రీబాలాజీ సినీ మీడియా పతాకంపై జె. భగవాన్, జె. పుల్లారావు నిర్మించనున్నారు. 'విన్నర్' పక్కా కమర్షియల్ చిత్రమ్! అయితే... ఇప్పటివరకూ సాయిధరమ్ తేజ్ చేయనటువంటి కొత్త కాన్సెప్ట్‌తో తాజా చిత్రాన్ని రూపొందించనున్నట్లు నిర్మాతలు తెలిపారు. వేసవిలో... మే నెలలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. "సాయిధరమ్ తేజ్, గోపీచంద్ మలినేనిలతో చిత్రం చేయడం ఆనందంగా ఉంది. సరికొత్త జోనర్ చిత్రమిది. యువ సంగీత సంచలనం ఈ చిత్రానికి బాణీలు సమకూర్చనున్నారు. ప్రసుత్తం దర్శకుడు గోపీచంద్ మలినేని మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎంపిక చేస్తున్నారు" అని నిర్మాతలు తెలిపారు.

అత్తమ్మే మా బలం

- ఉపాసన



చేస్తున్న వృత్తిని, కుటుంబాన్ని రెండు కళ్లలాగా చూసుకోవడం అతి తక్కువ మందికే చేతనవుతుంది. అలా చేతనైనవారిలో ఉపాసన ఒకరు. రామ్‌చరణ్ భార్యగా ఒకవైపు కొణదెల వారి ఇంటి బాధ్యతలను, మరోవైపు అపోలో ఆసుపత్రి పనులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారామె. ఆదివారం చిరంజీవి భార్య సురేఖ కొణిదెల పుట్టినరోజు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సురేఖతో ఉన్న ఫొటోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు ఉపాసన. 'హ్యాపీ బర్త్‌డే అత్తమ్మా. మా ఫ్యామిలీకి బలం ఆమె" అని ట్వీట్ చేశారు. కుర్చీలో కూర్చుని సురేఖ చేతికి గోరింటాకు పెట్టించుకుంటుండగా, కింద మోకాలి మీద కూర్చున్నట్టున్న ఆ ఫొటో నెటిజన్లను ఆకట్టుకుంటోంది. అత్తాకోడళ్ల మధ్య ఆత్మీయతను చూపించేలా ఉందని పలువురు కామెంట్లు చేశారు.



ఏడీ కృతీ సనన్... టేక్ వన్!

సినిమా భాషలో ఏడీ అంటే అసిస్టెంట్ డైరెక్టర్! తెలుగులో అయితే మహిళలను సహాయ దర్శకురాలు, మగవాళ్ళను సహాయ దర్శకుడు అంటారు. మహేశ్‌బాబు 'వన్ నేనొక్కడినే'లో నటించిన కథానాయిక కృతీ సనన్ గుర్తున్నారా? ఆమె ఏడీగా మారారు. హిందీ చిత్రం 'అర్జున్ పాటియాలా'కు సహాయ దర్శకురాలిగా పని చేశారు. అందులోని ఏడో సన్నివేశంలోని తొమ్మిదో షాట్‌కి క్లాప్ ఇచ్చారు కూడా! ఉన్నట్టుండి కృతీకి దర్శకత్వం మీద ఎందుకు ఆసక్తి కలిగింది? అంటే... ఆసక్తి కాదు, అందరి ముందు ఖాళీగా కూర్చోవడం ఇష్టం లేక! పంజాబీ నటుడు, పాప్ సింగర్ దిల్జీత్ దోసాంజ్ హీరోగా నటిస్తున్న 'అర్జున్ పాటియాలా'లో కృతీనే కథానాయిక. ఈ సినిమా చిత్రీకరణ గురువారం మొదలైంది. తొలి రోజు ఠంచనుగా చిత్రీకరణకు వెళ్లారు. కానీ, ఆమెపై తీసే సన్నివేశాలు ఏవీ లేవు. దాంతో ఖాళీగా కూర్చోవడం ఇష్టం లేక క్లాప్ బోర్డ్ పట్టుకుని అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఈ చిత్రంలో కృతీ సనన్ జర్నలిస్ట్‌గా, దిల్జీత్ దోసాంజ్ పోలీస్ అధికారిగా కనిపించనున్నారు.


కృతీ సనన్

చూసినా నమ్మలేం


శ్రావ్య, సాయి రోనక్

"కొన్ని కథలను విని, కొన్నిటిని చూసి నమ్ముతాం. చూసినా నమ్మలేని విధంగా కొన్ని ఉంటాయి. అలాంటిదే మా 'మసక్కలి'" అని అంటున్నారు దర్శకుడు నబి యెనుగుబాల (మల్యాల). సాయి రోనక్, శ్రావ్య, శిరీషా వంకా, కాశీ విశ్వనాథ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రమిది. డూ గుడ్ పాలో రైట్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతోంది. సుమిత్ సింగ్ నిర్మాత. ఇటీవల ఈ చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో దర్శకనిర్మాతలు తమ్మారెడ్డి భరద్వాజ, మధుర శ్రీధర్ ఆవిష్కరించారు. తమ్మారెడ్డి మాట్లాడుతూ "కొత్త దర్శకులు మంచి కథలతో ముందుకు వస్తున్నారు. ట్రైలర్ బావుంది. మంచి కథలకు మరింత ఆదరణ పెరగాలి" అని చెప్పారు. పాటలను మధుర ఆడియో ద్వారా విడుదల చేస్తున్నట్టు 'మధుర' శ్రీధర్‌రెడ్డి చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ "మసక్కలి సైకలాజికల్ గేమ్. అందమైన ప్రేమ కథ కూడా ఇందులో ఉంటుంది. ఓ కొత్త అనుభూతినిచ్చే సినిమా. న్యూ ఏజ్ లవ్ స్టోరీ ఇది" అని తెలిపారు. కొత్త కథతో చేసిన ప్రయత్నమని నిర్మాత చెప్పారు.

'హ్యాపీడేస్' మరపించేలా

ఆహ్లాదకరమైన కథతో, యువ హృదయాలను కొల్లగొట్టిన మలయాళ 'ఆనందం' చిత్రం అదే టైటిల్‌తో తెలుగులో విడుదల కానుంది. ఎత్తరి గురురాజ్ తెలుగులో అనువదిస్తున్నారు. గణేశ్ రాజ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, రోషన్ మాథ్యూ, విశాక్ నాయర్, సిద్ధి మహాజనకట్టి, అన్ను ఆంటోని, అనార్కళి మరికర్ కీలక పాత్రధారులు. నివిన్‌పాల్ అతిథి పాత్రలో కనిపిస్తారు. ఆర్.సీతారామరాజు సమర్పకులు. నిర్మాత మాట్లాడుతూ మలయాళంలో ఘన విజయం సాధించిన చిత్రమిది. తెలుగు నేటివిటీకి సరిపోయే అంశాలు పుష్కలంగా ఉండటంతో భారీ పోటీ మధ్య తెలుగు హక్కులు పొందాం. ఎక్కడా ఓవర్ డ్రామా, మెలో డ్రామా, సినిమాటిక్ డ్రామా లేకుండా చాలా నేచురల్‌గా ఉంటుంది. ఇందులో మూడు ప్రేమకథలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. సచిన్ వారియర్ వినసొంపైన పాటల్ని అందించారు. మార్చి మొదటి వారంలో పాటల్ని, 16న సినిమాను విడుదల చేస్తాం. 'హ్యాపీడేస్' చిత్రాన్ని మరపించేలా ఈ చిత్రం ఉంటుంది" అని అన్నారు.

